ఈనాడు

విజయవాడ 9-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 119
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



చలి గుప్పిట్లో మన్యం

● అరకులో 3.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో కనిష్ఠ ఉష్ణోగ్రత 3.6 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం కావడం గమనార్హం. గత నెల 18న జి.మాడుగులలో కనిష్ఠ ఉష్ణోగ్రత 4.6 డిగ్రీలుగా నమోదైంది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, (మిగతా 3లో)

‘పురుషోత్తపట్నం’తో ఎంతో ప్రయోజనం..

● చంద్రబాబు హయాంలోనే ప్రతిపాదన, నిర్మాణం పూర్తి 2లో

● ఏలేరు ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణకు ఊతం

మన జీఎస్‌డీపీ భేష్

2025-26 రెండో త్రైమాసికంలో 11.28% వృద్ధి

జాతీయ సగటు 8.7% కంటే అధికం

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

ఈ ఏడాది 17.11% వృద్ధి లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు



జీఎస్‌డీపీ గణాంకాల విడుదల సందర్భంగా సచివాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో వృద్ధిరేటు బాగుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జులై - సెప్టెంబరు)లో ఏపీ జీఎస్‌డీపీ వృద్ధి అంచనాలు 11.28 శాతంగా నమోదయ్యాయని.. జాతీయ స్థాయిలో వృద్ధిరేటు 8.7 శాతమేనని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం వృద్ధి సాధిస్తామని ప్రకటించారు. ఇందుకోసం రంగాల వారీ ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళుతున్నామని పేర్కొన్నారు. జీఎస్‌డీపీ పెరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, తలసరి ఆదాయంతోపాటు కొనుగోలు శక్తి పెరుగుతుందని వివరించారు. సచివాలయంలో సోమవారం ఆయన జీఎస్‌డీపీ గణాంకాలు, వృద్ధి లక్ష్యాల్ని సమగ్ర ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

అధిక వృద్ధికి అడుగులు ఇలా

■ అభివృద్ధిలో భాగంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాం.

■ ఆక్వా రంగానికి యూనిట్ రూ.1.50 చొప్పున విద్యుత్తు అందించాం. పంట ఉత్పత్తుల్ని కొనుగోలు చేసి, రైతుల్ని ఆదుకుంటున్నాం.

■ రోడ్లు, పోర్టులు, జలవనరులు తదితర రంగాల్లో వ్యయం పెంచాం. సాంకేతికత అందిపుచ్చుకున్నాం.

■ పెట్టుబడులకు ప్రోత్సాహం ఇస్తున్నాం. రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటికే ఆమోదించిన పెట్టుబడులతో 8.29 లక్షల కోట్లతో 7.62 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయి.

■ మెగా పీటీఎం సహా విద్యా రంగంలో ఏపీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం.

పారిశ్రామికం పరుగులు..

పారిశ్రామిక రంగంలో వృద్ధి రూ.86,456 కోట్లు. గత ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికంతో పోలిస్తే 12.20% వృద్ధి నమోదైంది. మైనింగ్, క్వారీయింగ్ రంగాల్లో 18.43% వృద్ధి ఉంది. రోడ్‌మెటల్ 79.51%, బ్లాక్ గ్రానైట్ 47.62% చొప్పున వృద్ధి నమోదు చేశాయి. విద్యుత్తు ఉత్పత్తి 19.12% పెరిగి 26,837 మిలియన్ యూనిట్లకు చేరింది. విద్యుత్తు వినియోగం కూడా 4.17% పెరిగింది. (మిగతా 3లో)

18 నెలల కష్టంతో ఆర్థికానికి ఊపిరి పోశాం

వైకాపా విధ్వంసంతో రూ.7 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి నష్టం 3లో

కోలుకోవడానికి అహరహం శ్రమిస్తున్నాం ● ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏఐతో తిరుమల అన్నప్రసాదం దినుసుల జల్లెడ

3లో

శ్రీవారికి జైన మతస్థుడు 122 కిలోల బంగారం కానుకగా ఇచ్చారు: సీఎం చంద్రబాబు

ముస్లింలీగ్‌కు కాంగ్రెస్ మోకరిల్లింది


వందేమాతరంపైనా ముస్లింలకు బుజ్జగింపులే

సామరస్యత పేరుతో దానిని ముక్కలుచేసింది

మహాత్మా గాంధీ ఆకాంక్షనూ తోసిరాజంది

నెహ్రూది ద్రోహం ● లోక్‌సభలో విరుచుకుపడ్డ మోదీ

ఆరోపణలకు ప్రత్యేక చర్చ పెట్టండి: ప్రియాంక



దిల్లీ: సామాజిక సామరస్యత పేరుతో వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ పార్టీ ముక్కచెక్కలు చేసిందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. వందేమాతరం గేయం ముస్లింలను ఆగ్రహానికి గురిచేస్తుందని వాదనతో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ ఏకీభవించారని, ముస్లింలీగ్ నేత మహమ్మద్ అలీ జిన్నాకు వంతపాడి.. ద్రోహం చేశారని విమర్శించారు. వందేమాతరాన్ని రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పార్లమెంటులో ప్రత్యేక చర్చలో ఆయన ప్రసంగించారు. ‘వందేమాతరం నేపథ్యం ముస్లింలకు కోపం తెప్పిస్తుందని సుభాష్ చంద్రబోస్‌కు నెహ్రూ లేఖ రాశారు. లఖ్‌నవూలో జిన్నా నిరసన వ్యక్తం చేసిన 5 రోజులకే కాంగ్రెస్ సంకుచిత విధానాన్ని మోపిందని.. గేయ నేపథ్యం గురించి చదివాక ముస్లింల విషయంలో తనకూ అలాగే అనిపిస్తుందని దానిలో పేర్కొన్నారు. తర్వాత వందేమాతరం వాడకాన్ని సమీక్షించడానికి బెంగాల్‌లో కాంగ్రెస్ ఒక సమావేశం నిర్వహించింది. ఆ మీదట రాజీపడింది. గేయాన్ని ముక్కలు చేసింది. బుజ్జగింపు రాజకీయాల ప్రయత్నమది. అదే కారణంతో దేశ విభజన డిమాండుకూ ఆ పార్టీ తలొగ్గింది. ఒత్తిళ్ల వల్లే కాంగ్రెస్ పార్టీ మోకరిల్లిందని చరిత్ర చెబుతోంది. కాంగ్రెస్ ఇప్పటికీ బుజ్జగింపు రాజకీయాలను అనుసరిస్తోంది’ అని మోదీ విరుచుకుపడినప్పుడు అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు.

అన్యాయం జరిగిందని ఆశ్చర్యకరం

‘బ్రిటిష్‌వాళ్లు ఎంతగా అణగతొక్కాలని చూసినా, బెంగాల్‌ను విభజించినా, వందేమాతరం ఒక శిలలా నిలిచి దేశమంతటా ఐక్యతాస్ఫూర్తి రగిలించింది. అదెంతో ప్రాచుర్యం పొంది జాతీయ గీతంలా అవతరించిందని సాక్షాత్తూ మహాత్మాగాంధీయే పేర్కొన్నారు. అయినా ఆ గేయానికి ఎందుకు అన్యాయం జరిగిందని ఆశ్చర్యం కలిగిస్తోంది. (మిగతా 3లో)



అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం పాల్తూరులో ఎండిన మిరపను పరిశీలిస్తున్న అధికారులు

మిరప రైతుకు.. నిద్ర కరవే!

ఎండు తెగులు.. వైరస్.. నల్లి ప్రభావం

● ఎన్ని మందులు చల్లుతున్నా కన్పించని ఫలితం

● ధరలు పెరుగుతున్నా.. దిగుబడులు కష్టమే

ఈనాడు, అమరావతి: మార్కెట్లో మిరప ధర పెరుగుతుండగా, రైతులకు మాత్రం దిగుబడులు దక్కేలా లేవు. వైరస్, నల్లి (నల్లతామర పురుగు) నలిపేస్తున్నాయి. అనంతపురం జిల్లాలో ఎండుతెగులుతో ఎండిపోతున్నాయి. ఎకరాలకొద్దీ విస్తీర్ణంలో పంట పీకేస్తున్నారు. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో నల్లి, వైరస్ తీవ్ర సమస్యగా ఉంది. వాటిని నియంత్రించేందుకు విడతకు రూ.4,000 వరకు ఖర్చు చేస్తూ.. రెండురోజులకోసారి పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదు. మళ్లీ ఈ ఏడాదీ నష్టాలే అనే నిరాశ రైతుల్ని వెన్నాడుతోంది.

సాగు చేయలేక.. కాడి వదేసి

ఒకేడాది భారీ వర్షాలు, మరో ఏడాది నల్లి, ఇంకో ఏడాది వైరస్.. గతేడాది ధరల పతనం.. వెరసి రైతుకు రూ.లక్షల్లో అప్పులే మిగిలాయి. దీంతో సాగు తగ్గుతోంది. గతేడాది క్వింటాల్‌కు రూ.8,000 నుంచి రూ.10,000 లోపే దక్కడంతో.. నష్టాలు నషాళానికి అంటాయి. వరసగా దెబ్బలు తగులుతుండటంతో ఈ ఏడాది మిరప వేయడానికి కూడా సాహసించలేదు. ఎకరాకు రూ.35,000 నుంచి రూ.40,000 ఉండే కౌలు కాస్తా రూ.15,000 నుంచి రూ.20,000కు తగ్గిపోయింది. (మిగతా 3లో)

తప్పు చేసిన వారిని ఉపేక్షించం



ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు జరుపుతున్నాం

● కొత్త విమానయాన సంస్థలను ఆహ్వానిస్తాం

● గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహించడం లేదు

● రాజ్యసభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడి స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: భారతీయ పౌరవిమానయాన రంగంలో ఏర్పడిన గుత్తాధిపత్యానికి కేంద్ర విధానాలే కారణమని, అందుకే ఇండిగోలాంటి సంస్థలు నిబంధనలను బేఖాతరు చేసి ప్రయాణికులను ఇబ్బందిపెడుతున్నాయన్న వాదనలను కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తోసిపుచ్చారు. ఈ రంగంలో గుత్తాధిపత్యానికి తాము తావివ్వడంలేదని, మరిన్ని విమానయాన సంస్థలను ఇందులోకి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కొత్త సంస్థలు అడుగుపెట్టడానికి ఇదే సరైన తరుణమని చెప్పారు. ఆయన సోమవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో దిల్లీ ఎయిర్‌పోర్టులోని ఆటోమేటిక్ మేసేజ్ స్విచ్చింగ్ సిస్టం(ఏఎంఎస్ఎస్)లో జరిగిన మార్పులపై కొందరు సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూనే.. ఆ ప్రశ్నకు సంబంధం లేకపోయినా స్వయంగా చొరవ తీసుకొని ఇండిగో వ్యవహారంపై సభకు వివరణ ఇచ్చారు. ఇండిగో సమస్యకు ఏఎంఎస్ఎస్‌కి సంబంధంలేదని, ప్రస్తుత సంక్షోభం అంతా ఆ సంస్థ అంతర్గత యాజమాన్య నిర్వహణలో తలెత్తిన గందరగోళం వల్లే జరిగిందని పేర్కొన్నారు. సిబ్బంది రోస్టరింగ్ నిర్వహణ వ్యవస్థలో తలెత్తిన లోపమే సమస్యకు దారితీసినట్లు చెప్పారు.

విస్తృత సంప్రదింపులు జరిపాం

“నవంబర్ 1 నుంచి ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డీటీఎల్) విధానం అమల్లోకి వచ్చింది. నిబంధనలను మార్చినప్పుడు భాగస్వామ్యపక్షాలందరితోనూ విస్తృతంగా సంప్రదింపులు జరిపాం. అందులో ఇండిగో కూడా ఉంది. ఇండిగో వ్యవహారం కారణంగా ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నదాంట్లో సందేహం లేదు. మొత్తం వ్యవహారంపై లోతుగా దర్యాప్తు జరుపుతున్నాం. బాధ్యులపై అత్యంత కఠిన చర్య తీసుకుంటాం. ఆ చర్య భవిష్యత్తులో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న గట్టి సందేశం పంపేలా ఉంటుంది. ఈ రంగంలో డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నందున మరిన్ని విమానయానసంస్థలు రావాలని మేం కోరుకుంటున్నాం. అందుకు తగ్గట్టు ప్రోత్సహిస్తున్నాం కూడా. (మిగతా 3లో)

‘ఇండిగో’ అంశాన్ని కేంద్రం చూసుకుంటుంది

3లో

కేంద్ర మంత్రి మా ఎంపీనే అయినా.. ఆ శాఖలో పర్యవేక్షణ నా పని కాదు

ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

ప్రభుత్వ పాఠశాలల్లో పఠన-గణన నైపుణ్య హామీ

1-5 తరగతుల్లో గ్యారంటీ ఎఫ్ఎల్ఎన్ అమలు

మార్చిలోపు సాధించేందుకు 75 రోజుల కార్యాచరణ



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1-5 తరగతులు చదివే విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించేందుకు రాష్ట్రంలో మొదటిసారిగా ప్రాథమిక సాక్షరత-సంఖ్యాజ్ఞాన హామీ (ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ గ్యారంటీ) కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ చేపట్టింది. ప్రాథమిక తరగతులు పూర్తి చేసే నాటికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలను కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. వాటిని తప్పనిసరిగా సాధించే లక్ష్యాన్ని ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ నిర్దేశించింది. ఇందులో భాగంగా 75 రోజుల (మిగతా 3లో)

ఇదీ సంగతి!



వాడు బాగానే చదువుతున్నాడు... మీరే మెరుగుపడాలి... జాగ్రత్త!!



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ వేదికపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఆర్.దినేష్, నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి, అపోలో ఆసుపత్రుల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ శోభనా కామినేని, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్ప్ డైరెక్టర్ ఎరిక్ స్వైడర్

దిగ్గజాల నోట.. తెలంగాణ రైజింగ్

● 10 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిన ఎరిక్ స్వైడర్

● సుమారు 3వేల మంది దేశ, విదేశీ ప్రతినిధుల రాక

● అట్టహాసంగా ప్రారంభమైన తెలంగాణ గ్లోబల్ సంబురం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సంకల్పించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశ, విదేశీ ప్రముఖులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖుల సమక్షంలో మధ్యాహ్నం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సదస్సును ప్రారంభించారు. సదస్సుకు హాజరైన అతిథులు తమ ప్రసంగాల్లో (మిగతా 13లో)

అభివృద్ధి అన్‌స్టాపబుల్..

తెలంగాణ గ్లోబల్ సమిట్ ప్రారంభ ప్లీనరీలో సీఎం రేవంత్‌రెడ్డి

13లో

'పురుషోత్తపట్నం'తో ఎంతో ప్రయోజనం..

- చంద్రబాబు హయాంలోనే ప్రతిపాదన, నిర్మాణం పూర్తి
- ఏలేరు ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణకు ఊతం
- మెట్ట ప్రాంత తాగు, సాగునీటి సమస్యలకు పరిష్కారం



పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా పోలవరం ఎడమ కాలువకు మళ్లిస్తున్న గోదావరి వరద జలాలు (పాత చిత్రం)

ఈనాడు, అమరావతి: ఏలేరు జలాశయం కింద ఉన్న ఏలేరు బ్రాంచి కాలువ రైతులకు పురుషోత్తపట్నం ఎత్తిపోతల వర ప్రదాయినిలా మారింది. విశాఖ అవసరాలకు తాగు, పారిశ్రామిక జలాలు మళ్లించేందుకు ఇది ఉపయుక్తమైంది. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం వల్ల వచ్చే అనేక ప్రయోజనాలు అది పూర్తికాకముందే ఈ ఎత్తిపోతలతో కొంత మేర సాధించగలిగారు. సముద్రంలో వృథాగా కలిసిపోతున్న గోదావరి వరద జలాలను ఏలేరు జలాశయంతో అనుసంధానం చేయడం వల్ల ఏళ్ల తరబడి రైతులు, ప్రజలు అనేక ప్రయోజనాలు పొందుతున్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ అడ్డంకుల వల్ల మధ్యలో రెండుమూడేళ్లు ఇబ్బందులు ఎదురైనా మళ్లీ రెండేళ్లుగా ఈ పథకం రైతుల పొలాల్లో సిరులు పండిస్తోంది.

పోలవరం ప్రాజెక్టుకు కుడి వైపున పట్టిసీమ ఎత్తిపోతల ఎలాంటిదో ఎడమ వైపున పురుషోత్తపట్నం అలాంటిదే. ఎప్పుడో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా నిర్మించారు. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ గట్టున పురుషోత్తపట్నం ఎత్తిపోతల నిర్మించి రెండు దశల్లో ఈ నీరు ఏలేరు జలాశయానికి మళ్లించేలా ఏర్పాట్లు చేశారు. విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు ఏలేరు జలాశయమే కీలకం. మరోవైపు ఏలేరు కాలువల కింద 67,614 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ ఆయకట్టు సాగుకు సకాలంలో నీరందించి పంటలను కాపాడేందుకు పురుషోత్తపట్నం ఎత్తిపోతల ఎంతో ఉపయుక్తంగా మారింది.

2 దశల్లో పురుషోత్తపట్నం నిర్మాణం...

★ అఖండ గోదావరి ఎడమ గట్టున 40.800 కి.మీ. వద్ద పురుషోత్తపట్నం గ్రామంలో ఈ ఎత్తిపోతల పంపు హౌస్‌ను నిర్మించారు. రెండు దశలకు కలిపి తొలుత రూ.1,638 కోట్లతో పాలనామోదం ఇచ్చారు. తర్వాత రూ.1,931.45 కోట్లకు అంచనాలు సవరించారు.

★ తొలిదశలో గోదావరి నుంచి 30 టీఎంసీల వరద జలాలు మళ్లించేందుకు వీలుగా నిర్మాణం. రోజుకు 3,500 క్యూసెక్కుల నీళ్లు తోడిపోసేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడి నుంచి 1.6 కి.మీ. మేర వెర్టికల్ టర్బయిన్ పంపులతో నీళ్లను మళ్లించి పోలవరం ఎడమ కాలువలో 10.148 కిలోమీటరు వద్ద పోసేలా పనులు చేశారు. అయిదు వరుసల్లో ఈ పంపుల నీళ్లు తీసుకువెళ్లి పోలవరం కాలువలో జార విడుస్తున్నారు. అక్కడి నీళ్లు ఇదే కాలువలో పోలవరం ఎడమ కాలువ 50వ కిలోమీటరును దాటి వెళ్తాయి.

★ రెండో దశలో పోలవరం ఎడమ కాలువ నుంచి మళ్లీ నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆ కాలువ 50వ కి.మీ. వద్ద మరో పంపుహౌస్ నిర్మించారు. ఇక్కడ 1,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆ నీటిని 13.262 కిలోమీటర్ల పొడువునా రెండు వరుసల్లో ఎంఎస్ ప్రెషర్ మెయిన్ ద్వారా ఏలేరు నీటిని మళ్లిస్తున్నారు. ఆ నీటిని ఏలేరు కాలువలోకి పంపిస్తున్నారు. గోదావరి వరద జలాలతో ఏలేరును అనుసంధానం చేస్తున్నారు.

ఏలేరు జలాశయంలోకే ఎందుకు?

ఏలేరు జలాశయం మొత్తం నీటి నిల్వ 24.11 టీఎంసీలు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఉన్న వాగులు, వంకలు, అక్కడి పరీవాహకం ఆధారంగా ఏలేరు జలాశయం నిండేది. క్రమేణా ఎగువన అనేక వాగులు, వంకలపై చిన్న తరహా చెక్‌డ్యాంలు, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణంతో ఏలేరు జలాశయానికి నీళ్ల రావడం అరుదుగా మారింది. జూన్‌లోనే వర్షాలు ప్రారంభమైనా అనేక సందర్భాల్లో సెప్టెంబరు వరకు ఏలేరు జలాశయానికి నీళ్లు చేరడం లేదు. ఈ క్రమంలో ఏలేరు ఎడమ కాలువ కింద భూముల ఖరీఫ్ సాగుకు, ఇక్కడి మెట్ట ప్రాంతంలో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో పురుషోత్తపట్నం ఆలోచన తెర పైకివచ్చింది. పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మించినందుకు హరిత ట్రైబ్యునల్ ఈ పథకానికి రూ.25 కోట్ల పరిహారంచెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో రెండేళ్ల నీటి సరఫరా నిలిచిపోయింది. సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో జరిమానాను రూ.2.50 కోట్లకు పరిమితం చేశారు. జలవనరులశాఖ ఆ సొమ్ములు చెల్లించింది.

పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా గోదావరి వరద నీటి మళ్లింపు ఇలా

నీటి సంవత్సరం	తొలిదశలో నీటి ఎత్తిపోత	రెండో దశలో నీటి ఎత్తిపోత (అంకెలన్నీ టీఎంసీల్లో)
2017-18	1.63	0.3152
2018-19	13.33	7.6302
2019-20	0.31	0.8936
2023-24	8.50	5.533
2024-25	5.309	1.67045
2025-26	11.920	7.61615

సంక్రాంతి నుంచి అన్ని సేవలూ ఆన్‌లైన్‌లో

- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇంటికే పంపాలి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రిజిస్ట్రేషన్ అనంతరం దస్తావేజులను కొరియర్ ద్వారా సంబంధిత వ్యక్తుల ఇళ్లకు పంపే ఏర్పాటు చేయాలని, సంక్రాంతి నుంచి పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లో అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్‌పై సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'ఆన్‌లైన్‌తో సేవలు పారదర్శకంగా అందుతాయి. ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్త స్థాయి పెరుగుతుంది. ఇప్పటికే ఔట్‌సోర్సింగ్ సేవలందించే శాఖలు ఆన్‌లైన్ విధానంలోకి మారాలి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందాలి. ఆర్టీజీ సేవలు మరింత మెరుగుపడాలి. బస్టాండ్ ప్రాంగణాలు పరిసరాలు, మరుగుదొడ్ల దగ్గర పరిశుభ్రత ఉండాలి. డ్రోన్ సేవలు మరింత విస్తృతంగా వినియోగించుకోవాలి. డ్రోన్ల సాయంతో పురుగుమందుల వినియోగాన్ని ఎలా తగ్గించుకోవచ్చనే దానిపై రైతులకు అవగాహన కల్పించాలి. కొన్ని జిల్లాల్లో అమలు చేసే మంచి విధానాలను మిగిలినచోట్లా అమలు చేసేలా చూడాలి' అని పేర్కొన్నారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

22 నుంచి కొత్త కానిస్టేబుళ్లకు శిక్షణ మొదలు

16న చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి శిక్షణ మొదలుకానుంది. అంతకంటే ముందు ఈ నెల 16న మంగళగిరి బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ శిక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు వారి తల్లిదండ్రులతో సహా ఈ ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం అభ్యర్థులంతా వారి సొంత ఊళ్లకు వెళ్లి, తిరిగి 22వ తేదీ లోపు వారికి కేటాయించిన పీటీసీ, డీటీసీ, బీటీసీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. అక్కడ 9 నెలల పాటు వారికి శిక్షణ ఉంటుంది. తొలి విడత నాలుగున్నర నెలల పాటు శిక్షణ పూర్తయ్యాక వారం రోజుల పాటు సెలవులిస్తారు. తర్వాత రెండో విడత శిక్షణ ఉంటుంది. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా, 6,015 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. యాంటిసిడెంట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వారిలో 5,551 మంది 'ఫిట్ ఫర్ ట్రైనింగ్ (శిక్షణకు అర్హత)' సర్టిఫికేట్ పొందారు. వీరందరికీ ఇప్పుడు శిక్షణ ఇవ్వనున్నారు.

ఏపీకి 8 మంది ఐఏఎస్ అధికారుల కేటాయింపు

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2024 బ్యాచ్‌కు ఎంపికయిన 179 మంది ఐఏఎస్ అధికారుల్లో 8 మందిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ లేఖ రాసింది. రాష్ట్ర కేడర్‌కు కేటాయించినవారిలో బన్నా వెంకటేష్, ఏఆర్ పవన్‌తేజ (ఆంధ్రప్రదేశ్), కె.ఆదిత్యశర్మ, చింతకింది శ్రవణ్‌కుమార్ రెడ్డి (తెలంగాణ), హరిఓం పాండియా (రాజస్థాన్), నమ్రతా అగర్వాల్ (హరియాణా), ప్రియ (దిల్లీ), సుయష్ కుమార్ (ఉత్తర్‌ప్రదేశ్)లు ఉన్నారు. ఏపీ స్వరాష్ట్రంగా ఉన్న చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డిని ఏజీఎంయూటీ, పి.సురేష్‌ను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు.





ఏయూలో జెన్-జెడ్ పోస్టాఫీసు ★ సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లు

ఏయూలో జెన్-జెడ్ తపాలా కార్యాలయం

విద్యార్థులే నిర్వహించుకునేలా ఏర్పాట్లు

ఈనాడు, విశాఖపట్నం: లోపలికి ప్రవేశించగానే క్యూఆర్ కోడ్‌ల చిత్రాలు, వాటిని స్కాన్ చేస్తే ఏ రకమైన సేవలు అందుతాయో తెలిపే వివరాలతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది ఆ కార్యాలయం. అదే విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 'జెన్-జెడ్' పోస్టాఫీసు. యువతరానికి తపాలా సేవలను పరిచయం చేయడానికి తపాలా శాఖ వినూత్నబాట పట్టింది. విద్యాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా వీటిని ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖపట్నంలో మంగళవారం దీన్ని ప్రారంభిస్తున్నారు. ★ జెన్- జెడ్ పోస్టాఫీసులో సేవలు అందించేందుకు ప్రత్యేకించి పోస్టల్ అధికారులెవరూ ఉండరు. విద్యార్థులు ఎవరికి వారే మొబైల్ ఫోన్‌ద్వారా నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అదే ఇక్కడి ప్రత్యేకత. అవసరమైన సాయం అందించేందుకు తపాలాశాఖ నుంచి ఓ వ్యక్తి అందుబాటులో ఉంటారు.

జనవరి నుంచి పీడీఎస్ ద్వారా..

రాగులు, గోధుమ పిండి పంపిణీ

- అన్ని బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్
- మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీతో భేటీ అయిన నాదెండ్ల మనోహర్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలోని అన్ని చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం కార్డుదారులకు ఇప్పుడిస్తున్న బియ్యం, పంచదారతో పాటు జనవరి 1 నుంచి రాగులు, గోధుమ పిండి కూడా అందించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ రెండు సరకులను నవంబరు నుంచే కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఇస్తున్నామని, జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ అంగీకరించారని చెప్పారు. సోమవారం దిల్లీలో కేంద్రమంత్రి జోషీతో మనోహర్ సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'జనవరి నుంచి పీడీఎస్ బియ్యం బస్తాలను క్యూఆర్ కోడ్ ట్యాగ్ ఆధారంగా అందజేస్తాం. తద్వారా బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. స్కూళ్లు, హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం కోసం సరఫరా చేసే బియ్యం బస్తాలపై ఇప్పటికే ఈ విధానం అమలవుతోంది' అని మంత్రి వివరించారు.

51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

'ఈ ఏడాది రాష్ట్రంలో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించగా, ఇప్పటికే 17.30 లక్షల టన్నులు కొనుగోలు చేశాం. 2.60 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.4,120 కోట్లు జమ చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 2,550 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, 16 వేల మంది సిబ్బంది, 32 వేల వాహనాలు పని చేస్తున్నాయి. 7.85 కోట్ల గోనె సంచులు అందించామ'ని మంత్రి మనోహర్ తెలిపారు. 'రాష్ట్రంలో ఎఫ్‌సీఐకి ప్రస్తుతం 7.85 కోట్ల టన్నుల నిల్వ సామర్థ్యం ఉండగా, మరో 3.87 కోట్ల టన్నుల మేర పెంచేందుకు కేంద్ర మంత్రి జోషీ అంగీకరించారు. ఇందుకోసం పీపీపీ విధానంలో స్టీల్ సైలోస్‌లు ఏర్పాటు చేస్తాం. వడ్లు అధికంగా పండించే ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వీటిని నిర్మిస్తాం. తద్వారా ధాన్యం నిల్వనష్టాలు తగ్గి, గింజ నాణ్యత పెరుగుతుంది' అని వివరించారు.



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఏపీలో డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయండి

సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్టనర్ అరుణ్ కుమార్‌తో మంత్రి లోకేశ్ భేటీ

శాన్‌ఫ్రాన్సిస్కో: అంతర్జాతీయ స్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్టనర్ అరుణ్ కుమార్‌తో ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్‌శాఖ మంత్రి నారా లోకేశ్ శాన్‌ఫ్రాన్సిస్కోలో భేటీ అయ్యారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... "ఆంధ్రప్రదేశ్ ఐటీ, డేటా హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అక్కడ డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడంతో పాటు సెమీ కండక్టర్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి. పరిశ్రమలకు నిర్ణీత సమయంలో ప్రోత్సాహకాలు అందించేందుకు దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఎకౌంట్ విధానాన్ని ప్రారంభించనున్నాం' అని వివరించారు. అరుణ్ కుమార్ స్పందిస్తూ... తాము ప్రధానంగా అమెరికా, భారత్, ఇజ్రాయెల్, ఆగ్నేయాసియా దేశాలపై దృష్టిసారిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

వల్లభనేని వంశీ అనుచరుడు.. కొమ్మా కోట్లుకు 15 వరకు రిమాండ్

సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో నిందితుడు



పటమట స్టేషన్‌లో లొంగిపోయేందుకు వచ్చిన కోట్లు

ఈనాడు-అమరావతి, పటమట, న్యూస్‌టుడే: గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌ను అపహరించి, దాడి చేసిన కేసులో కొమ్మా కోట్లు అలియాస్ కోటేశ్వరరావు(ఏ2)కు కోర్టు రిమాండ్ విధించింది. గత పది నెలలుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడు సోమవారం విజయవాడలోని పటమట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ప్రధాన అనుచరుడైన కోట్లు.. సత్యవర్ధన్‌ను బెదిరించి తెదేపా కార్యాలయంపై దాడి కేసును ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కోర్టు జారీ చేసిన ఎన్‌బీడబ్ల్యూ (నాన్ బెయిలబుల్ వారెంట్) చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. లొంగిపోయిన నిందితుడికి పోలీసులు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి, ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి ఈనెల 15 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం కోట్లును నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో ఇంకా చేబోలు శ్రీనివాస్‌రావు(ఏ11), వేణు (ఏ12) అరెస్టు కావాల్సి ఉంది.



రాబోయే ఏడాది కోసం ఎదురుచూస్తూ గడపకండి

నూతన సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలను విధించుకున్నారు కదా? అయితే వాటిని సాధించడం కోసం ప్రయత్నాలు ఎప్పుడు మొదలుపెడతారు? ఇంకా జనవరి రాలేదు కదా, అప్పటివరకూ ఆగుదాం అనుకుంటున్నారా? ఇలాంటి వేచిచూసే ధోరణిని కొనసాగించేవారు వచ్చే ఏడాది డిసెంబరు వరకూ సరైన సమయం కోసం ఎదురుచూస్తూనే గడిపేస్తారు. అలాంటి మనస్తత్వాన్ని వీడి ఇప్పుడే రంగంలోకి దిగండి.

– అలెక్స్ హర్మోజీ, బిజినెస్ గ్రోత్ మెంటార్

గ్రహం అనుగ్రహం

9-12-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
పంచమి: రా. 8-01 తదుపరి షష్ఠి
పుష్యమి: ఉ. 8-34 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: రా. 9-06 నుంచి 10-40 వరకు
అమృత ఘడియలు: లేవు
దుర్ముహూర్తం: ఉ. 8-33 నుంచి 9-17 వరకు
తిరిగి రా. 10-33 నుంచి 11-26 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.22; సూర్యాస్తమయం: సా.5.22

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.7	28.8
మెదక్	9.0	30.2
హైదరాబాద్	13.3	30.5
విజయనగరం	16.0	27.0
అనంతపురం	16.2	30.5
విశాఖపట్నం	17.0	29.0
శ్రీకాకుళం	17.0	29.0
కర్నూలు	17.8	30.9
విజయవాడ	17.9	30.0
కడప	18.0	28.0
గుంటూరు	19.0	29.0
నరసాపురం	19.0	32.2
రాజమహేంద్రవరం	19.0	35.0
తిరుపతి	20.5	29.4
ఒంగోలు	21.0	30.7
నెల్లూరు	21.8	30.3
తాడేపల్లిగూడెం	28.0	30.0

కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ అరెస్టు

- ధ్రువపత్రాల ఫోర్జరీ.. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు
- సంఘం మాజీ కార్యదర్శి ఫిర్యాదుతో చర్యలు

పటమట, న్యూస్‌టుడే: ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డుల్లో వయసు తారుమారు చేయడం. . తనకు కావాల్సిన క్రీడాకారులను అర్హత లేకపోయినా లీగ్ పోటీలకు పంపడం.. కోచ్‌లు, క్రీడాకారులకు నగదు ఆశ చూపి మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడం వంటి ఆరోపణలపై ఆంధ్రా కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తన పదవిని అడ్డం పెట్టుకుని ఆయన అనేక అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆ సంఘం మాజీ కార్యదర్శి కేపీ రావు విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీకాంత్‌తో పాటు అతడి అనుచరుడైన కొట్ల గోపి, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువ లీగ్ పోటీల్లో అవకతవకలు

ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 25 వరకు విజయవాడలో ఆంధ్ర కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో యువ లీగ్ పోటీలు జరిగాయి. వాటికి శ్రీకాంత్‌తో పాటు సంఘం సభ్యులైన అర్జున్‌రావు, సుబ్బరాజు, కె.వి.నాంచారయ్య తదితరుల ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. తమకు అనుకూలురైన క్రీడాకారుల వయసు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల్లో వయసు మార్చేసి పోటీలకు ఎంపిక చేశారు. శ్రీకాంత్ తన అనుచరుడైన కొట్ల గోపి ద్వారా కొందరు టీమ్ కోచ్‌లు, కెప్టెన్లతో మ్యాచ్ ఫిక్సింగ్ గురించి చర్చించినట్లు కేపీ రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ మ్యాచ్ గెలవాలో.. ఏది ఓడిపోవాలో వారే నిర్ణయించేవారని తెలిపారు. ఇందుకోసం కొంతమంది కోచ్‌లు, క్రీడాకారుల ఖాతాలకు నగదు బదిలీ చేశారని ఆరోపించారు.

41ఎ నోటీసు అందజేత..

శ్రీకాంత్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు పలు అంశాలపై అతడిని ప్రశ్నించారు. ఫోర్జరీ ఆరోపణలున్న కొన్ని పత్రాలను చూపించి వివరణ కోరారు. ఏడేళ్ల లోపు శిక్ష ఉన్న సెక్షన్లు కావడంతో 41ఎ నోటీసు ఇచ్చి పంపించారు.

స్క్రబ్ టైఫస్ జన్యుక్రమంపై అధ్యయనం

- వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరపాండియన్. చిత్రంలో డీఎంఈ రఘునందన్, డీపీహెచ్ పద్మావతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నమోదైన తొమ్మిది స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసుల మరణాలకు కేవలం ఈ వ్యాధే కారణమని చెప్పలేమని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలూ కారణం కావొచ్చని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయి స్పష్టతకు వచ్చేందుకు జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల ద్వారా వ్యాధి ధోరణిపై అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నమూనాలు విజయవాడ, గుంటూరుల్లోని జీనోమ్ ల్యాబ్‌లతోపాటు మంగళగిరిలోని ఎయిమ్స్, వేలూరు, బెంగళూరుల్లోని ల్యాబ్‌లలో పరీక్షలు చేయిస్తామని పేర్కొన్నారు. మంగళగిరిలో వైద్య నిపుణులతో కలిసి సోమవారం వీరపాండియన్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ తాజా పరిస్థితిపై అంతర్జాతీయ, డబ్ల్యూహెచ్‌వో నిపుణులతో మాట్లాడానని, 26 జిల్లాలకూ సత్వర స్పందన బృందాలను పంపామని పేర్కొన్నారు. "అన్ని శాఖల సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు భయాందోళన చెందొద్దు. ఏటా మలేరియా, డెంగీ తరహాలోనే స్క్రబ్ టైఫస్ కేసులూ నమోదవుతున్నాయి. బ్యాక్టీరియా ప్రభావం 5 నుంచి 20 రోజుల్లో తెలుస్తుంది. శరీరంపై కీటకం కుట్టినట్లు నల్ల మచ్చలు గుర్తించినా, జ్వరం వచ్చినా జాప్యం చేయకుండా పరీక్ష చేయించుకోవాలి. రాష్ట్రంలో గతేడాది 1,613 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు నమోదైతే.. ఈ ఏడాది 1,566 కేసులు నమోదయ్యాయి. ఇతర రాష్ట్రాల్లోనూ వేలల్లో కేసులు వస్తున్నాయి. ప్రాథమిక దశలో అజిత్రోమైసిన్, డాక్సీసైక్లిన్ మాత్రలతో దీన్ని నయం చేయవచ్చు. సబ్ సెంటర్ నుంచి జీజీహెచ్ వరకు మందులు, పరీక్షల కిట్లు అందుబాటులో ఉన్నాయి" అని వీరపాండియన్ వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ, అంటువ్యాధుల వైద్య నిపుణులు కల్యాణ చక్రవర్తి, ప్రజారోగ్య సంచాలకులు (డీపీహెచ్) పద్మావతి, వైద్య విద్య సంచాలకులు రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

★ మరో మహిళ మృతి

స్క్రబ్ టైఫస్ లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం మరో మహిళ (33) మృతి చెందారు. దుగ్గిరాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్ ఆదివారం జీజీహెచ్‌లో చేరారు. ఆమెకు పరీక్షల్లో స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయింది. సోమవారం చనిపోయినట్లు జీజీహెచ్ వర్గాలు తెలిపాయి. సోమవారం జీజీహెచ్ ప్రత్యేక వార్డు నుంచి ఇద్దరు కోలుకుని డిశ్చార్జి కాగా, 12 మంది చికిత్స పొందుతున్నారు.






18 నెలల కష్టంతో ఆర్థికానికి ఊపిరి పోశాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి: వైకాపా ప్రభుత్వం ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసిందని.. అప్పులు పుట్టని పరిస్థితి తెచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తూ 12% వడ్డీకి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపిందని దుయ్యబట్టారు. వైకాపా పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని, ప్రభుత్వ ఆస్తులతోపాటు భవిష్యత్తు ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు నెరపుతూ ఆ అప్పుల్ని రీషెడ్యూల్ చేయించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. '18 నెలలుగా ప్రతి నిమిషం, ప్రతి గంట కష్టపడ్డాం.. పూర్తిగా నిలదొక్కుకోవడానికి కొంత సమయం పడుతుంది. ముందుకంటే నయం.. కాస్త నమ్మకం వచ్చింది' అని పేర్కొన్నారు. 2025-26 రెండో త్రైమాసిక జీఎస్‌డీపీ గణాంకాల విడుదల సందర్భంగా సచివాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. జీఎస్‌డీపీ లక్ష్య సాధనకు త్వరలో శాఖాధిపతులు, కార్యదర్శులతో సమావేశాలతోపాటు జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గత పాలకుల తప్పులతో జనం జీవితాలు అతలాకుతలం: పాలకులు తప్పులు చేస్తే ప్రజల జీవితాలు ఎంతగా అతలాకుతలమవుతాయో చెప్పడానికి వైకాపా ప్రభుత్వంలోని జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) గణాంకాలే నిదర్శనమని చంద్రబాబు విమర్శించారు. 'రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ల తెదేపా ప్రభుత్వ పాలన (సగటు 13.5%)తో పోలిస్తే వైకాపా హయాం (సగటు 10.32%)లో జీఎస్‌డీపీ 3.2% తగ్గింది. దీంతో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి కోల్పోయింది. రెవెన్యూ వసూళ్లు రూ.76,195 కోట్లు తగ్గాయి. తెదేపా ప్రభుత్వంలోని వృద్ధి కొనసాగి ఉంటే అప్పులు చేయడం తగ్గేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దిల్లీలోని వివిధ మంత్రిత్వ శాఖలకు వెళ్లి నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాలు ప్రారంభించాలని కోరుతూ జాబితా ఇచ్చా. గతంలో (వైకాపా ప్రభుత్వంలో) ఏపీకి ఇచ్చిన నిధుల్ని ఇతర అవసరాలకు మళ్లించారని, ముందు వాటిని ఖర్చు చేయండంటూ అక్కడి అధికారులు నా ముందు మరో జాబితా పెట్టారు. దీంతో ఆయా శాఖలకు నిధులిచ్చి ఖర్చు చేయించి, కేంద్రానికి వినియోగపత్రాలిచ్చాం. 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్ని పునరుద్ధరింపజేయించాం' అని చంద్రబాబు వివరించారు.



జగన్ దెబ్బకు కేంద్ర నిబంధనలు మార్పు

'గత ప్రభుత్వ అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు.. కేంద్రం ప్రత్యేక ఖాతాలు తెరిపించింది. ఏపీలో పరిస్థితి చూసే ఈ నిర్ణయం తీసుకుంది. ఒక వ్యక్తి చేసిన తప్పులకు ఏకంగా వ్యవస్థలోనే మార్పులు తెచ్చారు' అని సీఎం పేర్కొన్నారు.

వారసత్వంగా 85 లక్షల టన్నుల చెత్త

'వైకాపా ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చింది. పట్టణాలు, పల్లెల్లో దాన్ని తొలగించడమే సమస్యగా ఉంది. 2026 జనవరి 1 నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేయాలని చూస్తున్నాం. తర్వాత నుంచి అన్ని ప్రాంతాల్లో 100% చెత్త సేకరిస్తాం' అని వివరించారు.

రెండో ఏడాదీ విద్యుత్తు ఛార్జీలు పెంచం

'గత ప్రభుత్వంలో విద్యుత్తుశాఖ అప్పు రూ.32 వేల కోట్లకు చేరింది. పీక్‌లోడ్‌లో యూనిట్ రూ.15 చొప్పున కొన్నారు. సౌర, పవన విద్యుత్తు వాడకుండానే తయారీ సంస్థలకు రూ.9 వేల కోట్లు చెల్లించారు. అదీ విధ్వంసపాలన అంటే. పన్ను చెల్లింపుదారుల సొమ్ము ఎలా ఖర్చు చేశారో చెప్పేందుకు ఇదే ఉదాహరణ' అని చంద్రబాబు మండిపడ్డారు. 'విద్యుత్తు రంగాన్ని గాడిన పెడతాం. కరెంట్ ఛార్జీలు పెంచకుండా వ్యవస్థను సమర్థంగా నడిపిస్తున్నాం. రెండో ఏడాది కూడా కరెంటు ఛార్జీల్ని పెంచడం లేదు. సూపర్-6 హామీ ఇచ్చి సూపర్-8 అమలు చేస్తున్నాం. ప్రజలెవరూ కార్యాలయాలకు రావాల్సిన పనిలేకుండా వాట్సప్ గవర్నెన్స్ అమలు చేస్తున్నాం. విద్యావ్యవస్థలో సంస్కరణలు అమలు చేస్తున్నాం' అని వివరించారు. విలేకర్ల సమావేశంలో చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

ప్రజలు తింటున్నవే పండించండి

- ప్రజలు తినే పంటలు పండించకపోతే వ్యాపారులు కొనలేరు. ప్రభుత్వానికీ కష్టమే. అందుకే ప్రజల వినియోగానికి అనుగుణంగా రైతులు పంటల సరళి మార్చుకోవాలి.
- ఎరువులు, క్రిమిసంహారక మందులు అధికంగా వాడితే మార్కెట్ ఉండదు. అలాంటి ఉత్పత్తుల్ని కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ధరలూ పడిపోతున్నాయి. ● బియ్యం తింటే మధుమేహ సమస్యలుంటాయి. అన్ని వ్యాధులకూ కారణం అదే.

అనంతపురంలో 51 రకాల పండ్ల సాగు

ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేశాం. ఇది దేశానికే పెద్ద పార్కుగా తయారవుతుంది. ప్రపంచ దేశాలకు ఉద్యాన ఉత్పత్తులు అందిస్తుంది.

- అనంతపురంలో ఒకప్పుడు పంట అంటే వేరుశనగే. అదీ పదేళ్లలో ఒకటి రెండేళ్లే దిగుబడి వచ్చేది. ఇప్పుడు అక్కడ 51 రకాల పండ్లు పండిస్తున్నారు. వ్యాగన్ల కొద్దీ అరటి.. దానిమ్మ, ఖర్జూరం సాగు చేస్తున్నారు. ● రైతు సేవా కేంద్రం యూనిట్‌గా వ్యవసాయ కార్యాచరణ రూపొందిస్తున్నాం. ఆర్టీజీఎస్ నుంచి దిశానిర్దేశం చేస్తాం

రైతుల ఆలోచనలు మారాలి

ఒక రైతుకు రెండెకరాలుంది. ఆయన అందులోనే ఎకరాలో సహజ సేద్యం చేస్తూ నెలకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు సంపాదిస్తున్నారు. వరితోపాటు చుట్టూ చేపలు పెంచుతున్నారు. గట్టుపై కూరగాయలు పండిస్తున్నారు. ఇంటి వినియోగానికి పోగా మిగిలినవి మార్కెట్లో అమ్ముతున్నారు.

- మరోవైపు కొందరు కౌలు రైతులు 60 ఎకరాల అరటి సాగు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారు. కలిసి రాకపోతే ఏం చేయాలో అర్థం కావడం లేదు. రైతులు ఇలాంటి విధానాలు మార్చుకోవాలి.

భూగర్భజలాల్ని పెంచితే రూ.5 వేల కోట్ల ఆదా

సమర్థ సాగునీటి నిర్వహణతో కరవు లేకుండా చేస్తున్నాం. జలాశయాల్లో 950 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. అన్ని మైనర్ ఇరిగేషన్ చెరువులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- భూగర్భజలం పెంపుపై దృష్టి పెట్టాం. 7.5 మీటర్ల నుంచి 6.08 మీటర్లకు తగ్గించాం. 30 ఏళ్ల నుంచి పంటకుంటలు, చెక్‌డ్యామ్‌లు, కాంటూరు కందకాలు తవ్విన ఫలితమే ఇది.
- వచ్చే రెండేళ్లలో భూగర్భజలాల్ని 3 మీటర్లకు తెస్తాం. దీనివల్ల మోటార్ల విద్యుత్తు బిల్లుల రూపంలోనే రూ.5 వేల కోట్లు ఆదా అవుతుంది. రిజర్వాయర్లు కట్టడమే కాకుండా భూమిని జలాశయంగా చేసుకుని భూగర్భజలాలు పెంచుతాం.

'ఇండిగో' అంశాన్ని కేంద్రం చూసుకుంటుంది

ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: తెదేపా ఎంపీ కేంద్ర మంత్రిగా ఉన్నంత మాత్రాన.. ఆయన శాఖలో ఏం జరుగుతోందో రోజూ పర్యవేక్షించడం తన పని కాదని, అది ప్రధాన మంత్రి విచక్షణాధికారమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. వైకాపా తలాతోకాలేని పార్టీ అని ఆయన మండిపడ్డారు. చేసిన నేరాల నుంచి తప్పించుకునేందుకు ఎదుటివారిపై బురద జల్లడం వారికి అలవాటేనని ధ్వజమెత్తారు. సోమవారం విలేకరుల సమావేశంలో... ఇండిగో విమానాల రద్దు అంశంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... "పైలట్‌లు, సిబ్బంది డ్యూటీ సమయాలు, విశ్రాంతి, ప్రయాణికుల భద్రత వంటి అంశాలపై పార్లమెంటు స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. దేశంలో 65 శాతం విమాన సర్వీసులు ఇండిగో సంస్థే నడుపుతోంది. కొత్త నిబంధనలకు తగ్గట్టు పైలట్‌లు, సిబ్బందికి ఎక్కువ విశ్రాంతి ఇవ్వాల్సి వచ్చినప్పుడు, దానికి తగ్గట్టుగా అదనపు సిబ్బందిని నియమించుకోవడంలో ఆ సంస్థ విఫలమైంది. ఫలితంగా తలెత్తిన పరిణామాల వల్ల పెద్ద సంఖ్యలో విమానాలు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించింది. పరిస్థితి చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రం ఆదేశాల మేరకు విమానయాన సంస్థ ప్రయాణికులకు క్షమాపణ చెప్పి, డబ్బు తిరిగి చెల్లిస్తోంది. నిబంధనల అమలుకు ఇండిగో సంస్థకు కొంత సమయం ఇచ్చారు కాబట్టి ఒకటి రెండు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుంది" అని సీఎం తెలిపారు. అదంతా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న మీ పార్టీ ఎంపీ రామ్మోహన్‌నాయుడి వైఫల్యమని, ఆయన రాజీనామా చేయాలని వైకాపా డిమాండ్ చేస్తోంది కదా? అన్న ప్రశ్నకు... "మా పార్టీ ఎంపీ అయినా... కేంద్ర మంత్రిగా ఆయన పార్లమెంటుకు, ప్రధానికి జవాబుదారీ. ఆయన శాఖలో ఏం జరుగుతోందో చూడటం నా పని కాదు. రాష్ట్రంలో సత్యకుమార్ మంత్రిగా ఉన్నారు. ఆయన శాఖలో ఏం జరుగుతోందో కేంద్రం నుంచి భాజపా నాయకులు రోజూ పర్యవేక్షించరు కదా?" అని ఆయన బదులిచ్చారు.

తప్పు చేసిన వారిని ఉపేక్షించం

(మొదటి పేజీ తరువాయి)

ఐదు పెద్ద విమానయానసంస్థలు నడిచే సామర్థ్యం ప్రస్తుతం భారత్‌లో ఉంది. దేశంలో అత్యధిక వృద్ధి జరుగుతున్నందున కొత్త ఎయిర్‌లైన్స్ ప్రారంభించడానికి ఇదే సమయం" అని చెప్పారు. ఇదే అంశంపై రామ్మోహన్‌నాయుడు మంగళవారం లోక్‌సభలో ప్రకటన చేయనున్నారు. సోమవారం వందేమాతరగీతంపై చర్చ ప్రారంభం కావడానికి ముందు కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయి లేచి దీని గురించి ప్రస్తావించినప్పుడు స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుంటూ మంత్రి ప్రస్తుతం రాజ్యసభలో ఉన్నారని, మంగళవారం ఆయన ప్రకటన చేస్తారని చెప్పారు.

రామ్మోహన్‌నాయుడు బాగా పనిచేశారు

- ప్రయాణికుల ప్రయోజనాలకు పెద్దపీట వేశారు
- తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కితాబు



దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు. చిత్రంలో ఎంపీలు శ్రీభరత్, నాగరాజు, పార్థసారథి, మస్తాన్‌రావు, ప్రసాదరావు, అంబికా లక్ష్మీనారాయణ

ఈనాడు, దిల్లీ: ఇండిగో యాజమాన్యం వైఫల్యం కారణంగా తలెత్తిన సంక్షోభ సమయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సమర్థంగా పనిచేసి అతితక్కువ కాలంలో పరిస్థితులను సాధారణ స్థితికి తేవడంతోపాటు, ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రాధాన్యం ఇచ్చారని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎంపీలు మతుకుమిల్లి శ్రీభరత్, బస్తిపాటి నాగరాజు, బీకే పార్థసారథి, బీద మస్తాన్‌రావు, దగ్గుమళ్ల ప్రసాదరావు, అంబికా లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. సోమవారం వారు ఇక్కడ విలేరులతో మాట్లాడుతూ.. "ఇండిగో వ్యవహార శైలి కారణంగా ఈనెల 3 నుంచి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిసిన వెంటనే రామ్మోహన్‌నాయుడు వార్‌రూం ఏర్పాటుచేసి ప్రయాణికుల ప్రయోజనాలను రక్షించడానికి చర్యలు తీసుకున్నారు. రిఫండ్, రీబుకింగ్, బ్యాగేజీల అప్పగింత, టికెట్ల ధరలపై పరిమితి విధించడం వంటి చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 99% రిఫండ్, 90% బ్యాగ్‌ల అప్పగింత పూర్తయ్యాయి. విమానయాన సంస్థలు ఎక్కువ వసూలు చేయకుండా టికెట్ల ధరలపై పరిమితి విధించారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో యాజమాన్యానికి నోటీసులు జారీచేసి సంజాయిషీ కోరారు. గతంలో ఎన్నడూ లేనంత వేగంగా చర్యలు తీసుకున్నా ఏపీలోని ప్రతిపక్ష నాయకులు, సామాజిక మాధ్యమాల్లో కొందరు అనవసరంగా బురద జల్లుతున్నారు. ఇండిగో సంస్థ నెలరోజులపాటు ఎఫ్‌డీటీఎల్ అమలు చేసింది. డిసెంబరు 1న కేంద్రమంత్రితో సమావేశమైనప్పుడు కూడా వాళ్లు తమకు ఏమీ ఇబ్బంది లేదని చెప్పారు. పౌర విమానయాన రంగం వృద్ధి, ప్రయాణికుల సౌకర్యార్థం గత ఏడాది కాలంలో రామ్మోహన్‌నాయుడు ఎన్నో చర్యలు తీసుకున్నారు. పైలట్ల కొరతను నివారించేందుకు ఏవియేషన్ కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం తీసుకొచ్చారు. గత ఏడాదిన్నరలో పది కొత్త ఎయిర్‌పోర్టులు ప్రారంభించారు. ఈ రంగంలో గుత్తాధిపత్యాన్ని నివారించడానికి స్టార్ ఎయిర్, శంఖేర్, ఎయిర్ కేరళ అనే మూడు కొత్త సంస్థలకు అనుమతి ఇచ్చారు. విమానాల నిర్వహణ, మరమ్మతులను దేశీయంగా ప్రోత్సహిస్తున్నారు" అని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు.

జనవరిలో దావోస్‌కు చంద్రబాబు

బృందంలో మంత్రులు లోకేశ్, టీజీ భరత్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి 19 నుంచి 23 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో పాల్గొంటారు. ఆయన వెంట విద్య, ఐటీ, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ శుభమ్ బన్సల్, సీఎం ముఖ్య భద్రతాధికారి టి.డి.యశ్వంత్ వెళుతున్నారు.

మిరప రైతుకు.. నిద్ర కరవే!

(మొదటి పేజీ తరువాయి)

అధికశాతం రైతులు కౌలు చేయడం మానుకున్నారు. ◆ ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.67 లక్షల ఎకరాల్లో మిరప వేశారు. 2024 ఖరీఫ్‌తో పోలిస్తే 1,00,000 ఎకరాలు తగ్గింది. 2023 ఖరీఫ్‌తో పోలిస్తే 2.40 లక్షల ఎకరాలు తక్కువ. ◆ ఈ ఏడాది మిరప అధికంగా సాగు చేసిన జిల్లాలు పల్నాడు 1,10,000 ఎకరాలు, కర్నూలు 43,000, ప్రకాశం 42,000, అనంతపురం 23,000, ఎన్టీఆర్ 22,000 ఎకరాలు.

పుంజుకున్న ధరలతో

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ధరలు కాస్త పుంజుకోవడంతో రైతుల్లో ఆశ మొదలైంది. క్వింటాల్ సగటున రూ.15,000కు చేరింది. ధరలు కలిసొస్తే అప్పుల నుంచి బయటపడతామని భావించారు. గతంలో నాలుగు ఎకరాలు మిరప వేసిన రైతులు ఈ ఏడాది రెండెకరాలు వేశారు. కౌలు, విత్తనాలు, పెట్టుబడి కలిపితే ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి అయింది.

వర్షాలు.. తెగుళ్లు.. పురుగుమందులు

అక్టోబరులో భారీ వర్షాలు కురిశాయి. దీంతో మొక్కదశలోని మిరప దెబ్బతింది. నవంబరులో కురిసిన కుండపోత వర్షాలతో తెగుళ్లు ప్రబలాయి.

- ◆ అనంతపురం జిల్లా ఉరవకొండ మండలంలో ఎండు తెగులు ఆశించి మొక్కలు ఎండుముఖం పట్టాయి. వాటిని తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపక్రమిస్తున్నారు.
- ◆ భారీవర్షాలతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మిరప మొక్కలు ఎదగలేదు. కొన్నిచోట్ల కోలుకున్నా ఇప్పటికీ అడుగు ఎత్తులోనే ఉన్నాయి. రెట్టింపు స్థాయిలో ఎరువులు వేసి.. పురుగు మందులు చల్లారు. పైరు ఏపుగా ఎదిగే సమయంలో వైరస్ తెగులు ఆశించింది. నల్లి తీవ్రత కూడా అధికమైంది. సత్తెనపల్లి, గురజాల, తాడికొండ, మాచర్ల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో నష్టాల తీవ్రత ఎక్కువగా ఉంది.
- ◆ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లోనూ తెగుళ్లు సోకాయి.
- ◆ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల, పెనుగంచిప్రోలు ప్రాంతాల్లోనూ మిరపలో కొద్ది రోజుల నుంచి నల్లి ప్రభావం మొదలైంది. ఆకులు ముడుచుకుపోతున్నాయి.

విపరీతంగా పురుగుమందుల వాడకం

వైరస్ తెగులుతోపాటు నల్లిని కట్టడి చేసేందుకు రైతులు పురుగు మందుల్ని విపరీతంగా వాడుతున్నారు. ఒక్కో విడత పిచికారీకి ఎకరానికి రూ.3,000 నుంచి రూ.4,000 వరకు అవుతోంది. తెగులు తీవ్రత లేని మిరప తోటల్లో కూడా ముందు జాగ్రత్తగా పురుగు మందులు చల్లుతున్నారు. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు మిరప తోటల్ని పరిశీలించి నివారణ మార్గాలు చూపాలని రైతులు కోరుతున్నారు.

ఏఐతో తిరుమల అన్నప్రసాదం దినుసుల జల్లెడ

- భక్తులకు నాణ్యమైన భోజనం పెడుతున్నాం
- శ్రీవారికి జైన మతస్థుడు 122 కిలోల బంగారం కానుకగా ఇచ్చారు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- దేవుడి సొమ్ము కొట్టేసిన దొంగకు జగన్ వంత పాడుతున్నారని మండిపాటు

ఈనాడు, అమరావతి: తిరుమలలో శ్రీవారి భక్తులకు అన్న ప్రసాదం తయారీలో వాడే దినుసులను జల్లెడ పట్టేందుకు ఏఐ టెక్నాలజీని వాడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బియ్యం, ఇతర దినుసుల్లో ఏ అన్యపదార్థం వచ్చినా ఏఐ టెక్నాలజీతో గుర్తించి యంత్రం వాటిని ఏరివేస్తుందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక లడ్డూ ప్రసాదంలో నాణ్యమైన నెయ్యి, దినుసులు వాడుతున్నామని, అన్నప్రసాదంపై ఒక్క ఫిర్యాదు కూడా లేదని తెలిపారు. 'తిరుమలలో ఎన్టీఆర్ హయాంలో గొప్ప ఆశయంతో భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం దాన్ని భ్రష్టుపట్టించింది. భక్తులకు నాసిరకం భోజనం పెట్టారు. పాల సేకరణే చేయని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ ఇచ్చి దోచుకున్నారు' అని సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో చంద్రబాబు ధ్వజమెత్తారు.

- వేంకటేశ్వరస్వామి ఎంతో మహిమగల దేవుడని, ఒక జైన మతస్థుడు స్వామిపై భక్తితో 122 కిలోల బంగారం కానుకగా సమర్పించారని సీఎం తెలిపారు. 'ఇటీవల జైన మతస్థుడైన ఒక భక్తుడు నన్ను కలిసినప్పుడు ఆయన అనుభవం చెప్పారు. ఆయన తన వ్యాపారంలో కొంత వాటాను విక్రయించడంతో రూ.5 వేల కోట్లు వచ్చింది. ఆయన స్వామివారికి 122 కిలోల బంగారం ఇస్తానని మొక్కుకున్నారు. మొక్కు తీర్చేందుకు తిరుమల వెళ్లి అధికారుల్ని కలిస్తే... శ్రీవారికి రోజూ 121 కిలోల బరువైన ఆభరణాలు అలంకరిస్తామని వారు మాటల సందర్భంలో ఆయనకు చెప్పారు. 122 కిలోల బంగారం కానుకగా సమర్పించాలని ఆ స్వామివారే తనకు సందేశం పంపినట్లుగా ఆ భక్తుడు భావించారు. స్వామివారికి ఎంత మహత్యం లేకపోతే ఒక భక్తుడు 122 కిలోల బంగారం ఇస్తారు! స్వామివారిని దర్శించుకునేందుకు రోజూ లక్ష మంది ఎందుకు వస్తారు? ఆయనపై భక్తుల నమ్మకం అలాంటిది. అంత మహిమగల దేవుడితో వైకాపా నాయకులు ఆడుకోవడం కరెక్టా?' అని చంద్రబాబు మండిపడ్డారు.

రూ.70 వేలు కొట్టేసిన వ్యక్తి... రూ.14 కోట్లు రాసిస్తాడా?

'తిరుమల శ్రీవారి పరకామణిలో రూ.70 వేలు కొట్టేసిన వ్యక్తి ప్రాయశ్చిత్తంగా స్వామివారికి రూ.14 కోట్లు రాసిచ్చాడని వైకాపా అధ్యక్షుడు జగన్ చెప్పడం నమ్మశక్యంగా ఉందా? కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి పరకామణిలోనే దొంగతనం చేసిన వ్యక్తిని సమర్థిస్తున్నవారు రాజకీయాల్లో ఉండేందుకు అర్హులా? వాళ్లతో రాజకీయం చేయాలంటే నాలాంటి వారికి ఎంత బాధగా ఉంటుంది' అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా నాయకులు రాజకీయాల ముసుగులో నేరాలు చేసేసి.. తమను వేధిస్తున్నారంటూ ఎదురుదాడి దిగితే సహించబోమని ఆయన హెచ్చరించారు. 'అనంతపురం జిల్లాలో ఒక ఆలయం ఈఓ తప్పు చేస్తే అరెస్ట్ చేసి, సర్వీసు నుంచి తొలగించాం. కానీ మొన్నటి వరకు అధికారంలో ఉన్న వైకాపా నాయకులు మాత్రం...దేవుడి డబ్బులకు కాపలాదారుగా ఉండాల్సిన వ్యక్తులు తప్పు చేస్తే సమర్థిస్తున్నారు. ఇంతకంటే దివాళాకోరుతనం ఏముంటుంది?' అని ఆయన దుయ్యబట్టారు.

సింగయ్యపై జగన్ కారు ఎక్కించేసి... ప్రభుత్వంపై ఆరోపణలు

కొన్ని రోజుల క్రితం గుంటూరులో సింగయ్య అన్న వ్యక్తిపై జగన్‌కారు ఎక్కించేసి, శాంతి భద్రతల సమస్య సృష్టించిందేగాక...ప్రభుత్వ అంబులెన్స్‌లో తీసుకెళ్లి చంపేశారంటూ సింగయ్య భార్యతో తప్పుడు ఆరోపణలు చేయించారని ఆయన మండిపడ్డారు. 'వాళ్లు కల్తీ మద్యం వ్యాపారం చేసి దొరికిపోయి..మాపై బురద జల్లాలని చూశారు. ఏలూరులో ఒక వ్యక్తి అనారోగ్యంతో చనిపోతే కల్తీ మద్యం వల్ల మరణించినట్లు తప్పుడు ప్రచారం చేశారు. ఒక పాస్టర్ హైదరాబాద్ నుంచి మద్యం సేవిస్తూ వచ్చి ప్రమాదంతో చనిపోతే... హత్య చేశారని ఆరోపించారు' అని మండిపడ్డారు.

కరెంటు ఛార్జీలు పెంచకపోవడం కూడా గోబెల్స్ ప్రచారమేనా?

మీరన్నీ అబద్ధాలు చెబుతున్నారని, గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారు కదా? అన్న ప్రశ్నకు... 'రాష్ట్రం బాగుపడితే చూసి ఓర్వలేనివారికి అన్నీ గోబెల్స్‌లానే కనిపిస్తాయి. జీఎస్‌డీపీ వృద్ధిపై ఇప్పుడు నేను చెప్పిన లెక్కలన్నీ వాస్తవాలే కదా? మా ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచకపోవడం కూడా గోబెల్స్ ప్రచారమేనా? వారిలా మేం కూడా ప్రజలపై రూ.35 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం వేయాలా? వైకాపా ప్రభుత్వం కరెంటు వాడుకోకుండానే విద్యుత్ సంస్థలకు రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని క్యాపిటల్ కాస్ట్‌గా చెల్లించిందని చెప్పడం కూడా గోబెల్స్ ప్రచారమేనా? అది వాస్తవం కాదా?' అని సీఎం ప్రశ్నించారు.

మన జీఎస్‌డీపీ భేష్

(మొదటి పేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లోని ప్రధానాంశాలు..

- ■ 2025-26 రెండో త్రైమాసిక వృద్ధి అంచనాల్లో పరిశ్రమల రంగం అనూహ్య ఫలితాలు నమోదు చేసింది. వృద్ధిరేటు 2.78 శాతం నుంచి 12.20 శాతానికి పెరిగింది. వ్యవసాయంలో 10.70 శాతం, సేవల రంగంలో 11.30 శాతంగా ఉంది.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య తలసరి ఆదాయంలో తేడా

సంవత్సరం	ఏపీ తలసరి ఆదాయం (రూ.ల్లో)	వృద్ధి రేటు (%)	తెలంగాణ తలసరి ఆదాయం (రూ.ల్లో)	వృద్ధి రేటు (%)
2014-15	93,903	13.31	1,24,104	10.65
2015-16	1,08,002	15.01	1,40,840	13.49
2016-17	1,20,676	11.74	1,59,395	13.17
2017-18	1,38,299	14.60	1,79,358	12.52
2018-19	154,031	11.38	2,09,848	17.00
సగటు		13.21		13.37
2019-20	1,60,341	4.10	2,31,326	10.23
2020-21	1,68,063	4.82	2,25,734	-2.42
2021-22	1,93,703	15.26	2,69,000	19.17
2022-23	2,19,917	13.53	3,12,046	16.00
2023-24	2,37,951	8.20	3,47,714	11.43
సగటు		9.18		10.88
2024–25	2,66,240	11.89	3,87,623	11.48

151% పెరిగిన అరటి ఉత్పత్తి.. ధాన్యం 24%

రాష్ట్రంలో అరటి ఉత్పత్తిలో 151% పెరుగుదల ఉంది. 14.85 లక్షల టన్నుల నుంచి 37.31 లక్షల టన్నులకు పెరిగింది. జామ దిగుబడిలో 87%, బత్తాయిలో 7.20% వృద్ధి నమోదైంది. ధాన్యం ఉత్పత్తి 24% పెరిగింది. గతేడాది 2.93 లక్షల టన్నులు ఉండగా ఈ ఏడాది 3.64 లక్షల టన్నులు వచ్చింది. పత్తి ఉత్పత్తి 31% పెరిగి 0.30 లక్షల టన్నులుగా ఉంది. మత్స్యరంగంలో రొయ్యల ఉత్పత్తి 27% పెరిగింది. 5.47 లక్షల టన్నుల నుంచి 6.95 లక్షల టన్నులకు చేరింది. పశు సంవర్ధకంలో మాంసం ఉత్పత్తి 8%, గుడ్ల ఉత్పత్తి 6.7% చొప్పున పెరిగాయి.

సేవా రంగంలో కార్గో దూకుడు

హోటల్స్, రెస్టారెంట్ల విభాగంలో జీవీఏ రూ.25,292 కోట్లు. కార్గో హ్యాండ్లింగ్ విభాగంలో 14.90% వృద్ధి నమోదైంది. విమానయానంలో 9.42% వృద్ధి ఉంది. ప్రయాణికుల సంఖ్య 13.69 లక్షల నుంచి 14.98 లక్షలకు పెరిగింది. వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్ 4.37% వృద్ధి కనబరచింది.

తొలి అర్ధ సంవత్సరంలో 10.91% వృద్ధి

2025-26 తొలి అర్ధ సంవత్సరంలో జీఎస్‌డీపీ అంచనా 10.91%గా నమోదైంది. మొత్తం జీవీఏ రూ.7,58,270 కోట్లుగా ఉంది. జాతీయ సగటు 8.8% మాత్రమే. ఈ ఏడాది మొత్తం 17.11% వృద్ధి లక్ష్యంగా నిర్ణయించారు. మొత్తం రూ.7.58 లక్షల కోట్ల జీవీఏలో తొలి అర్ధ సంవత్సరంలో 40.64% లక్ష్యం సాధించారు. రెండో అర్ధ సంవత్సరంలో 59.36% సాధించాల్సి ఉంది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 65.64%, పరిశ్రమల రంగంలో 55%, సేవా రంగంలో 55% జీఎస్‌డీపీ లక్ష్యాలు సాధించాల్సి ఉంది.

2025-26 రెండో త్రైమాసిక జీవీఏ, జీఎస్‌డీపీ అంచనాలు (ప్రస్తుత ధరల ప్రకారం)

రంగం	ఏపీ జీవీఏ (రూ.కోట్లలో)	వృద్ధి(%)	జాతీయ వృద్ధి (%)
వ్యవసాయం	1,25,577	10.70	1.8
పరిశ్రమలు	86,456	12.20	8.5
సేవలు	1,60,075	11.30	10.6
జీవీఏ	3,72,108	11.30	8.7
జీఎస్‌డీపీ	4,00,377	11.28	8.7

రంగాల వారీ జీవీఏ లక్ష్య సాధన ఇలా..

వ్యవసాయం: పంచసూత్రాల అమలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ, నీటి సరఫరా, పంట ఉత్పత్తుల సేకరణ, యాంత్రీకరణ, డెయిరీ, మత్స్య, కోళ్ల, పట్టు పరిశ్రమ, ఉద్యాన రంగాలకు ప్రోత్సాహం

పారిశ్రామిక రంగం: ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల్లో నాణ్యతకు పెద్దపీట, సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు పట్టాలెక్కించడం, వేగంగా అనుమతులు, మౌలిక సౌకర్యాల కల్పన

సేవారంగం: టూరిజం, సేవా రంగాలు, పోర్ట్స్, మారిటైమ్ సేవల విస్తరణ, రీజినల్, గ్లోబల్ కనెక్టివిటీ పెంచడం, ఐటీ, ఆర్థిక, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రోత్సాహం

వైకాపా హయాంలో 11.14 శాతం నుంచి 5.97 శాతానికి

2018-19లో వృద్ధి రేటు 11.14 శాతం నమోదవగా.. వైకాపా అధికారంలోకి వచ్చాక 2019-20లో 5.97 శాతానికి పడిపోయిందని చంద్రబాబు వివరించారు. ఇదే సమయంలో తలసరి ఆదాయంలో వృద్ధి 17 శాతం నుంచి 10.23 శాతానికి పడిపోయింది.

ముస్లింలీగ్‌కు కాంగ్రెస్ మోకరిల్లింది

(మొదటి పేజీ తరువాయి)

గత శతాబ్దంలో దానికి ఎందుకు వెన్నుపోటు పొడిచారు? గాంధీ ఆకాంక్షల్ని తుంగలో తొక్కిన శక్తి ఎవరు? వందేమాతరానికి వందేళ్లు పూర్తయినప్పుడు దేశానికి ఎమర్జెన్సీ అనే సంకెళ్లు వేశారు. వందేమాతరం గొప్పతనాన్ని పునరుద్ధరించుకునే అవకాశం మనకు ఇప్పుడు వచ్చింది. ఈ గేయం మనందరికీ గర్వకారణం. చారిత్రక ఘట్టానికి మనం సాక్షులం" అని మోదీ పేర్కొన్నారు.

నెహ్రూను నిందించడమే ఉద్దేశమన్న ప్రియాంక: వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ- నెహ్రూ లేఖలో కొంత భాగాన్నే మోదీ ప్రస్తావించారని తప్పుపట్టారు. త్వరలో బెంగాల్‌లో శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో వందేమాతరంపై చర్చను ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. "ప్రజాసమస్యల నుంచి దృష్టి మళ్లించాలని సర్కారు చూస్తోంది. మోదీలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోంది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన నెహ్రూవంటివారిపై కొత్త ఆరోపణలు చేయడమే ప్రభుత్వ ఉద్దేశం. మీరు 12 ఏళ్లుగా ప్రధానిగా ఉంటే నెహ్రూ పన్నెండేళ్లు జైల్లో ఉన్నారు. ఆయన్ని ఇంకా ఎన్ని రకాలుగా అవమానించాలనుకుంటున్నారో దయచేసి ఓ 999 అంశాలతోనో.. 9,999 ఆరోపణలతోనో ఒక జాబితా రూపొందించండి. ఒకేసారి చర్చించండి. వందేమాతరంపై 10 గంటలు కేటాయించినట్లే నెహ్రూపై మీ ఆరోపణలు ఏకరవు పెట్టే చర్చకు 10, 20 లేదా 40 గంటలు కోరదాం. ఆ అధ్యాయాన్ని అక్కడితో శాశ్వతంగా ముగించండి. ఆ తర్వాతైనా.. మీకు ధైర్యం ఉంటే నిరుద్యోగం, ప్రశ్నపత్రాల లీకేజీ, అధిక ధరలు వంటి వర్తమాన సమస్యలపై మాట్లాడుకుందాం. దేశ చరిత్రలో, ప్రజల గుండెల్లో ఉన్న గేయంపై ప్రత్యేక చర్చ ఎందుకు?" అని ప్రశ్నించారు. 17 ఏళ్లు ప్రధానిగా ఉన్న నెహ్రూ హయాంలో ఇస్రో వచ్చి ఉండకపోతే మంగళ్‌యాన్, తేజస్ వంటివి ఎక్కడుండేవన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని, ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎంలను ఆయనే తీసుకురాకపోతే వికసిత భారత్ ఎలా సాధ్యమన్నారు.

చలి గుప్పిట్లో మన్యం

(మొదటి పేజీ తరువాయి)

విజయనగరం, శ్రీసత్యసాయి, శ్రీకాకుళం, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, కాకినాడ, ఎన్టీఆర్, నంద్యాల, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపే. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉత్తరాది నుంచి వచ్చే చలిగాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది.

రాష్ట్రంలో ఆదివారం రాత్రి నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతల వివరాలు

ప్రాంతం	కనిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
అరకు (అల్లూరి సీతారామరాజు జిల్లా)	3.6
డుంబ్రిగుడ (॥)	3.9
జి.మాడుగుల (॥)	3.9
హుకుంపేట (॥)	4.6
ముంచంగిపుట్టు (॥)	4.8
పాడేరు (॥)	4.8
పెదబయలు(॥)	6.1

ప్రభుత్వ పాఠశాలల్లో పఠన-గణన నైపుణ్య హామీ

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్ఎల్ఎన్ కార్యాచరణను విడుదల చేసింది. డిసెంబరు 8 నుంచి వచ్చే ఏడాది మార్చిలోపు ఈ లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించింది. ప్రతి విద్యార్థీ పఠన, గణన నైపుణ్యాల లక్ష్యాలను సాధించాల్సి ఉంటుంది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు నవంబరు 24 నుంచి డిసెంబరు 6 వరకు ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఆధారంగా పిల్లల్ని మూడు విభాగాలుగా ప్రవాహం (స్ట్రీమ్), పర్వతం (మౌంటెయిన్) ఆకాశం(స్కై)గా విభజించారు. దీని ప్రకారం తెలుగు, ఆంగ్లం, గణితంలో ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 13.60 లక్షల మంది పిల్లలు ఎఫ్ఎల్ఎన్ సాధించాల్సి ఉంటుంది.

ఈనాడు

వణికిస్తున్న స్క్రబ్ టైఫస్

స్క్రబ్ టైఫస్ విజృంభణ ధాటికి ఏపీ బెంబేలెత్తిపోతోందిప్పుడు! ఆ రాకాసి వ్యాధి మూలంగా కృష్ణా, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో మరణాలు సైతం నమోదు కావడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇప్పటివరకు ఏపీ వ్యాప్తంగా పదిహేను వందలకు పైగా స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగు చూశాయి. ఈ నెల నాలుగు-ఆరో తేదీల మధ్యలోనే 746 కొత్త కేసులొచ్చాయంటేనే ఆ రోగమెంత వేగంగా చుట్టుముడుతోందో అర్థమవుతుంది. చిత్తూరు, కడప, కాకినాడ, విశాఖపట్నం జిల్లాల్లో పాజిటివ్ కేసులు పెద్ద సంఖ్యలో బయటపడ్డాయి. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికీ స్క్రబ్ టైఫస్ పీడిత చిన్నారుల తాకిడి కొన్నాళ్లుగా పెరుగుతూ కలవరపరుస్తోంది. సామాన్య జనంలో చాలామందికి అవగాహన లేని జబ్బు కావడంతో ప్రమాద తీవ్రత అధికమవుతోంది. నల్లిని పోలి ఉండే చిన్న కీటకం కుట్టడం వల్ల వ్యాధి కారక బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది. వెంటనే తగిన చికిత్స అందకపోతే అవయవాలు విఫలమై మరణం సంభవించే ముప్పుంది. వ్యాధి ప్రభావం ప్రధానంగా చిన్నపిల్లలపై ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కోరలు మరింతగా పదునెక్కి ప్రజారోగ్యాన్ని కబళించే లోపే ప్రభుత్వాలు మేల్కోవాలి!

బ్యాక్టీరియా ద్వారా సోకే ప్రాణాంతక స్క్రబ్ టైఫస్- ఇండియాతో పాటు పలు ఆసియా దేశాల్లోనూ తరచూ పంజా విసురుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు పది లక్షల మంది దాని కబంధ హస్తాల్లో చిక్కుకుంటున్నారు. వారిలో పది శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు. బాధిత దేశాల జాబితాలో భారతావని ముందుండటమే ఆందోళనకరం. వివిధ అధ్యయనాల ప్రకారం- ప్రతి సంవత్సరం గ్రామీణ భారతంలో చాలామంది మంచంపట్టడానికి స్క్రబ్ టైఫసే కారణం! విచ్చలవిడి పట్టణీకరణ, భూ వినియోగంలో వస్తున్న విపరీత మార్పులు, వాతావరణ విపరిణామాలతో రాబోయే రోజుల్లో ఈ సమస్య ఇంకా తీవ్రతరం కావచ్చునంటున్న వైద్య నిపుణుల హెచ్చరికలు వెన్నులో వణుకుపుట్టించేవే! అధిక వర్షపాతం, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు స్క్రబ్ టైఫస్ కారక కీటక సంతతిని ఇబ్బడిముబ్బడిగా పెంచడం వల్ల ఈ ఏడాది మొదట్లో తమిళనాడులోని పలు జిల్లాల్లో ఆ వ్యాధి ఒక్కపెట్టున విరుచుకుపడింది. ఆరేళ్ల కిందట విజయవాడలోనూ ఆ బ్యాక్టీరియా స్వైరవిహారం చేసింది. కర్ణాటక, కేరళ, హిమాచల్, బిహార్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా వంటిచోట్ల ఏటా స్క్రబ్ టైఫస్ కలకలం సృష్టిస్తోంది. మరణాలూ పెద్దసంఖ్యలో చోటుచేసుకుంటున్నాయి. అతిప్రమాదకరమైన ఆ రోగం గురించి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. దాంతో మామూలు జ్వరమని భావించి జనం కాలయాపన చేస్తుండటంతో ప్రాణాలపైకి వస్తోంది!

పరిసరాలు శుభ్రంగా లేకపోతే ఎలుకలు, దోమలతో పాటు ఇతరేతర కీటకాలు అనేకం విపరీతంగా పుట్టుకొస్తాయి. వాటివల్ల విషజ్వరాలతో పాటు పలు అనారోగ్య సమస్యలు ముమ్మరిస్తాయి. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారం, ఇంటి లోపలా బయటా అపరిశుభ్ర వాతావరణం స్క్రబ్ టైఫస్ వ్యాప్తిని ఎగదోస్తోంది. అదే జనారోగ్యాన్ని కుంగదీస్తోంది. ఈ నేపథ్యంలో వ్యర్థాలను వీలైనంత త్వరగా తొలగించడంపై స్థానిక ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి అనుమానితులకు అవసరమైన పరీక్షలు చేయించాలి. అందుకు సంబంధించిన మౌలిక వసతులను విస్తృతం చేయాలి. ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించడం, ఔషధాలను తగినంతగా అందుబాటులో ఉంచడం అన్నింటికన్నా ప్రధానం!



జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా సరే,
మనం చేయగలిగింది ఏదో ఒకటి ఉంటుంది.
దాంట్లో విజయం సాధించగలం కూడా...
కాకపోతే జీవితేచ్ఛను వదిలేయకుండా
పట్టుదలగా కొనసాగాలంతే.

– స్టీఫెన్ హాకింగ్

సలహాదారులు

'బావా మా తరఫున రాయబారానికి వెళ్లాలి' అన్నాడు ధర్మరాజు. వెళ్లి ఏం చేయాలన్నాడు కృష్ణుడు. 'యుద్ధమంటే ఇరువైపులా బంధు నాశనం. శాంతి కుదిరేట్లు చూడండి' అన్నాడు ధర్మరాజు. 'ఒకవేళ కౌరవులు శాంతికి ఒప్పుకోకుంటే ఏం చేయాలి, యుద్ధం గురించి మాట్లాడవద్దా?' అడిగాడు కృష్ణుడు. 'తప్పదు అనుకుంటే యుద్ధం చేద్దాం' అన్నాడు ధర్మజుడు. ఎక్కడా కృష్ణుడి కర్తృత్వం లేదు.

రాయబారంలో కూడా కృష్ణుడు ముందుగా యుద్ధ ప్రస్తావన తేలేదు. రాజ్యం కాదు కదా అయిదు ఊళ్లు కూడా ఇవ్వం, కావాలంటే యుద్ధం చేసుకోవచ్చని దుర్యోధనుడే అన్నాడు. ఎక్కడ యుద్ధం చేద్దాం మరి అని అడిగిన కృష్ణుడు- కౌరవుల నోటనే కదన ప్రదేశాన్ని ఎంపిక చేయించాడు. ఏ సమయంలో సమరం చేద్దామని అడుగుతూ వారితోనే యుద్ధానికి ముహూర్తం పెట్టించాడు. కృష్ణుడు తనంతట తానుగా ఏదీ చెప్పలేదు. కౌరవులు వారి మృత్యువుకు వారే ముహూర్తం పెట్టుకునేటట్టు చేశాడు. పాండవులు మంచివాళ్లు, అయిదు ఊళ్లు అడిగినా దుష్టులైన కౌరవులు ఇవ్వలేదు... అనే సానుభూతిని కూడబెట్టాడు శ్రీకృష్ణుడు. ఉత్తమ గుణ సంపన్నుడు మనకు సలహాదారుగా ఉంటే ఇదీ లాభం.



అంతర్యామి

కౌరవ సలహాదారు శకునిలో లౌక్యానికి మించి జిత్తులమారితనం ఉంది. 'ధర్మమేంటో నాకు తెలుసు కానీ అనుసరించలేను. పాండవులకు సూదిమొన మోపిన స్థలం కూడా ఇవ్వకూడదు. నా ఇచ్ఛ నన్ను ఎలా నడిపిస్తే అలా నడుస్తాను' అన్న దుర్యోధనుడి మాటలకు శకుని వత్తాసు పలికాడు. ఫలితం మనకు తెలిసిందే.

నిత్య వ్యవహారాల్లో మనం వేర్వేరు వ్యక్తుల సాయం తీసుకుంటాం. బట్టల నుంచి భాగస్వామి ఎంపిక వరకు అనేక పనుల్లో సలహాలు కోరతాం. మన సలహాదారు కృష్ణుడి లాంటివాడైతే మంచి మాటలతో మేలు చేస్తాడు. శకుని లాంటివాడైతే మనకే నష్టం కలిగిస్తాడు. అందుకే మనం సలహాదారులను జాగ్రత్తగా ఎంచుకోవాలి.

ఒక్కోసారి సలహాదారుడి వల్ల మనం నష్టపోతే 'నీవల్లే ఇలా జరిగింది' అని ఆరోపిస్తాం. సలహా ఇచ్చింది ఎవరైనా ఆచరించాల్సింది మనమేగా? చాలా సందర్భాల్లో అంతరాత్మే అసలు సలహాదారు. కృష్ణుడు మనలోనే ఉన్నాడు. శకుని కూడా మనలోనే ఉన్నాడు. ఎటువైపు మొగ్గుతామో ఫలితం కూడా అలాగే వస్తుంది.

సలహా తీసుకోవచ్చు కానీ స్వీయవిచక్షణతో ఆలోచించాలి. ఆధునిక కాలంలో పాలకులు కూడా సలహాదారులను గుడ్డిగా నమ్ముకుని నష్టపోయిన ఉదంతాలు చూస్తున్నాం. ప్రభుత్వంలో అనేక శాఖల్లో సలహాదారులు ఉంటారు. వారు పాలనలో పలు సూచనలూ సలహాలు ఇస్తారు. కానీ ముందే చెప్పినట్లు ఎవరి అంతరాత్మ వారికి అసలైన సలహాదారు. ఆయా సలహాలు పాటించడంలో ఎదురయ్యే లాభనష్టాలకు అంతిమంగా ఎవరికి వారే జవాబుదారులు. బాధ్యత వహించాల్సిన వాళ్లు. ఇది తెలుసుకుని జీవితాన్ని సుఖశాంతులతో నడుపుకోవాలి. లేకపోతే అడుగడుగునా అశాంతి, అసంతృప్తితో అలమటించాల్సి వస్తుంది.

– శివలెంక ప్రసాదరావు

వ్యవస్థ మారాలి... గుత్తాధిపత్యం పోవాలి!

ఇండిగో విమానాలు చెప్పాపెట్టకుండా నిలిచిపోవడం సాంకేతిక సమస్య కాదు. గుత్తాధిపత్యం సాధించడానికి ఒక ప్రైవేటు విమానయాన సంస్థకు అవకాశమిస్తే- అది సర్వీసులను నిలిపివేసినప్పుడు యావద్దేశానికీ ఇబ్బందులు తప్పవనేందుకు ఇదొక హెచ్చరిక కూడా! మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనుకుంటున్న ఇండియా- ఇకపై మరే సంస్థా ప్రయాణికుల సమయంతోనూ, డబ్బుతోనూ, భద్రతతోనూ ఆడుకోవడానికి వీల్లేకుండా నిబంధనలను కఠినతరం చేయాల్సిన అవసరాన్ని చాటిచెబుతోందీ సంక్షోభం.

గడిచిన కొద్దిరోజుల్లో చాలా ఇండిగో విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని ఎడతెగని ఆలస్యంతో నడిచాయి. దాంతో లక్షలాది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ముఖ్యమైన కుటుంబ కార్యక్రమాలకు వెళ్ళాల్సినవారు, వైద్యులను కలవాల్సినవారు, వ్యాపార సమావేశాలకు, పరీక్షలకూ హాజరు కావాల్సినవారు అక్కడే ఇరుక్కుపోయారు. పైలట్లకు తగినంత విశ్రాంతి ఇవ్వాలన్న నిబంధనలను ఇండిగో చెవికెక్కించుకోలేదు. కొత్తవారిని నియమించుకోకుండా, ఉన్నవారితోనే అత్యంత బిజీ షెడ్యూల్లో ఎడాపెడా విమానాలను నడుపుతోంది. ఇలాంటి తరుణంలోనే కొన్ని విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్య జరుగుతుండటం సమస్య తీవ్రతను పెంచింది. దేశ పౌరవిమానయాన రంగంలో 63శాతం వాటా కలిగిన ఇండిగో విమానాల రద్దుతో, బాధిత ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చేంత సామర్థ్యం మిగతా సంస్థలకు లేదు. పైగా ఇలాంటి పరిస్థితుల్లో చాలా రూట్లలో టికెట్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దాంతో ఇండిగో తప్ప తమకు మరో గత్యంతరం లేదన్న భావన సామాన్య ప్రయాణికుల్లో నాటుకుపోయింది.



భద్రతను పణంగా పెడతారా?

మన పౌరవిమానయాన రంగం భారీ స్వప్నాలు, ఆకస్మిక పతనాల మధ్య ఊగిసలాడుతోంది. కొన్ని విమానయాన సంస్థలు మూతపడగా, మరికొన్ని దివాలా తీయడం ఇండిగో ఎదుగుదలకు దోహదపడింది. తక్కువ ఖర్చు, అధిక సామర్థ్యంతో పనిచేసే ఒకే రకమైన సాధారణ విమానాలను సమకూర్చుకుందా సంస్థ. పైగా చాలా తక్కువమంది సిబ్బందితో విమానాలను రోజంతా నడపడంపై దృష్టి పెట్టింది. దీనివల్ల ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడూ, నిబంధనలు మారినప్పుడూ ప్రయాణికుల భద్రత గాలిలో దీపమవుతోంది. అదే సమయంలో భారత్ కూడా- పొగమంచు, సాంకేతిక సమస్యలు, కొత్త భద్రతా నియమాలు వచ్చినప్పుడు సజావుగా ముందుకు సాగిపోయే పటిష్ఠ విమానయాన వ్యవస్థలను నిర్మించడంపై పెద్దగా దృష్టి పెట్టలేదు. పైలట్ల శిక్షణపైనా పెద్దగా వెచ్చించలేదు. ఆ పర్యవసానంగానే ఒక్క కంపెనీ తప్పుచేస్తే మొత్తం నెట్‌వర్క్ అతలాకుతలమయ్యే దుస్థితి దాపురించిందిప్పుడు!

తాజా సంక్షోభ తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వం నూతన పైలట్ విశ్రాంతి నిబంధనలను పాక్షికంగా సడలించింది. ఇండిగోపై కఠిన చర్యలు తీసుకుంటామంది. ఛార్జీల నియంత్రణకు ప్రయత్నించింది. బాధిత ప్రయాణికులకు డబ్బులను తిరిగివ్వాలని ఇండిగోను ఆదేశించింది. అయితే, ఇలా పైలట్ల విశ్రాంతి నిబంధనలను సడలించడం- పెద్ద కంపెనీలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నియమావళికి నీళ్లొదిలేయవచ్చనే తప్పుడు సందేశాన్నిస్తోంది. పైలట్లు అవిశ్రాంతంగా పనిచేస్తే అలసిపోతారని, దానివల్ల ప్రయాణికుల భద్రతకు ముప్పు ఉంటుందన్న హెచ్చరికలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. అత్యవసర సందర్భాల్లో మూడు చర్యలు చేపట్టాలి. ఒకటి- విమానాలు రద్దయినప్పుడూ, ఆలస్యంగా నడిచినప్పుడూ ప్రయాణికులు రిఫండ్, నష్టపరిహారం కోసం కౌంటర్ల దగ్గర క్యూల్లో నిలబడాల్సిన అగత్యంకానీ, కాల్ సెంటర్లకు ఫోన్ చేయాల్సిన అవసరంకానీ ఉండకుండా చూడాలి. డబ్బులు ఆటోమేటిక్‌గా ప్రయాణికుల ఖాతాల్లో జమచేయాలి. ఏ రోజైనా పరిమితికి మించి విమానాలు రద్దయితే, వెంటనే 'ఎమర్జెన్సీ కోడ్'ను అమలు చేయడం రెండోది. టికెట్ ధరలు పెరగకుండా చూడటం, అదనపు విమానాలను నడిపేందుకు ఇతర సంస్థలకు తక్షణమే అనుమతివ్వడంతో పాటు టికెట్ల జారీలో బాధిత ప్రయాణికులకు ముందు ప్రాధాన్యమిచ్చేలా ఈ కోడ్ ఉండాలి. మూడోది- సౌలభ్యం కోసమని పైలట్ల విశ్రాంతి నిబంధనలను ఎక్కువగా సడలించకూడదు.

విమానయాన రంగంలో గుత్తాధిపత్య నివారణకు వచ్చే 2-5 సంవత్సరాల్లో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి. రద్దీగా ఉండే మార్గాలు, పెద్ద విమానాశ్రయాల్లో బడా సంస్థలకే కాకుండా... చిన్న, కొత్త ఆపరేటర్లకూ అవకాశమివ్వాలి. జాతీయస్థాయిలో, లేదంటే ఏదైనా మార్గంలో నిర్ణీత పరిమితికి మించి వాటా సాధించిన సంస్థలు అదనపు పైలట్లనూ, విమానాలనూ సమకూర్చుకోవాలి. ఆకస్మిక పరిస్థితులను అవి ఎదుర్కొంటాయా అనేదీ ఎప్పటికప్పుడు పరీక్షించాలి. ప్రయాణికుల హక్కులను పరిరక్షించేందుకు చట్టపరమైన మార్పులు కూడా అత్యావశ్యకం.

విమానయాన విధానం దేశార్థిక లక్ష్యానికీ, భౌగోళిక పరిమాణానికీ సరిపోయేదిగా ఉండటం ముఖ్యం. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జాతీయ సామర్థ్య ప్రణాళికను రూపొందించుకుని- ఒక పద్ధతి ప్రకారం విమానాశ్రయాల విస్తరణ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆధునికీకరణ, విమానాల పెంపు, పైలట్ శిక్షణ చేపట్టాలి. నిజానికి, మన దగ్గర సుశిక్షితులైన పైలట్లు, ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం చాలానే ఉంది. కాబట్టి మరిన్ని శిక్షణ సంస్థలను నెలకొల్పాలి. ఒక స్వతంత్ర భద్రతా సంస్థ ద్వారా సిబ్బంది అలసట, షెడ్యూళ్లు, త్రుటిలో తప్పిన ప్రమాదాలు, అవాంతరాలను నిరంతరం పర్యవేక్షించాలి.

పాఠాలు నేర్చుకోవాలి

విమానయాన చట్టం-1934, డీజీసీఏ నిబంధనల ప్రకారం విమాన సర్వీసుల రద్దు, జాప్యానికి ఆయా సంస్థలు ఛార్జీలను రిఫండ్ చేయడమో, ప్రత్యామ్నాయ విమానం నడపడమో చేయాలి. లేదంటే రూ.20వేల వరకు నష్టపరిహారాన్ని చెల్లించాలి. కానీ, నిబంధనలు కఠినంగా లేకపోవడం వల్ల ఎవరూ వాటిని పట్టించుకోవడంలేదు. ఈ పరిస్థితిని మార్చాలి. ఇండిగో సంక్షోభాన్ని ఒక దురదృష్టకర ఘటనగా చూస్తే- భారత్ నేర్చుకునేదేమీ ఉండదు సరికదా, మళ్ళీ ఇలాంటి అగచాట్లే పునరావృతమవుతాయి. దీన్నుంచి పాఠం నేర్చుకుంటే- ప్రయాణికులను గౌరవించే, భద్రతతో రాజీపడని, గుత్తాధిపత్యానికి తావులేని బలమైన విమానయాన వ్యవస్థను నిర్మించుకోగలుగుతాం. ఇండిగో సంక్షోభాన్ని మౌలిక వసతుల నిర్వహణను మలుపుతిప్పే; ప్రయాణికులే కేంద్రంగా, సులభతరమైన నష్టపరిహార చెల్లింపులతో కూడిన సౌహార్ద్ర విమానయాన వాతావరణాన్ని కల్పించే సందర్భంగా చూడాలి. తద్వారా దేశార్థిక ఆశయాలకు అనుగుణమైన వాయు రవాణా వ్యవస్థ సమకూరుతుంది. గుత్తాధిపత్యం కలిగిన సంస్థకు వత్తాసు పలికితే మాత్రం- తదుపరి వైఫల్యం మరింత పెద్దదిగా ఉండవచ్చు!



సీఆర్ సుకుమార్
సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది

జ్ఞాపకాలూ అనుభవాలు ప్రతి మనిషికీ వ్యక్తిగతమైనవే. ప్రతి ఒక్కరూ జీవిత ప్రయాణంలో ఎన్నో అనుకూల, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటారు. ఆ అనుభవాలే వారి ఆలోచనలకు, నిర్ణయాలకు, వ్యక్తిత్వానికి పునాది వేస్తాయి. అవి వ్యక్తులకే కాదు- సంస్థలకు, సమాజానికి కూడా ఎంతో ఉపయోగపడతాయని చరిత్ర చెబుతోంది. అనీ ఫ్రాంక్ 'ద డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్' లాంటివి నాటి పరిస్థితులకు అద్దం పడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంత ప్రజాదరణ పొందాయో మనకు తెలుసు. పాత తరాలు సాంకేతికతపై తక్కువగా ఆధారపడినప్పటికీ, వారి అనుభవాలు, సలహాలు, సూచనలు జీవన విధానాలను, ప్రమాణాలను మెరుగుపరిచాయన్నది నిస్సందేహం.

ఏఐ ఒక్కటే చాలదు!



పుస్తక జ్ఞానం జీవితంలో ఒక భాగం మాత్రమేనని పెద్దలు చెబుతుంటారు. అనుభవాలు నేర్పిన పాఠాలకే వాళ్లు పెద్దపీట వేశారు. పెద్ద సంస్థల సీఈవోల నుంచి సాధారణ వ్యక్తుల వరకు... చాలామంది తమ రోజువారీ అనుభవాలను డైరీ రాసుకుంటుంటారు. అది వ్యక్తిగతం కాబట్టి ఎలాంటి భేషజాలు, కప్పిపుచ్చుకోవడాలు లేకుండా జయాపజయాల్ని, తప్పొప్పుల్ని, సమస్యలను ఎదుర్కొన్న తీరును స్పష్టంగా రాసుకుంటారు. అలాంటి డైరీలు వారి నిజ జీవితానికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి. అంతెందుకు... మహాత్మాగాంధీ, అబ్దుల్ కలామ్ లాంటి వారు నిష్కర్షగా రాసిన జీవిత చరిత్రలు ఎందరికి స్ఫూర్తినివ్వడం లేదు? అయితే అటువంటి జీవిత చరిత్రలు కొందరివే అందుబాటులో ఉంటాయి. డైరీలు ఎంతోమంది రాస్తారు కానీ అవి బహిరంగంగా అందుబాటులో ఉండవు. టైమ్ మేనేజ్‌మెంట్ నుంచి మానవ సంబంధాలు, ఆర్థిక వనరుల నిర్వహణ, వర్క్ లైఫ్ బ్యాలెన్స్ వరకు అనేక విషయాలు డైరీలోకి చేరతాయి. ఇంటర్వ్యూలో ఎవరన్నా అడిగితే ఒకటీ అరా బయటికి వస్తాయి కానీ అందరూ అన్నీ చెప్పరు.

సరే, ఇప్పుడీ డైరీల ప్రస్తావన ఎందుకొచ్చిందీ అంటే- నేడు యువతరం అన్నిటికీ ఆన్‌లైన్ మీదే ఆధారపడుతోంది. ప్రతిదీ ఇంటర్నెట్‌లో దొరుకుతుందనీ... చాట్ జీపీటీ, గ్రోక్ లాంటివి ఏదడిగినా చెబుతాయనీ భావిస్తోంది. కృత్రిమ మేధ మోజులో పడి మానవ సహజ మేధస్సును పక్కనపెడుతోంది. అనుభవ పాఠాలకు దూరమవుతోంది. ఏఐ టూల్స్ పనిచేసేది వాటికి మనం అందించిన డేటా ఆధారంగానే. అవి సమాచారాన్ని ఉన్నది ఉన్నట్లుగా చదివి చెబుతాయి కానీ 'బిట్వీన్ ద లైన్స్' అంటే వాక్యాల మధ్య దాగి ఉండే అంతరార్థాన్ని గ్రహించలేవు. దాంతో సమాచారం కోసం వాటిమీద ఆధారపడేవాళ్లు సహజంగానే విషయాన్ని పైపైనే తప్ప లోతుగా తెలుసుకోలేకపోతున్నారు. ఆ లోటు తీరాలంటే- డిజిటల్ టూల్స్‌ను దాటుకుని వెళ్లి అనుభవజ్ఞులతో పరిచయాలు పెంచుకోవాలి. వారితో మాట్లాడుతూ ఉంటే సందర్భానుసారం వాళ్లు చెప్పే మంచి విషయాలను పాఠాల్లా మెదడులో పదిలపరచుకోవచ్చు. మనం పనిచేస్తున్న, ఆసక్తి ఉన్న రంగాల్లో నిపుణులుగా, విజేతలుగా పేరొందిన వారి దగ్గరికి వెళ్లాలి. శిష్యరికం చేయాలి. అప్పుడే సమాచారానికి అనుభవ జ్ఞానం తోడై మేధస్సును పరిపుష్టం చేస్తుంది.

– డాక్టర్ మైలవరం చంద్రశేఖర్



మహారాష్ట్రలోనే ఎక్కువ!

రోడ్డు దుర్ఘటనలు, నీళ్లలో మునిగిపోవడం, ఎత్తుల నుంచి పడిపోవడం తదితర ప్రమాదాల వల్ల 2023లో దేశవ్యాప్తంగా 4.37 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ మృతుల్లో మహారాష్ట్ర వాసులే అందరికంటే ఎక్కువగా ఉన్నారు. మధ్యప్రదేశ్, యూపీ ప్రజలు తరవాతి స్థానాల్లో నిలుస్తున్నారు. 2023లో ప్రమాదవశాత్తూ సంభవించిన మొత్తం మరణాల్లో ఆయా రాష్ట్రాల వాటా... (శాతాల్లో)

మహారాష్ట్ర	15.7
మధ్యప్రదేశ్	9.8
ఉత్తర్ ప్రదేశ్	9.7
తమిళనాడు	7.4
కర్ణాటక, రాజస్థాన్	6.8
గుజరాత్	5.2
ఒడిశా	5.0
ఆంధ్రప్రదేశ్	3.8
బిహార్, హరియాణా	3.7
ఇతర రాష్ట్రాలు, యూటీలు	22.4

(ఆధారం: ఎన్‌సీఆర్‌బీ నివేదిక)

నిర్వచనం మారింది... ముప్పు పెరిగింది!

ఆరావళి పర్వతాల్లో మైనింగ్ అంశం జాతీయ స్థాయిలో దుమారం రేపుతోంది. గనుల తవ్వకాలు ఆపకపోతే దేశ రాజధాని దిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీన్ని తోసిపుచ్చుతున్న కేంద్రం- పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామంటోంది. ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టును ప్రారంభించిన సంగతిని గుర్తుచేస్తోంది.



దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. దాదాపు 250 కోట్ల సంవత్సరాలకు మునుపే... అంటే ప్రొటెరోజోయిక్ యుగంలో అవి ఏర్పడినట్లు చరిత్ర చెబుతోంది. ప్రపంచంలోని పురాతన మడత పర్వత వ్యవస్థల్లో ఒకటిగా ఆరావళిని పరిగణిస్తారు. దిల్లీ చెంత మొదలై నైరుతి దిశగా దక్షిణ హరియాణా, రాజస్థాన్ మీదుగా గుజరాత్ వరకు దాదాపు 700 కి.మీ. మేర ఈ పర్వతాలు విస్తరించి ఉన్నాయి. ఇవి అనేక నదులు, వృక్షాలు, వన్యప్రాణులకు నెలవులు. పర్వతశ్రేణి వెంట పదుల సంఖ్యలో జీవవైవిధ్య పార్కులు, అభయారణ్యాలు ఉన్నాయి. థార్ నుంచి గంగా మైదానాల వరకు ఎడారులు విస్తరించకుండా ఆరావళి పర్వతాలే అడ్డుకుంటున్నాయి. వర్షాకాలంలో నీటిప్రవాహాన్ని అదుపు చేస్తున్నాయి. భూగర్భ జలాలను రీఛార్జ్ చేస్తున్నాయి. దిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంలో గాలి కాలుష్యం ఇంకా విషమించకుండా నిలువరిస్తున్నాయి.

ఊహకందని నష్టం!

దేశానికి అత్యంత కీలకమైన ఆరావళి పర్వత శ్రేణిలో విలువైన ఖనిజాలెన్నో లభ్యమవుతాయి. అందుకే అనుమతులతో కొందరు, అక్రమంగా మరికొందరు అడ్డగోలుగా మైనింగ్ చేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న విచ్చలవిడి తవ్వకాలతో కొండలు కరిగిపోతున్నాయి. దాంతో పర్యావరణం అదుపు తప్పుతోంది. చలిగాలులు ముందుగానే దేశంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇవన్నీ చాలా కాలం నుంచీ జరుగుతున్నప్పటికీ ఇప్పుడే ఎందుకు చర్చ సాగుతోందంటే... ఆరావళి పర్వతాలకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్వచనం ఇవ్వడమే వివాదానికి కారణమైంది. 100 మీటర్లు... అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలని సర్కారు నిర్వచించింది. అంతకంటే తక్కువ ఎత్తుంటే పర్వతాలుగా పరిగణించలేమని స్పష్టంచేసింది. ఇదే ఇప్పుడు అగ్గి రాజేసింది. ప్రభుత్వ నిర్ణయంపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశానికి ప్రాణావసరమైన పర్వత శ్రేణిని కాపాడాల్సిన ప్రభుత్వమే ఆ బాధ్యతను పక్కనపెట్టి మైనింగ్‌కు ఎలా దారి చూపుతారని ప్రశ్నిస్తున్నారు.

ఆరావళి ప్రస్తుత పరిస్థితిపై 'పీపుల్ ఫర్ ఆరావళీస్' సంస్థ సవివర సమాచారం వెలుగులోకి తెచ్చింది. అక్రమ తవ్వకాలు, అభివృద్ధి పేరిట సాగుతున్న కట్టడాలతో... హరియాణా, రాజస్థాన్‌లోని చార్ఖీ దాద్రి, భీవానీ జిల్లాల్లో ఆరావళి పర్వతాలు ధ్వంసమయ్యాయి. జీవవైవిధ్యం నాశనమైంది. పరిస్థితి మరింత దిగజారితే ఉత్తర భారతంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఆరావళిలో గనుల తవ్వకాలను సుప్రీంకోర్టు గతంలో నిషేధించినా, అక్రమ కార్యకలాపాలు మాత్రం ఆగలేదు. ఇప్పుడు పర్వతాలకు కొత్త నిర్వచనం ఇవ్వడంతో ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్ ముప్పు పొంచి ఉంది. అదే జరిగితే, దిల్లీ వరకు థార్ ఎడారి విస్తరించే ప్రమాదముంది. భూగర్భ జలాలు అడుగంటుతాయి. గాలి నాణ్యత మరింత దెబ్బతింటుంది. అనారోగ్య సమస్యలు పెరిగిపోతాయని 'పీపుల్ ఫర్ ఆరావళీస్' హెచ్చరిస్తోంది. అయితే, 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తున్న కొండలను పర్వతాలుగా పరిగణించలేమని నవంబర్ 20న కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. దాన్ని న్యాయస్థానం ఆమోదించింది. ఆరావళి పర్వతశ్రేణుల స్వరూపాన్ని మార్చడానికి మాత్రం వీల్లేదని తేల్చిచెప్పింది. చుట్టూ మైనింగ్ జరుగుతుంటే... పర్వతాల స్వరూపం కచ్చితంగా మారిపోతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. 2024లో ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొన్న కీలకాంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. ఆరావళిలో తక్కువ ఎత్తుండే పర్వతాలే థార్ ఎడారి నుంచి వచ్చే ధూళి, ఇసుకను అడ్డుకోవడంలో కీలకమైనవని ఎఫ్ఎస్ఐ స్పష్టం చేసిందని పర్యావరణవేత్తలు గుర్తుచేస్తున్నారు.

పునఃసమీక్ష మేలు!

ఆరావళిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని కేంద్రం ఆక్షేపిస్తోంది. ఆ పర్వతశ్రేణిని కాపాడటానికి ఇప్పటికే చర్యలు చేపట్టామంటోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రధాని మోదీ ప్రారంభించారు. కాలుష్యం, వాతావరణ మార్పులతో క్రమంగా అడవులు అంతరించిపోతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. అందుకే దిల్లీ నుంచి గుజరాత్ వరకు అడవులు పెంచడమే లక్ష్యంగా పునరుజ్జీవన పథకం చేపట్టినట్లు వెల్లడించారు. ఆరావళి చుట్టూ భయాందోళనలు ముసురుకుంటున్న నేపథ్యంలో వంద మీటర్ల కంటే ఎత్తున్నవే పర్వతాలనే నిర్ణయాన్ని కేంద్రం పునఃసమీక్షించాలి. పర్యావరణవేత్తలు, భూవిజ్ఞాన శాస్త్రవేత్తలతో కమిటీ వేసి, వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులోని 90శాతం ప్రాంతాల రక్షణకు చర్యలు చేపట్టాలి. డిజిటల్ మానిటరింగ్, ఏఐ టూల్స్ వినియోగం, మెషిన్ లెర్నింగ్‌ల ద్వారా అక్రమ మైనింగ్‌ను గుర్తించే వ్యవస్థ ఏర్పాటుచేయాలి. రాజస్థాన్, హరియాణా, గుజరాత్‌లలో మ్యాపింగ్ ప్రోటోకాల్స్ కఠినంగా అమలు చేయాలి. ఇది అక్రమ కార్యకలాపాలను తగ్గించి, రియల్-టైమ్ రక్షణను బలోపేతం చేస్తుంది. ఆరావళి గ్రీన్‌వాల్ వంటి ప్రాజెక్టులను విస్తరించాలి. అడవుల పునరుద్ధరణ, భూగర్భ జలాల రీఛార్జ్ ప్రాజెక్టులు చేపట్టాలి. స్థానికులతో సంయుక్త అటవీ నిర్వహణ కమిటీలు ఏర్పాటుచేసి... ప్రభుత్వం, ఎన్జీవోలు వారికి సహకరించాలి.

– పేరం వెంకటేశ్వర ప్రసాద్

పువ్వుల్లో దాగున్న విశేషాలు..!

హాలో ఫ్రెండ్స్..! పువ్వులు అనగానే మనకు రకరకాల రంగులూ వాటి వాసన గుర్తొస్తాయి కదా! చెట్టు ఆకుపచ్చ రంగులో ఉంటే పువ్వులకు అన్ని రంగులు ఎలా వస్తున్నాయి. వాటి నుంచి వచ్చే సువాసనకు కారణం ఏంటి? కొన్ని పువ్వులు ఉదయానికి వికసిస్తే.. మరికొన్ని రకాల పువ్వులు సాయంత్రం, రాత్రి ఎందుకు పూస్తాయి? ఇలాంటి బోలెడు సందేహాలు మీకూ ఉన్నాయి కదూ! అయితే ఈ కథనం చదివేయండి..

పూలు అనగానే ఎక్కువగా గులాబీ, మందార, మల్లెపువ్వులే గుర్తొస్తాయి. ఎందుకంటే మన ఇళ్లలో ఎక్కువగా వాటినే పెంచుకుంటాం కాబట్టి. కానీ కొన్ని వేల రకాల పువ్వులున్నాయి. అందులో ఒక్కోటి ఒక్కోరకమైన రంగు, రూపం, వాసన కలిగి ఉంటాయి. అందుకు చాలా కారణాలే ఉన్నాయి. పువ్వులు సీతాకోకచిలుకలను, తేనెటీగలను.. ఇలా రకరకాల కీటకాలను ఆకర్షించడానికే రంగులు, వాసనను కలిగి ఉంటాయట. పూలల్లో ఉండే యాంతోసైనిన్స్, కెరోటినాయిడ్స్ వంటి పిగ్మెంట్స్ వల్లే అవి రకరకాల రంగుల్లో ఉంటాయి. అలాగే వాటిలో ఉండే వోలటైల్ ఆయిల్స్ తొందరగా పాడవ్వకుండా, పురుగులు పట్టకుండా ఉండేందుకు సాయం చేస్తాయి. మరో విషయం ఏంటంటే.. ఉదయం పూచే పూలు ఎక్కువ రంగు, తక్కువ వాసనతో ఉంటాయి. సాయంత్రం, రాత్రి వికసించే పువ్వులేమో ఎక్కువ సువాసనను విడుదల చేస్తాయి. చీకట్లో కీటకాలు పువ్వులను గుర్తించలేవు కదా! అందుకే వాటిని వాసన ద్వారా ఆకర్షిస్తాయన్నమాట. ఇవి ఎక్కువ సమయం తాజాగా కూడా ఉంటాయట. ఉదయం పూచే పూలు ఒకవేళ ఎక్కువ వాసన కలిగి ఉన్నా, దాన్ని ఎండ వేడి తగ్గించేస్తుంది. పువ్వులు మనలోని ఒత్తిడిని, ఆందోళనని తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయట. నేస్తాలూ.. ఉదయం, సాయంత్రం పూచే రెండు రకాల పూలను కోసి.. ఒకసారి వాటి రంగు, వాసనలను మీరూ పరిశీలించండి! ✦

హాయ్! బుజ్జీ!!



నేనెవర్ని?

1. నేనో ఆరు అక్షరాల పదాన్ని. నాలోని.. 1,2,3,5,6 అక్షరాలను కలిపితే 'డబ్బు' అని.. చివరి మూడు అక్షరాలను కలిపితే 'తాళంచెవి' అనే అర్థాన్నిస్తాను. నేనెవర్ని?

2. అయిదక్షరాల పదాన్ని నేను. నాలోని.. 1,3,2,4 అక్షరాలను కలిపితే 'ఉప్పు' అని.. చివరి నాలుగు అక్షరాలను కలిపితే ఆలస్యం అనే అర్థాన్నిస్తాను. నేనెవరినో తెలిసిందా?

జవాబు: 1.MONKEY 2.SLATE

పీజీవాలా చాయ్.. హుషారెత్తించేనోయ్..



ఓ చిన్న ఆలోచన జీవితాన్ని మార్చేస్తుంది. విజయవాడ తితిదే కల్యాణ మండపం రోడ్డులో నవంబరు 25న పీజీవాలా చాయ్‌తో పాటుగా క్రీం, చాక్లెట్ మస్కాబన్ అమ్మకం ప్రారంభించారు తాండ్ర స్పందన. ఉదయం, సాయంత్రం 6 నుంచి 8.30 వరకూ అమ్ముతున్నారు. రెండు పీజీలు (ఎంఏ, ఎంఈడీ) చేసినా చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదనుకుంటూ ఆమె సమయం వృథా చేసుకోలేదు. కుటుంబ పరిస్థితులు, పిల్లల పెంపకం కారణంగా బయటకు వెళ్లి ఉద్యోగం చేసే పరిస్థితి లేక.. క్షణ్ణంగా, ఇష్టంతో చేసే చిన్న పనైనా చాలు మనకు ఆనందం పెరుగుతుందని ఆమె చెబుతున్నారు. పదేళ్లు టైలరింగ్ పని చేసి పిల్లలను చదివించారు. బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న కొడుకు గత ఆగస్టులో భీమవరం దగ్గర పేరుపాలెం బీచ్‌లో సముద్ర కెరటాల్లో చిక్కుకుని మృతి చెందాడు. ఆ విషాదం నుంచి బయటకు వచ్చి, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న పాపను బాగా చూసుకోవాలని, ఇందుకోసం కొత్తగా ఏదైనా వ్యాపారం చేయాలని ఇలా చాయ్-మస్కాబన్‌ని ఎంచుకున్నానని స్పందన తెలిపారు. రెండు వారాల్లోనే ప్రజల ఆదరణ పెరిగిందని చెప్పారు. కుమారుడు చనిపోవడంతో అతని స్నేహితులు అండగా నిలబడ్డారని గుర్తు చేసుకున్నారు. - ఈనాడు, అమరావతి

ఇదిగో సౌకర్యం.. వాడితే సౌలభ్యం



రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే శాఖ సేవలను విస్తృతం చేస్తోంది. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్న ప్రయాణికుల కోసం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వీల్‌ఛైర్ అందుబాటులో ఉంది. ఈ సేవలు ఉన్నట్లు చాలా మందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రైలు దిగి బయటకు వెళ్లడానికి లేదా బయట నుంచి రైలు వద్దకు వెళ్లేందుకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. విజయవాడ రైల్వేస్టేషన్ ప్రధాన ముఖ ద్వారంతో పాటు పార్సిల్ కార్యాలయం, తారాపేట, తూర్పు బుకింగ్ ప్రాంతంలో.. ఈ సేవలు 24గంటలు అందిస్తారు. రైలు విజయవాడకు చేరుకునే లోపు ప్రయాణికులు ఫోన్ చేసి రైలు నంబరు, పేరు, బోగీ, బెర్త్ నంబరు చెబితే.. మీరు స్టేషన్ చేరుకునేలోపు పోర్టర్లు వీల్‌ఛైర్‌తో సిద్ధంగా ఉంటారు. అలాగే బయటి నుంచి వచ్చే వారి కోసం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్రవేశ మార్గాల్లో ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. ఫోన్ చేస్తే.. పోర్టర్ అక్కడికే వస్తారు. దీనికి రూ.165 మాత్రమే వసూలు చేస్తారు. ఎవరైనా అధికంగా వసూలు చేస్తే.. విజయవాడ స్టేషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ నంబరు 0866-2767225, 96037 28325, 99481 88678. - న్యూస్‌టుడే, విజయవాడ(గాంధీనగర్)

బందరు తాజ్‌మహల్



మచిలీపట్నంలోని ఇంగ్లీషు చర్చి



అరబెల్లా సమాధి

ఆగ్రాలోని తాజ్‌మహల్ ప్రేమకు చిహ్నం అని అందరికీ తెలిసిందే. అంతటి కట్టడం కాదు కానీ ఎప్పుడో శతాబ్దాల నాటి ప్రేమకు చిహ్నం మచిలీపట్నంలోనూ ఉంది. దానిని బందరు తాజ్‌మహల్ అంటారు. 18వ శతాబ్దంలో ఇంగ్లండ్ నుంచి వచ్చిన సైనికాధికారి కెప్టెన్ రాబిన్‌సన్, ఆయన భార్య హారియట్, కుమార్తె అరబెల్లా బందరులో ఉండేవారు. అప్పట్లో సైనిక కేంద్రానికి మేజర్‌గా ఉండే జనరల్ పాటర్, అరబెల్లా సౌందర్యానికి ఆకర్షితుడై ప్రేమిస్తున్నట్లు చెప్పడంతో ఆమె అంగీకరించింది. కానీ వారి వివాహానికి అరబెల్లా తండ్రి, క్రైస్తవ మతాధిపతులు అంగీకరించలేదు. దీంతో వారిద్దరు రహస్యంగా ప్రేమను పెంచుకున్నారు. అదే సమయంలో ఆంగ్ల సిపాయిల మధ్య అంతర్గత గొడవలు తీవ్రమవడంతో బ్రిటిషర్లు సైనిక అధికారుల పదోన్నతులు నిలిపివేశారు. రాబిన్‌సన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. తాను పదవి కోల్పోవడానికి పాటర్ కారణమని భావించి తన కూతురు అరబెల్లా పాటర్‌ను కలవకుండా కట్టుదిట్టం చేశారు. పాటర్‌ను కలవలేక బాధతో అనారోగ్యానికి గురైన అరబెల్లా మంచం పట్టింది. ఆమె 1809 నవంబరు 6న తన ప్రియుడు పాటర్ చేతుల్లోనే తుదిశ్వాస విడిచింది.

నాటి ప్రేమకు చిహ్నం: పెళ్లి కాకముందే కన్యగా చనిపోయిన అరబెల్లా మృతదేహాన్ని బందరులోని ఆంగ్ల శ్మశానవాటికలో ఖననం చేయడానికి అంగీకరించలేదు. పాటర్ తన ప్రియురాలు వివాహానికి సిద్ధం చేసుకున్న పెళ్లిగౌను, ఉంగరాలు ఆమె పార్థివదేహానికి తొడిగి శరీరం కుళ్లిపోకుండా రసాయనాలు పూసి గాజు పేటికలో భద్రపరిచారు. మాచవరంలో 15 ఎకరాలు కొని అక్కడే పాతిపెట్టారు. తన ప్రేయసి మృతదేహాన్ని తరచూ చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆ తరవాత సమాధి మీద 1814లో చర్చి నిర్మించి 1818లో బ్రిటిష్ ప్రభుత్వానికి అప్పగించారు. పాటర్ మద్రాసు బదిలీ అయ్యాక అక్కడే చనిపోయారు. ప్రస్తుత ఇంగ్లీషు చర్చి ఆవరణలోని సమాధి వారి ప్రేమను నేటి తరానికి చాటిచెబుతోంది. - మచిలీపట్నం కార్పొరేషన్

ఉడతా ఉడతా ఊచ్.. ఉరకలు వేసిందోచ్..



గాల్లో తేలినట్టుందే.. అంటూ ఈ చిట్టి ఉడతల సందడి చూస్తే ముచ్చటేస్తుంది కదూ.. ఆహార వేటలో గుంపులుగా ఉండి ఒకదానితో మరొకటి తరుముకుంటూ చకచకా గంతులు వేస్తూ ఉడతలు సందడి చేశాయి. విజయవాడ ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో రెండు ముచ్చటైన చెట్ల రెమ్మలపై నుంచి ఒకదాని వెంట ఒకటి గంతులు వేస్తూ 'ఈనాడు' కెమెరాకు చిక్కాయి. -ఈనాడు, అమరావతి

వరి తోరణం.. విరిసిన ఆనందం



వరికంకులతో తయారు చేసిన అందమైన తోరణాలు ఇంటి గుమ్మాలకు, వరండాల్లో కట్టుకుంటే అక్కడ వాలే పక్షులు తిండి గింజలు అవసరమైనప్పుడు వచ్చి తినడానికి వీలుగా తయారు చేశారు. చూడముచ్చటగా ఉన్న వీటిని రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో అమ్మకానికి ఉంచారు. ఈ వరికంకుల తోరణాలు సైజును బట్టి రూ.300 నుంచి రూ.450 వరకు విక్రయించారు. -ఈనాడు, అమరావతి

అనాథనయ్యాను ఆదుకోండి..



94 ఏళ్ల వయసులో కలెక్టర్‌కి తన సమస్య చెప్పుకోవడానికి వచ్చిన ఈ వృద్ధురాలి పేరు జాలాది లక్ష్మీకాంతం. విజయవాడ గ్రామీణ మండలం నిడమానూరు వాసి. కట్టుకున్న భర్త, కన్న కొడుకు చనిపోవడంతో ఒంటరిగా మిగిలింది. ప్రభుత్వ పింఛను డబ్బులతోనే జీవనం సాగిస్తోంది. కొడుకు చనిపోవడంతో కోడలు ఆధీనంలో ఉన్న తన ఇంటిలో తనకు రావాల్సిన వాటా ఇప్పించాల్సిందిగా కోరుతూ ఈ ఏడాది జూన్‌లో కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం మరోసారి కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఆరా తీశారు. - ఈనాడు, అమరావతి



క్రిస్మస్ కొవ్వొత్తులు.. వెదజల్లే సువాసనలు..

క్రిస్మస్ సమీపిస్తుండడంతో వివిధ రకాల పర్యావరణ హితమైన క్యాండిల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. విజయవాడ ఆటోనగర్ బస్టాండు ఎదురుగా ఉన్న ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన థీమెటిక్ ఎగ్జిబిషన్‌లో సోయాబీన్స్ నుంచి వచ్చే ఓ పదార్థంతో తయారైన క్రిస్మస్ కొవ్వొత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. వీటిని వివిధ రకాల ఫ్లేవర్స్‌తో తయారు చేశారు. వెలిగిస్తే సువాసనలు వెదజల్లుతున్నాయి. – ఈనాడు, అమరావతి

ప్రమాదకరమైనా.. అరికట్టలేరా?!

ఈనాడు డిజిటల్- మచిలీపట్నం- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

నేనండీ... మీ విజయవాడ- అవనిగడ్డ కరకట్ట దారిని.. దయచేసి నా విన్నపం ఆలకించరూ..

విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లాలంటే నేనే దగ్గర దారినండి. ఏళ్లుగా గుంతలు పడి.. ఎక్కడికక్కడ కుంగినా.. నాకు మరమ్మతులైనా చేయలేదు. నాపై బస్సులు మినహా పెద్ద వాహనాలకు అనుమతిలేదు. గత వైకాపా జమానా నుంచి భారీ ఇసుక టిప్పర్లు తిప్పేస్తున్నారు. ఆ బరువు మోయడం నా వల్ల కాదని తెలిసినా పట్టించుకోవట్లేదు. జనం నన్ను నిందించకుండా కూటమి ప్రభుత్వంలో అయినా బాగు చేస్తారేమో నని ఆశపడితే.. కొందరు పాలకులు, అధికారులు నాటి దందానే సాగిస్తూ వేదన మిగులుస్తున్నారు.



అప్పారావుపేట వద్ద దెబ్బతిన్న రోడ్డు

చితికిపోతున్నా.. చిన్నచూపేల?

యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు 90 శాతం దెబ్బతిన్నా. చాలా చోట్ల భారీ గుంతలు పడగా.. ఇంకొన్నిచోట్ల ఎక్కడికక్కడ కుంగి ఎగుడుదిగుడుగా మారాను. 20 టన్నుల టిప్పర్లు... 40-50 టన్నుల ఇసుకతో 50 కి.మీ. వేగంతో దూసుకెళ్తున్నాయి. అంతటా ఇసుక జారి ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు నిత్యం అదుపు తప్పి గాయాలపాలై నన్ను తిడుతున్నారు.

చక్కదిద్దింది... బాబేనండి

యనమలకుదురు- నుంచి పులిగడ్డ వరకు 60 కి.మీ. కరకట్ట రోడ్డు నేను. 1998 కృష్ణా వరదలకు బాగా బలహీనపడగా అప్పటి సీఎం చంద్రబాబు రూ.15 కోట్లతో నన్ను బాగు చేసి.. రూ.10 కోట్లతో 2002లో తారురోడ్డుగా మార్పించారు. ★ 2009లో వరదలు రాగా రూ.138 కోట్లతో రెండు వరుసల దారేశారు. ★ 2017 నుంచి బస్సులను అనుమతించారు.



చల్లపల్లి: నడకుదురు-రాముడుపాలెం వద్ద ఒకవైపు కుంగిన రహదారి

అడుగడుగునా గాయాలే..!

రామలింగేశ్వరుడి సన్నిధి నుంచి పెదపులిపాక, చోడవరం, మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు, అప్పారావుపేట, లంకపల్లి, శ్రీకాకుళం, వెలువోలు, నడకుదురు, కొత్తపాలెంలో విపరీతంగా దెబ్బతిన్నా. ★ నేను పూర్తిగా దెబ్బతింటే కట్ట కింద గ్రామాలన్నీ కొట్టుకుపోతాయి. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలకు విజయవాడ నుంచి బందరు మీదుగా 120 కి.మీలు తిరిగి రావాల్సిందే.

ప్రాణాలు పోతున్నాయ్..!

ఇటీవల అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు తోట్లవల్లూరు వద్ద గుంతల దాటికి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో 37 మంది ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ముప్పు తప్పింది. ★ పాపవినాశనం వద్ద గుంతల తీవ్రతకు లారీ బోల్తా పడి డ్రైవర్ బలయ్యాడు.

★ కొత్త లేయర్ నిర్మాణానికి రూ.139 కోట్ల అంచనాతో సర్కారుకు ప్రతిపాదనలు పంపామనీ.. ఇసుక టిప్పర్లు తిరగకుండా చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఈఈ రవికిరణ్ చెబుతున్నారు.. ఇవి నెరవేరతాయని కాసింత ఆశతో ఉన్నా.

నిత్యమై.. సత్యమై..!

పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గాపార్వతి సహిత నాగేశ్వరస్వామి ఆలయంలో సత్యానికి ప్రతీకగా నిలిచే స్తంభం ఉంది. దీనికి మూడు పేర్లున్నాయి. అవి.. సత్యస్తంభం, కర్కోటక (నవ నాగులలో ఒకటైనది)స్తంభం, ధర్మ స్తంభం. భక్తులు తొలుత ఈ స్తంభానికి మొక్కి 'నా చేత, నా నోటి వెంట సత్యాన్ని పలికించు..' అని మొక్కుకుని అనంతరం స్వామి, అమ్మవార్లను కొలుస్తారు.



అగస్త్య మహర్షి ద్వారా ఈ దేవాలయం వెలుగులోకి వచ్చిందని పురాణ విశ్లేషణ. ఈ దేవాలయం 15వ శతాబ్దిలో రాజుల పాలనలో ఉండేది. గ్రామాల్లో తగాదాలు ఆస్తి, కుటుంబ కలహాలు వస్తే ఇరు పక్షాలనూ విచారించి రాజు చెప్పినదే తుది తీర్పు. ఒకసారి అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా.. రాజుగారి వద్దకు వచ్చింది. ఇద్దరినీ ఆలయంలో ఈ స్తంభం వద్ద నిల్చోబెట్టి విచారించారు. ఇద్దరిలో ఒకరిదే ఆస్తి, కానీ రెండో వాడు కూడా తనకు సంపద వస్తుందనే ఆశతో ఉన్నాడు. 'అబద్ధమే కదా ఆడేది.. కొంపలు మునిగిపోతాయా?' అనే ధోరణితో వ్యవహరించాడు. రాజు గారి ముందు అబద్ధమాడితే ఏమవుతుందిలే అనుకున్నాడు. స్తంభం దగ్గర నిలబడిన అన్నదమ్ముల్ని రాజు గారు ఆదేశిస్తూ.. 'ఈ ఆస్తి నాది' అనమన్నాడు. అదే మాట ఇద్దరి నోటి వెంట ఒకేసారి వెలువడింది. అబద్ధం ఆడిన వ్యక్తి శిరస్సుపై స్తంభం మూడు ముక్కలుగా విరిగి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక భాగం మాత్రం ఇప్పటికీ దేవాలయ ప్రాంగణంలో విశేష పూజలందుకుంటోంది. పడిపోయిన మూడు భాగాలను ఆలయంలో ఉన్న భోగ మండప నిర్మాణ సమయంలో అమర్చారు. ఇప్పటికీ అవి సజీవతను భక్తులకు తెలియచేస్తున్నాయి.

– పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే

పీజీ మెడికల్ ఆల్ ఇండియా కోటా సీట్లకు ఫ్రీ ఎగ్జిట్

ఈనాడు కథనానికి స్పందన

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: దేశంలోని కొన్ని రాష్ట్రాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ పీజీ మెడికల్ ప్రవేశాలకు ఫ్రీ ఎగ్జిట్ ఆప్షన్ ఇచ్చింది. ఆల్ ఇండియా కోటా సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా సొంత రాష్ట్రాల్లోనూ సీట్లు సాధించి డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్నారని సోమవారం 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. మొదటి విడత ఆల్ ఇండియా కోటాలో సీట్లు పొందిన అభ్యర్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని ఎంసీసీ పేర్కొంది. అలా వదిలేసిన సీట్లను రెండో విడత ఆల్ ఇండియా కోటాకు మళ్లించబడతాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి పీజీ మెడికల్ మొదటి విడత కౌన్సెలింగ్ గడువు 10వ తేదీతో ముగియనుండగా.. ఈ గడువును మరో రెండు రోజులు అదనంగా పొడిగించాలని చూస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

హుండీ ఆదాయం రూ.5.22 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గగుడి హుండీల్లో కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. 26 రోజుల్లో రూ.5,22,18,647 వచ్చింది. కానుకలతో పాటు 415 గ్రాముల బంగారం, 7.465 కిలోల వెండి వస్తువులు వేశారు. విదేశీ కరెన్సీ 489 యుఎస్‌ఏ డాలర్లు, 109 సింగపూర్ డాలర్లు, 125 కెనడా డాలర్లు, 860 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్స్, 125 సౌది రియాల్స్ కానుకలుగా హుండీల్లో వేసినట్లు దేవస్థానం ఈవో శీనానాయక్ తెలిపారు. లెక్కింపును ఈవోతో కలిసి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

కష్టం.. కోలుకోలేనంత!

వరి కోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ

ఈనాడు, అమరావతి

వరికోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ అన్నదాతకు గుండెకోత మిగులుస్తోంది. పెరిగిన పెట్టుబడి భారంతో నలిగిపోతున్న రైతన్నను ఈ పరిణామం గోరుచుట్టుపై రోకటి పోటులా వేధిస్తోంది. దిత్వా తుపాను, కోతల ఎద్దడిని ఆసరాగా తీసుకుని రేటు భారీగా పెంచి వరి రైతుల వెన్ను విరుస్తున్నారు. ధరలు క్రమబద్ధీకరించే వ్యవస్థ లేకపోవడంతో నష్టపోతున్నారు.



తిరువూరులో యంత్రంతో వరి కోతలు

ఎద్దడిని బూచిగా చూపి...

✪ ఉమ్మడి జిల్లాలో 4.74 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే 60 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. ✪ దిత్వా తుపాను నేపథ్యంలో ఆగిన కోతలు ఒకేసారి ఊపందుకోవడంతో డిమాండ్‌ను కోత యంత్రాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ✪ నిరుడు కోత యంత్రానికి గంటకు రూ.3 వేలు తీసుకున్నారు. ఈసారి రూ.3,500 పెంచారు. తుపానుకు ముందు డిమాండ్ పెరగడంతో గంటకు రూ.4,500 వసూలు చేశారు. ✪ తుపాను తర్వాత అందరూ కోతలు మొదలుపెట్టగా ఎద్దడిని బూచిగా చూపి రూ.3,700-4,000 వసూలు చేస్తున్నారు.

నేల వాలితే అంతే...

✪ ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల్లో పంట నేల వాలినట్లు అంచనా. సాధారణంగా నిలబడి ఉన్న పంట కోయాలంటే గంటన్నర పడుతుంది. గంటకు రూ.3,500 చొప్పున ఎకరాకు రూ.5,250 అవుతుంది. అదే నేలవాలిన పంట కోయాలంటే 3 గంటలు పడుతుంది. ✪ నేలవాలిన పంట కోసే సమయంలో ఎకరానికి 3 బస్తాలకు పైగా ధాన్యం రాలిపోతోంది. దీంతోపాటు మట్టి ఇతర చెట్ల గింజలు ధాన్యంలో కలిసిపోతున్నాయి.

10 శాతం అదనపు భారం..

✪ ఇదే అదనుగా కూలీలూ కొండెక్కి కూర్చున్నారు. ఎకరం కోత కోసి, కుప్ప వేసి, ధాన్యం తీస్తే రూ.15-18 వేలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి రైతులు ప్రతి గ్రామంలో పదుల్లో ఉన్నారు. ఈ బాదుడుతో 10 శాతం అదనపు పెట్టుబడి భారం పడుతోంది.

☛ **తిరువూరు** రైతు అన్నాబత్తుల కుమారస్వామి మూడెకరాల్లో కౌలు సాగు చేస్తున్నారు. పైరు బాగా పెరిగిందని తుపాను గాలులకు పడిపోతుందని కోత కోయిస్తే గంటకు రూ.4,500 వసూలు చేశారు. ఎకరానికి గంటన్నర పట్టగా రూ.6,750 చొప్పున మూడెకరాలకు రూ.20,250 ఖర్చయింది.

☛ **కంకిపాడు** మండలం ఈడా బాలస్వామి 10 ఎకరాల్లో కౌలు సాగు చేస్తున్నారు. ఆరెకరాలు నేల వాలింది. యంత్రంతో కోయిస్తే 18 గంటలు పట్టగా... (రూ.3500 చొప్పున) రూ.63 వేల ఖర్చు అయింది.

ఇంతి మోమున...వెలుగురేఖ!

ఈనాడు, అమరావతి

మహిళల్లో సృజనాత్మక నైపుణ్యాల పెంపునకు జిల్లా డీఆర్‌డీఏ నడుం బిగించింది. కేశినేని ఫౌండేషన్ సహకారంతో వెలుగు సిబ్బందికి జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) హైదరాబాద్‌లో శిక్షణ పొందే అవకాశం దొరికింది.



హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ..

35 రోజుల ప్రత్యేక శిక్షణ... ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్ ఉండాలనే కూటమి ప్రభుత్వ ఆశయానుగుణంగా వెలుగు మహిళలకు శిక్షణ చేపట్టారు. జిల్లా నుంచి మొత్తం 101 మందిని పంపారు. ★ ఎన్ఐఆర్డీలో చిరుధాన్యాల సాగు, ఆరోగ్య ప్రయోజనాలు, మిల్లెట్స్, సోయా ఉత్పత్తుల తయారీపై 5 రోజులు శిక్షణ ఇస్తున్నారు. ★ గచ్చిబౌలిలో ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లో లెదర్, నాన్ లెదర్ వస్తువుల తయారీలో 30 రోజులు శిక్షణ ఇస్తున్నారు. డిసెంబరు 1న 40 మంది వెలుగు సభ్యులు హైదరాబాద్ తరలివెళ్లారు. అక్కడ తరగతులే కాక.. ఆచరణాత్మక శిక్షణ ఇస్తున్నారు.

కుటీర పరిశ్రమలకు ఊతం... ఈ శిక్షణ... బృందాల వారీగా కొనసాగుతుంది. ఏటా 3-4 బృందాలకు శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం. ★ సభ్యుల నైపుణ్యాలు, అభిరుచుల మేరకు ఒక్కో బృందానికి ఒక్కో రకం అంశాలపై శిక్షణ ఇచ్చేలా డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అల్లికలు, బ్యూటీషియన్ కోర్సు, కుట్టులో నైపుణ్య తర్ఫీదు, బొమ్మలు, వస్తువుల తయారీ వంటివి ఉంటాయి. ★ శిక్షణ పూర్తయిన బృందాలు స్వతహాగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది. ★ ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరి ఉత్పత్తులతో స్టాళ్లు పెట్టించి ప్రచారం కల్పిస్తారు. ★ వారు ఆదాయం పొందుతూనే మరికొందరికి ఉపాధి కల్పించేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందని డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు తెలిపారు.

★ మరో 61 మందికి కూడా: సోమవారం తరలివెళ్లిన 61 మందికి డిసెంబరు 8-12 వరకు 5 రోజుల శిక్షణ ఇస్తారు. ★ 30 మందికి హ్యాండ్‌మేడ్ పేపర్ తయారీపై శిక్షణ.. 31 మందికి ఆ పేపర్ నుంచి తయారయ్యే వాషింగ్ పౌడర్, లిక్విడ్ సోప్స్, షాంపూలు, ఫినాయిల్ తయారీపై శిక్షణ ఇస్తారు.

ఆస్తి.. భూ వివాదాలే ఎక్కువ

విజయవాడ నేరవార్తలు: పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 82 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ప్రసాద్, ఏడీసీపీ రాజారావు ఫిర్యాదులు స్వీకరించారు. అత్యధికంగా ఆస్తి, భూ, నగదు లావాదేవీల వివాదాలపై 46 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ మోసాలు 7, మహిళా సంబంధ నేరాలు 5, కుటుంబ కలహాలు 2, కొట్లాటలు 2, దొంగతనాలు 2, రోడ్డు ప్రమాదం 1, ఇతర వివాదాలు 17 చొప్పున వచ్చాయి.

బాలోత్సవం వచ్చేసింది..

నేటి నుంచే..



విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన, నైపుణ్యం, కళలను ప్రోత్సహించేందుకు అమరావతి-బాలోత్సవం- పిల్లల పండగ పేరుతో కొన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియం ఇందుకు వేదికగా నిలిచింది. మూడు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే నినాదంతో దీనిని నిర్వహించనున్నారు. ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

వేదికలకు ప్రముఖుల పేర్లు : ఈ పోటీలకు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 18 మండలాల్లో వివిధ యాజమాన్యాలకు చెందిన రెండు వందల పాఠశాలల నుంచి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనడానికి ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. ఐదు వేదికలు, ఐదు ప్రాంగణాలు, ఐదు గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. వివిధ వేదికలకు ప్రముఖ సైంటిస్టు పద్మభూషణ్ డాక్టర్ ఏఎస్ రావు, విశ్వనరుడు, గుర్రం జాషువా, బాలల ప్రేమికుడు రచయిత నార్ల చిరంజీవి, ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి పద్మశ్రీ శోభానాయుడు, తెలుగు నాట మొట్టమొదటి సినీ గాయని లావు బాలసరస్వతీదేవి, ప్రముఖ విద్యావేత్త గిజుబాయ్, ప్రముఖ చిత్రకారుడు సూర్యదేవర సంజీవదేవ్, ప్రజాకళాకారుడు, నాటక రచయిత, దర్శకుడు గాదె సుబ్బారెడ్డి పేర్లు పెట్టారు.

మానసిక వికాసం, సమగ్రాభివృద్ధి: చదువుతో పాటు విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి బాలోత్సవం నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు తెలిపారు. 12 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

ముగిసిన ఫల.. పుష్ప ప్రదర్శన



పూల మొక్కలు చూస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రారంభమైన ఫల, పుష్ప ప్రదర్శన సోమవారం రాత్రితో ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నర్సరీల నిర్వాహకులు వివిధ రకాల మొక్కలను ప్రదర్శించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సందర్శించారు. ప్రదర్శనను 60 వేల మందికి పైగా తిలకించారని రోజ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) అక్టోబరు-2025 ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు గంట ముందు హాజరు కావాలని కోరారు. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే తాజా ఫొటో, గుర్తింపు కార్డు లేదా ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు, ఓటరు కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం తీసుకొని వెళ్లాలని సూచించారు. పీహెచ్‌సీ అభ్యర్థులు టెట్-2025 దరఖాస్తులో పీహెచ్‌సీ అని పొందుపర్చకపోతే వారి వైకల్య ధ్రువీకరణ పత్రంతో జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో సహాయకుడిని పొందవచ్చన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లవద్దన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏపీ టెట్ అక్టోబరు-2025 పేరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులు సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబరు 87902 58661 నంబరును సంప్రదించాలని కోరారు.

యువ మేధతో నూతన ఆవిష్కరణలు

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : యువ మేధస్సు నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్) సహకారంతో పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-విజయవాడ స్పోక్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్‌లో యువత వివిధ సమస్యలకు చూపిన సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ప్రోస్థెటిక్ చేతిని విష్ణు అసిస్టివ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్, మారిస్ స్టెల్లా కళాశాల విద్యార్థులు సామాజిక ప్రభావం కలిగించే పలు సాంకేతికతలను ప్రదర్శించారు. [illegible] బృందం స్వయం నియంత్రిత డ్రోన్ లాస్ట్‌మైల్ డెలివరీ వ్యవస్థను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇలక్కియా మాట్లాడుతూ.. యువ ఆవిష్కర్తలు, విద్యార్థి పరిశోధకులు ఆర్‌టీఐహెచ్‌తో పాటు కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ విభాగం ప్రోత్సహిస్తోందని తెలిపారు. [illegible] వేగవంతం చేసేందుకు ఈ చర్యలు దోహదం చేస్తాయన్నారు. ప్రోగ్రామ్ అసోసియేట్ జి.సుజాత, సౌమ్య మనోజ్, ఆర్‌టీఐహెచ్ సీఈవో జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో మామిడి కొనుగోళ్లు

విస్సన్నపేట: విస్సన్నపేటలో మామిడి కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక కిట్టూ మ్యాంగో గ్రోయర్స్‌లో తోతాపురి రకం టన్ను రూ.75,000లు పలికింది. విస్సన్నపేట నుంచి అహ్మదాబాద్ మార్కెట్‌కు మేలి రకం తోతాపూరి మామిడి కాయలు అర టన్ను రైలు మార్గాన ఎగుమతి చేసినట్లు మామిడి వ్యాపారి రాయల కిట్టూ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు..!

- క్షతగాత్రుడిని కాపాడేందుకు ట్రాఫిక్ పోలీసుల విశ్వప్రయత్నం
- గ్రీన్ ఛానల్‌లో తరలించినా ఫలించని వైనం



క్షతగాత్రుడిని పరీక్షిస్తున్న వైద్యురాలు



లారీ వెనుక చక్రాల వద్ద ఇరుక్కుపోయిన విజయ గోపాలకృష్ణ

విజయవాడ నేర వార్తలు, న్యూస్‌టుడే : ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ప్రాణాలు నిలిపేందుకు ట్రాఫిక్ పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన పొబట్టు విజయగోపాలకృష్ణ (52) నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని కుంచనపల్లిలోని ఇంటికి బయలుదేరారు. బెంజిసర్కిల్ సమీపం స్క్యూ బ్రిడ్జి వద్దకు రాగానే.. ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. వెనుక చక్రాల వద్ద ఆయన ఇరుక్కుపోయారు. శిరస్త్రాణం ధరించినా.. తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ రవికుమార్, సిబ్బంది శ్రమించి ఆయన్ని బయటకు తీశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఒక వైద్యురాలు వచ్చి పరీక్షించగా.. నాడి కొట్టుకుంటోంది. వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆమె సూచించారు. అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో.. ఆటోలో ఎక్కించారు.

కూడళ్లలో వాహనాలు నిలిపివేసి.. క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించిన వెంటనే కంట్రోల్‌రూంకు సమాచారం అందించారు. అక్కడి నుంచి వస్తున్న ఆదేశాలతో బెంజిసర్కిల్, నిర్మల కాన్వెంట్ కూడలి, రమేష్ ఆసుపత్రి కూడలిలో వాహనాలను నిలిపివేశారు. ఆటోకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి.. హుటాహుటీన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా.. విజయగోపాలకృష్ణ ప్రాణాలు కోల్పోయారు. అతన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వేదనకు గురయ్యారు. ప్రమాద ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎస్ఐ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పటమట, న్యూస్‌టుడే: ఉపాధి కల్పనా సంస్థలతో పాటు వాటిలో పనిచేస్తున్న కార్మికులను ప్రోత్సహించేందుకు ఈఎస్ఐసీ ప్రవేశపెట్టిన స్ప్రీ(స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ది ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్-2025) పథకం గడువు ఈ నెల 31తో ముగిస్తుందని రీజనల్ డైరెక్టర్ మల్ల రామారావు తెలిపారు. ఈ పథకం ఈ ఏడాది జులై 1న ప్రారంభమైందని వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ పథకంలో రాష్ట్రంలో 2.5 లక్షల మంది కార్మికులను రిజిస్ట్రేషన్ చేయించి వారికి సామాజిక భద్రత కల్పించామన్నారు. సుమారు 1000 కంపెనీలు పాత బకాయిలు చెల్లించి లబ్ధి పొందాయని వివరించారు. కంపెనీల యాజమాన్యాలు, కార్మికులు స్వచ్ఛందంగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుని ఈఎస్ఐ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 0866-2453498 సంప్రదించాలని సూచించారు.

గడువులోగా సమస్యలకు పరిష్కారం చూపాలి



అర్జీ పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా నేతృత్వంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 162 వినతి పత్రాలు స్వీకరించారు. వీటిలో అధికంగా రెవెన్యూ శాఖకు 65 అర్జీలు అందాయి. పోలీస్ 20, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ 26, పంచాయతీరాజ్ 10, విద్య 6, పౌరసరఫరాలు 5, వైద్యారోగ్యం 4, సర్వే, ఏపీ సీపీడీసీఎల్, జల వనరుల శాఖలకు 3 చొప్పున, ప్రజా రవాణా (ఆర్టీసీ), డీఆర్‌డీఏ, కార్మిక, [illegible] సంక్షేమ శాఖలకు రెండేసి చొప్పున వచ్చాయి. గృహ నిర్మాణం, పశుసంవర్ధక శాఖ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, సహకార శాఖ, అటవీ, దేవాదాయ, ఐసీడీఎస్, బీసీ సంక్షేమం, అగ్నిమాపక శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయి. ఇలక్కియా మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండరాదని, సత్వర, సంతృప్తికర పరిష్కారం లభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జ్యోతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగపండు కుటుంబానికి సాయం అందజేత



కవితకు ఎఫ్‌డీ పత్రాలు ఇస్తున్న అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల విద్యా శాఖ కార్యాలయంలో సీఆర్‌పీగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన గుగులోతు నాగపండు కుటుంబానికి విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.8.38 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఎ.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగపండు భార్య కవితకు తహసీల్దారు కె.లక్ష్మి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎ.కొండూరు, విస్సన్నపేట ఎంఈవోలు ఎం.రాజశేఖర్, ఈఎల్‌సీ.కేశవరావు, ఈ.సుధాకర్, హెచ్‌ఎం ప్రసాదరావు ఎఫ్‌డీ పత్రాలను అందజేశారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, మైలవరం మండలాల్లోని ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు రూ.7.75 లక్షలు, కేజీబీవీ సిబ్బంది రూ.33 వేలు, సమగ్ర శిక్షా సిబ్బంది రూ.20 వేలు బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇచ్చారని ఎంఈవో కేశవరావు తెలిపారు. మొత్తం సాయంలో రూ.7.75 లక్షలు అతని ఇద్దరి కుమారుల పేరుతో పదేళ్ల కాలపరిమితితో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు వెల్లడించారు.

నవీన్‌రెడ్డి హత్య కేసులో రౌడీషీటర్ అరెస్టు

మద్యం మత్తులోనే ఘటన జరిగిందని తేల్చిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ, ఏసీపీ, సీఐ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో సస్పెక్ట్ షీటర్ అలవాల నవీన్ రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు విజయవాడకు చెందిన రౌడీషీటర్ సాయికృష్ణ (పిల్ల సాయి)ని సోమవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు సమీపంలో రాంకో సిమెంట్స్ కర్మాగారం పక్కన లేబర్ కాలనీకి వెళ్లే మార్గంలో పొలాల్లో నవీన్‌రెడ్డి హత్యకు గురైన సంగతి తెలిసిందే. స్థానిక సీఐ కార్యాలయంలో డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు కేసు వివరాలు విలేకరులకు సోమవారం వెల్లడించారు. చిల్లకల్లుకు చెందిన ఇనపనుర్తి అన్వేష్ ధర్మవరప్పాడు తండా వద్ద ఏర్పాటు చేసిన మద్యం పార్టీలో నవీన్‌రెడ్డి, సాయికృష్ణ మరికొందరు పాల్గొన్నారు. మద్యం మత్తులో నవీన్‌రెడ్డి, సాయికృష్ణ వాగ్వాదం.. ఆవేశంలో హత్య జరిగినట్లు పోలీసులు తేల్చారు. ఆవేశంతో తన చేతిలోని బీరు సీసా పగలకొట్టిన నిందితుడు.. నవీన్ కంఠంపై పొడవడంతో తీవ్ర రక్తస్రావానికి గురయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న నవీన్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. నిందితుడు సాయికృష్ణపై ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం, కొట్లాటలు, హత్య, గంజాయి రవాణా వంటి కేసులున్నట్లు గుర్తించి గాలింపు చేపట్టారు. డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్‌ల ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి.. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దర్యాప్తులో భాగంగా సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు సాయికృష్ణ విజయవాడలోని కృష్ణలంక రాజీవ్ కాలనీకి చెందిన వ్యక్తి. ఈ అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై సూర్యశ్రీనివాస్, మణికంఠ, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ అభినందించారు. కొద్దికాలంగా చిల్లకల్లులో అద్దెకు ఉంటున్న నవీన్ రెడ్డి, నిందితుడు కూడా విజయవాడకు చెందిన వారే. ఇద్దరూ నేరచరితులు కావడం, గంజాయి కేసుల్లో ఉండడంతో నేరాన్ని తీవ్రమైనదిగా భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ, పరిశోధన చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం దగ్ధం



కాలిపోతున్న వాహనం

కృష్ణలంక: కృష్ణలంక జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనం దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు హోసన్నా చర్చి సమీపంలో నివాసం ఉంటున్న పొదులోపు కిషోర్. కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరాడు. కృష్ణలంక జాతీయ రహదారి ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చే సరికి ఇంజిన్‌లో లోపాలు తలెత్తి పొగలు వస్తుండడాన్ని గమనించి వాహనాన్ని పక్కకు తీసి నిలిపి కిందకు దిగుతుండగా అప్పటికే మంటలు రేగడంతో యువకుడి కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. వాహనం మంటల్లో కాలిపోతుండడాన్ని స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను ఆర్పివేశారు.

ధరల నియంత్రణ కమిటీ సమావేశం

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక): నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా సోమవారం జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను సమీక్షించారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ధరలు నియంత్రణలో ఉన్నాయని తెలిపారు. కూరగాయల దిగుమతులు ఎక్కువగా ఉండడంతో రానున్న కాలంలో కొరత ఉండదన్నారు. డీఎస్‌వో ఎ.పాపారావు, మార్కెటింగ్, అగ్రికల్చర్, అధికారులు, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? తూర్పు ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ గ్యాస్ గోడౌన్ వద్ద రహదారి అధ్వానంగా మారింది. - **షరీఫ్, స్థానికుడు**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **మధు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు - న్యూస్‌టుడే ఇబ్రహీంపట్నం**
? మూలపాడు క్యాటిల్ పాస్‌వేకు ఇరువైపుల చెత్త చెదారంతో దుర్వాసన వస్తోంది. - **గోవిందరావు, స్థానికుడు**
✔ ప్రత్యేక సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**
? పినపాకలోని ఎస్సీ శ్మశాన వాటికలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురైంది. - **రమేష్ స్థానికుడు** ✔ మరమ్మతు పనులు పూర్తి చేసి అవస్థలు తొలగిస్తాం. - **నారాయణరావు పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

స్పందనకు వందనం

* జి.కొండూరు గుడి సెంటర్‌లోని డ్రెయిన్లలో మురుగు పేరుకుందని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. - **న్యూస్‌టుడే, జి.కొండూరు**
* కొండపల్లి గీతామందిర్ రోడ్డులోని కాలువల్లో తీసిన చెత్తను తొలగించాలని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పారిశుద్ధ్య పనుల మేస్త్రీ శ్రీను కార్మికులతో చెత్తను సోమవారం తీయించారు. - **న్యూస్‌టుడే, కొండపల్లి**
* తిరువూరు 2వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికుడు ప్రసాదరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. - **న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

విద్యార్థులకు చలికోట్లు అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని 35 మంది విద్యార్థులకు జి.కొండూరుకు చెందిన ప్రవాస భారతీయుడు ఒరుగంటి నరసింహరావు, ఆయన బంధువు చనమోలు వెంకటేశ్వరరావు మొదటి వర్ధంతి సందర్భంగా రూ.10 వేలు వితరణ చేశారు. దీంతో ఆయన మిత్రులు చలికోట్లను సమకూర్చి విద్యార్థులకు సోమవారం అందజేశారు. పోతురాజు రమేష్, హేమ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల జీఎస్ డబ్ల్యూఎస్ అధికారిగా నర్రా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్తు కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు.


ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రభాకరరావు తదితరులు

తిరువూరులో సందడిగా సెమీ క్రిస్మస్

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని మునుకుళ్ల రోడ్డులో సోమవారం రీజనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ నిర్వహించారు. పాస్టర్లు పుష్పరాజు, ఉపేంద్ర, జోనాతాన్, రామకృష్ణ, కృష్ణారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేకు కోసి కొవ్వొత్తులు వెలిగించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో రీజనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

లక్ష్యం చేరేలా.. కర్షకులను ఆదుకునేలా..

అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రభుత్వ కేంద్రాల ద్వారా శనివారం నాటికి 35,232 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ఏడాది డివిజన్‌లో సాగైన ఖరీఫ్ వరిలో 1,56,331 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లభిస్తుందని అధికారుల అంచనా. గత నెల రోజుల్లో పీపీసీల ద్వారా దిగుబడి అంచనాలో 22.54 శాతం ధాన్యం కొన్నారు. అంతకు రెట్టింపు ధాన్యం రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. ఈ సంవత్సరం తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో 31,755 మంది రైతులు 58,422 ఎకరాల్లో వరి సాగు చేశారు. నవంబరు మొదటి వారం నుంచి నూర్పిడులు ప్రారంభించారు. డిసెంబరు మొదటి వారానికి మొత్తం సాగు విస్తీర్ణంలో 36,028 ఎకరాల్లో నూర్పిడి పూర్తయింది.


సత్యాలపాడు: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి, పక్కన తహసీల్దారు రాజేశ్వరి

ఇంకా 22,394 ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. ఆలస్యంగా నాట్లు వేసిన భూముల్లో ఈ నెలాఖరు వరకు నూర్పిడులు కొనసాగుతాయి.

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా..

వాస్తవంగా పంట దిగుబడిలో 60 శాతం మేరకు పీపీసీ కేంద్రాల్లో కొనుగోలు చేయాలి. లక్ష్యం మేరకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనేందుకు రెవెన్యూ, వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అన్నదాతలను చైతన్య పరుస్తున్నారు. ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర సాగుదారులకు అనుకూలంగా ఉన్నా.. వాతావరణ పరిస్థితులు రైతులను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేలా చేస్తున్నాయి. ఇంకా 22 వేల ఎకరాల్లో నూర్పిడి చేయాల్సిన ధాన్యం ఉండగా ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పీపీసీలో కొనుగోలు చేసిన ధాన్యానికి గంటల వ్యవధిలోనే నగదు చెల్లిస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంటని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించాలని ఆర్డీవో కె.మాధురి కోరారు. ధాన్యం నూర్పిడిలో ప్రతికూల వాతావరణం ఏర్పడినపుడు అధికార యంత్రాంగం కర్షకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె చెప్పారు.

భవనానికి స్థలం కేటాయించాలని వినతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల శివారు రాజీవ్‌నగర్ కాలనీలో సామాజిక భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కాలనీవాసులు తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణికి సోమవారం వినతిపత్రం అందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


తహసీల్దార్ లక్ష్మీ కల్యాణికి అర్జీ ఇస్తున్న కాలనీవాసులు

సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు

గొల్లపూడి, న్యూస్‌టుడే : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ డీఎం సతీష్ పేర్కొన్నారు. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం 57 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అన్నదాతలకు రూ.121 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న సతీష్

పుస్తక నిర్వహణ జరిగేలా చూడాల్సింది సీసీలే..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గ్రామైక్య సంఘాల్లో ప్రతి నెల రెండు సమావేశాలు నిర్వహించాలని వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీల సమావేశాలు షెడ్యూల్ మేరకు వీవోఏలు ఏర్పాటు చేసి సమావేశాలలోనే పుస్తక నిర్వహణ జరిగేలా చూడాల్సిన బాధ్యత సీసీలదే అన్నారు. ఈ నెలలో జెండర్ మాసోత్సవాల్లో భాగంగా అన్ని వీవోల్లో సమావేశం పెట్టి జెండర్ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శిరీష, ఎంఎస్ కార్యదర్శి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఏపీఎం రామకృష్ణ

లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించాలి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు న్యాయస్థానంలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు తమ వివాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.సింధూర, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యతేజ కోరారు. సోమవారం తిరువూరు న్యాయస్థానంలో న్యాయవాదులు, బ్యాంకు, పోలీసు అధికారులతో వారు సమన్వయ సమావేశం నిర్వహించి వారితో మాట్లాడారు.


సూచనలు ఇస్తున్న న్యాయమూర్తి సింధూర, పక్కన అదనపు జడ్జి సూర్యతేజ

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపీపీ ఎన్నిక

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట ఎంపీపీ ఎన్నిక ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎంపీటీసీ సభ్యులు సహకరించాలని ఆర్డీవో కె.మాధురి కోరారు. గత ఎంపీపీ పిల్లి మెర్సీ వసంతకుమారి రాజీనామా చేయడంతో మంగళవారం నూతన ఎంపీపీ ఎన్నిక జరుగుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆర్డీవో సమావేశమై మాట్లాడారు. ★ ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో స్థానిక ఎస్సై గోరికపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ఎస్సై రామకృష్ణ ఎంపీడీవోతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణాన్ని పరిశీలించారు.


అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో మాధురి

పరిసరాల శుభ్రతలో వివాదం

చంద్రాల(మైలవరం), న్యూస్‌టుడే : మండలంలోని చంద్రాల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుభ్రత వ్యవహారం వివాదాస్పదమైంది. మైదానంలో పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు విషసర్పాలు వస్తున్నాయని, పిల్లలు భయపడుతున్నారంటూ ఇటీవల నిర్వహించిన పీటీఎంలో తల్లిదండ్రులు తెలిపారు. దాంతో మాజీ సర్పంచి శీలాప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు తొలగించే పనులు చేపట్టారు. గతంలో తొలగించిన నాపరాళ్లను తరలిస్తున్నారని, వీల్లేదంటూ గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడొకరు ఫిర్యాదు చేయడంతో పనులు ఆపేశారు. దీనిపై మాజీ సర్పంచి అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ అబ్దుల్ దరియా సాయంత్రం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. మళ్లీ పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానంతో సోమవారం మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపునకు కూలీలను నియమించి పనులు ప్రారంభించారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

గంపలగూడెం: పెనుగొలను శివాలయంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం నిర్వహించారు. భక్తులు వాల్మీకి చిత్రపటం పట్టుకుని శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అర్చకులు డి.రామలింగేశ్వరశర్మ, నిర్వాహకులు ఎం.బ్రహ్మం, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే : స్వామి వారి పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక కోదండ రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మఠంలో ఉన్నటువంటి ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగాన్ని శోభాయమానంగా అలంకరించారు. గంపలగూడెం, మేడూరు, పెనుగొలను, తిరువూరు, ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయాల్లో అర్చకులు, భక్తులు విశేష పూజలు నిర్వహించారు.


ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగం

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తత అవసరం

కొండపల్లి, న్యూస్‌టుడే : స్క్రబ్ టైఫస్ జ్వరాల పట్ల పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు మధుసూదనరావు సూచించారు. కొండపల్లి చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు స్క్రబ్ టైఫస్‌పై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పురపాలికలో దీని వ్యాప్తిని అడ్డుకోవాల్సిన బాధ్యత పారిశుద్ధ్య కార్మికులదేనని చెప్పారు. వైస్ ఛైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మధుసూదనరావు

రెడ్డిగూడెం: స్క్రబ్ టైఫస్ సంబంధించి ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలో గడ్డిమందు పిచికారీ చేయించామని పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు సోమవారం తెలిపారు. సర్పంచి ఎం.రాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టంలో నిబంధనలు పొందుపరచాలి

ఇబ్రహీంపట్నం (గ్రామీణం): నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే పరిహారం ఇచ్చేలా చట్టంలో నిబంధనలు పొందుపరచాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మూలపాడు గ్రామ సెంటర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో విత్తన బిల్లు, విద్యుత్తు బిల్లుల ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న రైతు వ్యతిరేక విత్తన బిల్లు, విద్యుత్తు బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : విత్తన, విద్యుత్తు బిల్లులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని కొండపల్లి ఎంసీపీఐ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఎంసీపీఐ నాయకుడు మరెడ్డి వెంకటరెడ్డి, బసవయ్య, తులసీప్రసాద్, వెంకటరత్నం, గడేష్‌బాబు పాల్గొన్నారు.

దారి.. రైతుకు ఆసరాగా మారి..




రైతులను కలవరపెట్టిన తుపాను తొలగింది. దీంతో కోత యంత్రాలతో పొలాల్లో సందడి మొదలైంది. చేతికొచ్చిన పంటను కోసి విక్రయించేందుకు సంసిద్ధులైన రైతులకు ధాన్యం ఆరబెట్టుకునే జాగా కరవైంది. దాంతో నూర్చిన ధాన్యాన్ని ట్రాక్టర్లతో ఒడ్డుకు తెచ్చి రోడ్లనే కళ్లాలుగా మార్చి ఎండబెట్టుకుంటున్నారు. మైలవరం మండలంలోని బాడవ టోల్‌గేట్ వద్ద ఖాళీ జాగాలో వడ్లను ఆరబెట్టారు. చంద్రగూడెంలో బైపాస్ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిపై పెద్ద ఎత్తున ధాన్యాన్ని ఆరబోయడంతో మార్గమంతా ధాన్యంతో నిండిందిలా. **- న్యూస్‌టుడే, మైలవరం**

నిత్యం ప్రమాదాలు.. రక్షణ చర్యలు శూన్యం



గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉన్న ఎన్టీటీపీఎస్ కాలువ ప్రమాదకరంగా మారింది. ఎన్టీటీపీఎస్‌లో వినియోగానికి అవసరమైన నీటిని అందించేందుకు వీలుగా కృష్ణా నది సమీపంలో దశాబ్దాల కిందట దీన్ని తవ్వారు. అయితే.. కాలువ వెంబడి సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం వరకు కాలువ పొడవునా అనేక గ్రామాలున్నాయి. దీంతో ప్రజలతో పాటు కాలువ గురించి తెలియని అనేక మంది అక్కడకెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతవుతున్నారు. లోతుగా ఉండడంతో అందులో పడితే బయటకు రావడం కష్టం. కొందరు మహిళలు దీని వద్దనే దుస్తులు ఉతుకుతుంటారు. వారు కూడా ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీనికి రక్షణ కంచె ఏర్పాటు చేస్తే కొంత వరకైనా ప్రమాదాలు తగ్గుతాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

చీకట్లు.. రాకపోకలకు అవస్థలు



తిరువూరులోని ప్రధాన రహదారుల్లో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బోస్ బొమ్మ రోడ్డు కూడలి నుంచి బస్టాండ్ వరకు వీధిలైట్లు అలంకారప్రాయంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

ఘనంగా ఎస్సీ సుధాకరరావు జన్మదిన వేడుకలు


సుధాకరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్, పట్టణ ప్రముఖుడు ఎస్సీ సుధాకరరావు జన్మదిన వేడుకలను మైలవరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

★ **డీపీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు : మైలవరం, న్యూస్‌టుడే :** డెమొక్రాటిక్ పీఆర్‌టీయూ సంఘ సభ్యత్వ నమోదును ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెదగమళ్ల నాగరాజు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. మండలంలోని చిలుకూరివారిగూడెం హైస్కూల్, పొందుగల హైస్కూల్, క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులకు సభ్యత్వాలు ఇచ్చారు. పొందుగలలో నూతనంగా నియమితుడైన వ్యాయామోపాధ్యాయుడు దారా మహేష్‌కు సర్వీస్ రిజిష్టర్ అందించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఆర్ కృష్ణారావు, నాయకులు యాకుబ్‌మియా, మస్తాన్, ప్రసాద బాబు, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

★ **మండల సర్వసభ్య సమావేశం నేడు: జి.కొండూరు, న్యూస్‌టుడే :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీవీ.రామకృష్ణ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు దీనికి హాజరుకావాలని ఆయన కోరారు.

అవీ ఇవీ

★ **విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కావొద్దు : తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని స్థానిక డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల హెచ్‌ఎం ఎస్.రవిబాబు తెలిపారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు స్కూల్ ఆవరణలో సహజ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, ఇతర కూరగాయలను భోజనాల్లో ఉపయోగిస్తున్నామని చెప్పారు. అనంతరం పాఠశాలలో కంప్యూటర్ పీఏయల్ ల్యాబ్‌ను ప్రారంభించారు.

★ **ఆధునిక పరికరాల పంపిణీ : మైలవరం, న్యూస్‌టుడే :** పీఎం ఉష పథకం కింద స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.14 లక్షల విలువైన ఆధునిక ఐసీటీ పరికరాలను సోమవారం అందజేసినట్లు ప్రిన్సిపల్(ఎఫ్‌ఏసీ) పి.రంగారావు తెలిపారు. ఇంటరాక్టివ్ బోర్డులు 4, జిరాక్స్ యంత్రం, యూపీఎస్‌లు, కలర్ ప్రింటర్లు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇవి విద్యార్థులు, కళాశాల అవసరాలకు ఉపయోగపడతాయని చెప్పారు.

వంట ఏజెన్సీ నియామకంపై రగడ

గణపవరం(మైలవరం), న్యూస్‌టుడే : గణపవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ నియామకం స్వల్ప వాదనకు దారి తీసింది. బడిలో ఆయాగా పని చేస్తున్న దాసరి రత్నకుమారి అత్త కొన్నాళ్ల కిందటి వరకు ఏజెన్సీ నిర్వాహకురాలిగా ఉంటూ మృతి చెందారు. తర్వాత ఆ బాధ్యతలను భర్తతో కలిసి రత్నకుమారి నిర్వహిస్తుండగా, ఖాళీగా ఉన్న ఏజెన్సీని వేరే వారికి కేటాయించాలని గ్రామ తెదేపా నాయకులు కొన్నాళ్లుగా పట్టుబడుతున్నారు. ఇటీవల కలెక్టర్‌కు ఎంఈవోపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్‌ఎంసీ తీర్మానంతో పీట్ల దుర్గ అనే మహిళలకు ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానించారు. హెచ్‌ఎం వేళాంగిణి ద్వారా తీర్మానాన్ని ఎంఈవోకు అందించారు. ఎవరూ ముందుకు రానప్పుడు తామే బాధ్యతలు నిర్వహిస్తే, అన్యాయంగా తొలగిస్తున్నారని రత్నకుమారి వాదనకు దిగారు. తానే మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తానని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు సోమవారం మృతి చెందాడు. నందిగామ మండలం పల్లగిరికి చెందిన రత్నకుమారి, ఆమె భర్త మరియదాసు గుంటుపల్లిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంటు వద్ద కాపలాగా ఉంటూ నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాలుగో అంతస్తుకు మరియదాసు వాటరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు చక్రం కిందపడి మహిళకు గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే : బస్సు వెనుక చక్రం కింద ఓ మహిళ కాలుపడి తీవ్రంగా గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. రెడ్డిగూడెం మండలం కుదపకు చెందిన పజ్జూరి కృష్ణకుమారి, ఆమె తల్లిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించారు. అనంతరం గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా, విస్సన్నపేట వెళ్లే బస్సు రద్దీగా ఉండటంతో ముందుగా ఎక్కి సీటు ఆపారు. బయట ఉన్న తల్లి కోసం కిందకు దిగగా అప్పటికే బస్సు నిండిపోయింది. బయలుదేరేందుకు డ్రైవర్ బస్సును వెనక్కి తీశాడు. ఆ సమయంలో ఆమె ఒక్కసారిగా చక్రం కింద పడగా, కాలుపైకి ఎక్కడంతో నుజ్జయ్యింది. అక్కడున్న ప్రయాణికులు గమనించి బస్సును ఆపి, క్షతగాత్రురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడకు తరలించారు.

వెల్వడంలో చౌక బియ్యం పట్టివేత

మైలవరం: వెల్వడంలో అక్రమంగా నిల్వ చేసిన 6.5 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని పట్టుకున్నట్లు తహసీల్దార్ అబ్దుల్ దరియా సోమవారం తెలిపారు. గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని బియ్యం నిల్వ చేశారన్న సమాచారంతో వీఆర్వో ద్వారా పరిశీలించి, శనివారం రాత్రి సీజ్ చేశామన్నారు. ఆ బియ్యాన్ని స్థానిక రేషన్ డీలరుకు స్వాధీన పర్చి, వాటిని నిల్వ చేసిన పరికెల జమలయ్యపై 6ఏ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వేతనాల్లో కోతలు పెడతామనడం తగదు


మైలవరం: బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు


జి.కొండూరు సహకార బ్యాంకు ఆవరణలో..

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఆయా ప్రాంతాల్లోని బ్యాంకుల వద్ద సోమవారం నిరసన తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పీఆర్‌సీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 2019 నుంచి సహకార సంఘాల్లో నియమితులైన సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. ఎక్కడా లేని విధంగా రుణాల రికవరీకి ఉద్యోగులను బాధ్యులను చేసి, వేతనాల్లో కోతలు వేస్తామంటూ చేస్తున్న చర్యలు ఆక్షేపణీయమన్నారు. అనంతరం ఆయా బ్యాంకు శాఖల మేనేజర్లకు వినతిపత్రాలు అందించారు. **- న్యూస్‌టుడే, బృందం**


గంపలగూడెంలో..


ఇబ్రహీంపట్నంలో..

నేత్రదానం

గంపలగూడెం, తిరువూరు: తిరువూరుకు చెందిన మునిగంటి లక్ష్మయ్య(82) సోమవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు అతని నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తిరువూరు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, ఎన్.శ్యామ్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.

ఫలితాల సాధనకు ఉపయుక్తం

విస్సన్నపేట: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రచురించిన స్టడీ మెటీరియల్ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ఉపయోగపడుతుందని ఎంఈవో- 1 కె.శంకరరావు తెలిపారు. సోమవారం నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం. ఎస్.శోభాలత వీటిని అందించారు.

2027లో రై రై బుల్లెట్ రైల్

● అదే ఏడాది ఆగస్టులో ట్రయల్ రన్ ● గుజరాత్‌లో వేగంగా ప్రాజెక్టు పనులు ● ప్రతి స్టేషన్ నిర్మాణమూ ప్రత్యేకమే

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి




నిర్మాణంలో ఉన్న అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ★ సబర్మతిలో నిర్మించిన మల్టీ ట్రాన్స్‌పోర్ట్ హబ్

దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్ పరుగులు పెట్టనున్న గుజరాత్‌లో ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ట్రాక్ వెళ్లే అహ్మదాబాద్, సబర్మతిలలో స్టేషన్లను సంస్కృతి ప్రతిబింబించేలా అదే సమయంలో అత్యాధునిక వసతులు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. అహ్మదాబాద్-ముంబయి మధ్య నడవనున్న బుల్లెట్ రైలు.. 508 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 7 నిమిషాల్లోనే చేరుకుంటుంది. దీనికి సంబంధించి 2027 ఆగస్టులో గుజరాత్‌లోని సూరత్-బిలిమోరా మధ్య 50 కి.మీ. దూరానికి ట్రయల్ చేపట్టనున్నట్టు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అహ్మదాబాద్ సివిల్ పనుల విభాగం ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేష్ అగర్వాల్ వివరించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లు కాగా గంటకు 350 కి.మీ. వేగంతో దూసుకుపోయే సామర్థ్యం ఈ బుల్లెట్ రైలుకు ఉంటుంది. అత్యాధునిక ట్రాక్‌తో పాటు మెట్రో, బస్సు, రైలు, బుల్లెట్ రైలు మార్గాలను అనుసంధానించేలా పూర్తి స్థాయి వసతులతో మొత్తం 12 స్టేషన్లు నిర్మిస్తున్నారు. సబర్మతిలో మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇది 2026లో అందుబాటులోకి రానుందని రాజేష్ వివరించారు. అహ్మదాబాద్, సబర్మతిలలో కొన్ని చోట్ల పనులు ఇప్పటికే పూర్తికాగా, మరి కొన్నిచోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. ఈనాడు ప్రతినిధి ఈ ప్రాజెక్ట్ పనులను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. వివరాలివీ....

అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ నిర్మాణాన్ని నగర సాంస్కృతిక, చారిత్రక వారసత్వం ప్రతిబింబించేలా రూపొందించారు. సుమారు 38,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నేల పైనుంచి 33.7 మీటర్ల ఎత్తులో ఈ స్టేషన్ ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ● ప్రయాణికుల సౌలభ్యం కోసం లాంజ్, మరుగుదొడ్లు, ఉద్యానవనాలు, వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ● బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను మెట్రో, ఆర్టీసీ, క్యాబ్ సర్వీసులతో అనుసంధానించేందుకు ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్ రైల్వే స్టేషన్‌తోనూ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అనుసంధానమై ఉంటుంది. ● ఇక్కడి నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయం దాదాపు 10 కి.మీ., గీతా మందిర్ సెంట్రల్ బస్ స్టాండ్‌కు 3.5 కి.మీ. దూరంలోనే ఉంటాయి.

సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్

● సబర్మతి టెర్మినల్ స్టేషన్ మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలోని చరఖా నుంచి ప్రేరణ పొందింది. ● ఈ స్టేషన్ మొత్తం నిర్మాణ విస్తీర్ణం: 45,094 చదరపు మీటర్లు కాగా భూమి నుంచి 44 మీటర్ల ఎత్తులో ఉంటుంది. నిర్మాణం కొనసాగుతోంది.

సబర్మతి మల్టీమోడల్ హబ్

● హై స్పీడ్ రైల్ మల్టీమోడల్ హబ్ ఒక ఆధునిక భవనం. సబర్మతి రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్, నిర్మాణంలో ఉన్న సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్, బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌తో నిరంతర కనెక్టివిటీ అందించడానికి దీనిని డిజైన్ చేశారు. ● ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం ముందు భాగం దండి మార్చ్ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ భవన నిర్మాణం దాదాపుగా పూర్తయింది. ● ఆరు అంతస్తుల ఈ భవనంలో బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లు, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్‌తో కూడిన హోటల్.. మొదలైనవి ఉంటాయి. ● పర్యావరణానికి హాని కలిగించని రీతిలో గ్రీన్ బిల్డింగ్‌గా ఈ హబ్‌ను తీర్చిదిద్దనున్నారు.



నేలపాలు చేసిన ద్రవ ఉక్కు

1,500 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం 1,500 టన్నుల ద్రవ ఉక్కును నేలపాలు చేశారు. ఎ.షిఫ్ట్‌లో 600 టన్నులు, బి.షిఫ్ట్‌లో 900 టన్నుల చొప్పున ద్రవ ఉక్కును ఇలా పారబోశారు. విశాఖ ఉక్కు యాజమాన్యం విలువైన ఉక్కును తుక్కు (పూల్డ్) పేరుతో నేలపాలు చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉక్కు తయారీకి పంపకుండా పూల్డ్ ఐరన్ పేరుతో తుక్కుగా మార్చడం తగదని అంటున్నాయి. పూల్డ్ ఐరన్ తయారు చేయాలన్నా కమిటీ అనుమతులు ఉండాలని.. అది తీసుకోకుండానే ఇలా చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కర్ణాటక సీఎంకు 'సుప్రీం' తాఖీదులు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు తాఖీదులు జారీ చేసింది. 2023లో విధానసభ ఎన్నికల సమయంలో మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'గ్యారంటీ పథకాల భరోసా' కారణమని, అవి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని అభ్యంతరం తెలుపుతూ అదే నియోజకవర్గానికి చెందిన శంకర్ అనే ఓటరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం వివరణ ఇవ్వాల్సిందిగా సిద్ధరామయ్యకు తాఖీదులు జారీ చేసింది. ఎన్నికల ముందు ఇచ్చే గ్యారంటీ హామీలు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం అవినీతిగా పరిగణించాలని, మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించటం పురుషులపై వివక్షగా భావించాలని శంకర్ గతంలో కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌దత్ యాదవ్.. పిటిషన్‌లో చటాలను ఉలంఘించేంత కారణాలేవీ లేవన్నారు. పార్టీ రూపొందించిన ఎన్నికల ప్రణాళికలకు ఓ అభ్యర్థిని ఎలా బాధ్యుడిని చేస్తామని ప్రశ్నించారు. ఇలాంటి పిటిషన్లతో గతంలోనూ దాఖలైనట్లు గుర్తుచేస్తూ శంకర్ అభ్యంతరాలను కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మంత్రి నెహ్రూ అవినీతికి పాల్పడ్డారు

● కేసు నమోదు చేయండి ● తమిళనాడు డీజీపీకి ఈడీ లేఖ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు పురపాలక, నీటి సరఫరా శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ రూ.1,020 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. అందులో.. మంత్రి కేఎన్ నెహ్రూ నిర్వహిస్తున్న శాఖల్లో భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణం, పౌరుల సేవల నియామకం, నాబార్డ్ నిధులు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఒప్పందం, పారిశుద్ధ్య కార్మికుల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లు, ఒప్పందాలలో అవకతవకలు జరిగినట్లు తెలిసింది. టెండర్లు, ఒప్పందాలు ముందుగానే ఎవరికి ఇవ్వాలో నిర్ణయించి, ఒక్కో టెండరుకు 7.5 శాతం నుంచి 10 శాతం వరకు కమీషన్ తీసుకున్నారు, ఈ అవినీతి రూ.1,020 కోట్ల మేర జరిగినట్లు ఆరోపించింది. కమీషన్‌గా పొందిన నగదు వివిధ మార్గాల ద్వారా బదిలీ అయి ఉండొచ్చని పేర్కొంటూ 259 పేజీల పత్రాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు పంపింది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేయాలని కోరింది. మంత్రి కేఎన్ నెహ్రూపై అవినీతి ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఈడీ రాసిన రెండో లేఖ ఇది కావడం గమనార్హం. ఇదివరకు ఆయన శాఖలోని ఖాళీల భర్తీలో భారీగా అవినీతి జరిగిందని, ఒక్కో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.35లక్షల వరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేసింది.

పాతికేళ్ల ప్రతీకారం.. రియల్టర్ దారుణ హత్య

● వేటకొడవళ్లతో నరికి...

తుపాకీతో కాల్చిన ఆరుగురు..



హతుడు గంటా వెంకటరత్నం

ఈనాడు-హైదరాబాద్, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారి ఒకరిని ఆటోతో గుద్దించి.. కత్తులతో విచక్షణ రహితంగా నరకడంతోపాటు తుపాకీతో కాల్చి మరీ హతమార్చిన ఉదంతంతో హైదరాబాద్ ఉలిక్కిపడింది. సుమారు 25 ఏళ్ల క్రితం జరిగిన తన తండ్రి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం.. ఆయన కుమారుడు.. స్నేహితులతో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది దారుణం.

ఆటోతో ఢీకొట్టి.. కిరాతకంగా హత్య

ఏపీలోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన గంటా వెంకటరత్నం(54).. ముప్పై ఏళ్లుగా పూర్వం హైదరాబాద్ వచ్చారు. చాలా కాలంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. ఏడేళ్లుగా జవహర్‌నగర్ ఠాణా పరిధి సాకేత్ కాలనీలో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం కుమార్తెను అదే కాలనీలోని స్కూల్ దగ్గర వదిలిపెట్టారు. ఉదయం 7.55 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ద్విచక్రవాహనంపై ఇద్దరు, ఆటోలో నలుగురు వెంబడించారు. తొలుత వెంకటరత్నం ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోతో ఢీకొట్టారు. కిందపడిపోయిన ఆయన తేరుకునేలోపే.. వేటకొడవళ్లతో మెడ, తల, ఇతర శరీరభాగాలపై దాదాపు 25 సార్లు నరికారు. తర్వాత సమీపంలోని బండరాయి తీసుకొచ్చి తలపై మోదారు. ఇదంతా జరుగుతుండగానే.. నిందితుల్లో ఒకడు తుపాకీతో ఒక రౌండు కాల్పులు జరపడంతో వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందారు. హత్య అనంతరం.. నిందితులు అక్కణ్నుంచి పరారైన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ఘటనాస్థలిని సందర్శించారు. ఘటనా స్థలంలో పడి ఉన్న తూటా, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన తర్వాత నిందితులు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పాతకక్షల కారణంగానే..: పాతకక్షల కారణంగానే హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు, నగరంలోని జుమ్మెరాత్‌బజార్‌కు చెందిన చందన్‌సింగ్(33) చెప్పినట్లు సమాచారం. ఆ ప్రకారం.. 'చందన్‌సింగ్ తండ్రి సురేశ్‌సింగ్ రౌడీషీటర్. పాతికేళ్ల క్రితం నగరంలో దందాలు, సెటిల్‌మెంట్లు చేసే వాడు. అప్పట్లో వెంకటరత్నం అతనికి ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సురేశ్‌సింగ్ 2001 ఏప్రిల్‌లో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. వెంకటరత్నం పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడమే తన తండ్రి మరణానికి కారణమని భావించిన చందన్ సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులైన వడ్డే వెంకటనారాయణ(39), కె.నరేశ్‌కుమార్(28), ఈషాన్‌శర్మ(19), ఎన్.పవన్‌కుమార్(20), నర్సింగ్(26) సాయంతో హత్యకు ప్రణాళిక రచించాడు.

రెరాపై నెలకో ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సు

● 10న తిరుపతిలో శ్రీకారం

● ఏపీ రెరా ఛైర్మన్ శివారెడ్డి వెల్లడి



ఈనాడు, అమరావతి: రెరా చట్టంపై బిల్డర్లు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు నెలకో ఉమ్మడి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ రెరా ఛైర్మన్ ఎ.శివారెడ్డి తెలిపారు. ఈనెల 10న తిరుపతిలో మొదటి సదస్సు జరగనుందని ఆయన చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పుర, నగరపాలక సంస్థల పరిధిలోని బిల్డర్లు, కొనుగోలుదారులు, సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. విజయవాడలోని రెరా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. 'ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రాజెక్టులు ముందే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొత్త కార్యాలయాల్లో ప్రాంగణంలోకి తరలించిన విషయం తెలిసిందే. కొత్త కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి ఛైర్మన్ శివారెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇళ్ల, స్థలాల కొనుగోలుదారులకు రెరా చట్టం కల్పిస్తున్న హక్కులపై ఇంకా అవగాహన అవసరం. బిల్డర్లు, లేఅవుట్లు వేసే వారికి కూడా కొత్తగా ప్రారంభించే ప్రాజెక్టులు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్న విషయంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాం' అని ఛైర్మన్ వివరించారు.

సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు..

'బిల్డర్లు ఎంత చేయగలరో ఆ మేరకే బ్రోచర్లలో ముద్రించాలి. ఎక్కువ చేస్తామని చెప్పి చేయకపోతే తర్వాత ఇబ్బందుల్లో పడతారు. సాధ్యంకాని హామీలు ఇవ్వొద్దు. ప్రాజెక్టుల పనులు గడువులోగా పూర్తి చేయాలి. కొనుగోలుదారుల నష్టం జరిగితే ఏది పరిష్కారాన్ని విధిస్తున్నాం లేదు. ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ సమయంలో సంబంధించిన బిల్డర్లు అన్ని దస్త్రాలను పక్కాగా అప్‌లోడ్ చేస్తే ..గడువులోపే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని శివారెడ్డి అన్నారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు

ఇళ్లు, స్థలాల కొనుగోలుదారులు నష్టం జరిగిందని భావిస్తే.. ఏపీ రెరా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. కార్యాలయం అమరావతికి మార్చినా ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు. బాధితులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాం. మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో రెరాలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధ్యయనం కోసం త్వరలో వెళ్తున్నాం. వాటిలో ముఖ్యమైన వాటిని రాష్ట్రంలోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తాం' అని శివారెడ్డి తెలిపారు. 'ఈ ఏడాది సెప్టెంబరు 17న బాధ్యతలు చేపట్టిన నుంచి ఇప్పటివరకు 270 కొత్త స్థిరాస్తి వ్యాపార ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేశాం. కొనుగోలుదారుల ఫిర్యాదులపై విచారణకు గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు బెంచ్ భేటీ అవుతోంది. గతంలో వారంలో ఒక రోజే ఉండేది' అని రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు వివరించారు. డైరెక్టర్లు కామేశ్వరరావు, కులదీప్, జగన్నాథరావు, వెంకటరత్నంతోపాటు రెరా పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ నాగసుందరి పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



కొండపల్లి బొమ్మను పరిశీలిస్తున్న పసుపులేటి హరిప్రసాద్ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : తెలుగు నేల సాంస్కృతిక సౌరభాలకు నెలవు. హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14 వరకు జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఏపీహెచ్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న వైఎస్ఆర్ కడప జిల్లా ఓనిపెంటలో గురుశిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ (జీఎస్‌హెచ్‌పీపీ) ద్వారా ఇత్తడి, కంచు లోహపు హస్తకళాకారులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా దుర్గిలో కళాకారులకు డిజైన్ అభివృద్ధిపై కార్యశాల, 13న శ్రీకాళహస్తిలో కలప, చెక్క కళాకారులకు టూల్ కిట్ల పంపిణీ, 14న అనకాపల్లి జిల్లా కె.డి.పేటలో కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ, డిసెంబరు 15-21 తేదీల్లో రాజమహేంద్రవరంలో గాంధీ శిల్ప్ బజార్ నిర్వహణ, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో శిల్పకళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుందని వివరించారు. డిసెంబరు 9న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం జరగనుందని తెలిపారు. ఇందులో రాష్ట్రానికి చెందిన ముగ్గురు కళాకారులు అవార్డులు అందుకోనుండడం గర్వకారణమన్నారు. డి.శివమ్మ (తోలుబొమ్మలాట, శిల్పగురు అవార్డు), గోర్స సంతోష్ (ఏటికొప్పాక బొమ్మలు, జాతీయ అవార్డు 2024), పి.విజయలక్ష్మి (కలంకారి హ్యాండ్ పెయింటింగ్, జాతీయ హస్తకళా అవార్డు 2023)లు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు వివరించారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐ.వి.లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి లారీ యజమానుల సమ్మె

ఆటోనగర్, న్యూస్‌టుడే: రవాణా వాహనాలపై ఫిట్‌నెస్ ఛార్జీలను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి లారీలను నిలిపివేసి సమ్మె చేపడుతున్నట్లు న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రవాణా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఫిట్‌నెస్ ఛార్జీల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల వ్యవసాయ వ్యయాలతోపాటు నిత్యావసర సరకుల ధరలు అధికమవుతాయన్నారు. గతంలో రూ.900 నుంచి రూ.1400 వరకు మాత్రమే ఉండే ఫిట్‌నెస్ ఛార్జీలు.. ప్రస్తుతం మూడు రెట్లు పెరగడంతో లారీ యజమానులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, గుంతలు ఉన్న రోడ్ల కారణంగా వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల పక్కనే సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడితే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. కౌంటర్ సిగ్నేచర్ ఫైల్‌ను తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లలో ఆమోదించి పంపిందని కానీ ఆ ఫైల్ గత ఎనిమిదేళ్లుగా ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లోనే ఉందని బొడ్డ శేషగిరి గుర్తుచేశారు.

బీడీఎస్ యాజమాన్య ప్రవేశాలకు ఫ్రీ ఎగ్జిట్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో పలు ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి సంబంధించి మొదటి రెండు విడతల్లో సీటు పొందిన అభ్యర్థులకు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 'ఫ్రీ ఎగ్జిట్' ఆప్షన్ ఇచ్చింది. అభ్యర్థులు ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా తమ ఆప్షన్‌ను సంబంధిత దంత కళాశాలల ప్రిన్సిపల్స్‌కు తెలియజేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

పోలీసుల వైఖరిపై భవానీల ఆగ్రహం



రహదారిపై బైఠాయించి భజన చేస్తున్న దీక్షాధారులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దీక్షలో ఉన్న తమపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులు క్షమాపణ చెప్పాలంటూ భవానీలు కృష్ణలంక జాతీయ రహదారిపై బైఠాయించారు. కంకిపాడుకు చెందిన సుమారు 20 మంది భవానీలు సోమవారం రెండు ఆటోల్లో చద్ది నిమిత్తం గుంటూరు జిల్లా తాడేపల్లికి బయలు దేరారు. ఆటోలు తాడిగడప 100 అడుగుల రోడ్డుకు చేరుకునే సరికి వెనుకగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న మఫ్టీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ఒకరు ఆటో వెనుక భాగంలో అజాగ్రత్తగా కూర్చున్న పిల్లలను గమనించి వారిని సరిగ్గా కూర్చోపెట్టాల్సిందిగా ఆటో డ్రైవర్‌కు సూచించారు. అదే వ్యక్తి ఆటోను వెంబడించి కానూరు వీఆర్ సిద్ధార్థ కళాశాల వద్దకు ఆటో చేరుకున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ముందు నిలుపుదల చేసి ఫొటో తీయడంతో భవానీలు కిందకు దిగి ఫొటో ఎందుకు తీశారంటూ గొడవకు దిగి చరవాణిని లాక్కొని నేలకేసి కొట్టి అక్కడ నుంచి వెళ్లిపోయారు. సదరు వ్యక్తి బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆటోను ఆపడంతో ఆటో దిగిన భవానీలు పోలీసులతో గొడవకు దిగడంతో వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. కొద్దిసేపటికి స్క్యూబ్రిడ్జి వద్ద ఆటోలను ట్రాఫిక్ పోలీసులు నిలుపుదల చేయడంతో తామేం తప్పు చేయకున్నా దీక్షలో ఉన్న తమను కించపరిచే విధంగా మూడుసార్లు తమ ఆటోలను ఆపిన పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ జాతీయ రహదారిపై బైఠాయించి భజన చేశారు. అదే సమయంలో వారిలో ఒక బాలిక ఈ తతంగాన్ని ఫోన్‌లో వీడియో తీస్తుండడాన్ని గమనించి పోలీసుల్లో ఒకరు ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టడంతో ఆగ్రహానికి లోనైన భవానీలు పోలీసులు తమకు క్షమాపణ చెప్పాలని.. అప్పటి వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ పట్టుబట్టారు. దీంతో బెంజిసర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి ట్రాఫిక్ నిలిచింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఏసీపీలు దామోదర్, పావన్ కుమార్, సీఐలు నాగరాజు, పవన్‌కిషోర్, బాల మురళీకృష్ణ తదితరులు వారికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలు

ఐదుగురి అరెస్టు, 15 ద్విచక్ర వాహనాల స్వాధీనం

నిందితులంతా నల్గొండ జిల్లా వారే

నందిగామ, న్యూస్‌టుడే



పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, నిందితులతో డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడు

వ్యసనాలకు బానిసలైన యువకులు ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించి తాకట్టు పెడుతున్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన వారే. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పోలీసులు నందిగామ వై.జంక్షన్ వద్ద ఆదివారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద 15 ఖరీదైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని కొనుగోలు చేసిన మరికొందర్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసు వివరాలను నందిగామ పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీసీపీ లక్ష్మీనారాయణ విలేకరులకు వెల్లడించారు.

నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో గత 20 రోజుల వ్యవధిలో ఐదు బైక్‌లు చోరీ చేశారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఏసీపీ బాలగంగాధర్ తిలక్, సీఐ వైవీవీఎల్ నాయుడు, పోలీసులు దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా నందిగామ వై.జంక్షన్ వద్ద ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో పోలీసులను చూసి నిందితులు తప్పించుకోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, నరసరావుపేట, పెనమలూరు, కృష్ణలంక, రెంటచింతల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 5, ఇతర ప్రాంతాల్లో మరో 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు.

నందిగామ కోర్టులో హాజరు

బైక్‌ల చోరీ కేసులో నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన ఏపూరి శివ, నకిరికల్ మండలం చీమలగడ్డకు చెందిన కర్రి మహేంద్ర, నకిరికల్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కంచుకొమ్మల సంజయ్‌కుమార్, దామచర్ల మండలానికి చెందిన ఊదర సంతోష్, నకిరికల్ మండలం చీమలిగడ్డకు చెందిన మేడిపల్లి ఉమేష్‌లను అరెస్టు చేశారు. వీరిని నందిగామ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకుని బైక్‌లు రికవరీ చేసిన నందిగామ ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీ, తొమ్మిది మంది పోలీసులను డీసీపీ లక్ష్మీనారాయణ అభినందించారు. అనంతరం రివార్డులు అందజేశారు.

మావోయిస్టులకు న్యాయ సహాయంపై పిటిషన్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 26 మంది మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు వారితో మాట్లాడాలని, దీనికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బెజవాడ బార్ అసోసియేషన్ మానవ హక్కుల కమిటీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. మానవ హక్కుల కమిటీ సభ్యులు పిచుక శ్రీనివాస్, వేముల రవీంద్రనాథ్, సతీష్, ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, గంగాభవానీ, ఆంజనేయులు తదితరులు జైలులో ఉన్న ముద్దాయిలను కలుసుకునేందుకు అనుమతి కోరుతూ విజయవాడలోని 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 18న హిడ్మా మరి కొంత మంది మావోయిస్టులు మారేడుమిల్లి అడవుల్లో ఎదురు కాల్పుల్లో చనిపోయారు. వారికి రక్షణ వలయంగా ఉన్న సెక్యూరిటీ దళ సభ్యులు కానూరులో షెల్టర్ తీసుకున్నారు. మొత్తం 26 మంది మావోయిస్టులను పెనమలూరు పోలీసులు అరెస్టు చేయగా.. వారు రాజమహేంద్రవరం జైలులో రిమాండ్‌లో ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులకు కేసు వివరాలు చెప్పలేదని, జైలులో ఉన్న వారికి న్యాయ సాయం అందలేదని పిచుక శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో బీబీఏ తరపున న్యాయ సహాయం అందించేందుకు.. వారితో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం పిటిషన్ దాఖాలు చేశారు.

పటమట కేసులో... పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడి నెల్లూరు కారాగారంలో ఉన్న నలుగురు మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు 4వ ఏసీజేఎం కోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ అనంతరం ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులకు కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులను కోర్టు కస్టడీకి ఇచ్చింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టు అయిన కట్టా రాజు, సయ్యద్ హాజీ, అంతదాస్, మిథున్‌దాస్‌లను నాలుగు రోజులు కస్టడీకి ఇస్తూ విజయవాడ ఎక్సైజ్ కోర్టు సోమవారం సాయంత్రం తీర్పు ఇచ్చింది. వీరిపై ఇటీవల ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్‌పై హాజరుపరిచిన సంగతి తెలిసిందే. నలుగురు నిందితులను 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈనెల 11 నుంచి 15 వరకు కస్టడీకి అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోనక్ పిటిషన్‌పై జైలు అధికారుల కౌంటర్

ఈనాడు - అమరావతి: ఇంటి నుంచి భోజనానికి అనుమతించాలని మద్యం కేసులో నిందితుడు రోనక్ వేసిన పిటిషన్‌పై సోమవారం జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తమ ఆచారాల మేరకు ఉల్లిపాయలు తినే అలవాటు లేదనీ, ఇంటి నుంచి భోజనానికి అనుమతించాలని రోనక్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై గుంటూరు జైలు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తదుపరి విచారణ కోసం ఈనెల 10వ తేదీకి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు.

10న బాక్సింగ్ జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు: ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా సీనియర్ (స్త్రీ, పురుషుల), యూత్(బాలికల) బాక్సింగ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తామని ఆ సంఘం కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో అదే రోజు ఉదయం 8 గంటలకు ఇండోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన పురుషుల జట్టు ఈ నెల 13, 14వ తేదీల్లో నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో, మహిళలు, యూత్ బాలికలు ఈ నెల 20, 21వ తేదీల్లో పిఠాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల మహిళల, యూత్ బాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తలపడతారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు మరిన్ని వివరాలకు కోచ్ జె.రాజు ఫోన్ 91103 72647 నంబరుపై సంప్రదించాలన్నారు.

ప్రతిభావంతులకు జూడో జట్లలో స్థానం



క్రీడాకారులతో కమిటీ సభ్యులు, జిల్లా సంఘాల ప్రతినిధులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కండ్రికలోని ఏఆర్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల క్యాడెట్(అండర్-18), జూనియర్(అండర్-21) బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయా జిల్లా జట్లకు ఎంపిక చేశామని ఎన్టీఆర్ జిల్లా జూడో సంఘం కార్యదర్శి ఎన్.పవన్ సందీప్, కృష్ణా జిల్లా సంఘం కార్యదర్శి నామిశెట్టి వెంకట్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎల్ ఉషారాణిలు సోమవారం తెలిపారు. క్యాడెట్ విభాగంలో ఎంపికైన 16 మంది, జూనియర్ విభాగంలో ఎంపికైన 16 మంది బాలబాలికలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కేడెట్, జూనియర్ బాలబాలికల జూడో ఛాంపియన్‌షిప్‌లో ఆయా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in



విడాకులు... ఈ ఒక్కటీ అనేక సవాళ్లను విసురుతుంది. అందులో ముందుగా వచ్చేవి ఆర్థిక పరమైనవి. ఇవి జీవిత భాగస్వామితో విడిపోవడానికి మించిన ఆందోళనను కలిగిస్తాయి. కారణం... తమను తాము ఆర్థికంగా సిద్ధం చేసుకోకపోవడమే. కాస్త ధైర్యం కూడగట్టుకుని ప్రణాళికలు వేస్తే తిరిగి ఆర్థిక స్వేచ్ఛను సాధించగలరు. ఆర్థిక విషయాలపై అవగాహనతో ఉంటేనే మహిళలు జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయగలరు. వీటి గురించి నిపుణులు ఏం చెబుతారంటే...

ఆ ముగింపు... ఓ ఆర్థిక ఆరంభం!

చేతులు కాలాక... అన్నట్లుగా సంక్షోభం వచ్చాక ఆర్థికంగా సన్నద్ధం కావడం కాదు... మొదటి ఆదాయం/జీతం పొందిన రోజు నుంచే... అకౌంట్ నిర్వహణ నుంచి పొదుపు, మదుపు అన్నీ మీరే చూసుకోవాలి. అదే ఆర్థిక అక్షరాస్యతకూ, స్వేచ్ఛకూ మొదటి మెట్టు. కొందరు పెళ్లికి ముందు ఇవన్నీ చేసినా, తర్వాత జీవిత భాగస్వామిపైన వదిలేస్తారు. ఆ పొరపాటు చేయొద్దు. సొంత ఖాతాను కొనసాగించాలి. దీంతోపాటు భాగస్వామితో రెండు జాయింట్ అకౌంట్‌లు తెరవాలి. ఒకటి ఖర్చులకు, రెండోది పెట్టుబడులకు. దీనివల్ల ఆర్థిక అంశాల్లో స్పష్టత, పారదర్శకత వస్తాయి. మీకు సొంత ఖాతా ఉండటంవల్ల ఖర్చులూ, పొదుపు విషయంలో స్వేచ్ఛ ఉంటుంది. వివాహ బంధంలో ఉన్నవాళ్లు కూడా ఎవరికి వాళ్లు ఆర్థిక స్వేచ్ఛతో ఉండటం అవసరమే.

రాతపూర్వకంగా ఉండాలి...

విడాకుల కారణంగా కొత్తగా ఆర్థిక వ్యవహారాల్ని చూడాల్సి వస్తే ముందుగా ఆర్థిక అంశాల్ని ఒకచోట రాసుకోవడం మేలు. ఆస్తులు, అప్పులు, ఆదాయ మార్గాలు... అన్నింటినీ ఒక చోట చేర్చాలి. రూపాయి రాకపోకల్ని వివరంగా రాసుకోవాలి.

- అద్దె, ఖర్చులు, నిత్యావసరాలు, పిల్లల అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా బడ్జెట్ వేసుకోవాలి.
- మొదట జాయింట్ అకౌంట్‌లు మూసేయండి. పాత కార్డులు, పిన్ నంబర్లు అతని దగ్గర లేకుండా చూసుకోవాలి. మీ వివరాలతో కొత్త ఖాతాలు తెరవండి.
- అలాగే అవసరమైన ప్రతిచోటా నామినీలూ, లబ్ధిదారుల పేర్లనూ మార్చుకోవాలి.
- మీకు కేటాయించిన ఆస్తి 30-60 రోజుల్లో మీ పేరు మీదకు వచ్చేలా చూసుకోవాలి.
- పెళ్లి, పిల్లల కారణంగా పనిచేయడం ఆపేసినవాళ్లు తిరిగి వృత్తి జీవితాన్ని మొదలుపెట్టాలి. అవసరమైతే కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి. లేదంటే చిన్న వ్యాపారం చేయొచ్చేమో చూసుకోవాలి.
- విడాకుల తర్వాత వచ్చే మొత్తాన్ని బీమా, అత్యవసర నిధి, మ్యూచువల్ ఫండ్స్... ఇలా విభజించండి. దీనివల్ల ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలు తీరుతాయి. విడిపోయిన తర్వాత మీకు, మీపైన ఆధారపడే వాళ్లకు మాత్రమే బీమా ఉండేట్టు మార్పులు చేయమనండి.

ఆర్థిక స్వతంత్రత విడాకుల్ని దృష్టిలో పెట్టుకుని పొందాల్సింది కాదు. అది గౌరవం, భద్రత, స్వేచ్ఛకు సంబంధించిన అంశం. ప్రతి మహిళా తన పేరు మీద ఉన్న ఆస్తుల సమాచారం తెలుసుకోవాలి. అవగాహనకు మించిన ఆర్థిక భద్రత లేదు... దాన్ని పొందడానికి ఈరోజు కంటే మెరుగైన సమయం రాదు!

అవన్నీ మీకే చెందుతాయి...

విడాకుల ఆలోచనతో ఎవరూ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టరు. కానీ ఆర్థిక కష్టాలు తోడైతే ఆ బాధ మరింత ఎక్కువవుతుంది. ఈ సమయంలో కొన్ని ఆర్థిక జాగ్రత్తలు తీసుకుంటూ హక్కుల్నీ తెలుసుకోవాలి.



ఇవి చెక్ చేసుకోండి...

- నెలవారీ ఖర్చులకు డబ్బు ఎక్కణ్నుంచి వస్తుందో చూసుకోవాలి. ఆరు నెలలకు అత్యవసర నిధి ఉండాలి.
- బ్యాంకు అకౌంట్లు, మదుపు, రుణాలు, బీమా, ఆస్తి వివరాల్ని ఒకచోట రాసుకోండి.
- లీగల్ డాక్యుమెంట్లు, బ్యాంకు స్టేట్‌మెంట్లను భద్రం చేసుకోండి.

హక్కులు తెలుసుకోండి...

భరణం, నెలవారీ మెయింటెనెన్స్ ఇవ్వడం గురించి స్పష్టత ఉండాలి. భరణానికి పన్ను ఉండదు, నెలవారీ వచ్చే మెయింటెనెన్స్‌కు పన్ను పడుతుంది.

- స్త్రీధనంగా వచ్చే నగలు, కానుకలు, నగదుతోపాటు మీ పేర నమోదైన ఆస్తులేవైనా(వివాహ బంధానికి ముందు, బంధంలో ఉన్నప్పుడు, తర్వాత) మీకే చెందుతాయి.
- ఉమ్మడి ఆస్తిలో సరైన వాటాని పొందండి. విడిపోయాక, ఆయనకు వారసత్వంగా వచ్చే ఆస్తిమీద మీకు హక్కు ఉండదు. కానీ పిల్లలకు ఉంటుంది.
- భార్య, పిల్లల్ని లబ్ధిదారులుగా పెడుతూ 'మ్యారీడ్ విమెన్స్ ప్రాపర్టీ' యాక్టు కింద బీమా తీసుకుంటే లబ్ధిదారుల్ని తర్వాత మార్చలేరు. అది మీకూ, పిల్లలకే చెందుతుంది.

– శిల్పా భాస్కర్ గోలె, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

విడాకుల కారణంగా ఆస్తుల పంపిణీ, ఆర్థిక విషయాల్లో ఏవైనా సందేహాలా? అయితే వాటిని మాకు మెయిల్: vasundhara@eenadu.in, వాట్సాప్(9154091911) ద్వారా పంపండి. నిపుణుల సలహాలూ సూచనలూ అందిస్తాం.

ఆస్తి రాసిచ్చారు... రద్దు చేయించొచ్చా?

పెళ్లప్పుడు నాన్న రెండెకరాల పొలం ఇస్తానన్నారు. తర్వాత దాని గురించి మాట్లాడలేదు. నా పెళ్లికి ఖర్చులన్నీ అత్తింటివారే పెట్టుకున్నారు. అయితే, ఆస్తి లేకపోతే అబ్బాయిలకు పెళ్లిళ్లు కావడం లేదంటూ... నాన్నను ఒప్పించి పొలమంతా తన పేరున రాయించుకున్నాడు అన్నయ్య. ఈ విషయం మాకు ఆలస్యంగా తెలిసింది. అది తాతయ్య నుంచి నాన్నకు వచ్చింది. ఇప్పుడు నేను దానిలో వాటా అడగొచ్చా? – ఓ సోదరి

మీ నాన్న మీకు పెళ్లప్పుడు ఇస్తాను అని కాగితం రాశారా? మీ తాతయ్య నుంచి ఆ ఆస్తి వచ్చింది కాబట్టి అది మీ నాన్నకు పిత్రార్జితం అవుతుంది. అయితే అది భాగస్వామ్యం అయిన తర్వాతా వచ్చిందా లేదా అన్నది చూడాలి. అంటే ఆయన దాన్ని తన అన్నదమ్ములతో కలిసి భాగం పంచుకుంటే వచ్చింది అయితే అది స్వార్జితం అవుతుంది. మీ అన్నయ్యకు గిఫ్ట్ డీడ్ రాశారా? సేల్ డీడ్ రాశారా? రిజిస్ట్రేషన్ అయ్యిందా అని తెలుసుకోవడం ముఖ్యం. మీ నాన్నగారు ఉంటే ఆయన చేత రెవొకేషన్ ఆఫ్ గిఫ్ట్ డీడ్ వేయించండి. అంటే ఇచ్చింది వెనక్కి తీసుకోవడం. ఒకవేళ అది సేల్ డీడ్ అయితే డబ్బులు ఇవ్వకుండా మోసం చేసి రాయించుకున్నారని దాన్ని రద్దు చేయమని కోరుతూ కోర్టులో దావా వేయవచ్చు. మీ నాన్న ఈ రెండింటికీ ఒప్పుకోకపోయినా, ఆయన ఇప్పటికే మరణించినా మీకు రావాల్సిన భాగం కోరుతూ భాగస్వామ్య దావా వేయొచ్చు. అలానే, మీ అన్న రాయించుకున్న ఆ కాగితాల్ని రద్దు చేయమని కోరవచ్చు. దేనికైనా మీ దగ్గర ఆ ఆస్తికి, మార్కెట్ విలువకి సంబంధించిన పత్రాలు ఉండాలి. అప్పుడే కోర్టులో దావా వేయగలరు. మధ్యవర్తుల ద్వారా ప్రయత్నించండి. పరిష్కారం కాకపోతే ఆ కాగితాలతో లాయర్‌ని కలవండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి, న్యాయవాది

విద్యార్థులకు మార్గదర్శిగా..!

ఓ లక్ష్యాన్ని పెట్టుకుని... దానికోసం కష్టపడితే, ఆలస్యమైనా విజయం తప్పక వరిస్తుంది. డాక్టర్ వెంకటలక్ష్మి ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. ఈమె ఎవరు? ఏం సాధించారో తెలియాలంటే...

'కలల్ని సాకారం చేసుకోవాలంటే చాలా ఓపిక ఉండాలి. కొన్నిసార్లు లక్ష్యం దగ్గర వరకూ వెళ్లినా, అపజయాలు తలుపుతడుతుంటాయి. మధ్యలో చిన్నచిన్న విజయాలూ పలకరిస్తుంటాయి. వాటికి తృప్తి పడి, గమ్యాన్ని వదిలిపెడితే... అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయామే అని తర్వాత పశ్చాత్తాప పడతాం' అంటారు వెంకటలక్ష్మి. ఈమెది జనగామ జిల్లా, దేవరుప్పుల మండలంలోని గొల్లపల్లి. అమ్మ పూలమ్మ, నాన్న వెంకట్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి. వీళ్లకి నలుగురు సంతానం. వాళ్లలో రెండోవారు వెంకటలక్ష్మి. 'నాన్న జీతమే మా జీవనాధారం. దాంతో ఓ పూట తింటే మరో పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి. ఇది మారాలంటే చదువుకుని మేం మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలి అనేవారు నాన్న. అందుకే చిన్నప్పట్నుంచి కష్టపడి చదివా. మ్యాథ్స్ నా ఫేవరెట్ సబ్జెక్ట్. కానీ పది పూర్తయ్యాక పై చదువులు చదివించే స్తోమత లేదన్నారు. నేను, అన్నయ్య ట్యూషన్లు చెబుతూ ఇంటర్ పూర్తిచేశాం. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించా. అక్కడ కూడా ఉదయం తరగతులకు హాజరై... సాయంత్రం ట్యూషన్లు చెప్పేదాన్ని. అలా



వెంకటలక్ష్మి

బీఏ(ట్రిపుల్ మ్యాథ్స్), ఎంఎస్సీ పూర్తిచేశా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ(ఎంఫిల్), అదే యూనివర్సిటీలో యూజీసీ-సీఎస్ఐఆర్ స్కాలర్‌షిప్‌తో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాలను అందుకున్నా. ఈక్రమంలో ఎన్నో అడ్డంకుల్ని దాటా'నని గుర్తుచేసుకుంటారు వెంకటలక్ష్మి.

ప్రొఫెసర్ అవ్వాలని...

'అన్నయ్య బీఈడీ రాసి టీచర్ ఉద్యోగంలో స్థిరపడ్డారు. నేనూ రాశా, పాస్ అయ్యాను కూడా. రెండుసార్లు దీనిలో ఉత్తీర్ణత సంపాదించా. కానీ నా కల ప్రొఫెసర్ కావాలని. అందుకే ఎన్ని అవకాశాలు వచ్చినా కాదనుకున్నా. 2001లో నిర్మల్ జిల్లా లోకేశ్వరానికి చెందిన మనోహర్ రెడ్డితో వివాహమైంది. ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెళ్లయ్యాక ఆయన ప్రోత్సాహమూ తోడైంది. దాంతో 2007లో ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నా కెరియర్‌ను ప్రారంభించా' అనే వెంకటలక్ష్మి 2019లో అసోసియేట్ ప్రొఫెసర్, 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఈమె చేసిన 44 పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి.

పరిశోధనల వైపు ప్రోత్సహిస్తూ...

'ఇప్పటితరం విద్యార్థుల్లో సైన్స్ గ్రూప్స్ మీద ఆసక్తి చూపించే వారు తగ్గిపోతున్నారు. ఇక్కడా చాలా అవకాశాలు ఉన్నాయి. సరైన విధంగా వినియోగించుకోవాలే కానీ, తొందరగా కెరియర్‌లో స్థిరపడే అవకాశం ఉన్న గ్రూప్స్ ఇవన్నీ. నా దగ్గర చదువుకునే విద్యార్థులందరికీ అదే చెబుతుంటా. వాళ్లకి ప్రభుత్వ పరీక్షలకు సిద్ధమవ్వడానికి శిక్షణ కూడా ఇస్తుంటా. వాళ్ల ఆసక్తి మేరకు పరిశోధనల వైపూ ప్రోత్సహిస్తుంటా' అనే వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఇప్పటివరకూ ఏడుగురు పీహెచ్‌డీ పట్టాను పొందారు. చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ స్థిరపడ్డారు.


– ఎస్.హన్మంత్ రెడ్డి, లోకేశ్వరం

అవసరం నేర్పిస్తుంది..!



'ఎంత చెప్పినా బాబుకి లెక్కలు అర్థం కావడం లేదు. 14 ఏళ్లు వచ్చినా పాప గడియారం చూసి సమయం చెప్పలేకపోతోంది. పిజ్జా, బర్గర్‌లు అలవాటై ఇంట్లో చేసినవేమీ తినడం లేదు'. ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ పిల్లల మీద తల్లులకు ఎన్ని ఫిర్యాదులో. చూడటానికి చిన్నగా కనిపించినా... ఇలాంటివన్నీ నైపుణ్య లోపాల జాబితాలోకే వస్తాయి. అయితే ఇవి సంపాదించుకోవడానికి ఓ అవసరం, అవకాశం రావాలి. దాన్ని తల్లులే సృష్టించాలి. అవసరమే పాఠాలు నేర్పిస్తుంది అంటున్నారు నిపుణులు. లెక్కలు అర్థం కానప్పుడు రూ.50 ఇచ్చి దుకాణానికి పంపండి. రూ.35 సరకులే తెమ్మనండి. అలానే పాకెట్ మనీ ఇచ్చి లెక్క చెప్పమనండి. అంతా ఓ చోట రాసి, ఇవ్వమనండి. ఇలా అన్నా లెక్కలు నేర్చుకుంటారు. స్మార్ట్ వాచ్‌లూ, ఫోన్లూ దగ్గరుంటే గడియారం చూసి సమయం చెప్పడం ఎలా వస్తుంది పిల్లలకి. అవన్నీ లేనప్పుడే కదా దీని అవసరం పడేది. వాటిని దూరం చేసి చూడండి. దీన్ని తప్పకుండా నేర్చుకుంటారు. అలానే బయటి వంటకాల్ని పూర్తిగా బ్యాన్ చేస్తే... ఇంటివంట తినడం తప్ప వారిదగ్గర పరిష్కారం ఏముంటుంది. ఇలా మంచి అలవాట్లనీ, నైపుణ్యాల్నీ నేర్చుకునే అవకాశాన్ని మీరు కల్పించాలే తప్ప... ఫిర్యాదులు చేస్తేనో, వారిని దండిస్తేనో వాళ్లకి ఏదీ నేర్పలేరు. సమస్య ఉంటే దానికి పరిష్కారం కూడా ఉంటుంది. మన ఆలోచనలకు కాస్త పదును పెడితే... పిల్లలకు మనం నేర్పలేనిది, వాళ్లు నేర్చుకోలేనిదంటూ ఏదీ ఉండదు. పాటిస్తారుగా మరి!

శాకాహారులకు ప్రొటీన్లు ఎలా?





మాంసాహారులకు గుడ్లు, చికెన్, మటన్... వంటివాటి నుంచి మాంసకృత్తులు సమృద్ధిగా అందుతాయి. మరి శాకాహారుల మాటేంటి? అదే చదివేయండి...

భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసీఎమ్ఆర్-ఎన్ఐఎన్)సిఫారసుల ప్రకారం 19-50 ఏళ్ల సాధారణ మహిళలకు 46-50 గ్రా. వరకూ ప్రొటీన్ అవసరమట. అదే జిమ్ వర్కవుట్లు చేసే ఆడవాళ్లు వారి శరీర బరువుని బట్టి 66-110 గ్రా. వరకూ తీసుకోవచ్చని ఓ అంచనా.

బలమైన ఎముకలు, రోగనిరోధకశక్తి, గర్భధారణ సమయంలో శిశువు అభివృద్ధి, రుతుక్రమం సాఫీగా సాగడం... ఇవన్నీ ప్రొటీన్ మీద ఆధారపడి ఉంటాయి. అయితే, చాలామంది మహిళలు రోజూ తగినంత ప్రొటీన్ తీసుకోవడం లేదనేది ఆరోగ్య నిపుణుల ఆందోళన.

ప్రొటీన్ ఎందులో ఉంటుంది...

పెసరపప్పు, సెనగలు, మినపప్పు, పాలు, పాల సంబంధిత ఉత్పత్తులు అంటే పెరుగు, పనీర్ వంటివాటిల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

- సోయాబీన్స్ నుంచి ఒక రోజుకు అవసరం అయిన మాంసకృత్తుల్లో 72 శాతం పొందవచ్చు. అయితే, ఇందుకోసం మనం ఆహారంలో కనీసం 30 గ్రాములైనా సోయాబీన్స్‌ని చేర్చుకోవాలి.
- నువ్వులూ, అవిసెగింజలూ, గుమ్మడిగింజల్లో ఏదో ఒక రకాన్ని పెద్ద చెంచా చొప్పున ఆహారంలో చేర్చుకున్నా మంచిదే. వీటి నుంచి రోజువారీ అవసరాల్లో 30 శాతం మాంసకృత్తులు శరీరానికి లభిస్తాయి.
- పిస్తా, జీడిపప్పులతో పోలిస్తే బాదం నుంచి మాంసకృత్తులు అధికం. అలాగని వీటిని మరీ ఎక్కువ తీసుకోవాల్సిన అవసరం లేదు. రోజూ ఓ పది గింజల్ని నానబెట్టుకుని తిన్నా చాలు. ఇక, మొక్కజొన్నలో మాంసకృత్తులు అధికం. సగం పొత్తు తిన్నా... తగినన్ని మాంసకృత్తులు లభిస్తాయి.
- వేరుసెనగ చట్నీ, పీనట్ బటర్‌ల నుంచి కూడా కావలసినన్ని ప్రొటీన్లు అందుతాయి.

బంగారం - వెండి



8న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,32,227	1,19,950	1,83,180
విజయవాడ	1,28,670	1,19,550	1,83,000
ప్రొద్దుటూరు	1,27,750	1,17,530	1,78,000
రాజమహేంద్రవరం	1,30,420	1,19,550	1,98,000
విశాఖపట్నం	1,29,950	1,19,550	1,85,000
తమిళనాడు	-----	1,20,400	1,98,000

2009లో కెరియర్ ప్రారంభించేనాటికి మహిళల క్రికెట్‌కు పెద్దగా ఆదరణ లేదు. కనీస వసతులూ కరవే. మ్యాచ్‌లు జరుగుతున్న సంగతే ఎవరికీ తెలీదు. ఇప్పుడు జనాలు స్టేడియాలకు వస్తున్నారు. చిన్నారులు సైతం అక్కడ కనిపిస్తున్నారు. ఆటలో అవకాశాలు పెరిగాయి. కానీ, ఇంకా మార్పు రావాలి. సరైన మైదానాలు, బాలికలకు శిక్షణ శిబిరాలు, కుటుంబ సభ్యుల మద్దతు, దేశవాళీ స్థాయి పోటీలు... ఇవీ వస్తే ఇంకా మెరుగైన ఫలితాలు వస్తాయి.

- హర్మన్‌ప్రీత్ కౌర్, భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్



స్వచ్ఛమైన గాలి మనతోనే..!



ఈ రోజుల్లో పీల్చే గాలిలో కూడా నాణ్యత కరవు అవుతుంది. దాంతో ఇంట్లో ఎయిర్ ప్యూరిఫైయర్‌ని ఏర్పాటు చేసుకుంటున్నాం. కానీ ఎప్పుడూ ఇంట్లోనే ఉండలేం కదా! బయటకు వెళ్లాల్సిందే. అలా బయటికి వెళ్లినప్పుడు కూడా మన చుట్టూ ఉండే గాలి శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. అసలే శీతకాలం ఎక్కడ చూసినా పొగమంచు ఇదంతా ఎక్కడ కుదురుతుందంటారా! అందుకే 'వేరబుల్ ఎయిర్ ప్యూరిఫైయర్'లు అందుబాటులోకి వచ్చాయి. మెడ లేదా హ్యాండ్ బ్యాగ్‌కు తగిలించుకునే చిన్న డివైజ్ ఇది. దీనికి ఒకసారి ఛార్జింగ్ పెడితే దాదాపు నాలుగురోజుల వరకూ వాడుకోవచ్చు. గాలిలోని దుమ్ము రేణువులు, పొగ, టాక్సిన్లను కూడా ఇవి వడపోస్తాయి. అంతేకాదు, ఇది మన ముఖం చుట్టూ బెలూన్ మాదిరిగా రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రయాణాలు, వాకింగ్, మార్కెట్, ఆఫీస్ ఇలా ఎక్కడికి వెళ్లినా మీ వెంటే చక్కగా తీసుకెళ్లొచ్చు.

వరుసల్లో మెరిసిపోతోంది!





నగా నట్రా

ధగధగ మెరిసే నగ అమ్మాయి మెడలో చేరిందంటే చాలు లక్ష్మీ కళ వచ్చేస్తుంది. అలాగని ఏదో ఒక డిజైను అని సరిపెట్టేసుకోలేం. వేసుకునే దుస్తులూ, సందర్భాన్ని బట్టి కొత్తదనం కనిపించాలని కోరుకుంటాం. అందుకే, మగువల మనసు తెలుసుకున్న తయారీదారులు ఎప్పటికప్పుడు నయా మోడళ్లను మార్కెట్‌లోకి తెస్తుంటారు. అలా నిన్నమొన్నటి వరకూ టెంపుల్ జ్యూయెలరీ పేరుతో భారీ పనితనంతో తీర్చిదిద్దిన హారాలు, పెండెంట్లదే హవా. ఇప్పుడు మాత్రం సింపుల్‌గా కనిపిస్తూనే రిచ్‌లుక్‌ని ఇచ్చే డిజైన్ల కోసం వెతుకుతున్నారు. ముఖ్యంగా ఒకేలాంటి డిజైన్‌తో తీర్చిదిద్దిన లేయర్డ్ హారాలను ఇష్టపడుతున్నారు. దీనికోసమే సంప్రదాయ దుస్తులతో పాటు మోడర్న్ డ్రెస్‌ల మీదకూ నప్పేలా వీటిని రూపొందిస్తున్నారు. అలా ముత్యాలు, పచ్చలు, పగడాలు, కుందన్లు, పోల్కీలు, వజ్రాలు వంటివాటితో తయారు చేసిన వీటిని మీరూ ఓ సారి చూసేయండి.

మహరీ... నృత్యమే కాదన్నారు..!

ఓ నాలుగేళ్ల పాప... ఆడుకునే వయసులో దేవుడి ముందు నాట్యం చేయాలనుకుంది. పట్టుదలతో నేర్చుకుని ఏడేళ్ల వయసులో స్వామి ముందు నర్తించింది. ఆ తరవాత... కాలగర్భంలో కలిసిపోతున్న ఆ సంప్రదాయ నృత్యాన్ని రాబోయే తరాలకు అందించాలనుకుంది. సాంస్కృతిక ఉద్యమం చేసింది. తను నేర్చుకున్న కళని విదేశీ వేదికలపై ప్రదర్శిస్తూ ప్రపంచ గుర్తింపుని తీసుకొచ్చింది. ఈ ప్రయాణంలో ఎన్నో అవార్డులనీ అందుకొంది. దిల్లీ దూరదర్శన్‌లో గ్రేడ్ ఎ ఆర్టిస్ట్‌గా పేరొందిన ఆమె...
రూపశ్రీ మహాపాత్ర.



రూపశ్రీ



మహరీ నృత్యానికి దాదాపు వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఇది ఒడిశాలో ఓ సంప్రదాయ నాట్యం. పూరీ జగన్నాథుని ఆలయం నిర్మించినప్పటి నుంచీ స్వామివారికి రోజువారీ ఆచార సంప్రదాయాల్లో ఈ నృత్యం కూడా ఒక భాగంగా ఉండేదట. అప్పటి రాజులు దేవుడికి సేవ చేసేందుకు దక్షిణాది నుంచి కొంతమంది దేవదాసీలను తీసుకొచ్చేవారట. వారు శ్రీ జగన్నాథుణ్ని తమ భర్తగా భావించి పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ స్వామివారిని సంతోషపెట్టేవారట. వారినే మహరీలు అని పిలిచేవారు. వాళ్లు చేసే ఈ నృత్యాన్నే మహరీగా చెప్పుకొనేవారు. కాలక్రమంలో దేవదాసీ వ్యవస్థ రద్దు అయిపోయింది. కానీ అంతటి ప్రాధాన్యం ఉన్న నృత్యం అందరికీతెలియాలనుకున్నారు రూపశ్రీ మహాపాత్ర. ఒడిశాలోని పూరీలో డోలమండప్ సాహిలో పుట్టిపెరిగారీమె. అమ్మ సరస్వతీ దేవి. నాన్న సాహిర్ పండిత్ హరిహర మహాపాత్ర. ముంబయి, చండీగఢ్, అలహాబాద్ ప్రాంతాల్లోని వివిధ సంగీత, నాటక అకాడమీల్లో చదువుకున్నారు. ప్రస్తుతం కేరళలోని గురువాయూర్‌లో డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. 'దాదాపు 42ఏళ్ల కృషి తర్వాత ఈ నృత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయగలిగా. దీని గురించి తెలియనివారు మహరీని అసలు నృత్యమే కాదనేవారు. దీని చరిత్ర ప్రపంచానికి తెలిసేలా చైనా, అమెరికా, లండన్, దోహా వంటి దేశాల్లో ఎన్నో వర్క్‌షాపులు నిర్వహించా. సుమారు 17 జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలిచ్చా. ఇప్పుడు ప్రపంచం మొత్తం మీద 5000 మంది కళాకారులు దీన్ని నేర్చుకుంటున్నారు. ఇందుకు గానూ ఒడిశా ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ అవార్డుని అందించింది. ఎన్నో పోరాటాల తర్వాత ఈ కళకి ఆ గౌరవం లభించింది. నా గురువు హరప్రియ, ఆమె ఒక దేవదాసీ. నాకు మహరీ నేర్పించారు. నాలుగేళ్లున్నప్పుడే ఆమెతో కలిసి గుడిలో దేవుడి ముందు నాట్యం చేశా'నంటారీమె. అంతేకాదు ఈ నృత్యాన్ని నేర్పేందుకు రూపశ్రీ కళా మందిర్ పేరుతో డ్యాన్స్ అకాడమీని నడుపుతున్నారు. మహరి సంప్రదాయం గురించి అందరికీ తెలిసేలా వ్యాసాలూ రాస్తుంటారు రూప.

కాలి నడకన భారత యాత్ర



ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల గౌరవ్ మాలవీయ.. కాలినడకన భారత్‌ను చుట్టేస్తున్నారు. దేశవ్యాప్తంగా గత నాలుగేళ్లలో ఆయన 13 రాష్ట్రాల్లో 54,000 కిలోమీటర్లు నడిచారు. 2 లక్షల కిలోమీటర్లకుపైగా నడవాలనేది ఆయన లక్ష్యం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జ్యోతిర్లింగాలను, ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించారు. పలు చోట్ల పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం గుజరాత్‌లోని ద్వారకకు చేరుకున్న గౌరవ్.. భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవడం, పర్యావరణ సమస్యలను పరిష్కరించడం, దేశ ప్రజల్లో ఐక్యతను పెంచడమే లక్ష్యంగా ప్రయాణాన్ని సాగిస్తున్నట్లు తెలిపారు. దేశంలో లక్ష మొక్కలను నాటాలని ఆశిస్తున్నానని వివరించారు.

రూ.12 కరెంటు బిల్లు కట్టలేదని లీగల్ నోటీసు



దేశంలో చాలా మంది లక్షల రూపాయల కరెంటు బిల్లులను చెల్లించరు. అయినా తప్పించుకుని తిరుగుతుంటారు. కానీ మధ్యప్రదేశ్‌లో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. సాత్నా జిల్లాలోని కోఠీ పట్టణానికి చెందిన పీయూష్ అగర్వాల్ అనే వ్యక్తి రూ.12 బకాయి పడ్డారని పేర్కొంటూ విద్యుత్తు శాఖ.. ఏకంగా లీగల్ నోటీసే పంపింది. బకాయి చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 'మీ విద్యుత్తు సర్వీసుకు సంబంధించి రూ.12 బకాయిని గడువులోగా చెల్లించడంలో మీరు విఫలమయ్యారు. అందువల్ల మీకు లీగల్ నోటీసు పంపుతున్నాం. రూ.12 బకాయికి అదనంగా రూ.12 పెనాల్టీ చెల్లించండి. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం' అని నోటీసులో విద్యుత్తుశాఖ పేర్కొంది. విద్యుత్తుశాఖను సంప్రదించగా.. పొరపాటున ఈ నోటీసు వచ్చి ఉంటుందని వివరణ ఇచ్చింది.

రూ.15 కోట్ల పుస్తకం



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకాన్ని చూడాలనుకుంటున్నారా.. అయితే మీరు బిహార్ రాజధాని పట్నా వెళ్లాల్సిందే. అక్కడి గాంధీ మైదాన్‌లో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనలో ఇది కొలువుదీరింది. దాని విలువ రూ.15 కోట్లు. ప్రముఖ రచయిత రత్నేశ్వర్ రచించిన ఈ పుస్తకం పేరు 'మైన్ (నా బ్రహ్మలోక ప్రయాణం). కేవలం 3 పుస్తకాలనే ఆయన ముద్రించారు. అయితే అంత ఖరీదైనా మీరు కొనుక్కోవడానికి వీల్లేదు. వాటిని విక్రయించకూడదని రచయిత నిర్ణయించుకున్నారు. దీంతో ఆ పుస్తకం వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకుంటున్నారు. 15 నెలలపాటు తాను ప్రవాసంలో ఉన్నప్పుడు చేసిన ఆధ్యాత్మిక యాత్రల్లో ఎదురైన అనుభవాలతో ఈ పుస్తకాన్ని రాశానని రచయిత రత్నేశ్వర్ ఈటీవీ భారత్‌కు తెలిపారు. మన మూలాల్లోని జీవన సిద్ధాంతాన్ని ఇందులో ఆవిష్కరించానని వెల్లడించారు.

ఈటీవీ భారత్

30 రోజుల్లోగా తాజా నిబంధనావళిని సమర్పించాలి

అన్ని పార్టీలకు ఈసీ సూచన

దిల్లీ: దేశంలోని పార్టీలన్నీ తమ తాజా నిబంధనావళులను సమర్పించాలని ఎన్నికల సంఘం (ఈసీ) కోరింది. 30 రోజుల్లోగా వాటిని అందజేయాలని సూచించింది. ఇప్పటిదాకా చాలా పార్టీలు నిబంధనావళులను అందించలేదని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పార్టీలు నడవడానికి నిబంధనావళులు ఎంతో ముఖ్యమని పార్టీ అధ్యక్షులకు రాసిన లేఖల్లో ఈసీ పేర్కొంది. 'తాజా నిబంధనావళి ప్రతితో పాటు ఇప్పటిదాకా చేసిన సవరణల వివరాలను 30 రోజుల్లో అందించాలి. ఆ తరువాత వాటిని ఈసీ వెబ్‌సైట్‌లో పెడతాం' అని ఎన్నికల సంఘం వివరించింది.

జపాన్‌లో భూకంపం.. స్వల్ప సునామీ

టోక్యో: జపాన్‌ను సోమవారం భూకంపం వణికించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 7.6గా నమోదైంది. భూకంప తీవ్రతకు జపాన్ ఉత్తర తీరంలో స్వల్ప సునామీ వచ్చింది. తీర ప్రాంతాల్లో 40 సెంటీమీటర్ల ఎత్తు వరకూ రాకాసి అలలు ఎగసిపడ్డాయి. భూకంపం కారణంగా అవోమోరి పట్టణంలోని ఓ హోటల్‌లో పలువురు గాయపడ్డారు.

కీళ్ల ఆరోగ్యానికి ఇవి పాటించండి



నలభై వయసులోనే కీళ్ల నొప్పులబారిన పడకూడదనుకుంటే వీటిని పాటించండి. 1.మీ ఆహారంలో ప్రొటీన్, కాల్షియం, ఒమేగా-3 సమృద్ధిగా ఉండేలా చూసుకోండి. 2.రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయండి.

– నబుషావో, హెల్త్‌కేర్ ఎక్స్‌పర్ట్

మరో 500 విమానాల రద్దు

- కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం
- అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: ఇండిగో సంక్షోభం కొనసాగుతూనే ఉంది. రెండు, మూడు రోజుల నుంచి పరిస్థితులు మెరుగుపడుతున్నా వందల సంఖ్యలో విమానాలు ఇంకా రద్దవుతూనే ఉన్నాయి. సోమవారం దేశవ్యాప్తంగా 1802 విమానాలను నడిపిన ఇండిగో 500కు పైగా సర్వీసులను నిలిపివేసింది. రిఫండ్ జారీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటివరకు దాదాపు రూ. 827 కోట్లను ప్రయాణికులకు రిఫండ్ చేసినట్లు పౌర విమానయాన మంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. వివిధ ఎయిర్‌పోర్టుల్లో నిలిచిపోయిన 9,000 బ్యాగేజీల్లో 4,500 బ్యాగులను ప్రయాణికులకు అందజేసినట్లు తెలిపింది. వచ్చే 36 గంటల్లో మిగిలిన వాటిని డెలివరీ చేసేందుకు ఇండిగో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. ఇండిగో విమానసేవల అంతరాయాలపై పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) జారీ చేసిన షోకాజ్ నోటీసులకు సోమవారం సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్, సీవోవో ఇసిడ్రో పోర్కెరాస్ సమాధానమిచ్చారు. ఈ మొత్తం గందరగోళానికి కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు మరికొంత సమయం కావాలని వారు కోరారు. స్వల్ప సాంకేతిక లోపాలు, విమానాల షెడ్యూళ్లను మార్చడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ.. ప్రాథమిక కారణాలుగా పేర్కొన్నారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మరోసారి క్షమాపణలు చెప్పారు.



దిల్లీ విమానాశ్రయంలో పేరుకుపోయిన ప్రయాణికుల లగేజీ

ఇది తీవ్రమైన అంశమే: సుప్రీం

'ఇండిగో సంక్షోభం'పై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. సర్వీసుల్లో తీవ్ర అంతరాయాన్ని ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. దాని పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభించిందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. "ఇది తీవ్రమైన అంశమే. భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సకాలంలో చర్యలు ప్రారంభించిందని మా దృష్టికి వచ్చింది'' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా ఇండిగో తన సర్వీసులు రద్దు చేస్తోందని, దాంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విమానాల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు కేంద్రం అండగా ఉండాలని, వారికి రిఫండులు జారీ అయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై మాత్రం దిల్లీ హైకోర్టు బుధవారం విచారణ చేపట్టనుంది.

జాతీయాదాయం పెరుగుతున్నా..

తగ్గని ఆర్థిక అసమానతలు!

- దక్షిణ భారత రాష్ట్రాల్లో సమ్మిళిత పురోగతి
- తాజా అధ్యయనంలో వెల్లడి


దిల్లీ: స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94 శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం.. ■ 2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. ■ నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ■ ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. ■ దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. ■ బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి.



రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో

మహిళా లాయర్లకు 30% సీట్లు

- సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: ఎన్నికల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో మహిళా న్యాయవాదులకు 30 శాతం సీట్లు కేటాయించాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ప్రస్తుత ఏడాదికి ఎన్నికల్లో పోటీ చేయడానికి తగినంత మంది మహిళా న్యాయవాదులు లేనట్లయితే 20శాతం సీట్లు వారికి కేటాయించి, మరో 10 శాతం సీట్లకు వారిని కో-ఆప్ట్ చేసుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సూచించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను తమ ముందు ఉంచాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి తెలిపింది. ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన బార్ కౌన్సిళ్లకు ఈ దశలో మహిళలకు సీట్లు కేటాయించాలనడం సరికాదని అభిప్రాయపడింది. కోర్టు గత ఆదేశాలకు అనుగుణంగా ఆరు రాష్ట్రాల్లో బార్ కౌన్సిళ్లకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని బీసీఐ ఛైర్‌పర్సన్ మనన్ కుమార్ మిశ్ర తెలిపారు. మహిళా న్యాయవాదులకు కేటాయించిన 30 శాతం సీట్లకు గాను ప్రస్తుత ఏడాదికి వారిని కో-ఆప్ట్ చేసుకోవడమే మేలని అభిప్రాయపడ్డారు. సాధారణంగా మహిళా లాయర్ల సంఖ్య తక్కువగా ఉంటుంది కాబట్టి 15శాతం మందిని ఈ కోటాలో నేరుగా నియమించాలని పేర్కొనగా సీజేఐ అభ్యంతరం తెలిపారు. కో-ఆప్ట్ చేసుకునే వారి సంఖ్య 10 శాతం ఉండటమే సముచితమని వెల్లడించారు. ఇప్పటికే బార్ కౌన్సిళ్ల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్, పంజాబ్-హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణ, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పోటీ చేస్తున్న మహిళా న్యాయవాదులు విజయం సాధించేందుకు గట్టిగా ప్రయత్నించాలని ధర్మాసనం పేర్కొంది. బార్ కౌన్సిళ్లలో మహిళా న్యాయవాదులకు 30శాతం సీట్లు కేటాయించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.

థాయ్, కంబోడియా సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తతలు

బ్యాంకాక్: ఆగ్నేయాసియా దేశాలైన థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఇరు దేశాల మధ్య ఆదివారం కాల్పులతో ప్రారంభమైన ఘర్షణ.. సోమవారం వైమానిక దాడులకు దారితీసింది. తాజా ఉద్రిక్తతల్లో ఓ థాయ్ సైనికుడు, నలుగురు కంబోడియా పౌరులు మృత్యువాతపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తొలుత ఉల్లంఘించింది మీరంటే మీరేనంటూ ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు గుప్పించుకున్నాయి. థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య దీర్ఘకాలంగా సరిహద్దు వివాదాలు ఉన్నాయి. వాటి మధ్య ఈ ఏడాది జులైలో ఐదు రోజులపాటు పెద్దఎత్తున ఘర్షణలు చోటుచేసుకోగా.. పదుల సంఖ్యలో సైనికులు, సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య అక్టోబరులో శాంతి ఒప్పందం కుదిరింది. అయితే వాటి సరిహద్దుల్లో ఆదివారం మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. కంబోడియా సైనికులు తొలుత కాల్పులు జరిపారని, దీంతో తమ సైనికులు ఇద్దరు గాయపడ్డారని థాయ్ ఆరోపించింది. సోమవారం కంబోడియా దళాలు మరోసారి కాల్పులకు పాల్పడటంతో తమ సైనికుడొకరు మరణించారని, మరో 8 మంది గాయపడ్డారని తెలిపింది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల నుంచి 50 వేలమందికిపైగా ప్రజలను సురక్షిత స్థావరాలకు తరలించామని పేర్కొంది.



థాయ్‌లాండ్‌లోని బురిరామ్ ప్రావిన్సులో ప్రత్యేక కేంద్రంలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రజలు

భారత్‌తో బలమైన మైత్రితో చైనాకు చెక్

- వార్షిక రక్షణ విధాన బిల్లులో అమెరికా స్పష్టీకరణ

న్యూయార్క్/ వాషింగ్టన్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత పరిస్థితులు నెలకొనేలా చూసేందుకు, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను తిప్పికొట్టేందుకు భారత్‌తో మైత్రిని బలోపేతం చేసుకోవడం అవసరమని అమెరికా తన వార్షిక రక్షణ విధాన బిల్లులో పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందిన ఈ 'నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్'ను అమెరికా కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో రక్షణ కూటములు, భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు అమెరికా రక్షణ మంత్రి చర్యలను కొనసాగించాలని కోరింది. చైనాతో సాగిస్తున్న వ్యూహాత్మక పోటీలో అమెరికా ఆధిపత్యం కొనసాగేలా చూడాలంది. ఈ క్రమంలో విదేశాంగశాఖ మంత్రితో సమన్వయం చేసుకోవాలని సూచించింది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌తో కూడిన క్వాడ్ కూటమి ద్వారా ముందడుగు వేయాలంది. ద్వైపాక్షిక, బహుళ సైనిక విన్యాసాలు చేపట్టాలని, రక్షణ వాణిజ్యాన్ని విస్తరించాలని, మానవతా సాయం, విపత్తు ప్రతిస్పందనలో సహకారాన్ని పెంపొందించుకోవాలని సూచించింది. యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ సెక్యూరిటీ డైలాగ్ వంటి సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటుచేయాలని పేర్కొంది. ఇరు దేశాల మధ్య 2008లో కుదిరిన పౌర అణుఒప్పంద పురోగతిని సమీక్షించాలని సూచించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 180 రోజుల్లో అమెరికా విదేశాంగ మంత్రి సంయుక్త అంచనాలను నివేదిక రూపంలో ఇవ్వాలని కోరింది. అమెరికాలో ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టాక భారత్‌తో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రతిపాదనలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.



కాంగ్రెస్ నుంచి సిద్ధూ సతీమణి సస్పెన్షన్



చండీగఢ్: రూ.500 కోట్ల సూట్‌కేసు సమర్పించినవారే ముఖ్యమంత్రి అవుతారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పంజాబ్ కాంగ్రెస్ నాయకురాలు, సిద్ధూ సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూను పార్టీ సస్పెండు చేసింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని సోమవారం సాయంత్రం పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రజా ప్రకటించారు. అయితే అంతకు ముందు నవ్‌జోత్ స్పందించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని వివరణ ఇచ్చారు.

నవ్‌జోత్ కౌర్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తన భర్త నవ్‌జోత్ సింగ్ సిద్ధూను కాంగ్రెస్ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తేనే మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారని ప్రకటించారు. ఏ పార్టీకీ డబ్బులివ్వడానికి తమవద్ద లేవని, కానీ పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని పేర్కొన్నారు. 'మేం ఎప్పుడూ పంజాబ్, పంజాబీయుల గురించి మాట్లాడతాం. కానీ ముఖ్యమంత్రి కుర్చీ కోసం రూ.500 కోట్లు ఇవ్వడానికి మావద్ద లేవు' అని వ్యాఖ్యానించారు. మిమ్మల్ని ఎవరైనా డబ్బులివ్వాలని డిమాండు చేశారా.. అని విలేకరులు ప్రశ్నించగా. . లేదని సమాధానమిచ్చారు. కానీ ఎవరైతే రూ. 500 కోట్ల సూట్‌కేసును ఇస్తారో వారే ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్యానించారు. దీనిపై తీవ్ర దుమారం రేగింది. దీంతో ఆమె వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ ఎప్పుడూ తమ నుంచి ఏదీ అడగలేదని స్పష్టం చేశారు.

మధుమేహంపై సామూహిక యుద్ధం

ఈటీవీ భారత్: మధుమేహం.. ప్రపంచంలోనే అతి పెద్ద జీవనశైలి వ్యాధి. మన దేశంలోనూ ఎంతో మందిని ప్రస్తుతం ఇది వేధిస్తోంది. ఈ ప్రమాదాన్ని ముందుగా ఊహించారో.. ఏమో.. నొయిడాకు చెందిన డాక్టర్ జీసీ వైష్ణవ.. 1996లోనే మధుమేహాన్ని కట్టడి చేసేందుకు స్వచ్ఛందంగా శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఆయన ఐదుగురితో 'నొయిడా డయాబెటిక్ ఫోరం' ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఆయన ఏర్పాటు చేసిన శిబిరానికి 11 మంది మధుమేహ బాధితులు హాజరయ్యారు. అప్పుడు దానినో వ్యాపారంగా ప్రజలు భావించారు. కానీ 27 సంవత్సరాల తర్వాత ఆ ఫోరం భారీగా విస్తరించింది. స్వచ్ఛంద సేవకు చిహ్నంగా నిలుస్తోంది. లక్షల మందికి ఉచితంగా సాయం అందిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోరంలో 200 మంది సేవలందిస్తున్నారు. వారిలో 30 మంది వరకూ వైద్యులున్నారు. ఈ సంస్థ ప్రతి మూడో ఆదివారం నొయిడాలో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోంది. 250 నుంచి 300 మంది వరకూ ఇక్కడ సేవలు పొందుతారు. ఏటా నవంబరులో భారీ శిబిరాన్ని నిర్వహిస్తారు. ఇందులో 10 కార్పొరేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు పాల్గొంటాయి. 50 మంది డాక్టర్లు హాజరవుతారు. 2,000 మంది పరీక్షలు చేయించుకుంటారు. ఖరీదైన పరీక్షలనూ ఉచితంగానే చేస్తారు.



దూరదర్శన్ సుప్రభాత కార్యక్రమానికి మోదీ ప్రశంస

దిల్లీ: దూరదర్శన్‌లో ప్రసారమవుతున్న సుప్రభాతం కార్యక్రమాన్ని సోమవారం ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇది ఉదయాన్ని ఉత్తేజకరంగా ప్రారంభించేందుకు సహాయపడుతుందన్నారు. యోగా నుంచి భారతీయ జీవన విధానం వరకు విభిన్న అంశాలను ఈ కార్యక్రమం ప్రసారం చేస్తుందని తెలిపారు. భారతీయ సంప్రదాయాలు, విలువలతో కూడిన ఈ కార్యక్రమం జ్ఞానం, ప్రేరణ, సానుకూలతలను అందిస్తుందని మోదీ పేర్కొన్నారు. ప్రత్యేక విభాగమైన 'సంస్కృతి సుభాషితం' భారతీయ సంస్కృతి, వారసత్వంపై చైతన్యాన్ని పెంచుతుందన్నారు.

'విజయ్ దివస్' వేడుకలకు బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగే విజయ్ దివస్ వేడుకలకు బంగ్లాదేశ్‌కు చెందిన 20 మంది ప్రతినిధుల బృందం హాజరుకానుంది. ఇందులో 8 మంది ముక్తిజోధాలు, ఇద్దరు సైనికాధికారులుంటారు. 1971 నాటి యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత సాయుధ దళాలు సాధించిన చరిత్రాత్మక విజయాన్ని గుర్తుచేస్తూ ఈ వేడుకలు నిర్వహిస్తారు. పాక్‌ను ఓడించిన భారత సైన్యం బంగ్లాదేశ్ అవతరణకు కారణమైంది. దీనికి గుర్తుగా ప్రతి ఏటా విజయ్ దివస్‌ను భారత్ నిర్వహిస్తుంది. డిసెంబరు 16న భారత సైన్యం తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం విజయ్‌దుర్గ్‌లో జరిగే పుష్పాంజలి కార్యక్రమంలో బంగ్లాదేశ్ ప్రతినిధులూ పాల్గొంటారు. సైన్యం నిర్వహించే కార్యక్రమలకూ హాజరవుతారు.

పుతిన్ భారత పర్యటనపై చైనా సానుకూల స్పందన

బీజింగ్: రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనపై చైనా సానుకూలంగా స్పందించింది. పటిష్ఠమైన త్రైపాక్షిక సహకారానికి సుముఖంగా ఉన్నట్లు తెలిపింది. స్థానిక, ప్రపంచ శాంతి స్థిరత్వానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంది. భారత్‌లో పుతిన్ మొదటి ఉన్నతస్థాయి పర్యటన, ప్రధాని మోదీతో చర్చల అంశంపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియకున్ ఈ మేరకు స్పందించారు. చైనా, రష్యా, భారత్‌లవి పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థలని, దక్షిణార్ధ గోళ దేశాలలో ఈ మూడూ ముఖ్య భాగస్తులని ఆయన చెప్పారు. భారత్, రష్యాలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దిల్లీతో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడం ఇరు దేశాలకూ, ప్రజలకూ ప్రయోజనకరమన్నారు. ఆసియాలో శాంతి, శ్రేయస్సులను నెలకొల్పడానికి ఇది తోడ్పడుతుందన్నారు.

'రోమియో' క్లబ్‌లకు తాళం

- ఆ సంస్థ మరో రెండు నైట్ క్లబ్‌లపై చర్యలు తీసుకున్న గోవా సర్కారు
- విచారణకు నలుగురితో కమిటీ



అగ్నిప్రమాదం జరిగిన క్లబ్‌లో అధికారుల విచారణ

పణజీ: గోవాలోని అర్పోరాలో ఉన్న 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్ యాజమాన్య సంస్థపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి 25 మంది మరణించిన నేపథ్యంలో ఆ సంస్థకున్న మరో రెండు శాఖలకు తాళం వేసింది. మరోవైపు నైట్ క్లబ్ ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణ కోసం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

■ రోమియో లేన్ యాజమాన్యం వగటార్, అస్సాగావ్‌లలో నిర్వహిస్తున్న ఏ బీచ్ షేక్‌తోపాటు మరో క్లబ్‌ను నార్త్ గోవా జిల్లా యంత్రాంగం సీజ్ చేసింది. ఈ రెండు క్లబ్‌లూ వివాదాల్లో ఉన్నందున చర్యలకు ఉపక్రమించింది.

■ నార్త్ గోవా జిల్లా కలెక్టర్ అంకిత్ యాదవ్ అధ్యక్షతన మెజిస్టీరియల్ విచారణ కమిటీ ఏర్పాటైంది. కమిటీలో సౌత్ గోవా ఎస్పీ తికమ్ సింగ్ వర్మ, ఫోరెన్సిక్ సైన్స్ డైరెక్టర్ అశుతోష్ ఆప్టే, అగ్నిమాపక, అత్యవసర సేవల డిప్యూటీ డైరెక్టర్ రాజేంద్ర హల్‌ర్నకర్‌లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. అగ్ని ప్రమాదానికి దారితీసిన వరుస కారణాలు, లైసెన్సు నిబంధలను క్లబ్ యాజమాన్యం అమలు చేసిన తీరు, చట్ట ఉల్లంఘనల వ్యవహారం, బాధ్యులైన సంస్థలు, శాఖలపై విచారణ జరిపి ప్రభుత్వానికి కమిటీ నివేదిక అందించనుంది. క్లబ్‌ల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలనూ సిఫార్సు చేయనుంది.

■ ప్రమాదంలో 25 మరణించడంపట్ల బిర్చ్ బై రోమియో లేన్ భాగస్వామి సౌరభ్ లూథ్రా విచారం వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకుంటామని సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు.

■ క్లబ్ యజమానులైన గౌరవ్ లూథ్రా, సౌరభ్ లూథ్రాలను అరెస్టు చేయడానికి గోవా పోలీసులు దిల్లీ వెళ్లారు. అయితే హడ్సన్ లేన్ ప్రాంతంలోని ఇంట్లో సోదరులు ఇద్దరూ లేరు. అరెస్టు భయంతో వారిద్దరూ థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పరారయ్యారు. శనివారం రాత్రి ప్రమాదం జరిగిన కొద్ది గంటల తర్వాత ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో వారు ఇండిగో విమానంలో థాయ్‌లాండ్‌కు పారిపోయారని గోవా పోలీసులు తెలిపారు. వారిని వెనక్కి రప్పించేందుకు ఇంటర్ పోల్ సాయం కోరనున్నట్లు వెల్లడించారు.

■ క్లబ్ ప్రమాదం కేసులో మరో ఉద్యోగిని పోలీసులు దిల్లీలో అరెస్టు చేశారు. అతడిని సబ్జీ మండి ప్రాంతానికి చెందిన భరత్ కోహ్లీగా గుర్తించారు.

లైంగిక దాడి కేసులో నటుడు దిలీప్ నిర్దోషే

- ఎర్నాకుళం కోర్టు తీర్పు



కోర్టు వద్ద దిలీప్

కొచ్చిన్: మలయాళ నటిపై లైంగికదాడి, కిడ్నాప్ కేసు నిందితుల్లో ఒకరైన ప్రముఖ నటుడు దిలీప్‌ను కేరళలోని ఎర్నాకుళం కోర్టు సోమవారం నిర్దోషిగా ప్రకటించింది. మరో ముగ్గురికీ ఉపశమనం కల్పించింది. కేసులో ఆరుగురిని మాత్రం అత్యాచారం, కుట్ర వంటి నేరాల కింద న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఎనిమిదేళ్ల క్రితం కేరళలో చోటుచేసుకున్న ఈ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే కోర్టు తీర్పుపై కేరళ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. తీర్పును సవాలు చేస్తూ అప్పీల్ దాఖలు చేస్తామని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పి.రాజీవ్ చెప్పారు. బాధితురాలికి సరైన న్యాయం జరగలేదన్నారు. ఈ కేసుతో నేరుగా సంబంధం ఉన్న ఆరుగురికి శిక్ష పడినప్పటికీ, ఇలాంటి తీర్పును ఎవ్వరూ ఊహించలేదన్నారు. మలయాళం, తమిళం, తెలుగు సినిమాల్లో నటించిన ప్రముఖ నటి 2017, ఫిబ్రవరి 17న కిడ్నాప్‌నకు గురయ్యారు. ఆ రోజు రాత్రి రెండు గంటలపాటు ఆమె కారులోనే లైంగిక వేధింపులకు గురిచేసిన దుండగులు.. తర్వాత అక్కడినుంచి పారిపోయారు. కొచ్చిలో ఈ ఘటన జరిగింది. ఈ కేసులో 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో దిలీప్ కూడా ఒకరు. వారిపై కిడ్నాప్, లైంగిక వేధింపులు, గ్యాంగ్‌రేప్, ఉద్దేశపూర్వకంగా ఆధారాలను చెరిపివేయడం వంటి అభియోగాల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో 2017లో తొలి ఛార్జిషీట్ నమోదైంది. అదే ఏడాది జులైలో దిలీప్ అరెస్టయ్యాడు. నాలుగు నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాడు. తాజా తీర్పుపై దిలీప్ స్పందిస్తూ... "ఇది నాపై జరిగిన కుట్ర. కొందరు పోలీసులు, కొన్ని మీడియా వర్గాలు కలిసి నా జీవితాన్ని నాశనం చేయాలని అనుకున్నారు. వారు అల్లిన తప్పుడు కథనాలను కోర్టు కొట్టివేసింది. నాకు మద్దతుగా నిలిచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు'' అని మీడియాతో చెప్పారు.

'ప్రసాద్' పునర్వ్యవస్థీకరణ

దిల్లీ: దేశంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిరిట్యువల్ అగ్‌మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) పథకాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గత 10 ఏళ్లలో ఈ పథకం కింద 54 ప్రాజెక్టులను మంజూరు చేశామని తెలిపింది. సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన అనుబంధ ప్రశ్నకు సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ శెఖావత్ సమాధానమిచ్చారు. ఈ పథకం ఆయా ప్రాంతాల ఆర్థిక పరిపుష్టికి ఉద్దేశించిందని, అది పూర్తయ్యే దశలో ఉందని, దానిని పునర్వ్యవస్థీకరిస్తున్నామని తెలిపారు. 2014లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రతిపాదనల ఆధారంగా అధ్యాత్మిక పర్యాటక క్షేత్రాల్లో కేంద్రం మౌలిక వసతులను కల్పించనుంది.

బ్రిటన్‌కు ఖాలిదా జియా తరలింపులో అడ్డంకి



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖాలిదా జియా ఆరోగ్యం విషమంగా ఉండటంతో ఆమెను చికిత్స కోసం బ్రిటన్‌లోని లండన్‌కు తరలించడానికి చేసిన ఏర్పాట్లలో మరోసారి అడ్డంకి ఏర్పడింది. ఆమె తరలింపునకు మంగళవారం ఖతార్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎయిర్ అంబులెన్స్ ఢాకా విమానాశ్రయంలో లాండింగ్‌ను ఉపసంహరించుకుంది. అయితే ఇందుకు కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె లండన్ ప్రయాణం వాయిదా పడటం ఇది మూడోసారి.

ఆచూకీలేని బెనిన్ బందీలు

పరారీలోనే సైనిక తిరుగుబాటు నేత

లాగోస్: పశ్చిమ ఆఫ్రికా దేశమైన బెనిన్‌లో ప్రభుత్వంపై తిరుగుబాటుకు యత్నించి పరారైన కమిటీ ఫర్ రీఫౌండేషన్ నేత, లెఫ్టినెంట్ కర్నల్ పాస్కల్ టిగ్రి ఆచూకీ తెలియరాలేదు. తిరుగుబాటుదారులు బంధించిన వారి క్షేమ సమాచారం కూడా తెలియలేదు. బందీల్లో సీనియర్ సైనికాధికారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం తుపాకుల గర్జనలతో మార్మోగిన బెనిన్ పరిపాలన నగరం కొటోనౌలో సోమవారం ప్రశాంతత నెలకొంది. వీధుల్లో సైనికుల పహారా కొనసాగుతోంది. కర్నల్ పాస్కల్ టిగ్రి నేతృత్వంలోని కొందరు తిరుగుబాటు సైనికులు బెనిన్ ప్రభుత్వం టీవీ ఛానల్ స్టేషన్‌పై ఆదివారం తెల్లవారుజామున దాడి చేసి, అధ్యక్షుడు ప్యాట్రిస్ టాలోన్‌ను తొలగించినట్లు ప్రకటించారు. అయితే, ఈ తిరుగుబాటును నైజీరియన్ బలగాల మద్దతుతో బెనిన్ సైన్యం అడ్డుకున్న విషయం తెలిసిందే.

నెయ్యి కల్తీ గురించి వైవీ సుబ్బారెడ్డికి అప్పుడే చెప్పా

- అప్పటి డిప్యూటీ ఈవోతో కలిసి వివరించా
- సిట్ విచారణలో అంగీకరించిన మాజీ జీఎం సుబ్రహ్మణ్యం



ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేర విభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అవుతోందన్న విషయాన్ని నాటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి చెప్పానని ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన కొనుగోళ్ల విభాగం మాజీ జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యం (ఏ29) సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. గత నెల 27న సుబ్రహ్మణ్యంను తిరుపతిలోని సిట్ కార్యాలయంలో విచారించినప్పుడు చెప్పిన అంశాలను రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించారు. ఆ వివరాలు సోమవారం వెలుగులోకి వచ్చాయి. '2022 మే 20న తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో సుబ్బారెడ్డిని కలవగా ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, భోలే బాబా ఓర్గానిక్ డెయిరీ ట్యాంకర్లు, టిన్నుల ద్వారా తితిదేకు పంపే నెయ్యిని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షించాలని ఆదేశించారు. జూన్‌లో నాలుగు నమూనాలు పంపగా నివేదికలు రావడంలో జాప్యం జరిగింది. దాంతో అక్కడి అధికారులతో మాట్లాడాలని డెయిరీ నిపుణుడైన డా.బత్తుల సురేంద్రనాథ్‌ను కోరాను. ఆయన వారిని సంప్రదించిన తర్వాత 2022 ఆగస్టు 3న తితిదే డిప్యూటీ ఈవో (వేర్ హౌసింగ్)కు నివేదిక వచ్చింది' అని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆ నివేదికపై సురేంద్రనాథ్ అభిప్రాయం కోరగా నాలుగు నెయ్యి నమూనాలూ కల్తీవేనని ఆయన తెలిపారు. బీటా సిటోస్టెరాల్ పాజిటివ్‌గా మైసూరు ల్యాబ్ తేల్చిందని.. అంటే వెజిటేబుల్ ఆయిల్స్ కలిపారని చెప్పారు. ఇదే విషయాన్ని డిప్యూటీ ఈవో, తాను వైవీ సుబ్బారెడ్డికి వివరించినట్లు సుబ్రహ్మణ్యం సిట్ అధికారుల ఎదుట అంగీకరించారు.

ఇప్పటికే వాడాం.. మీరు చెప్పొద్దు!

నెయ్యి కల్తీ అయినట్టు మీ నివేదికలో ప్రస్తావించవద్దని సుబ్రహ్మణ్యం 2022 ఆగస్టు 11 నుంచి 14 తేదీ మధ్య మూడునాలుగు సార్లు ఫోన్‌చేసి విజ్ఞప్తి చేశారని డెయిరీ నిపుణుడు సురేంద్రనాథ్ సిట్ బృందానికి వెల్లడించారు. మైసూరు ల్యాబ్ నుంచి నివేదిక రావడంలో ఆలస్యం కావడంతో అప్పటికే ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించామని.. కల్తీ గురించి బయటకు తెలిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని చెప్పారన్నారు. ఈ నేపథ్యంలోనే నెయ్యి కల్తీ అయిందా? లేదా? అని తాను స్పష్టంగా నివేదించనప్పటికీ బీటా సిటోస్టెరాల్ కలిసిందని మాత్రం అభిప్రాయపడ్డానని సిట్ అధికారులకు తెలిపారు. మరోవైపు సుబ్రహ్మణ్యం మాత్రం కల్తీ నెయ్యి వ్యవహారంలో అనుకూలంగా నివేదిక ఇవ్వాలని సురేంద్రనాథ్‌ను కోరలేదని వాంగ్మూలంలో పేర్కొన్నారు. కల్తీ గురించి వైవీ సుబ్బారెడ్డికి మాత్రమే చెప్పానని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని చెప్పారు. ఎందుకు వారికి చెప్పలేదని ప్రశ్నించగా మౌనం దాల్చారు. కల్తీ అంశంలో డెయిరీల నిర్వాహకులను హెచ్చరించారా? అని అడగ్గా లేదని బదులిచ్చారు. మైసూరు ల్యాబ్ నివేదికపై నిపుణుల అభిప్రాయం తీసుకోవాలని ఎవరైనా ఆదేశించారా? అని ప్రశ్నించగా.. తాను, డిప్యూటీ ఈవో కలిసి నిర్ణయం తీసుకున్నామని బదులిచ్చారు. గత నవంబరు 27న సురేంద్రనాథ్‌తోపాటు డెయిరీ నిపుణులైన డా.మల్లం మహేందర్, వి.వెంకట సుబ్రమణియన్, కె.జయరాజ్ రావును సిట్ అధికారులు విచారించారు. అదేరోజు సుబ్రహ్మణ్యంనూ ప్రశ్నించి, అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

కల్తీ నెయ్యి నిందితులకు నాలుగురోజుల కస్టడీ

కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో నిందితులైన అజయ్ కుమార్ సుగంధ్ (ఏ16), తితిదే కొనుగోళ్ల విభాగం మాజీ జీఎం సుబ్రహ్మణ్యం(ఏ29)ను నాలుగు రోజుల సిట్ కస్టడీకి అప్పగిస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. వీరిని ఈనెల 9 నుంచి 12 వరకు సిట్ విచారించనుంది.



ఉప్పాడ నుంచి కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్తున్న మత్స్యకారులు

ఇతర రాష్ట్రాల పర్యటనకు మత్స్యకారులు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాచరణలో తొలి అడుగు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: మత్స్యకారుల జీవనోపాధి పెంపొందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూపొందించిన భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా సోమవారం కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని 60 మంది మత్స్యకారులు రెండు బృందాలుగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు బయలుదేరి వెళ్లారు. మత్స్యశాఖ అధికారులు వీరికోసం రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఉప్పాడలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ రామస్వామి, మాజీ ఎమ్మెల్యే దొరబాబు ఆయా బస్సులకు జెండా ఊపారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రెండు బృందాల మత్స్యకారులు తాము పర్యటించే ప్రాంతాల్లో నూతన విధానాల అమలుపై అవగాహన పెంచుకొని తిరిగి స్వగ్రామాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ కృష్ణారావు, జనసేన నాయకులు ఓదూరి కిషోర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సరి'హద్దులు' దాటిన ప్రేమికుడు

యువతి కోసం వెళ్లి పాక్ ఆర్మీకి చిక్కిన విశాఖ యువకుడు

విశాఖపట్నం (జగదాంబ కూడలి), న్యూస్‌టుడే: ప్రేమించిన అమ్మాయి కోసం విశాఖకు చెందిన ఓ యువకుడు సరిహద్దు దాటి వెళ్లడంతో పాకిస్థాన్ ఆర్మీకి చిక్కిన ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విశాఖకు చెందిన ప్రశాంత్ అనే యువకుడు మొదట ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన స్విట్జర్లాండ్ అమ్మాయిని ప్రేమించాడు. అక్కడికి వెళ్లేందుకు వీసా లేకపోయినా ఆమెను ఎలాగైనా కలవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 2017లో రాజస్థాన్ దగ్గర సరిహద్దు దాటి పాక్ మీదుగా స్విట్జర్లాండ్ వెళ్లాలని ప్రయత్నించగా పాకిస్థాన్ పోలీసులు అరెస్టు చేసి జైలులో పెట్టారు. అక్కడ ఓ మహిళా ఖైదీతో మరోసారి ప్రేమలో పడ్డాడు. 2021లో అతడిని పాక్ అధికారులు కస్టడీ నుంచి వదిలేశారు. అయితే పాకిస్థాన్ అమ్మాయిని మళ్లీ చూసేందుకు రాజస్థాన్ వద్ద సరిహద్దు దాటి వెళ్లడంతో మరోసారి పాక్ ఆర్మీకి చిక్కాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో కుమారుణ్ని కలిసేందుకు బయలుదేరినట్లు సమాచారం. కొడుకు మానసిక స్థితి సరిగాలేదంటూ వారు వైద్యులిచ్చిన ధ్రువపత్రంతో వెళ్తున్నట్లు తెలిసింది. ఆ యువకుడి పూర్వాపరాలు వెల్లడి కావలసి ఉంది.

శ్రీవారి భక్తులకు 'కమాండ్' సేవలు

- ఏఐ వినియోగంతో సమర్థంగా దర్శనాలు
- త్వరలో అత్యాధునిక కెమెరాల ఏర్పాటు
- కొండపైకి ఎవరు ఎన్నిసార్లు వచ్చారో గుర్తించే సాంకేతికత సమకూర్చుకునే యోచన
- తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి





విలేకరులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి. చిత్రంలో సీవీఎస్వో మురళీకృష్ణ, సీపీఆర్‌వో రవి ★ డ్యాష్‌బోర్డుపై భక్తుల సమాచారం, కంపార్ట్‌మెంట్‌లో వేచి ఉన్న భక్తుల చిత్రం

ఈనాడు డిజిటల్, తిరుపతి, తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) సేవలు అందుబాటులో వచ్చాయని, వాటి ద్వారా శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తుల నుంచి వీవీఐపీల వరకు ప్రతి ఒక్కరికీ దర్శనాలు సమర్థంగా కల్పిస్తున్నామని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. సోమవారం సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన ఈ కేంద్రం సహకారంతో భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గిస్తూ ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. 'దీని ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1, 2లలో ఎంతమంది భక్తులు, ఎన్ని కంపార్ట్‌మెంట్లలో, ఎంత సమయం వేచి ఉన్నారో తెలుసుకోవచ్చు. ఎక్కువసేపు వేచి ఉన్న భక్తులను దర్శనానికి ముందు పంపుతాం. భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించిన సమయం, నిరీక్షణ వివరాలు, దర్శనానికి వెళ్లిన, పూర్తయిన సమయం వంటివి రియల్ టైమ్‌లో ఐసీసీసీ డ్యాష్‌బోర్డుపై గుర్తించి విశ్లేశిస్తాం. శ్రీవారి ఆలయ సేవలు, పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచడం, భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించడమే దీని ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశం. అలాగే ఎంత మంది భక్తులు, ఎన్నిమార్లు కంపార్ట్‌మెంట్లలో అన్నప్రసాదాలు అందించాం, ఇంకెంతమందికి ఇవ్వాలనే వివరాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని సకాలంలో అందించే ఏర్పాటు చేస్తున్నాం' అని అదనపు ఈవో వివరించారు.

- త్వరలో 250 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలు (ఎఫ్ఆర్ఎస్) కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా కొత్తగా భక్తులను గుర్తించడంతోపాటు అవసరమైన వారి కదలికలను ట్రాక్ చేయవచ్చని ఆయన వివరించారు.
- ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఇప్పటికే ఏఐ కేంద్రానికి డేటా అనుసంధానం చేశామని, తిరుమలకు వచ్చే వాహనాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. తిరుమలలో కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలకు చెక్ పెట్టేందుకు ఎన్నేళ్ల లోపు వాహనాలను అనుమతించాలో కేంద్ర నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించి అమలు చేస్తామన్నారు.
- ఓ భక్తుడు శ్రీవారి దర్శనానికి ఏడాదిలో ఎన్నిసార్లు వచ్చారనే సమాచారం సైతం తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తెస్తామని వివరించారు.
- నేరచరిత్ర కలిగిన వారికి సంబంధించిన డేటాను సేకరించి ఏఐతో అనుసంధానం చేసి వారు భక్తుల్లో కలిసిపోతే గుర్తించేలా వినియోగిస్తామని అదనపు ఈవో వివరించారు. సీఎం చంద్రబాబు చొరవ వల్లే ఇలాంటి ఆధునిక సాంకేతికత తితిదేకు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు.
- ఈ సందర్భంగా అమెరికా నుంచి వర్చువల్‌గా దాత జయప్రకాశ్ మాట్లాడారు. ఈ కేంద్రం నిర్వహణకు ఇప్పటికే రూ.16 కోట్ల వరకు ఖర్చుచేశామని, మరో రూ.14 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఏడుగురు దాతలతో కలిసి ఈ ప్రాజెక్టును సిద్ధం చేయడంతోపాటు ఏడాదిపాటు నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నామని తెలిపారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఉద్యోగులతో పవన్ 'మాటా-మంతి' రేపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ కానున్నారు. 'మాటా-మంతి' పేరుతో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో జిల్లాల నుంచి వచ్చే రెండు వేల మంది ఉద్యోగులతో బుధవారం ఆయన సమావేశం కానున్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. పంచాయతీరాజ్ శాఖలో గత 17 నెలల్లో అనేక సంస్కరణలు అమలు చేశారు. ఎంపీడీవోల మొదలు కార్యదర్శుల వరకు పెద్దఎత్తున పదోన్నతులు కల్పించారు. పాలనలో పారదర్శకత కోసం స్వర్ణ పంచాయతీ పోర్టల్ ప్రారంభించారు. పదోన్నతులతో ఉత్సాహంగా ఉన్న ఉద్యోగుల ద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన సేవలందించేలా వారిని ఉప ముఖ్యమంత్రి సమాయత్తం చేయనున్నారు.

రూ.2,123 కోట్ల సాస్కీ నిధులతో 13 వేల గ్రామీణ రోడ్ల అభివృద్ధి

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత అధ్వానంగా ఉన్న రహదారులను మంచి రోడ్లుగా మార్చనున్నారు. సాస్కీ పథకంలో భాగంగా రూ.2,123 కోట్లతో 4,007 కిలో మీటర్ల పొడవైన 12,999 రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా 'సాస్కీ' పథకంలో రాష్ట్రానికి నిధులు కేటాయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో గ్రామాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఉన్న రహదారులను ఇంజినీర్లు గుర్తించారు. మొత్తం నాలుగు కేటగిరీల్లో వీటిని ఎంపిక చేశారు. మరమ్మతులు చేయడం ద్వారా ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్న రహదారులకు అధిక ప్రాధాన్యమిచ్చారు. మొత్తం 175 నియోజకవర్గాల పరిధిలో 484 మండలాల్లోని రోడ్లను ఎంపిక చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపారు. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే అంచనాలు వేసి పనులకు టెండర్లు పిలవనున్నారు.

జాతీయ రహదారిలో ఇద్దరు కిడ్నాప్

రూ.3 కోట్ల నగదు చోరీపై కేసు

పెనుకొండ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఈ నెల 3వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు ఓ కారును ధ్వంసం చేసి, అందులోని ఇద్దరు వ్యక్తులను అపహరించిన ఘటనలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఘటన జరిగిన రోజునే సీఐ శేఖర్ ఫిర్యాదుతో అదే రోజు కియా పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పట్టణ శివారులో జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో కారులో వెళుతున్న సూరత్‌కు చెందిన ఫల్కేశ్, అనిరుధ్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. సూరత్ నుంచి బెంగళూరుకు ఇన్నోవా కారులో రూ.4.21 కోట్ల నగదుతో వెళుతుండగా, మార్గమధ్యలో గుర్తుతెలియని దుండగులు అటకాయించి, తమను మరో కారులో కిడ్నాప్ చేశారని, కారులోని దాదాపు రూ.3 కోట్ల నగదు దొంగిలించి తమను వదిలేశారని పోలీసుల ఎదుట వాపోయారు. అనంతరం కారులో సీటు కింద భాగంలో రహస్యంగా చేయించిన అరలో దాచిన రూ.1.21 కోట్లను, రెండు కార్లను పోలీసులు జప్తు చేసి కోర్టులో అప్పగించారు. సూరత్‌కు చెందిన ఫల్కేశ్, అనిరుధ్‌లు సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేసేవారని తెలిసింది. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవన్ వెల్లడించారు. ఐదు ప్రత్యేక బృందాలు బెంగళూరు తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాయి.

నకిలీ మద్యం కోసం తప్పుడు ఇన్వాయిస్‌లు

- తయారీ సామగ్రి రవాణాకు భారీగా వినియోగం
- ఫోన్ల నుంచి నిందితులు తొలగించిన డేటా.. రికవరీ

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులు నకిలీ ఇన్వాయిస్‌లు, డమ్మీ జీఎస్టీ నంబర్లు వాడినట్లు సిట్, ఎక్సైజ్ అధికారుల దర్యాప్తులో వెలుగు చూసింది. దాదాపు నాలుగేళ్ల పాటు ఇదే రీతిలో చౌక మద్యం, స్పిరిట్, లేబుళ్లు, క్యారమెల్ తదితరాలను హైదరాబాద్, బెంగళూరు నుంచి ఇబ్రహీంపట్నం, ములకలచెరువులోని ప్లాంట్లకు సరఫరా చేసినట్లు బయటపడింది. రవాణాలో ఎవరికీ అనుమానం రాకుండా నిందితులు ఈ జాగ్రత్తలు తీసుకున్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం గుట్టు రట్టయ్యాక నిందితులు అప్రమత్తమై.. తమ ఫోన్ల నుంచి కీలక ఆధారాలను తొలగించారు. వీటిని దర్యాప్తు అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో వెలికితీయగలిగారు. ఇవే ఈ కేసులో నిందితుల పాత్రను బలపర్చేందుకు ఉపయోగపడ్డాయి.

డమ్మీ జీఎస్టీ ఇన్వాయిస్‌లతో పార్సిల్ బుకింగ్

ఆర్థికంగా చితికిపోయిన అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1), మాజీ మంత్రి జోగి సోదరుల అండదండలతో 2021 నవంబరులో విజయవాడలో అక్రమ మద్యం వ్యాపారం ప్రారంభించాడు. వైకాపా హయాంలో తెలంగాణలో కంటే ఏపీలో మద్యం ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని అక్కడ చీప్ లిక్కర్ కొనేవాడు. దాన్ని 35 లీటర్ల క్యాన్లలో నింపి, నిజాంపేట నుంచి కేపీహెచ్‌బీ వరకు ఆటోల్లో రవి, శ్రీనివాసరావులు తరలించేవారు. అక్కడి నుంచి ఏపీఎస్ఆర్టీసీ, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ద్వారా ఇబ్రహీంపట్నం పంపించేవారు. పార్సిల్ బుకింగ్‌కు ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్‌లో నిర్వహణ బాధ్యతలు చూసే మురళీకృష్ణ పేరుతో డమ్మీ జీఎస్టీలు సృష్టించి ఫినాయిల్, స్విమ్మింగ్ పూల్ శుభ్రం చేసే లిక్విడ్ పేరుతో కన్‌సైన్‌మెంట్లను పంపించేవారు. క్యాన్లను ఇక్కడ అందుకున్న హాజి (ఏ5).. మద్యాన్ని లీటరు, 180 ఎంఎల్ సీసాల్లోకి నింపి విక్రయించేవారు.

- ఇబ్రహీంపట్నానికి చెందిన నాగబాబుకు ఫినాయిల్, మరుగుదొడ్లు శుభ్రం చేసే యాసిడ్ తదితర ఉత్పత్తులకు సంబంధించిన ఏజెన్సీ ఉంది. ఆ ఏజెన్సీ జీఎస్టీ లైసెన్స్‌ను జనార్దన్‌రావు తీసుకున్నాడు. బెంగళూరు నుంచి స్పిరిట్, క్యారమెల్, ఎసెన్స్‌ను సరఫరా చేసే బాలాజీకి పంపించాడు. అక్కడ నకిలీ మద్యం తయారీకి వాడే ముడిపదార్థాలను ములకలచెరువు, ఇబ్రహీంపట్నానికి నకిలీ ఇవ్వాయిస్ల ఆధారంగా రవాణా చేసేవారు. అద్దేపల్లి ఆధీనంలోని ప్లాంట్లకు 1.31 లక్షల బాటిళ్లను శ్రీనివాస పెట్ బాటిల్స్ యజమాని శ్రీనివాస్‌రెడ్డి (ఏ11) అందించాడు. దీనికి కూడా ఇతరుల జీఎస్టీ నంబర్‌ను వాడుకున్నారు.

చెరిపేసినా.. చెరిగిపోని ఆధారాలు

అరెస్టుకు ముందు నిందితులు తమ ఫోన్లలోని సమాచారాన్ని తొలగించగా, ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిపుణులు తిరిగి రాబట్టారు. బాదల్‌దాస్ (ఏ7)కు చెందిన ఫోన్‌లో నకిలీ మద్యం తయారు చేస్తుండగా చిత్రీకరించిన వీడియో దొరికింది. ఇందులో బాదల్‌దాస్‌తో పాటు మరికొందరు వ్యక్తులు స్పష్టంగా కన్పించారు. మరో నిందితుడు ప్రదీప్‌దాస్ (ఏ8) నుంచి సీజ్ చేసిన ఫోన్‌లో నిందితులు నకిలీ మద్యం సీసాల పెట్టెలను మోసుకెళ్తున్న ఫొటోలున్నాయి. సీసాలు సరఫరా చేసిన శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఫోన్, కంప్యూటర్‌లో అనేక ఆధారాలు దొరికాయి. జగన్మోహన్‌రావు(ఏ2)తో జరిపిన వాట్సప్ సంభాషణలు, కాల్ రికార్డులు, సొమ్ము చెల్లింపులు బయటకు వచ్చాయి. ఎన్.రవి (ఏ4), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) ఫోన్లలో తలారి రంగయ్య, చెక్కా సతీష్‌లకు వాట్సప్‌లో పంపించిన లేబుళ్ల డిజైన్లు, వాటి నకిలీలు, ఆన్‌లైన్ చెల్లింపులు వెలుగుచూశాయి.

సహచరులతో కలిసి లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్



రాంధేర్ మజ్జీ

చర్ల, న్యూస్‌టుడే: ఎంఎంసీ(మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) ఏరియాలో చురుగ్గా పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ మజ్జీ తన 11 మంది సహచరులు, ఆయుధాలతో సహా సోమవారం బాలాఘాట్ జిల్లా పరిధిలోని పోలీసుల వద్దకు లొంగిపోయేందుకు వచ్చారు. జిల్లాలోని ఖైరాగఢ్‌లోని కుంహి గ్రామంలోని బకర్‌కట్ట పోలీసుస్టేషన్‌కు వీరంతా ఓ వాహనంలో బయలుదేరి వచ్చారు. రాంధేర్‌తో పాటు కీలక నాయకులు డీవీసీఎం(డివిజనల్ కమిటీ సభ్యుడు) చందు ఊసెండీ, లలిత, జానకీ, ప్రేమ్, ఏరియా కమిటీ సభ్యులు రాంసింగ్ దాదా, సుఖేశ్ పొట్టం, పార్టీ సభ్యులు(పీఎం) లక్ష్మీ, షీలా, యోగితా, కవిత, సాగర్ లొంగిపోయిన వారిలో ఉన్నారు. రాంధేర్ టీం ఉత్తర బస్తర్ డివిజన్‌లో అత్యంత చురుగ్గా పని చేసిందని, వీరి లొంగుబాటుతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ జోన్‌లు మావోయిస్టురహితంగా మారతాయని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వీరిపై రూ.2.36 కోట్ల రివార్డు ఉంది. ఒకటి రెండు రోజుల్లో రాంధేర్ టీమ్ లొంగుబాటును అధికారికంగా చూపనున్నారు. జిల్లాలో ఆదివారం మావోయిస్టు కీలక సభ్యుడు సురేశ్ అలియాస్ కబీర్ సహా 10 మంది మావోయిస్టులు సైతం లొంగిపోయారు.

అత్యాచారం కేసు నిందితులను.. రోడ్డుపై నడిపించుకుంటూ న్యాయస్థానానికి



నిందితులను రోడ్డుపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకువెళుతున్న ఏలూరు టూటౌన్ పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇటీవల ఏలూరులో సంచలనం రేకెత్తించిన యువతిపై అత్యాచారం కేసుకు సంబంధించి ప్రధాన నిందితులైన సస్పెక్ట్ షీటర్లు పులిగడ్డ జగదీష్ బాబు, లావేటి భవానీ కుమార్, వీరికి సహకరించిన ఆకేటి ధనుష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరిని టూటౌన్ పోలీసుస్టేషన్ నుంచి కోర్టు వరకు జనాలు చూస్తుండగా రోడ్డుపై బహిరంగంగా నడిపించుకుంటూ తీసుకువెళ్లారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని నేరస్థుల్లో భయం పుట్టించేందుకే నిందితులను ఇలా బహిరంగంగా నడిపించుకుంటూ తీసుకువెళ్లామని తెలిపారు.

నెల్లూరులో బ్లేడ్లతో దాడి కేసు నిందితులను..



నెల్లూరులో నిందితులను రోడ్డుపై నడిపిస్తున్న పోలీసులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని బోసుబొమ్మ వద్ద శనివారం ప్రైవేటు బస్సు డ్రైవరు, కండక్టరుపై బ్లేడ్లతో హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను సంతపేట పోలీసులు సోమవారం రాత్రి నగరంలో రోడ్లపై నడిపించారు. ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య మాట్లాడుతూ దాడి ఘటనలో మదన్ అలియాస్ బాబీ, ఉప్పు శ్రీకాంత్, గండవరపు అజయ్, యాకసిరి నితిన్, నక్క తేజలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా మద్యం తాగి రోడ్డుపై అడ్డంగా బైకులు పార్కింగ్ చేసుకుని మాట్లాడుకుంటుండగా.. బస్సు డ్రైవరు హారన్ కొట్టి తొలగించాలని చెప్పినందుకు బ్లేడ్లతో దాడి చేశారని పేర్కొన్నారు.

రూ.కోట్ల స్వాహాకు స్కెచ్!

- వేతన సవరణ బకాయిల సొమ్ము కొట్టేసేందుకు యత్నాలు
- మానేసిన పొరుగుసేవల సిబ్బంది పేర్లతో జాబితాలు
- విద్యుత్తు సంస్థల్లో అడ్డగోలు వ్యవహారం

ఈనాడు, అమరావతి: విద్యుత్తు సంస్థల్లో పనిచేసే పొరుగు సేవల సిబ్బందికి చెల్లించాల్సిన వేతన సవరణ బకాయిల మొత్తాన్ని స్వాహా చేసేందుకు మ్యాన్‌పవర్ సప్లయ్ ఏజెన్సీలు/కాంట్రాక్టర్లు సిద్ధమయ్యాయి. సుమారు రూ.100 కోట్ల మేర సొమ్ము చేసుకునేందుకు పావులు కదుపుతున్నాయి. దీనికి కొందరు అధికారులు సైతం సహకరిస్తున్నట్లు సమాచారం. ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పొరుగు సేవల కింద సుమారు 20 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి చెల్లించే వేతనాలను విద్యుత్తు సంస్థలు సవరించాయి. దాని ప్రకారం 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు సవరించిన ప్రకారం వేతనాల వ్యత్యాసాన్ని చెల్లించాలని నిర్ణయించాయి. ఈ మొత్తాన్ని కాంట్రాక్టర్లు/ఏజెన్సీలకు అందించి.. వాటి ద్వారా సిబ్బందికి చెల్లించాలి. దీన్ని కొన్ని ఏజెన్సీలు/కాంట్రాక్టు సంస్థలు సొమ్ము చేసుకునేందుకు అవకాశంగా మలుచుకుంటున్నాయి.

మానేసిన వారి పేర్లతో..

వేతన బకాయిలు చెల్లించాల్సిన కాలంలో పనిచేసిన సిబ్బందిలో సుమారు 60 శాతం మంది ప్రస్తుతం విధుల్లో లేరు. వారి పేర్లనూ కాంట్రాక్టు సంస్థలు జాబితాల్లో చేర్చాయి. ఆయా జాబితాల ఆధారంగా బకాయిల మొత్తాన్ని ఏజెన్సీ/కాంట్రాక్టర్ల ఖాతాలకు విద్యుత్తు సంస్థలు జమ చేసేందుకు రంగం సిద్ధం చేశాయి. కాంట్రాక్టు సంస్థలు దాఖలు చేసిన జాబితా మేరకు సిబ్బంది విధుల్లో ఉన్నారా? లేదా? అనే వివరాలను అధికారులు పరిశీలించడం లేదు. కొన్నిచోట్ల కాంట్రాక్టు సంస్థలు మారిపోయాయి. గతంలో పనిచేసిన సిబ్బంది వివరాలు కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ల దగ్గర లేవు. కానీ, పూర్తి సిబ్బందికి బకాయిలు చెల్లించేందుకు వీలుగా జాబితాలను దాఖలు చేయడం గమనార్హం. వీటిని విద్యుత్తు సంస్థల అధికారులు పరిశీలించిన తర్వాతే ఆమోదించాలి. ఇవేమీ లేకుండా కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు అయినట్లు ఆరోపణలున్నాయి.

బిల్లులు చెల్లించాలంటూ ఒత్తిడి

బకాయిలు చెల్లించేందుకు అనుమతిస్తూ విద్యుత్తు సంస్థలు గత నెల 20న ఉత్తర్వులిచ్చాయి. అంతలోనే కాంట్రాక్టర్లు/ఏజెన్సీలు హడావుడిగా జాబితాలు సిద్ధం చేసి, బకాయిల కోసం పంపాయి. వాటి ప్రకారం నిధులు విడుదల చేయాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇప్పటికే ట్రాన్స్‌కోలో పనిచేసే పొరుగుసేవల సిబ్బందికి రూ.20 కోట్ల మేర బకాయిల కింద విడుదల చేయాలని ఏజెన్సీ నిర్వాహకుల నుంచి ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం. డిస్కంల పరిధిలోనూ ఒత్తిళ్లు వస్తున్నాయి. బకాయిలు చెల్లించాల్సిన కాలానికి సంబంధించి ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది పేర్లను తప్పించి, వారి బ్యాంకు ఖాతాల వివరాలనూ ఏజెన్సీలు చూపడం లేదు. దీంతో వారికైనా బకాయిలు అందుతాయా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాణాలు తీసిన దొంగ వ్యవహారం

- చోరీ కోసం భారీ వాహనాన్ని ఆపిన నిందితులు
- హఠాత్తుగా ఆగడంతో దానిని ఢీకొన్న కారు
- ప్రమాదంలో ఐదుగురు విద్యార్థుల దుర్మరణం
- చోరీ కుట్ర ప్రధాన నిందితుడు ఏఎస్సై కుమారుడు





ప్రధాన నిందితుడు వెంకటనాయుడు.. ఇతడే ఏఎస్సై కుమారుడు ★ భారీ వాహనంపై ట్రాక్టర్లు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా చిలకలూరిపేట బైపాస్‌పై ఈనెల 4న జరిగిన ఘోర ప్రమాదానికి కారకుడు ఒక ఏఎస్సై కుమారుడని పోలీసులు గుర్తించారు. ఆరుగురు విద్యార్థులు కారులో వెళ్తూ రోడ్డు మీద ఆగి ఉన్న భారీ ట్రాలీ వాహనాన్ని ఢీకొనడంతో వారిలో ఐదుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ట్రాక్టర్ ఇంజిన్లను ఎక్కించుకుని వెళ్తున్న ఆ ట్రాలీని కారుతో ఓవర్‌టేక్ చేసి, దానిని పక్కకు ఆపాలంటూ అందులోని ఓ వ్యక్తి చేతితో సైగ చేయడాన్ని గుర్తించారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన విద్యార్థుల కారు ఆ ట్రాలీని ఢీకొంది. దానిని హఠాత్తుగా పక్కకు ఆపడం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారణకు వచ్చిన పోలీసులు నిందితుల కారు నంబరు ఆధారంగా విచారణ చేపట్టారు. అది నరసరావుపేట ఏఎస్సై కుమారుడిదని గుర్తించి దర్యాప్తు జరపగా అతడి నేరాల వ్యవహారం బయటకొచ్చింది. నిందితులను అదుపులోకి తీసుకుని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ బి.కృష్ణారావు సోమవారం విచారించారు. అందులో కీలక విషయాలు రాబట్టినట్లు సమాచారం.

ట్రాక్టర్ల చోరీకి ప్లాన్?: విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రమాదం జరిగిన రోజు ఆరుగురు నిందితులు కారులో భారీ ట్రాలీ వాహనాన్ని వెంబడించారు. వారిలో ప్రధాన నిందితుడైన మలమంచి వెంకటనాయుడు (ఏఎస్సై శీను కుమారుడు)తోపాటు మహేశ్‌బాబు, గోపి, ఎస్‌కే బాషా, వెంకట్రావు పోలీసుల అదుపులో ఉండగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. రూ.లక్షల విలువైన ట్రాక్టర్లు ఆ ట్రాలీపై ఉండటంతో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాదిరిగా ఆ వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించారు. డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి, ట్రాక్టర్లను చోరీ చేసి అమ్ముకోవాలని పథకం రచించారు. ఈ విషయాన్ని నిందితుల్లో ఒకరు పోలీసుల వద్ద అంగీకరించినట్లు తెలిసింది. ఏఎస్సై కుమారుడు 2023లో తక్కువకే బంగారం ఇప్పిస్తామని ఒకరిని మోసగించి రూ.50 లక్షల నగదు, కారుతో ఉడాయించినట్లు సమాచారం. గుంటూరు సరిహద్దు నుంచి నిందితులు తనను ఫాలో అవుతున్నట్లు గుర్తించానని, వాహనాన్ని పక్కకు ఆపాలని సైగ చేయడం వల్లే ఆపానని, ప్రమాదం జరగడంతో వారు పారిపోయారని హరియాణాకు చెందిన ఆ ట్రాలీ వాహనం డ్రైవర్ పోలీసులకు చెప్పాడు. కాగా, నిందితుల్ని తప్పించేందుకు ఆదివారం రాత్రి వరకు ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం.

చాంపియన్

టెస్టు సిరీస్ వాళ్లది.. వన్డే సిరీస్ మనది.. మరి టీ20 పోరులో నెగ్గేదెవరు? ఈ సిరీస్‌ను గెలుచుకుని మొత్తంగా భారత పర్యటనలో పైచేయి సాధించిన సంతృప్తితో స్వదేశానికి వెళ్లాలని చూస్తోంది దక్షిణాఫ్రికా. వన్డే సిరీస్ గెలిచిన ఊపులో టీ20ల్లోనూ నెగ్గి.. టెస్టుల్లో ఎదురైన వైట్‌వాష్ పరాభవానికి గట్టి బదులివ్వాలన్న కృత నిశ్చయంతో భారత జట్టుంది. నిరుడు పొట్టి ప్రపంచకప్ గెలిచాక వరుసగా సిరీస్‌లు సాధిస్తున్న సూర్యకుమార్ సేన.. సఫారీలనూ మట్టికరిపించి, ఇంకో రెండు నెలల్లో సొంతగడ్డపై మొదలయ్యే ప్రపంచ కప్ దిశగా సన్నాహాలను వేగవంతం చేయాలని చూస్తోంది.


డికాక్, జార్జ్ లిండే


ప్రాక్టీస్‌లో భారత జట్టు

పైచేయి ఎవరిదో?

భారత్, దక్షిణాఫ్రికా టీ20 సిరీస్ నేటి నుంచే

రాత్రి 7 నుంచి


సూర్యకుమార్

కటక్

దక్షిణాఫ్రికాతో టెస్టుల్లో చేదు అనుభవాల తర్వాత వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా ప్రదర్శన గొప్ప ఊరటే! సిరీస్ విజయానికి తోడు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల మెరుపులూ అభిమానులకు అమితానందాన్నిచ్చాయి. ఇక ఆద్యంతం మెరుపులతో సాగే టీ20 సిరీస్ అంటే ఆసక్తి లేనిదెవరికి? గత ఏడాది దక్షిణాఫ్రికాను దాని సొంతగడ్డపై ఓడించి సిరీస్ సాధించిన సూర్యకుమార్ సేన.. సొంతగడ్డపైనా అదే ఫలితాన్ని పునరావృతం చేయాలనుకుంటోంది. గాయాల నుంచి కోలుకున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పునరాగమనం చేయబోతుండడం భారత్‌కు కలిసొచ్చేదే. టెస్టులు, వన్డేల్లో దక్షిణాఫ్రికా ప్రదర్శనను బట్టి చూస్తే.. టీ20ల్లో ఆ జట్టు అంత తేలిగ్గా లొంగకపోవచ్చు. కాబట్టి సిరీస్ హోరాహోరీగా సాగడం ఖాయం.

కళ్లన్నీ అతడి మీదే..: వన్డే సిరీస్ మొదలవుతుంటే అందరి కళ్లూ కోహ్లి, రోహిత్‌ల మీదే నిలిచాయి. వాళ్లిద్దరూ ఆ ఒక్క ఫార్మాట్లోనే ఆడుతున్నారు. టీ20 జట్టులో వీరిలా అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఆటగాడంటే అభిషేక్ శర్మనే. తొలి బంతి నుంచి విధ్వంసకంగా ఆడే అతను.. టీ20 జట్టులో భారత అభిమానుల ఫేవరెట్‌గా మారిపోయాడు. ఆసియా కప్‌లో, ఆపై ఆస్ట్రేలియా పర్యటనలో సత్తా చాటిన అభిషేక్.. తాజాగా దేశవాళీ టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ అదరగొట్టాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న అభిషేక్.. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లోనూ జట్టుకు మెరుపు ఆరంభాలందిస్తాడని జట్టు ఆశిస్తోంది. టీ20ల్లోకి పునరాగమనం చేశాక ఓ మోస్తరు ప్రదర్శనే చేసిన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఈ సిరీస్‌లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడతాడేమో చూడాలి. మెడ గాయంతో టెస్టు సిరీస్ నుంచి అర్ధంతరంగా తప్పుకొన్న అతను.. కోలుకుని ఈ సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. ఆసియా కప్‌లో గాయపడి రెండు నెలలకు పైగా ఆటకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా ఈ సిరీస్‌తో పునరాగమనం చేయనున్నాడు. ముస్తాక్ అలీలో అతనూ రాణించాడు. వీరికి తోడు కెప్టెన్ సూర్యకుమార్, వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్, ఆసియా కప్ ఫైనల్ హీరో తిలక్ వర్మ, ఆల్‌రౌండర్ శివమ్ దూబెలతో భారత బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. వన్డే సిరీస్‌లో ఆడని బుమ్రా.. టీ20ల్లో బరిలోకి దిగుతున్నాడు. అతడితో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కొత్త బంతిని పంచుకుంటాడు. మరో స్పెషలిస్టు పేసర్‌గా అర్ష్‌దీప్‌ను ఎంచుకుంటారా.. లేక పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబె సేవలను ఉపయోగించుకుంటారా అన్నది చూడాలి. స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి ముగ్గురినీ తుది జట్టులో చూడొచ్చు.

బలంగా దక్షిణాఫ్రికా: టెస్టుల్లో భారత్‌తో సున్నా చుట్టించడమే కాక.. వన్డేల్లో గట్టి పోటీ ఇచ్చింది దక్షిణాఫ్రికా. టీ20ల్లోనూ ఆ జట్టు మెరుగ్గా కనిపిస్తోంది. కాబట్టి సవాలు తప్పకపోవచ్చు. ఆ జట్టుకు టీ20ల్లో మార్‌క్రమ్ నాయకత్వం వహించనున్నాడు. అతడితో పాటు డికాక్ జోరుమీదున్నారు. వన్డే సిరీస్‌లో వీళ్లిద్దరూ సెంచరీలు చేశారు. డివాల్డ్ బ్రెవిస్, మార్కో యాన్సెన్, కార్బిన్ బోష్ ఎంత ప్రమాదకరమో భారత్‌కు ఇప్పటికే అనుభవమైంది. వీరికి టీ20 స్పెషలిస్టులు రీజా హెండ్రిక్స్, డేవిడ్ మిల్లర్ తోడవుతున్నారు. ట్రిస్టన్ స్టబ్స్ కూడా ప్రమాదకర బ్యాటరే. బ్యాటింగ్‌లో ఆ జట్టు భారత్‌కు దీటుగా ఉంది. బౌలింగ్‌లో మాత్రం సఫారీ జట్టు కొంచెం బలహీనంగా కనిపిస్తోంది. ప్రధాన పేసర్ రబాడ గాయంతో మొత్తంగా భారత పర్యటనకు దూరంగా కావడం ఆ జట్టుకు ప్రతికూలమైంది. యాన్సెన్, బోష్‌లకు తోడు నోకియా, ఎంగిడిల్లో ఒకరు పేస్ బాధ్యతలు పంచుకునే అవకాశముంది. వీరు భారత బ్యాటర్లకు కళ్లెం వేయడం కష్టమే. స్పిన్నర్లు జార్జ్ లిండే, కేశవ్ మహరాజ్ స్పిన్‌కు సహకరించే కటక్ పిచ్‌ను ఏమేర ఉపయోగించుకుంటారో చూడాలి.

పిచ్, వాతావరణం?

బారాబటి స్టేడియం పిచ్ సమతూకంతో ఉంటుంది. ఆరంభంలో పేసర్లకు, తర్వాత స్పిన్నర్లకు సహకారం అందుతుంది. ఇక్కడ పరుగులు బాగానే వస్తాయి. అయితే ప్రస్తుతం మంచు ప్రభావం వల్ల ఆట సాగేకొద్దీ బౌలర్లకు కష్టమవుతుంది. కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపే అవకాశముంది. మ్యాచ్‌కు వర్షం ముప్పేమీ లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), సంజు శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్/వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

దక్షిణాఫ్రికా: క్వింటన్ డికాక్, రీజా హెండ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), డివాల్డ్ బ్రెవిస్, ట్రిస్టన్ స్టబ్స్ డేవిడ్ మిల్లర్, జార్జ్ లిండే, మార్కో యాన్సెన్, కార్బిన్ బోష్, కేశవ్ మహరాజ్, నోకియా/ఎంగిడి

"2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే.. 2026 టోర్నీకి మా సన్నాహాలు మొదలయ్యాయి. ఎప్పటికప్పుడు ప్రయోగాలు చేస్తూ సాగుతున్నాం. చివరి అయిదారు సిరీస్‌ల్లో చాలా వరకు ఒకే రకమైన కూర్పును ప్రయత్నించాం. ఎక్కువ మార్పులుండవు. అదే తరహాలో ఆడతాం. శుభ్‌మన్‌కు టీ20ల్లో విరామం రావడానికి ముందు అతనే ఇన్నింగ్స్‌ను ఆరంభించేవాడు. ఓపెనింగ్ స్థానం తనకే సొంతం. అతను లేనపుడు సంజును ప్రయత్నించాం. ఇప్పుడతణ్ని 3-6 మధ్య ఎక్కడైనా ఆడిస్తాం. సంజుతో పాటు జితేశ్ మా ప్రణాళికల్లో ఉన్నాడు. ఇద్దరూ తుది జట్టులో ఉన్నా బాగుంటుంది. హార్దిక్ కొత్త బంతితో బౌలింగ్ చేయడం వల్ల మాకు ప్రత్యామ్నాయాలు పెరుగుతున్నాయి. కూర్పు పరంగా కలిసొస్తోంది. అది ఆసియా కప్‌లో చూశాం. తన అనుభవం మాకు ఎంతో ఉపకరిస్తుంది. హార్దిక్ జట్టుకు సమతూకం తీసుకొస్తాడు. ప్రస్తుతం అతను పూర్తి ఫిట్‌గా ఉన్నాడు"

– సూర్యకుమార్ యాదవ్

"ఇప్పుడు ఎంతో మెరుగైన స్థితిలో ఉన్నా. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వచ్చిన రోజుకు, అక్కడి నుంచి వెళ్లిన రోజుకు చాలా తేడా ఉంది. అక్కడ నా శిక్షణ, సాధన బాగా సాగింది"

– శుభ్‌మన్ గిల్, భారత వైస్‌కెప్టెన్

3 కటక్‌లో భారత్ ఆడిన టీ20లు. అందులో రెండు మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాతోనే జరిగాయి. ఆ రెండూ దక్షిణాఫ్రికానే నెగ్గింది. మరో మ్యాచ్‌లో భారత్.. శ్రీలంకను ఓడించింది.

31 దక్షిణాఫ్రికాతో భారత్ ఆడిన టీ20లు. 18 మ్యాచ్‌ల్లో నెగ్గి, 12 ఓడింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. సొంత గడ్డపై ఆ జట్టుతో 12 టీ20లు ఆడిన భారత్.. అయిదింట్లో నెగ్గి, ఆరు ఓడింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

అభిషేక్ వికెట్ కీలకం


మార్‌క్రమ్

భారత జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మ మ్యాచ్ విన్నర్ అని.. అతడి వికెట్ తీయడం కీలకమని దక్షిణాఫ్రికా టీ20 జట్టు కెప్టెన్ మార్‌క్రమ్ అన్నాడు. మంగళవారం భారత్‌తో తొలి టీ20 జరగనున్న నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "అభిషేక్‌తో కలిసి ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడాను. అతడు మ్యాచ్ విన్నర్. బ్యాట్‌తో అదరగొడతాడు. అందుకే అభిషేక్ వికెట్ తీయడం కీలకం. కొత్త బంతిని అందుకునే బౌలర్లకు ఇదో పెద్ద సవాల్" అని మార్‌క్రమ్ చెప్పాడు. దూకుడైన ఆటతో వినోదాన్ని అందించే యువ ఆటగాళ్లే ఇప్పుడు టీ20 ఫార్మాట్‌ను నడిపిస్తున్నారని మార్‌క్రమ్ తెలిపాడు. "భయం లేకుండా ఆడడం.. తొలి బంతి నుంచే బాదుడు షురూ చేయడం ప్రస్తుత టీ20 బ్యాటర్లలో చూస్తున్నాం. ఒక ఆటగాడు ఆరంభం నుంచి దూకుడుగా ఆడడం వల్ల ఆ జట్టు బలమైన స్థితిలో నిలుస్తుంది. ఇలాంటి ప్లేయర్లే ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌ను నడిపిస్తున్నారు" అని మార్‌క్రమ్ అన్నాడు.

క్యాండిడేట్స్ టోర్నీకి ప్రజ్ఞానంద


ప్రజ్ఞానంద

దిల్లీ: భారత చెస్ యువ కెరటం ప్రజ్ఞానంద 2026 క్యాండిడేట్ టోర్నీకి అర్హత సాధించాడు. ఫిడే సర్క్యూట్ టోర్నీలో విజేతగా నిలవడం ద్వారా అతడీ బెర్తు దక్కించుకున్నాడు. క్యాండిడేట్స్ టోర్నీలో ఓపెన్ విభాగంలో భారత్ నుంచి ప్రజ్ఞానంద మాత్రమే పోటీలో ఉన్నాడు. ఈ సీజన్లో సూపర్ ఫామ్‌లో ఉన్న ఈ చెన్నై కుర్రాడు.. టాటా స్టీల్ మాస్టర్స్, సూపర్‌బెట్ క్లాసిక్, ఉజ్ కప్, లండన్ క్లాసిక్ టోర్నీల్లో టైటిళ్లు సాధించాడు. సింక్యూఫీల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలిచాడు. ఎనిమిది మంది ఆటగాళ్లు పోటీపడే క్యాండిడేట్ టోర్నీకి ఇప్పటికే ఏడుగురు అర్హత సాధించారు. ప్రజ్ఞానందతో పాటు అనీష్ గిరి, ఫాబియనో కరువానా, మతియాస్ బ్లూబమ్, సిందరోవ్, వీయీ, ఆండ్రీ ఇస్పెంకో ఈ టోర్నీలో ఆడబోతున్నారు. ఆరు నెలల వ్యవధిలో (ఆగస్టు 1, 2025 నుంచి జనవరి 1, 2026 వరకు) ఉత్తమ ఫిడే రేటింగ్ సగటు ఉన్న ప్లేయర్ క్యాండిడేట్స్ టోర్నీలో మిగిలిన ఎనిమిదో బెర్తు చేజిక్కించుకుంటాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికరు నకముర ఈ స్థానం దక్కించుకునే అవకాశాలున్నాయి. మహిళల క్యాండిడేట్స్ టోర్నీకి దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి, వైశాలి ఇప్పటికే అర్హత సాధించారు.

మాకొద్దీ మీడియా హక్కులు!

ఐసీసీతో ఒప్పందం నుంచి జియో హాట్‌స్టార్ బయటికి

ముంబయి: ఇంకో రెండు నెలల్లో టీ20 ప్రపంచకప్ జరగబోతుండగా.. ఐసీసీకి పెద్ద షాక్ తగిలింది. ఐసీసీ టోర్నీలకు సంబంధించి భారత్‌లో ప్రసార హక్కుల ఒప్పందం నుంచి జియో హాట్‌స్టార్ వైదొలగాలని నిర్ణయించుకుంది. 2024-27 మధ్య ఐసీసీ టోర్నీలను భారత్‌లో ప్రసారం చేసే హక్కులకు గాను 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.27 వేల కోట్లు) చెల్లించేలా జియో హాట్ స్టార్ ఒప్పందం చేసుకుంది. అయితే జియో హాట్‌స్టార్‌కు భారీ నష్టాలు వస్తుండడం, ఐసీసీ టోర్నీల ప్రసారం ద్వారా ఆశించినంత ఆదాయం రాకపోవడం ఆ సంస్థ పునరాలోచనలో పడింది. తర్వాతి రెండేళ్లకు ఒప్పందం నుంచి వైదొలగాలనుకుంటున్నట్లు ఐసీసీకి స్పష్టం చేసినట్లు సమాచారం.

ఒప్పందం చేతులు మారితే.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే టీ20 ప్రపంచకప్ జియో హాట్‌స్టార్‌లో ప్రసారం కాబోదు. ఒప్పందం రద్దుపై జియో హాట్‌స్టార్ సమాచారం ఇవ్వడంతో 2026-29 కాలానికి భారత్‌లో ఐసీసీ టోర్నీల ప్రసార హక్కులను అమ్మేందుకు కొత్తగా బిడ్డింగ్ ప్రక్రియను ఐసీసీ ఇప్పటికే ఆరంభించిందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ప్రసార హక్కుల అమ్మకం ద్వారా 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21.6 వేల కోట్లు) ఆర్జించాలని ఐసీసీ లక్ష్యంగా పెట్టుకుంది.

సూపర్ లీగ్‌కు హైదరాబాద్

ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ

కోల్‌కతా

ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ సూపర్ లీగ్‌కు అర్హత సాధించింది. గ్రూప్-బిలో తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చండీగఢ్ చేతిలో ఓడినప్పటికీ.. మిగతా ఫలితాలు అనుకూలంగా రావడంతో ఈ గ్రూప్‌లో అగ్రస్థానం దక్కించుకుంది. హైదరాబాద్ (20)తో పాటు మధ్యప్రదేశ్ (16) ముందంజ వేశాయి. గ్రూప్-ఎ నుంచి ముంబయి, ఆంధ్ర ఇప్పటికే సూపర్ లీగ్ చేరాయి. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఝార్ఖండ్ కూడా ముందంజ వేశాయి. సూపర్ లీగ్‌లో ఎనిమిది జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఆడతాయి. గ్రూప్-ఎలో హైదరాబాద్, ముంబయి, హరియాణా, రాజస్థాన్, గ్రూప్-బిలో ఆంధ్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, ఝార్ఖండ్ ఉన్నాయి. డిసెంబర్ 12న ఆరంభమయ్యే సూపర్ లీగ్‌లో ప్రతి జట్టు తమ గ్రూప్‌లో మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్‌లో అగ్రస్థానం సాధించిన టీమ్‌లు ఫైనల్లో తలపడతాయి. సూపర్ లీగ్ తమ తొలి మ్యాచ్‌లో ముంబయిని హైదరాబాద్.. పంజాబ్‌ను ఆంధ్ర ఢీకొనబోతున్నాయి.


ప్రజయ్

హైదరాబాద్ ఓటమితో..: గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో చండీగఢ్ చేతిలో ఓడిపోయింది. మొదట హైదరాబాద్ 8 వికెట్లకు 146 పరుగులు సాధించింది. ప్రజ్ఞయ్ రెడ్డి (43), ఆమన్ రావు (33), తనయ్ (27) రాణించారు. జగ్‌జీత్ సింగ్ (3/36), సందీప్ శర్మ (2/33), చిరాగ్‌వీర్ (2/18) హైదరాబాద్‌ను కట్టడి చేశారు. అర్జున్ (63), శివమ్ (42) రాణించడంతో చండీగఢ్ 19.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మిలింద్ (2/27), రక్షణ్ రెడ్డి (2/36) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు.

ఆంధ్ర కూడా..: ఆంధ్రకు కూడా చివరి మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. ఎలైట్ గ్రూప్-ఎ చివరి మ్యాచ్‌లో 19 పరుగుల తేడాతో విదర్భ చేతిలో ఓడింది. మొదట విదర్భ 8 వికెట్లకు 154 పరుగులు సాధించింది. అమన్ (50), అక్షయ్ (41) రాణించారు. సత్యనారాయణ రాజు (4/26) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. ఛేదనలో ఆంధ్ర 9 వికెట్లకు 135 పరుగులే చేయగలిగింది. అవినాష్ (44) పోరాటం ఫలితాన్ని ఇవ్వలేదు. యశ్ ఠాకూర్ (4/22), హర్ష్ దూబె (2/29), ఉమేశ్ యాదవ్ (2/28) ఆంధ్ర బ్యాటర్లకు కళ్లెం వేశారు.


అమిత్

అమిత్ రికార్డు శతకం

ఈనాడు, హైదరాబాద్: అమిత్ పాసి (114; 55 బంతుల్లో 10×4, 9×6) రికార్డు సెంచరీతో అదరగొట్టడంతో సర్వీసెస్‌తో గ్రూప్-సి పోరులో బరోడా 13 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బరోడా ఇన్నింగ్స్‌లో ఆరంభం నుంచి సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడిన వికెట్ కీపర్ అమిత్.. 24 బంతుల్లో అర్ధసెంచరీ.. 44 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. అరంగేట్ర టీ20లో అత్యధిక స్కోరు సాధించిన బిలాల్ ఆసిఫ్ (పాకిస్థాన్, 2015)ను అమిత్ సమం చేశాడు. తొలి టీ20లో సెంచరీ చేసిన భారత మూడో బ్యాటర్ అతడు. శివమ్ బాంబ్రి (106; 2019లో), అక్షత్ రెడ్డి (105; 2010లో) అతడికన్నా ముందు ఈ ఘనత సాధించారు. అమిత్ మెరుపులతో బరోడా 5 వికెట్లకు 220 పరుగులు చేయగా.. ఛేదనలో సర్వీసెస్ 207/8కే పరిమితమైంది.

భారత షూటింగ్ బృందం ఉత్తమంగా..

దోహా: షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్ టోర్నీలో భారత్ తన ఉత్తమ ప్రదర్శన చేసింది. ఈ పోటీల్లో రెండు స్వర్ణాలు సహా ఆరు పతకాలు గెలుచుకుని రెండో స్థానంలో నిలిచింది. చైనా (9) అగ్రస్థానాన్ని సాధించింది. చివరి రోజు, సోమవారం పురుషుల ట్రాప్‌లో జొరావర్ సింగ్ ఏడో స్థానంలో నిలిచాడు. 30 షాట్ల ఫైనల్లో అతడు ఏడు పాయింట్లే స్కోరు చేయగలిగాడు. హింటన్ (29, అమెరికా), పియరీ (గాటిమలా, 28), వాల్టన్ (అమెరికా, 23) తొలి మూడు స్థానాలు దక్కించుకున్నారు. ఈ టోర్నీలో సిమ్రన్‌ప్రీత్ కౌర్ (25 మీటర్ల పిస్టల్), సురుచి పొగాట్ (10 మీటర్ల పిస్టల్) పసిడి ప్రదర్శన భారత్ తరపున హైలైట్.

వేల్స్‌పై భారత్ గెలుపు

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ ప్రపంచకప్‌లో ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించిన భారత్.. వర్గీకరణ మ్యాచ్‌లో విజయాన్ని అందుకుంది. సోమవారం 3-1తో వేల్స్‌ను ఓడించింది. 14వ నిమిషంలో హినా బానో చేసిన గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత సనెలిటా టొప్పో (24వ), ఇషిక (31వ) స్వల్ప వ్యవధిలో బంతిని నెట్‌లోకి పంపడంతో 3-0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. ఆట చివర్లో ఎలోయిజ్ (52వ) వేల్స్‌కు గోల్ అందించినా.. అప్పటికే భారత్ విజయాన్ని ఖాయం చేసుకుంది. మంగళవారం ఉరుగ్వేతో భారత్ తలపడనుంది.

ప్రపంచకప్‌లో పానీయ విరామం

జ్యూరిచ్: వచ్చే ఏడాది జరిగే ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ప్రతి మ్యాచ్‌కు అదనంగా రెండు విరామాలు రాబోతున్నాయి. అమెరికా, కెనడా, మెక్సికో ఆతిథ్యం ఇస్తున్న ఈ కప్‌లో ఎండ తీవ్రత కారణంగా ఆటగాళ్లు అలసిపోకుండా ఉండేందుకు ఫిఫా ఈ కొత్త సౌలభ్యం తీసుకొచ్చింది. ప్రతి మ్యాచ్‌లో తొలి 22 నిమిషాల తర్వాత 3 నిమిషాలు డ్రింక్స్ విరామం ఇస్తారు. మ్యాచ్ రెండో అర్ధంలోనూ 22 నిమిషాల తర్వాత మరోసారి ఈ బ్రేక్ ఉంటుంది. 22 నిమిషాల్లోపు ఎవరైనా ఆటగాడు గాయపడితే ముందుగానే రిఫరీ ఈ డ్రింక్స్ విరామం ప్రకటించే వెసులుబాటు ఉంది. గతేడాది అమెరికాలో జరిగిన క్లబ్ ప్రపంచకప్‌లో కొంతమంది ప్లేయర్లు వేడి, ఉక్కపోత కారణంగా తీవ్రంగా ఇబ్బంది పడిన నేపథ్యంలో ఫిఫా ఈ నిర్ణయం తీసుకుంది. ఫుట్‌బాల్ ప్రధాన టోర్నీల్లో వేడి వాతావరణం ఆటగాళ్లకు సవాల్‌గా మారుతోంది. మ్యాచ్‌ల్లో పానీయ విరామాలు తప్పక ఉండాలని లేదా జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని 2014 ప్రపంచకప్‌నకు ముందు బ్రెజిల్ కోర్టు ఫిఫాను ఆదేశించింది.

కావాలనే త్రో బౌలింగ్ చేశా


షకిబ్ అల్ హసన్

లండన్: కౌంటీ మ్యాచ్‌లో ఎక్కువ ఓవర్లు వేసి అలిసిపోవడంతో కావాలనే త్రో బౌలింగ్ చేసినట్లు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ ఒప్పుకున్నాడు. గతేడాది సర్రేకు ఆడుతూ సోమర్‌సెట్‌పై షకిబ్ త్రో బౌలింగ్ చేయడంతో ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అతడిని కౌంటీల్లో బౌలింగ్ చేయకుండా నిషేధం విధించింది. దీనిపై షకిబ్ మాట్లాడుతూ.. "సోమర్‌సెట్‌తో నాలుగు రోజుల మ్యాచ్‌లో దాదాపు 70 ఓవర్లు బౌలింగ్ చేశా. ఒక మ్యాచ్‌లో ఇన్ని ఓవర్లు ఎప్పుడూ వేయలేదు టెస్టుల్లోనూ అన్ని ఓవర్లు బౌల్ చేయలేదు. సోమర్‌సెట్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్‌పై రెండు టెస్టులు ఆడాను. దీంతో బాగా అలసటగా అనిపించింది. సోమర్‌సెట్‌తో మ్యాచ్‌లో కావాలనే కొన్ని ఓవర్లు త్రో చేశాను. అంపైర్ హెచ్చరిస్తాడని అనుకున్నా. కానీ నిషేధం పడింది. నిబంధనలు అలా ఉన్నాయి. బౌలింగ్ యాక్షన్‌ను సరిదిద్దుకునే పరీక్షలోనూ మొదట విఫలమయ్యా. రెండు వారాలు కష్టపడి మళ్లీ గాడిలో పడ్డా" అని షకిబ్ అన్నాడు.

ఇటు సానియా.. అటు ఎవరు?

హైదరాబాద్: మహిళల టెన్నిస్‌లో ఏ భారత క్రీడాకారిణికీ సాధ్యం కాని ఎన్నో ఘనతలు సాధించి దేశంలోని ఎంతోమంది అమ్మాయిలు ఈ ఆటలోకి రావడానికి స్ఫూర్తిగా నిలిచింది సానియా మీర్జా. కొన్నేళ్ల కిందటే ఆటకు గుడ్‌బై చెప్పిన ఆమె.. తాజాగా రాకెట్ పట్టి కోర్టులో సందడి చేసింది. ఒక ప్లేయర్‌తో టెన్నిస్ ఆడింది. అవతల ఉన్న ఆ ప్లేయర్ సానియాకు ఎంతో ప్రత్యేకమైన వ్యక్తి. అతనెవరో కాదు.. సానియా ముద్దుల తనయుడు ఇజాన్. తల్లి నుంచే టెన్నిస్‌లో ఓనమాలు నేర్చుకున్న ఇజాన్.. చిన్న వయసులోనే ఆటలో మంచి నైపుణ్యం సాధించాడని సానియా తల్లి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న వీడియో చూస్తే అర్థమవుతుంది. చాలా దూకుడుగా ఆడుతూ బంతిని వేగంగా అవతలి వైపునకు కొడుతూ తన ప్రతిభను చాటుకున్నాడు ఇజాన్. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతమవుతోంది.




ముత్యాల దండలా.. వైజయంతి మాల



ఈ చిత్రంలోని మాల.. తెల్లగా మెరిసిపోతూ ముత్యాల దండగా కనిపిస్తోంది కదూ! నిజానికి ఇవి ముత్యాలు కావు. అరుదుగా కనిపించే వైజయంతి మాల మొక్కల గింజలు. దీన్ని కొందరు విజయమాల (గార్లెండ్ ఆఫ్ విక్టరీ), ఆకాశమాల అని పిలుస్తుంటారు. ఉత్తరాది ప్రాంతవాసులు విష్ణుమూర్తిని ఈ దండలతో పూజిస్తుంటారు. వైజయంతి మాల మొక్క చిగుర్లలో వరికంకుల మాదిరిగా గింజలు కాస్తాయి. ముత్యాల్లా ఉన్న వీటిని గుజరాత్, ఇతర ప్రాంతాల్లో వైష్ణవాలయాల్లో విరివిగా వాడుతారు. ఇలాంటి మొక్కలు గాజువాకలోని 'నేచురల్ గార్డెనర్స్ గ్రూప్' మహిళా సభ్యుల ఇళ్లలో పెంచుతున్నారు. గ్రూప్ వ్యవస్థాపకురాలు మాసవరపు ఐశ్వర్య మూడేళ్ల కిందట కేరళ నర్సరీ నుంచి ఈ మొక్కలను తెచ్చి మిద్దె పంటలు పండించే సభ్యులకు అందించడంతో పలు ఇళ్లల్లో ఇవి కాస్తున్నాయి. మొక్క నుంచి గింజలను తీసి 108 గింజలతో మాలను కడుతున్నారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం(గాజువాక)

అవసరం ఏదైనా... హలో అంటే చాలు!



డయల్ 100

ఏ సమయంలోనైనా, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఉన్నా, పోలీసుల సాయం పొందేందుకు 100ను సంప్రదించవచ్చు. ఇది 24 గంటలూ పనిచేస్తుంది. మీరు మాట్లాడే ప్రతి మాట కంట్రోల్ రూమ్‌లో రికార్డవుతుంది. స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారమందించి మిమ్మల్ని వెంటనే ఆదుకుంటారు.

అగ్నిప్రమాదమా.. 101

రాష్ట్రంలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈ నంబర్‌కు కాల్ చేయండి. రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్ నుంచి సమీపంలోని అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందుతుంది. వెంటనే అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకుంటాయి.

అంబులెన్స్ సేవల కోసం.. 108

రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చినప్పుడు తక్షణ సాయం కోసం కాల్ చేస్తే దగ్గర్లోని అంబులెన్స్‌కు సమాచారం అందుతుంది. వాహనంతో సహా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తారు.

సైబర్ ఫిర్యాదుకు 1930

సైబర్ నేరాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక చాలా మంది సతమతమవుతుంటారు. అలాంటి వారు తాము మోసపోయామని గుర్తించిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. నేరం జరిగిన తొలి గంటలో అప్రమత్తమైతే ఎంతో ప్రయోజనకరం.

లంచం అడిగితే 1064

నిబంధనల ప్రకారం చేయాల్సిన పనుల కోసం ప్రభుత్వాధికారులు లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా 1064 లేదా 9440440057 నంబర్లకు కాల్ చేస్తే ఏసీబీ డైరెక్టర్ జనరల్ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేరుతుంది. దానిపై వెంటనే చర్యలు తీసుకుంటారు.

రైల్లో ప్రయాణిస్తున్నారా... గుర్తుపెట్టుకోండి 139

రైళ్లల్లో ప్రయాణం చేటప్పుడు సామగ్రితో పాటు 139 టోల్‌ఫ్రీ నంబర్‌ను తప్పనిసరిగా గుర్తుపెట్టుకోండి. మీ భద్రతకు సంబంధించి ఏదైనా సమస్య ఉన్నా, వైద్య సేవలు కావాలన్నా దీనికి కాల్ చేసి సాయం కోరవచ్చు. పీఎన్ఆర్ స్టేటస్, రైలు రాకపోకల సమయం, బెర్తుల లభ్యత, ఛార్జీలు, టికెట్ బుకింగ్, అవినీతిపై ఫిర్యాదుల కోసం కూడా సంప్రదించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సేవలు పొందవచ్చు.

జాతీయ రహదారులపై సాయంకోసం 1033

జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డు ప్రమాదానికి గురైనా, అత్యవసర సాయం కావాలన్నా ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదిస్తే వెంటనే వారు స్పందిస్తారు. ఫాస్టాట్యాగ్, ఇతరత్రా ఏ సమస్యలు ఎదురైనా దీనికి ఫిర్యాదు చేయవచ్చు.

విద్యుత్తు సమస్యల కోసం 1912

విద్యుత్తు అంతరాయ సమస్యలు, వోల్టేజీలో హెచ్చుతగ్గులు, వైర్లు కిందపడిపోవటం, సరఫరా నిలిచిపోవటం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినటం, స్తంభాలు, లైన్లు ఇలా ఎటువంటి సమస్యలున్నా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

బాలల సమస్యలపై ఫిర్యాదు... 1098

బాల్య వివాహాలు, బాలకార్మికులు, చిన్నారులపై వేధింపులు, హింస, బాలల అక్రమ రవాణా, పునరవాసం ఇలా వీరికి సంబంధించి ఎలాంటి సమస్యలు, ఫిర్యాదులున్నా ఈ నంబర్‌కు కాల్ చేసి సాయం పొందొచ్చు.

- **112** అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం మహిళలు ఈ నంబర్లకు కాల్ చేయొచ్చు.
- **1915** జాతీయ వినియోగదారుల సహాయక కేంద్రం టోల్‌ఫ్రీ నంబర్ ఇది. వినియోగదారులు ఫిర్యాదుల కోసం దీని ద్వారా సంప్రదించవచ్చు.

ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారా... 149 సేవ్ చేసుకోండి

ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఏవైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయడమే కాక బస్సు రిజర్వేషన్లు, విచారణ సహా సమగ్ర వివరాలు ఈ నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చు.

30 శాఖలు..751 సేవల కోసం మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్

95523 00009 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శాఖల సేవలు, ఫిర్యాదుల కోసం ఈ నంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు... మీకు ఏ శాఖకు సంబంధించి, ఏ సేవ కావాలో వెంటనే మెసేజ్ ద్వారా అడుగుతారు. ఆ వివరాలు అందించి సంబంధిత సేవలు పొందొచ్చు. దేవాలయాల్లో టికెట్లు, రూమ్‌లు బుకింగ్‌లు, ఆర్టీసీలో బస్ టికెట్లు బుకింగ్, రెవెన్యూకు సంబంధించిన వివిధ సర్టిఫికెట్లు సహా మొత్తం 30 శాఖల నుంచి 751 రకాల సేవల్ని మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా పొందొచ్చు.

- ఏపీ పోలీసు శాఖకు సంబంధించిన సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసుస్టేషన్ల ఎస్‌హెచ్‌వోల సెల్‌ఫోన్, స్టేషన్ల ల్యాండ్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి.

– ఈనాడు, అమరావతి


పట్టుదలే దారి చూపింది!



పుట్టుకతో అంధుడైన బాలుడి పట్టుదల.. వందల కి.మీ. స్కేటింగ్ చేసేలా ప్రోత్సహించింది. తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన హర్షవర్ధన్ మురారి(12)కి మొదటి నుంచీ కళ్లు కనిపించవు. తల్లిదండ్రులు మునిబాబు, రాజకుమారి.. తమ కుమారుడికి ఏదైనా ప్రత్యేకంగా నేర్పించాలని భావించి, స్కేటింగ్ అయితే బాగుంటుందని శిక్షణ ఇప్పించారు. 6 నెలలు కఠోరంగా సాధన చేసి పట్టు సాధించిన హర్ష.. అంధుల విభాగంలో వరల్డ్ రికార్డు కోసం ఒకే రోజు ఆగకుండా 220 కి.మీ స్కేటింగ్ చేయాలని నిర్ణయించుకుని రంగంలోకి దిగాడు. ఆంధ్ర- కర్ణాటక సరిహద్దులోని నంగలి నుంచి సోమవారం ఉదయం ఆరున్నరకు బయల్దేరి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకు (రాత్రి పొద్దుపోయే సమయానికి) స్కేటింగ్ చేసుకుంటూ వెళ్లాడు. బెంగళూరు-నాయుడుపేట నేషనల్ హైవేపై చిత్తూరు నగర శివారు ఇరువారం వద్ద ఉన్నప్పుడు 'ఈనాడు' అతడిని క్లిక్‌మనిపించింది.

– ఈనాడు, చిత్తూరు

ఇంట్లో కొలువై.. ఇలవేలుపు తానై!



ఓ మహిళ చెట్టు నీడలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నట్లు ఉన్న ఈ చిత్రంలో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా? ఆమె కూర్చున్నది ఏ తోటలోనో కాదండోయ్. మూడంతస్తుల పైన డాబా మీద. అక్కడ అంత చెట్టు ఎలా ఉందనే కదా మీ ప్రశ్న? ఒంగోలులోని జమ్మిచెట్టువీధికి చెందిన రామచంద్రరావుకు





తండ్రి నుంచి వారసత్వంగా స్థలం వచ్చింది. అక్కడ ఇల్లు నిర్మించాలని భావించగా అప్పటికే బాగా పెరిగిన వేపచెట్టు అక్కడ ఉంది. దానిని తొలగించడం ఇష్టం లేక అలాగే ఉంచి మూడంతస్తుల ఇల్లు కట్టుకున్నారు. ఇంట్లో నుంచి మేడ పైవరకు ఎదిగిన ఆ చెట్టు.. పైన గొడుగులా విచ్చుకుని నీడ కూడా ఇస్తోంది. దాదాపు వందేళ్ల వయసున్న ఈ చెట్టును దేవతగా తలచి ఆ కుటుంబం నిత్యం పూజలు చేస్తుండటం మరో విశేషం.

– ఈనాడు, ఒంగోలు

కోటి తలంబ్రాలకు వానరహారతి



అయోధ్య, భద్రాచలం, ఒంటిమిట్టలలో శ్రీరామనవమికి జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ఏటా గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం ద్వారా పంపిస్తారు. ఇందుకోసం ఏటా భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేయించిన విత్తనాలతో తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురంలో వరి పంట వేస్తారు. ఈ ఏడాది పంట కాలం పూర్తవ్వడంతో సోమవారం వరి పనలను కోసి కుప్పగా వేసి వానర హారతి కార్యక్రమం నిర్వహించారు. సీతారాములతో పాటు ఆంజనేయుడు, అంగదుడు, సుగ్రీవుడు, జాంబవంతుడి వేషధారణలో పూజలు నిర్వహించి భజనలు చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సంఘ అధ్యక్షుడు కల్యాణం అప్పారావు మాట్లాడుతూ.. కుప్పను నూర్పగా వచ్చిన వరి విత్తనాలను భక్తులకు అందిస్తామన్నారు. వారు భక్తిశ్రద్ధలతో గోటితో ఒలిచిన తరువాత శ్రీరాముల వారి కల్యాణానికి తలంబ్రాలుగా పంపుతామని వివరించారు.

– న్యూస్‌టుడే, గోకవరం

ఆంగ్లం స్థానంలో భారతీయ భాషా పదాల భర్తీ అవసరం

- భాషాభివృద్ధికి రామోజీ ఫౌండేషన్ కృషి ప్రశంసనీయం
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వెంకయ్యనాయుడికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, చిత్రంలో తోటకూర ప్రసాద్, ఆర్డీ విల్సన్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, రాజానగరం: భారతీయ భాషలకు ఏకరూప శాస్త్రీయ పదజాలం రూపొందించేందుకు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇవ్వాలని, పదసంపద సృష్టికి ఇదో మేలిమలుపు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. సామాజిక పరిణామంలో భాష కీలకమైన ఇరుసు వంటిదని అభివర్ణించారు. రాజమహేంద్రవరంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా సమితి, కేంద్ర విద్యాశాఖ సంయుక్తంగా 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో సోమవారం ఆయన ప్రసంగించారు. శాస్త్ర, సాంకేతిక కోర్సుల్లో ఆంగ్ల పదాల స్థానంలో భారతీయ భాషా పదాల రూపకల్పనపై సదస్సు నిర్వహించడాన్ని అభినందించారు. ప్రాథమిక విద్య, న్యాయస్థానాల్లో వాదనలు, తీర్పులు మాతృభాషలోనే ఉండాలని, ఉన్నత, సాంకేతిక విద్యలోనూ వినియోగం పెరగాలని సూచించారు. 'ఇటీవల దిల్లీలో రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ భేటీ సందర్భంగా.. వారిద్దరికీ ఇంగ్లిషు వచ్చినా స్వాభిమానంతో మాతృభాషలో మాట్లాడారు. అనువాదకులు తర్జుమా చేశారు. వీధి బడిలో చదువుకున్న నేను ఉపరాష్ట్రపతిగా, మాతృభాషలోనే చదువుకున్న జస్టిస్ ఎన్వీ రమణ సుప్రీంకోర్టు సీజేగా, ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతిగా, నరేంద్ర మోదీ ప్రధానిగా ఎదిగార'ని వెంకయ్యనాయుడు ఉదహరించారు. తాను న్యాయవాది కావాలని అనుకున్నప్పటికీ, ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి, జైలు పాలై చివరకు ప్రజాప్రతినిధిగా మారానని గుర్తుచేశారు. 'ఇటీవల రామోజీ ఫౌండేషన్ రూపొందించిన రెండు నిఘంటువులను ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి ఆవిష్కరించాను. ఒకటి తెలుగు పదాలకు తెలుగులోనే అర్థాలు తెలిపే పదకోశం కాగా, మరోటి ఆంగ్ల పదాలకు తెలుగు అర్థాలు తెలిపే డిక్షనరీ. ఓ ప్రైవేటు సంస్థ ఇలా భాషాభివృద్ధికి కృషి చేయడం ప్రశంసనీయం. సూర్యరాయాంధ్ర నిఘంటువు పునఃముద్రణకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవడం అభినందనీయం' అని కొనియాడారు. వర్సిటీ వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయ భాషా సమితి సమన్వయకర్త కె.గిరిధరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఎగ్జిబిషన్

ఈనాడు, హైదరాబాద్ : మూసీ సుందరీకరణతో మారే నగరం రూపురేఖలు... భారత్ ఫ్యూచర్‌సిటీలో రాబోతున్న ఆకర్షణలు.. కాలుష్యరహితంగా మార్చే నెట్ జీరో విధానాలు.. భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చెప్పే రోబో యంత్రాలు... పాఠశాల, కళాశాల విద్యార్థుల ఆవిష్కరణలు తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో దేశ, విదేశీ ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్ర విజన్‌ను ప్రతిబింబించేలా ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థలకు చెందిన 25 స్టాళ్లను 'ఎక్స్‌పో ఎరీనా'లో ప్రదర్శించారు. నగరంలో ఇప్పటివరకు జరిగిన ప్రదర్శనలు ఒక ఎత్తు.. ఇది ఒక ఎత్తు అనేలా ఏర్పాట్లు చేశారు. ప్రదర్శనలో తెలంగాణ పర్యాటక, పోలీసు, విద్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, హ్యాండ్లూమ్, ఓవర్సీస్, సంక్షేమ, మహిళా సాధికారికత, టాస్క్, హెచ్ఎండీఏ-మెట్రో స్టాళ్లతో పాటు ప్రైవేటు సంస్థలు స్కైరూట్, ధ్రువ స్పేస్, మెడ్‌టెక్, ఫార్మా, నరెడ్కో తెలంగాణ, క్రెడాయ్ హైదరాబాద్, ఎమ్మార్, తోషిబా సంస్థలు స్టాళ్లను ప్రదర్శించాయి. తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీని ఎలా అభివృద్ధి చేయాలనుకుంటుందో తెలిపేలా 'భారత్ ఫ్యూచర్ సిటీ' స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి త్రీడీ తెరలు మరింత ఆకట్టుకుంటున్నాయి. పర్యాటక శాఖ పెవిలియన్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీ అందాలను డిజిటల్ తెరపై ప్రదర్శించారు. దేశీయ, విదేశీ అతిథులను ఆకట్టుకుంది. రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి పెవిలియన్‌ను సందర్శించారు.

తెలంగాణలో పెట్టుబడుల ధమాకా

తొలిరోజే రూ.3,97,500 కోట్లు...

- 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో ప్రభుత్వంతో పలు కంపెనీల ఎంఓయూలు

ఈనాడు, హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో పెట్టుబడులు వెల్లువెత్తాయి. సదస్సు తొలిరోజైనసోమవారం ఒక్కరోజే రూ.3,97,500 కోట్ల పెట్టుబడులకు పలు కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

■ రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 'వంతార'... తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి వన్యప్రాణుల సంరక్షణ, నైట్ సఫారీ ఏర్పాటుకు ముందుకొచ్చింది. దేశంలో వన్యప్రాణుల పునరావాస వ్యవస్థ మెరుగుతో పాటు శాస్త్రీయ సంరక్షణ, పరిశోధన, ప్రజలకు అవగాహన, నైట్ సఫారీ అనుభవాలను పంచనుంది. దీనికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను వంతార బృందం వివరించింది. ■ భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయస్థాయి నాణ్యతతో కూడిన రేసింగ్, మోటోక్రాస్ సదుపాయాన్ని అభివృద్ధి చేసేందుకు 'సూపర్‌క్రాస్ ఇండియా సంస్థ' ముందుకొచ్చింది.

■ రాష్ట్రంలో రూ.10 వేల కోట్లతో సమీకృత టౌన్‌షిప్, ప్రపంచస్థాయి ఫిల్మ్ స్టూడియోను ఏర్పాటు చేసేందుకు సల్మాన్‌ఖాన్ వెంచర్స్ సంస్థ ప్రణాళిక ప్రకటించింది. ■ రాష్ట్రంలో హెల్త్‌కేర్ రంగాన్ని బలోపేతం చేయడం, వైద్యవిద్య విస్తరణ, డిజిటల్ హెల్త్‌లో, కమ్యూనిటీ ఆరోగ్యం కోసం అపోలో ఆసుపత్రుల సంస్థ తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ■ తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ తెలంగాణతో ఒప్పందం చేసుకుంది.

ఫ్యూచర్ సిటీలో పదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

ప్రకటించిన ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూప్ కార్ప్ డైరెక్టర్ ఎరిక్ స్వైడర్

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీలో రానున్న పదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్ప్ డైరెక్టర్ ఎరిక్ స్వైడర్ ప్రకటించారు. తన ఆధ్వర్యంలోని సంస్థలు ఈ మొత్తాన్ని 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుకు సమకూరుస్తాయని వెల్లడించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు భారీ ఉత్తేజాన్ని తెచ్చేలా.. గ్లోబల్ సమిట్ ప్రారంభ సమావేశంలో స్వైడర్ ఈ ప్రకటన చేశారు.

దిగ్గజాల నోట.. తెలంగాణ రైజింగ్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రైజింగ్‌ను.. విజన్‌ను కొనియాడారు. ఆత్మీయ ఆతిథ్యానికి ముగ్ధులయ్యారు. హెచ్ఐసీసీకి ఆవల రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట భారత్ ఫ్యూచర్ సిటీలో తొలిసారిగా మొత్తం 100 ఎకరాల విస్తీర్ణంలో భారీగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలోని ప్రధాన సమావేశ మందిరంలో సదస్సు ప్రారంభమైంది. తెలంగాణలోని చారిత్రక సంఘటనల్ని 85 మీటర్ల డిజిటల్ తెరపై కళ్లకు కట్టారు. సదస్సులోని కార్యక్రమాలను.. గవర్నర్, ముఖ్యమంత్రి సహా వీఐపీల రాకను భారీ డిజిటల్ తెరలపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. సదస్సు ప్రధాన వేదికకు కుడి వైపున తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సదస్సులో పలువురికి హేక్‌హ్యాండ్ ఇస్తూ రోబో సందడి చేసింది. మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు ప్రారంభమైన సదస్సు రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. తొలిరోజు ప్రధాన ప్రారంభ వేడుకతో పాటు.. వివిధ అంశాలపై చర్చాగోష్ఠులు జరిగాయి. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టనున్న భారీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ దేశవిదేశీ ప్రతినిధులను ఆకట్టుకుంది. సుమారు 3 వేల మంది ప్రతినిధులు హాజరైన తొలిరోజు సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సమిట్ కమిటీ ఛైర్మన్ జయేశ్ రంజన్, పారిశ్రామికవేత్తలు శోభన కామినేని, కరణ్ అదానీ, ఆర్.దినేశ్, ఎరిక్ స్వైడర్, కైలాష్ సత్యార్థి తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వ అంచనాలకు మించి తొలిరోజు సదస్సుకు అతిథులు హాజరైనా.. ఎక్కడా లోటుపాట్లు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా భోజనాలు, స్నాక్స్, మంచినీళ్లు, టీ, కాఫీ వంటివి సమయానుకూలంగా అందించడంలో నిర్వాహక కమిటీ సమర్థంగా వ్యవహరించింది. ట్రంప్ మీడియా డైరెక్టర్ ఎరిక్ స్వైడర్ ప్రసంగంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌ను ప్రశంసించారు. 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రకటించడంతో సదస్సు చప్పట్లతో హర్షం వెలిబుచ్చింది.



రోబోకు హాయ్ చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.., చిత్రంలో అక్కినేని నాగార్జున, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి తదితరులు


అభివృద్ధి.. అన్‌స్టాపబుల్..

గ్లోబల్ సమిట్ ప్రారంభ ప్లీనరీలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ 'అన్‌స్టాపబుల్' అని, 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాలు సాధించేందుకు ఈ సదస్సుతో అడుగులు పడ్డాయని ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో వ్యాపార వాణిజ్యవేత్తలు, కార్పొరేట్లు, విధానకర్తలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వం, నిపుణులు, భాగస్వాములుగా ఉంటారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో అందరి ఆలోచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లను ఆదర్శంగా తీసుకుని, ఆ దేశాలతో పోటీపడేందుకు తెలంగాణ సిద్ధమైందని.. 2047 తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో ఆయా దేశాల పెట్టుబడులు, సహకారం, సమన్వయం కోసం వారిని ఆహ్వానించామన్నారు. సీఎం సోమవారం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025 ప్రారంభ ప్లీనరీ సమావేశంలో మాట్లాడారు.

తెలంగాణ పురోగతికి 'గ్లోబల్ సమిట్' వేదిక కావాలి

సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



ఈనాడు, అమరావతి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ఆ రాష్ట్ర అభివృద్ధి, పురోగతి, ఆవిష్కరణలకు వేదిక కావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. సమిట్ సందర్భంగా ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించిన సీఎం



కారు నడుపుతున్న రేవంత్‌రెడ్డి

ఒలెక్ట్రా కంపెనీ రూపొందించిన కొత్త ఎలక్ట్రిక్ కారును సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ సందర్భంగా ఫ్యూచర్‌సిటీ ప్రాంగణంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ అనంతరం రేవంత్‌రెడ్డి స్టీరింగ్ అందుకుని కారును నడిపించారు. కారులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ కృష్ణారెడ్డి కూర్చున్నారు. – ఈనాడు, హైదరాబాద్

11 వరకు విజయవాడ-దిల్లీ ఇండిగో సర్వీసు రద్దు

విశాఖలో సోమవారం నడవని ఏడు విమానాలు

గన్నవరం గ్రామీణం, విశాఖపట్నం (ఎన్‌ఏడీకూడలి) న్యూస్‌టుడే: ఇండిగో విమాన సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దిల్లీకి రాకపోకలు సాగించే ఇండిగో విమానయాన సంస్థకు చెందిన సర్వీసును ఈ నెల 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. సోమవారం ఇక్కడి నుంచి పలు విమాన సర్వీసులు కాస్త ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. సోమవారం విశాఖపట్నం విమానాశ్రయంలో ఏడు విమాన సర్వీసుల రాకపోకలు పూర్తిగా రద్దయినట్లు స్థానిక విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు.

'ఆయుష్'కు రూ.112.08 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆయుష్ శాఖ పరిధిలోని ఆయుర్వేదం, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.112.08 కోట్లు మంజూరు చేసింది. 2025-26 బడ్జెట్‌లో రాష్ట్ర వార్షిక ప్రణాళికలో కేటాయించిన నిధుల వినియోగానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఆయుష్ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రులతోపాటు విశాఖలోని ఆయుష్ ఆసుపత్రి.. రాజమహేంద్రవరం, విజయవాడల్లోని ఆయుష్ వైద్య కళాశాలల అభివృద్ధికి రూ.57.55 కోట్లు మంజూరుచేసింది. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆసుపత్రులు, ప్రొద్దుటూరులో ప్రభుత్వ యునానీ వైద్యకళాశాల, కాకినాడలోని ఆయుర్వేదిక్ వైద్య కళాశాల, ధర్మవరంలో ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, విశాఖలో నేచురోపతి కళాశాలల అభివృద్ధికి రూ.54.53 కోట్లు మంజూరు చేసింది.



ఇతరులు మీకు అవకాశాలు ఇవ్వాలంటే..

నేను ఈ పని చేయగలను అనుకుంటున్నాను' అని చెప్పడం కాదు, 'ఎలాగైనా సరే ఈ పని పూర్తయ్యేలా చూస్తాను' అని ధైర్యంగా చెప్పగలిగేలా మీ ఆలోచనా విధానాన్ని మార్చుకోవడం అత్యంత కీలకం. అదే మీ జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఇతరులు మిమ్మల్ని విశ్వసించడానికి, మీకు అవకాశాలు ఇవ్వడానికి దోహదం చేస్తుంది.

– డొమినిక్ మార్టిన్, మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్

బొగ్గు రవాణాకు.. అదానీతో పాటు మరో ముగ్గురు

- మొదటిసారి నాలుగు సంస్థలకు రవాణా కాంట్రాక్టు
- టెండర్లలో ఎల్1 అదానీకి 40 శాతం.. మిగిలింది ముగ్గురికి

ఈనాడు, అమరావతి: ఏపీ జెన్‌కో 10 లక్షల టన్నుల బొగ్గు సరఫరా టెండరును మొదటిసారి నాలుగు సంస్థలకు కట్టబెట్టింది. జెన్‌కో పిలిచిన టెండరు దక్కించుకునేందుకు నాలుగు సంస్థలు పోటీ బిడ్‌లు వేశాయి. అదానీ సంస్థ టన్ను బొగ్గు రవాణాకు రూ.2,160 ధర కోట్ చేసి ఎల్1గా నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో శరత్ చటర్జీ, చెట్టినాడ్, కరమ్‌చంద్ థాపర్ (కేసీటీ) సంస్థలు ఉన్నాయి. ఒకే సంస్థకు మొత్తం బొగ్గు రవాణా అప్పగించే బదులు.. ప్రయోగాత్మకంగా నాలుగు సంస్థలకు అప్పగించాలని జెన్‌కో నిర్ణయించింది. ఈ ప్రతిపాదనపై గుత్తేదారు సంస్థలతో సంప్రదింపులు జరిపింది. ఎల్1 కోట్ చేసిన ధరకే మిగిలిన సంస్థలూ రవాణా చేసేందుకు అంగీకరించాయి.

రవాణాలో జాప్యం లేకుండా

మహానది, ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ నుంచి కేటాయించిన బొగ్గును రోడ్డు మార్గంలో పారదీప్ పోర్టుకు చేర్చి.. అక్కడి నుంచి నౌక ద్వారా కృష్ణపట్నం పోర్టుకు చేర్చాలి. కృష్ణపట్నం, ఆర్‌టీపీపీ థర్మల్ కేంద్రాలకు రైలు మార్గం లేదు. ఈ దృష్ట్యా సముద్ర మార్గంలోనే బొగ్గు తీసుకురావాలి. గతంలో ఒకే సంస్థకు అప్పగించడం వల్ల రవాణాలో జాప్యం జరుగుతోంది. ఏదైనా కారణాలతో గుత్తేదారు సంస్థ బొగ్గు సరఫరా చేయలేకపోతే థర్మల్ ప్లాంట్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. గుత్తేదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే.. తక్కువ సమయంలో ఎక్కువ బొగ్గు తెచ్చుకునే అవకాశం ఉంటుంది. అదానీ 4 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేస్తే.. రెండో స్థానంలో నిలిచిన శరత్ ఛటర్జీ 2.5 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన చెట్టినాడ్ 2 లక్షలు, కేసీటీ 1.5 లక్షల టన్నులు సరఫరా చేసేందుకు అంగీకరించాయి. ఈ మేరకు ఆయా సంస్థలతో జెన్‌కో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సంస్థలన్నీ గతంలోనూ జెన్‌కోకు బొగ్గు రవాణా చేశాయి.

వేసవికి ఇప్పటి నుంచే ప్రణాళిక


వేసవిలో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా జెన్‌కో థర్మల్ కేంద్రాల నుంచి రోజుకు కనీసం 100 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ఉండాలన్నది అధికారుల ప్రణాళిక. అందుకు అవసరమైన బొగ్గు నిల్వలు సమకూర్చుకోవడంపై దృష్టి సారించారు. వేసవిలో బొగ్గుకు డిమాండ్ ఉంటుంది. ఈ దృష్ట్యా ఇప్పుడే సాధ్యమైనంత మేరకు నిల్వలు పెంచుకోవడంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం జెన్‌కో థర్మల్ కేంద్రాల దగ్గర నాలుగైదు రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వాటిని కనీసం 10 రోజులకు పెంచుకోవాలన్నది అధికారుల ఆలోచన. ఇప్పటికే కృష్ణపట్నం థర్మల్ కేంద్రానికి 5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు అదానీ నుంచి కొనేందుకు జెన్‌కో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.



పవిత్ర

పెళ్లికి నిరాకరించారని మరదల్ని హతమార్చిన ఉన్మాది

సికింద్రాబాద్‌లో దారుణం.. మృతురాలి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా



ఉమాశంకర్

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: మరదలితో తన వివాహానికి మేనమామ కుటుంబం నిరాకరించిందనే కారణంతో సదరు మరదల్ని దారుణంగా పొడిచి చంపాడో ఉన్మాది... సికింద్రాబాద్‌లోని చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన కాంతారావు, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పదేళ్ల కిందట ఈ కుటుంబం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చింది. ప్రస్తుతం ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌లో నివాసముంటోంది. పెద్ద కుమార్తె పవిత్ర(19) ఇంటర్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటోంది. కాంతారావు సోదరి కుటుంబం కూడా నగరంలోని రహ్మత్‌నగర్‌లో నివాసముంటోంది. కాంతారావు అక్క కొడుకు ఉమాశంకర్(25) టైల్స్ ఫ్లోరింగ్ పనిచేస్తుంటాడు. కొంతకాలం కిందట మేనల్లుడికి తన కూతుర్నిచ్చి వివాహం చేయాలని కాంతారావు దంపతులు భావించి.. ఇరు కుటుంబాలు ఆ మేరకు మాట్లాడుకున్నాయి. అయితే ఉమాశంకర్ నిత్యం మద్యం తాగడంతో పాటు పనికి సరిగా వెళ్లకుండా జులాయిగా తిరుగుతున్నట్లు గుర్తించిన కాంతారావు కుటుంబం వివాహానికి నిరాకరిస్తున్నట్లు సోదరి కుటుంబానికి ఇటీవల స్పష్టం చేసింది. దీంతో ఉమాశంకర్ మేనమామకు పలుమార్లు ఫోన్ చేసి వాదనకు దిగేవాడు. ఇటీవల లక్ష్మీ తన కుమార్తెలతో కలిసి విజయవాడకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు మేనమామ ఇంటికి వచ్చిన ఉమాశంకర్ మేనత్త లక్ష్మీతో గొడవపడ్డాడు. తనకు చెప్పకుండా మరదల్ని వేరే ఊరికి తీసుకెళ్లారంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఆమె నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తుండగా ఉమాశంకర్ వెంట తెచ్చుకున్న కత్తితో పవిత్ర గొంతులో బలంగా పొడిచి పారిపోయాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న కూతురిని చూసి రక్షించాలంటూ తల్లి కేకలు వేశారు. చుట్టుపక్కలవారు పవిత్రను ఆసుపత్రి తరలించేందుకు ప్రయత్నించగా ఆలోపే ఆమె మృతి చెందింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన కత్తి, నిందితుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ శశాంక్‌రెడ్డి తెలిపారు.

కుక్కలు తరమడంతో.. గోడను ఢీకొని యువకుడి దుర్మరణం



ఫజిల్

రాయచోటి, న్యూస్‌టుడే: రహదారులపై శునకాల స్వైరవిహారం ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పట్టణంలోని లక్ష్మీపురానికి చెందిన ఫజిల్ (25) ద్విచక్ర వాహనంపై గాలివీడు రోడ్డులో వెళ్తున్నారు. పట్టణ పోలీసుస్టేషన్ సమీపానికి రాగానే రహదారిపై ఉన్న కుక్కలు ద్విచక్ర వాహనం వెంటపడ్డాయి. కుక్కలను గమనించిన ఫజిల్ వాటి బారి నుంచి తప్పించుకోవడానికి వాహనాన్ని వేగంగా నడుపుతూ అదుపుతప్పి కె.రామాపురం వెళ్లే మార్గంలో ఉన్న ఆలయం గోడను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఫజిల్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన పట్టణంలోని ట్రంక్ రోడ్డులో ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నారు. దుకాణంలోని సామగ్రిని మరో భవనంలోకి మార్చి ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాద ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.



ప్రమాద స్థలంలో ఫజిల్ మృతదేహం



షేక్ అబ్దుల్ జలీల్ సమస్యలను దరఖాస్తులో నింపుతున్న పారా లీగల్ వాలంటీర్ వెంకటలక్ష్మి ★ జలీల్‌ను కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్తున్న వెంకటలక్ష్మి

కలెక్టర్ చొరవ.. ప్రజాసేవలో కొత్త తోవ

జిల్లాల్లో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవారికి సులువుగా సేవలందించేలా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లు ఫలితాలిస్తున్నాయి. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి? దరఖాస్తు ఎలా నింపాలి? ఎక్కడివ్వాలో తెలియక ఇబ్బంది పడేవారికి సహాయంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ అధికారులు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారాలీగల్ వాలంటీర్లను ప్రత్యేకంగా నియమించారు. వయసు పైబడిన వృద్ధులు, ఒంటరిగా వచ్చే నిరక్షరాస్యులకు వీరు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ సోమవారం 80 ఏళ్ల వయస్సున్న షేక్ అబ్దుల్ జలీల్ నడవలేని స్థితిలో విజయవాడలోని కలెక్టరేట్‌కు వచ్చారు. వడ్రంగిగా జీవనం గడిపిన జలీల్‌కు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. అందరూ పెళ్లిళ్లు చేసుకుని వెళ్లిపోయారని, ఇటీవల భార్య చనిపోవడంతో ఒంటరినయ్యానని, బతుకుదెరువు కోసం పింఛను ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చారు. న్యాయసేవాధికార సంస్థ వాలంటీర్ ఆయనతో గంటన్నర పాటు మాట్లాడి వివరాలన్నీ దరఖాస్తులో నమోదు చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, కలెక్టర్ ఛాంబర్‌కు తీసుకెళ్లారు.

– ఈనాడు, అమరావతి

ఆమ్రపాలి కేటాయింపుపై క్యాట్ తీర్పు నిలిపివేత

మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ హైకోర్టు



ఈనాడు, హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణి కె.ఆమ్రపాలిని తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆమ్రపాలిని తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలంటూ క్యాట్ జూన్ 24న ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ... డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ పి.నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ... ఆమ్రపాలి పరస్పర బదిలీకి చేసుకున్న దరఖాస్తు నిబంధనలకు అనుగుణంగా లేదని తెలిపారు. కేంద్రం తెలంగాణ క్యాడర్‌కు కేటాయించిన సృజన, హరికిరణ్‌లతో పరస్పర బదిలీకి దరఖాస్తు చేసుకున్నారన్నారు. సృజన, ఆమ్రపాలిలకు వేర్వేరు వేతనాలున్నాయని, హరికిరణ్ రిజర్వు కేటగిరీకి చెందడంతో కేంద్రం అనుమతించలేదన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయించాలంటూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదన్నారు. ఆమ్రపాలి తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ క్యాట్‌లో దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని, ఎలాంటి స్టే మంజూరు చేయరాదని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ ప్రస్తుతం ఆమ్రపాలి ఏపీలో పనిచేస్తున్నారని, మధ్యంతర ఉత్తర్వులతో ఎలాంటి నష్టం ఉండదని పేర్కొంది. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఆమ్రపాలికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

మగబిడ్డ కనలేదని భార్యకు శిరోముండనం

విజయపుర, న్యూస్‌టుడే: తన భార్య శిరోజాల్లో దెయ్యం ఉండడంతో ఆమె వరుసగా ముగ్గురు ఆడబిడ్డలకు జన్మనిచ్చిందని ఓ మంత్రగాడు చెప్పిన మాటలు నమ్మిన భర్త ఆమెకు బలవంతంగా శిరోముండనం చేసిన అమానవీయ ఘటన కర్ణాటకలోని విజయపుర గ్రామీణ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హొన్నుటగి గ్రామానికి చెందిన జ్యోతి, డుండేశ్‌లకు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. మీకు మగబిడ్డ పుట్టకపోవడానికి నీ భార్య శిరోజాల్లో దెయ్యం ఉందని ఓ మంత్రగాడు చెప్పడంతో డుండేశ్ నమ్మాడు. ఇటీవల జ్యోతికి బలవంతంగా గుండు చేసి, కొన్ని శిరోజాలను పీకడంతో ఆమె గాయపడింది. బాధితురాలిని ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకుని, నిందితుడ్ని అరెస్టు చేశారు.

EENADU Vol: 52, Issue: 119 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఎగుమతి కార్లకేనా తుప్పు రక్షణ?

● దేశీయంగా అమ్మేవాటికీ ఉండాలి కదా
● యాంటీ కరోజన్ వారెంటీ ఊసే లేదు
● ప్రయాణికుల రక్షణపైనా ప్రభావం
● పరిస్థితి మారాలంటున్న పరిశ్రమ విశ్లేషకులు



దేశీయంగా అమ్మేకార్లకు, ఇతర దేశాలకు ఎగుమతి చేసే కార్లకు నాణ్యత మధ్య ఎటువంటి తేడా ఉండకూడదని కూడా పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం దేశీయ విపణి కోసం తయారవుతున్న కార్లతో పోలిస్తే, విదేశాలకు పంపేందుకు తయారు చేసే కార్లకు తుప్పు నుంచి రక్షణ ఉంటోంది. ఐరోపా, జపాన్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసే కార్ల తయారీకి 70%, అంతకన్నా అధిక గాల్వనైజ్డ్ స్టీల్ వినియోగిస్తున్నారు. 6-12 ఏళ్ల పాటు యాంటీ కరోజన్ వారెంటీనీ అందిస్తున్నారు. భారత్‌లో విక్రయమయ్యే చాలా కార్లకు అతి తక్కువ గాల్వనైజేషన్ ఉంటోంది. తుప్పు నుంచి వారెంటీ దాదాపు ఏ కారుకూ ఇవ్వడం లేదు.

ఏటా తుప్పు ఖర్చు రూ.9 లక్షల కోట్లు

దేశంలో తుప్పు ఫలితంగా ఏర్పడుతున్న నష్టం ఏటా జీడీపీలో 5% (100 బిలియన్ డాలర్లు-సుమారు రూ.9 లక్షల కోట్లు) పైగా ఉంటోంది. వాహనాలు, మౌలిక వసతులు, పరిశ్రమ వ్యవస్థలపై ఈ తుప్పు అమిత ప్రభావం చూపుతోంది. సాధారణ కారు యజమానులకు మరమ్మతు బిల్లులు పెరగడం, నిర్మాణాత్మక తరుగుదల, రీసేల్ విలువ తగ్గడం జరుగుతోంది.

0.1% కూడా ఉండదు

ఒక వాహనానికి గాల్వనైజేషన్ ఖర్చు ఆ వాహనం ధరలో 0.1% కూడా ఉండదు. అయితే తుప్పు పడితే, మరమ్మతులకు వేల రూపాయల్లో ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వాహనానికి గాల్వనైజేషన్ చేయకుండా, ఆ భారాన్ని వినియోగదారులపైకి కార్ల తయారీదార్లు నెడుతున్నారని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. వాహన నిర్మాణంలో 70% వరకు ఉక్కు ఉంటుంది. తుప్పు వల్ల ఛాసిస్ భాగాలు బలహీనపడతాయి. సస్పెన్షన్ జాయింట్లు దెబ్బతినడం వల్ల ప్రయాణికుల భద్రతపైనా ప్రభావం పడుతుంది.

ఎటువంటి నిబంధనల్లేవు

భారత్‌కు చెందిన సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ (సీఎంవీఆర్), బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ప్రయాణికుల వాహనాలకు తుప్పు నిరోధ స్థాయిలు లేదా గాల్వనైజేషన్ శాతాలకు ఎటువంటి ప్రమాణాలు లేవు. అందుకే వాహన కంపెనీలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

జింక్ కోటెడ్ ఉక్కు షీట్లను వాడొచ్చు

జింక్ కోటెడ్ ఉక్కు షీట్లను వినియోగించడం ద్వారా, కారు బాడీని రక్షించొచ్చని ఇండియా లెడ్ జింక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్(ఐఎల్‌జడ్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.పుగళేంతి అంటున్నారు. 'ఎగుమతి చేసే కార్లకు జింక్ కోటెడ్ స్టీలు బాడీలను వినియోగిస్తున్నారు. మరి అదే ప్రయోజనాన్ని దేశీయ కారు యజమానులకు ఎందుకు అందించరు? ప్రపంచవ్యాప్తంగా ఇదే తరహా ప్రయోజనాలు, సంతృప్త స్థాయి వినియోగదార్లు కోరుకుంటున్నార'ని ఆయన అన్నారు.

ఈనాడు బిజినెస్

నవిటాస్ సెమీకండక్టర్ కార్పొరేషన్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: నాస్‌డాక్‌లో నమోదైన కంపెనీ నవిటాస్ సెమీకండక్టర్ కార్పొరేషన్‌తో సైయెంట్ గ్రూపు సంస్థ సైయెంట్ సెమీకండక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యూహాత్మక దీర్ఘకాలిక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇన్ఫోసిస్ గాలియమ్ నైట్రైడ్ (జీఏఎన్), సిలికాన్ కార్బైడ్ (ఎస్ఐసీ), పవర్ సెమీకండక్టర్లలో నవిటాస్ సెమీకండక్టర్ అగ్రగామి సంస్థగా ఉంది. మనదేశంలో జీఏఎన్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడానికి, దీనికి అవసరమైన పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించడానికి ఈ సంస్థతో కలిసి పనిచేయనున్నట్లు సైయెంట్ సెమీకండక్టర్స్ వెల్లడించింది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి ఊతమిచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు వినియోగిస్తున్న జీఏఎన్ టెక్నాలజీ కంటే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశం ఆవిష్కరించగలదని నవిటాస్ సీఈఓ క్రిస్ అలెగ్జాండర్ అన్నారు. ఈ దిశగా సైయెంట్‌తో కలిసి పనిచేస్తామని తెలిపారు.

క్యాన్సర్ మందు అభివృద్ధికి
ఇమ్యుటెప్‌తో డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: క్యాన్సర్, ఆటో-ఇమ్యూన్ వ్యాధులతో బాధపడేవారికి వినియోగించే మందుల ఉత్పత్తి, విక్రయాల నిమిత్తం ఇమ్యుటెప్ లిమిటెడ్ అనే కంపెనీతో డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు కంపెనీలకు చెందిన సబ్సిడరీ సంస్థలైన ఇమ్యుటెప్ ఎస్ఏఎస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఎస్ఏ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. ఎఫ్టిలిగిమోడ్ ఆల్ఫా (ఎఫ్టి) అనే ఔషధాన్ని ఉత్తర అమెరికా, ఐరోపా, జపాన్, చైనా దేశాలను మినహాయించి మిగిలిన దేశాల్లో విక్రయించడానికి ఈ రెండు సంస్థలు కృషి చేస్తాయి. ఈ మందు ప్రస్తుతం ప్రయోగాల దశలో ఉంది. నాన్-స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్‌తో పాటు తల, మెడ, రొమ్ము క్యాన్సర్ వ్యాధులకు కూడా పనిచేసేలా ఈ మందును అభివృద్ధి చేయాలని భావిస్తున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా డాక్టర్ రెడ్డీస్ అడ్వాన్సుగా 20 మిలియన్ డాలర్లను ఇమ్యుటెప్‌నకు చెల్లిస్తుంది. ఈ మందును సత్వరం అభివృద్ధి చేసి, వివిధ దేశాల్లో అందించాలని చూస్తున్నామని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ (బ్రాండెడ్ మార్కెట్స్) ఎం.వి.రమణ తెలిపారు.

ఎన్‌పీసీఎల్ రైట్స్ ఇష్యూ

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌పీసీఎల్ లిమిటెడ్, రైట్స్ ఇష్యూ ప్రకటించింది. ఒక్కో షేరును రూ.76.70కు జారీ చేస్తారు. మొత్తం 3,25,01,851 ఈక్విటీ షేర్లు జారీ చేసి, రూ.249.29 కోట్లు సమీకరించాలని కంపెనీ ప్రతిపాదించింది. రైట్ ఇష్యూకు ఈ నెల 12ను రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆరోజుకు వాటాదార్లుగా ఉన్న వారికి, ప్రతి 31 షేర్లకు, 5 రైట్స్ షేర్లు జారీ చేస్తారు. ఇష్యూ ఈ నెల 22న ప్రారంభమై, 30న ముగుస్తుంది.

ఫిబ్రవరి వరకు సర్వీసులు తగ్గించండి

ఇండిగోకు డీజీసీఏ ఆదేశం?

ఫిబ్రవరి వరకు రోజువారీ విమాన సర్వీసులను తగ్గించుకోవాల్సిందిగా ఇండిగోను విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ కోరే అవకాశం ఉంది. పైలట్ల కొరత కారణంగా తలెత్తిన సమస్యలతో ఈ నెలలో ఇప్పటివరకు 5000కు పైగా ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. తన దగ్గర ఉన్న విమానాలతో, ఇంతకు ముందు రోజుకు 2200కు పైగా సర్వీసులను ఇండిగో నడిపింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో శీతాకాల షెడ్యూల్ కింద రోజుకు 300 విమాన సర్వీసులను తగ్గించుకోమని డీజీసీఏ ఆదేశించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి కల్లా 158 మంది పైలట్లను అదనంగా నియమించుకుంటామని ఇండిగో తెలిపినందున, అప్పటివరకు సర్వీసులు తగ్గించుకోవాలని డీజీసీఏ కోరనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. సర్వీసుల కుదింపుపై ఇండిగోకు ఆదేశాలిస్తామని పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ధ్రువీకరించారు. అయితే శీతాకాలంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కనుక, డిమాండ్‌కు అనుగుణంగా విమాన సర్వీసులు పెంచాల్సిందిగా ఎయిరిండియా, ఇతర విమానయాన సంస్థలను కేంద్రం ఆదేశించొచ్చని అంటున్నారు.

ఇండిగో రుణ రేటింగ్ ప్రతికూలం: మూడీస్

సిబ్బంది కొరతతో పాటు నిర్వహణ పరమైన అంశాల కారణంగా నవంబరులో 755 సర్వీసులు, ఈ నెలలో ఇప్పటికే 5,000 సర్వీసులను రద్దు చేసిన దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. ఆదాయపరంగా నష్టపోతోంది. రద్దయిన సర్వీసులకు సంబంధించి, ప్రయాణికులకు టికెట్ల రిఫండ్ కింద రూ.745 కోట్లు సంస్థ జారీ చేసింది. ఈనెలలో అసాధారణ స్థాయిలో రోజూ వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయి, కంపెనీ ఆదాయ నష్టం చవిచూస్తోంది. లక్షల మంది ప్రయాణికులను ఇబ్బంది పెట్టినందుకు, ప్రభుత్వ జరిమానాకు సంస్థ గురికావాల్సి వస్తుందని మూడీస్ రేటింగ్స్ పేర్కొంది. ఈ పరిస్థితులన్నీ సంస్థ రుణ రేటింగ్‌కు ప్రతికూలమని పేర్కొంది.

✦ 'విమానాల రద్దు, ప్రయాణికులకు టికెట్ ఛార్జీల రిఫండ్-ఇతర పరిహారాల కారణంగా ఇండిగో ఆదాయం గణనీయంగా తగ్గనుంది. ఇవన్నీ రుణ రేటింగ్‌పై ప్రభావం చూపుతాయి. డీజీసీఏ విధించబోయే పెనాల్టీలు ఇందుకు తోడవ్వనున్నాయ'ని మూడీస్ తెలిపింది.

8% నష్టపోయిన ఇండిగో షేరు

విమాన సర్వీసుల రద్దు, టికెట్ ఛార్జీలను భారీగా రిఫండ్ ఇస్తున్న నేపథ్యంలో ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు బీఎస్ఈలో సోమవారం 8.28% నష్టపోయి రూ.4,926.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో రూ.4,842.20 స్థాయిని తాకింది. గత 6 ట్రేడింగ్ రోజుల్లో ఈ షేరు 16.4% క్షీణించడంతో సంస్థ మార్కెట్ విలువ రూ.37,000 కోట్ల మేర తగ్గింది.



ప్రయాణికులకు
ఎయిరిండియా బాసట

ఇండిగో సర్వీసులు రోజూ వందల సంఖ్యలో రద్దవుతూ, వేలమంది ఇబ్బంది పడుతున్న తరుణంలో.. ప్రయాణికులకు బాసటగా నిలిచేందుకు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ముందుకొచ్చాయి. ఈనెల 5 నుంచి రోజూ అదనంగా 20 విమానాలు నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. అర్హత గల తమ ప్రయాణికులకు తేదీల మార్పిడి, క్యాన్సిలేషన్ ఫీజుపై వన్-టైం మినహాయింపు ఇస్తున్నట్లు వివరించాయి. డిసెంబరు 4 వరకు టికెట్లు బుక్ చేసుకుని, డిసెంబరు 15 వరకు ప్రయాణాలు ఉన్న వారికి, అదనపు చెల్లింపులు లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే వీలు కల్పిస్తున్నట్లు తెలిపాయి. పూర్తి రిఫండ్‌తో టికెట్ రద్దుకూ అవకాశం ఇచ్చాయి. ఒక వేళ మార్చిన ప్రయాణ తేదీలో ఎక్కువ ధర ఉంటే ఆ తేడాను ప్రయాణికులు చెల్లించాలి. ఇందు కోసం తమ 24/7 కాల్ సెంటర్లు లేదా ట్రావెల్ ఏజెంట్లను ప్రయాణికులు సంప్రదించొచ్చని తెలిపింది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కస్టమర్లు తమ చాట్‌బాట్ టియానూ వినియోగించుకునే అవకాశం ఉందని వివరించింది.

✦ విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, సాయుధ దళాల సిబ్బందికి ప్రస్తుతం అందిస్తున్న తగ్గింపు ధరలు కొనసాగుతాయని ఎయిరిండియా స్పష్టం చేసింది.

2027-28 కంటే ముందే కొత్త ఐటీఆర్ ఫారంల నోటిఫై

కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ ఛౌధ్రి



దిల్లీ: ఆదాయపు పన్ను చట్టం-2025కు సంబంధించి కొత్త ఐటీ రిటర్న్ (ఐటీఆర్) ఫారంలను 2027-28 ఆర్థిక సంవత్సరం కంటే ముందే నోటిఫై చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ ఛౌధ్రి తెలిపారు. ఐటీఆర్ ఫారంల సరళీకరణపై ఏర్పాటైన సీబీడీటీ (కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు) కమిటీ.. పన్నుల నిపుణులు, సంస్థాగత సంఘాలు, ఐటీ విభాగ అధికారులతో విస్తృత సంప్రదింపులు జరుపుతోందని లోక్‌సభలో మంత్రి తెలిపారు.

స్టార్‌లింక్ అపరిమిత డేటా

● ఇళ్లకు నెలవారీ ఫీజు రూ.8,600 ● పరికరాలకు రూ.34,000

అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, మనదేశంలో శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు ధరలను నిర్ణయించింది. ఈ సేవలు పొందేందుకు అవసరమైన పరికరాలను రూ.34,000 పెట్టి కొనుగోలు చేయాలి. వ్యక్తులకు (రెసిడెన్షియల్) నెలవారీ ఫీజుగా రూ.8,600 వసూలు చేయనుంది. ఈ ప్లాన్ కింద అపరిమిత డేటా లభిస్తుంది. 30 రోజుల ట్రయల్‌నూ అందించనుంది.

3 కంపెనీలకు అనుమతులు: శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను అందించడానికి ఇప్పటిదాకా మనదేశంలో 3 కంపెనీలకు టెలికాం విభాగం (డాట్) అనుమతులు ఇచ్చింది. స్టార్‌లింక్‌తో పాటు భారతీ గ్రూప్‌నకు చెందిన యూటెల్‌శాట్ వన్‌వెబ్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో శాటిలైట్ విభాగం ఇందులో ఉన్నాయి. వాణిజ్యపరంగా సేవలను అందించడానికి ఈ మూడింటికి స్పెక్ట్రమ్ కేటాయింపు జరగాల్సి ఉంది.

కోడి గుడ్లు

9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	650
విశాఖపట్నం	640
చిత్తూరు	663

లైవ్ మార్కెట్ డేటా వినియోగాన్ని నిషేధిస్తాం

సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే



ముంబయి: మదుపర్ల అవగాహన కోసం ప్రస్తుత లైవ్ మార్కెట్ డేటాను వినియోగించడాన్ని నిషేధించేలా, త్వరలో నిబంధనలు మారుస్తామని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం వెల్లడించారు. ఫిన్ ఇన్‌ఫ్లుయెన్సర్ అవధూత్ సాథేపై సెబీ రూ.546 కోట్ల జరిమానా విధించిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పాస్ట్ రిస్క్ అండ్ రిటర్న్ వెరిఫికేషన్ ఏజెన్సీ (పీఏఆర్ఆర్‌వీఏ) ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న తుహిన్ మాట్లాడుతూ.. 'ఫిన్‌ఇన్‌ఫ్లుయెన్సర్లు మదుపర్లను ఆకర్షించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల సెబీ నిర్వహించిన సర్వేలో 62% మంది మదుపర్లు, పెట్టుబడుల నిర్ణయం తీసుకోవడానికి ఫిన్‌ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఆధారపడుతున్నట్లు తెలిపారు. 'లైవ్ మార్కెట్ డేటాను వినియోగిస్తూ, భారీ లాభాలను పొందడం ఎలా?' అంటూ ఫిన్‌ఇన్‌ఫ్లుయెన్సర్లు మదుపర్లను తప్పుదోవ పట్టిస్తున్నారు. అందుకే ఆ డేటా వినియోగాన్ని నిషేధించేందుకు నిబంధనలు మారుస్తామ'ని వెల్లడించారు.

ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ ఐపీఓ వాయిదా

ఐపీఓకు ముందే దిగ్గజ అంతర్జాతీయ పెట్టుబడిదారు, ఇతర ప్రైవేటు ఈక్విటీ వాటాదార్ల నుంచి భారీగా నిధులు సమకూరడంతో, ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ తాత్కాలికంగా ఐపీఓ ముసాయిదా పత్రాలను వెనక్కి తీసుకుంది. పరిస్థితులను విశ్లేషించుకున్నాక, ఐపీఓకు అనుమతి కోరుతూ తాజా పత్రాలను సెబీకి సమర్పిస్తుందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. 2025 జులైలో ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ రూ.6,000 కోట్ల నిధుల సమీకరణ నిమిత్తం, కాన్ఫిడెన్షియల్ మార్గంలో సెబీకి ఐపీఓ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.

12 నుంచి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఐపీఓ

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ రూ.10,602 కోట్ల ఐపీఓ ఈ నెల 12-16 తేదీల్లో ఉండనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.2,061-2,165. రిటెయిల్ మదుపర్లు కనీసం 6 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. సంస్థ విలువను రూ.1.07 లక్షల కోట్లుగా పరిగణిస్తూ, ఐపీఓకు వస్తోంది. ఈ నెల 11న యాంకర్ మదుపర్లు బిడ్లు దాఖలు చేయనున్నారు. ఇష్యూ మొత్తం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో ఉంటుంది. యూకేకు చెందిన ప్రమోటర్ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ 4.89 కోట్ల ఈక్విటీ షేర్లను ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించనుంది. ప్రస్తుతం ఐసీఐసీఐ బ్యాంక్‌కు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో 51% వాటా ఉండగా, ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్‌కు 49% వాటా ఉంది. డిసెంబరు 19న ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానున్నాయి.

✦ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ మార్కెట్‌లోకి రావడానికి ముందే మరో 2% వాటా పెంచుకుంటామని ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా వెల్లడించారు. తమ గ్రూప్‌లోని 3 నమోదిత సంస్థల్లో బ్యాంక్ వాటా 51% పైనే ఉండేలా చూసుకుంటామని తెలిపారు.

16న 5 బిలియన్ డాలర్ల విలువైన డాలర్/రూపాయి స్వాప్ వేలం: ఆర్‌బీఐ

దేశ ఆర్థిక వ్యవస్థలోకి నగదును చొప్పించేందుకు ఈనెల 16న 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.45,000 కోట్ల) విలువ మేర డాలర్/రూపాయి బై-సెల్ స్వాప్ వేలాన్ని నిర్వహించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సోమవారం ప్రకటించింది. ఆర్‌బీఐ వైపు నుంచి విదేశీ మారకాన్ని మార్చుకోవడాన్ని స్వాప్‌గా పరిగణిస్తారు. రిజర్వ్ బ్యాంక్ కోసం ఒక బ్యాంక్ అమెరికా డాలర్లను విక్రయించడంతో పాటు, స్వాప్ కాలవ్యవధి ముగిసేసరికి అంతే మొత్తంలో డాలర్లను కొనుగోలు చేయడానికి అంగీకరిస్తుంది. తాజా స్వాప్ వేలం కాలవ్యవధిని 36 నెలలుగా నిర్ణయించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. కనీసం 10 మిలియన్ డాలర్లకు బిడ్ వేయాల్సి ఉంటుంది.

నవంబరులోనూ వాహన జోరు

కార్లకు కొనసాగిన గిరాకీ: ఫాడా

దేశీయంగా పండగల తర్వాత కూడా వాహన విక్రయాల జోరు కొనసాగింది. ప్రయాణికుల వాహనాల (కార్లు, వ్యాన్లు, ఎస్‌యూవీల)కు బలమైన గిరాకీ లభించడంతో 2024 నవంబరుతో పోలిస్తే గత నెలలో వాహన రిజిస్ట్రేషన్‌లు 2% పెరిగాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. మొత్తం వాహన రిటెయిల్ విక్రయాలు 2024 నవంబరులో 32,31,526 కాగా, గత నెలలో 33,00,832కు చేరాయి. గతేడాది దీపావళి, ధనత్రయోదశి అక్టోబరు చివర్లో రావడంతో, వాహన రిజిస్ట్రేషన్లు నవంబరులో జరిగాయని, ఫలితంగా అమ్మకాలు మెరుగ్గా నమోదైనట్లు ఫాడా తెలిపింది. 'జీఎస్‌టీ రేట్ల కోతలు, వాహన డీలర్ల రిటెయిల్ ఆఫర్లతో ఈసారి సెప్టెంబరు చివర నుంచి కొనుగోలుదార్ల గిరాకీ పెరిగింది. పండగల సీజన్ తర్వాత కూడా షోరూమ్‌లకు వినియోగదారులు వస్తున్నారు' అని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు.

నవంబరులో వాహన రిటెయిల్ విక్రయాలు

వాహన విభాగం	2025	2024	వృద్ధి(%)
ప్రయాణికులు	3,94,152	3,29,253	19.71
ద్విచక్ర	25,46,184	26,27,617	−3.10
వాణిజ్య	94,935	79,152	19.94
త్రిచక్ర	1,33,951	1,08,317	23.67
మొత్తం	33,00,832	32,31,526	2.14



✦ ఈ ఏడాది రబీ సీజన్ మెరుగ్గా ప్రారంభమైందని, గ్రామీణ సెంటిమెంట్, ఆర్థిక వ్యవస్థ సంకేతాలు సానుకూలంగా ఉండటంతో సమీపకాలంలోనూ వాహన విక్రయాల జోరు కొనసాగొచ్చని ఫాడా అంచనా వేసింది. ఈ ఏడాది చలి సాధారణం కంటే అధికంగా ఉండొచ్చన్న వాతావరణ శాఖ అంచనాలతో, వాహన అవసరాలు పెరగొచ్చని తెలిపింది. ఎఫ్ఎంసీజీ, ట్రాక్టర్లు, గ్రామీణ ద్విచక్ర వాహన మార్కెట్లకు ఇది అనుకూలమని పేర్కొంది.

రూ.4 లక్షల కోట్ల అంతరిక్ష వ్యాపారం

● రాబోయే 8-10 ఏళ్లలో సాకారం
● ప్రైవేట్ పెట్టుబడులే కీలకం



భారత అంతరిక్ష రంగ వ్యాపారం రాబోయే 8-10 ఏళ్లలో సుమారు రూ.4 లక్షల కోట్ల (45 బిలియన్ డాలర్ల)కు చేరొచ్చని అంచనా. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ సంకల్పించిన సంగతి విదితమే. ఇందులో భాగంగానే అంతరిక్ష రంగ వ్యాపార లక్ష్యాల సాధనను భారత్ వేగవంతం చేసిందని, భారత అంతరిక్ష కార్యకలాపాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. '2035 కల్లా భారతీయ అంతరిక్ష స్టేషన్ పేరుతో మనకు ఒక అంతరిక్ష కేంద్రం (స్పేస్ స్టేషన్) ఏర్పాటవుతుంది. 2040 కల్లా చంద్రుడిపైనా భారత వ్యోమగామి కాలు మోపుతారని భావిస్తున్నామ'ని మంత్రి తెలిపారు. అంతరిక్ష కార్యకలాపాల పరంగా చైనా సహా ఇతర దేశాలతో భారత్‌కు ఉన్న అంతరాన్ని తగ్గించే ప్రయత్నాలను మోదీ ప్రభుత్వం ముమ్మరం చేసిందన్నారు. చైనాకు ఇప్పటికే సొంత స్పేస్ స్టేషన్ ఉండగా. 2030 కల్లా తన వ్యోమగాములను చంద్రుడి పైకి పంపాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ అవతరించేందుకు, ప్రైవేట్ పెట్టుబడుల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.

అంకురాల అండ..: 'దేశీయ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగానికి అనుమతులు ఇవ్వడానికి ముందు ఈ రంగ పరిమాణం స్వల్పంగా ఉండేది. ఇప్పుడు ఇది 8 బి.డాలర్ల (రూ.72,000 కోట్ల)కు పెరిగింద'ని సింగ్ తెలిపారు. రాబోయే 8-10 ఏళ్లలో దేశీయ అంతరిక్ష విపణి 40-45 బి.డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. ఇందులో అధిక వాటా దేశీయ అంతరిక్ష రంగ అంకుర సంస్థల నుంచే ఉంటుందని.. ప్రస్తుతం వీటి సంఖ్య 400కి చేరిందని అన్నారు. ఉపగ్రహాల తయారీ, లాంచింగ్ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా అనలిటిక్స్ కార్యకలాపాలను ఈ అంకురాలు నిర్వహిస్తున్నాయి. దశాబ్ద కాలంలో అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష విపణిలో 8-10% మార్కెట్ వాటా సాధించాలని భారత్ భావిస్తోంది. ప్రస్తుతం ఇది 2 శాతంగా ఉంది.

ఆరో ఏడాదీ రిలయన్స్‌దే అగ్రస్థానం

విజికీ న్యూస్‌మేకర్స్-2025 జాబితా



2025 సంవత్సరంలో భారత ప్రసార మాధ్యమాల్లో అత్యంత ఎక్కువగా చోటుదక్కించుకున్న నమోదిత కంపెనీగా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) నిలిచింది. విజికీ న్యూస్‌మేకర్స్ జాబితా ప్రకారం.. రెండో స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మూడో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నాయి. ఈ జాబితా ప్రారంభించిన 2019 నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆర్ఐఎల్ న్యూస్ స్కోర్ ఏటా స్థిరంగా పెరుగుతూ వస్తోంది. 2021లో 84.9 నుంచి 2022లో 92.56, 2023లో 96.46, 2024లో 97.43, 2025లో 97.83గా కంపెనీ స్కోర్ ఉంది. ఆయా సంస్థలు ప్రచురించిన వార్తల ఆధారంగా, న్యూస్ స్కోర్‌ను విజికీ నిర్ణయిస్తోంది. 4,00,000కు పైగా ప్రచురణల్లో బ్రాండ్ ప్రాతినిధ్యాన్ని మదింపు చేసేందుకు కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా, మీడియా అనలిటిక్స్‌ను సంస్థ వినియోగిస్తోంది. 0 నుంచి 100 వరకు స్కోర్‌ను ఆయా సంస్థలకు ఇస్తోంది.

✦ ఈ ఏడాదికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్కోర్ 92.81గా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్కోర్ 88.41గా ఉన్నాయి. అగ్రగామి-10 సంస్థల్లో భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, ఐటీసీ చోటు దక్కించుకున్నాయి.

✦ కొత్త తరం కంపెనీలు జొమాటో, స్విగ్గీ, వన్ 91 కమ్యూనికేషన్స్ (పేటీఎం) వరుసగా 11, 12, 13వ స్థానాల్లో ఉన్నాయి.


శాటిలైట్ స్పెక్ట్రమ్ ఫీజు పెంపునకు ట్రాయ్ ససేమిరా

దిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్ (శాట్‌కామ్) కంపెనీలకు విధించే వార్షిక స్పెక్ట్రమ్ ఫీజును 5 శాతానికి పెంచాలన్న టెలికాం విభాగం(డాట్) అభిప్రాయాన్ని నియంత్రణాధికార సంస్థ ట్రాయ్ తోసిపుచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో కనెక్షన్‌కు రూ.500 ఫీజు వసూలుకు మాత్రం అనుమతినిచ్చింది. శాట్‌కామ్ స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతి; స్టార్‌లింక్, యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో ఎస్ఈఎస్‌లకు విధించే ఛార్జీలపై ట్రాయ్ చేసిన సిఫారసుల్లో కొన్ని మార్పులు చేయాలని డాట్ కోరింది. వార్షిక స్పెక్ట్రమ్ ఛార్జీని 4% బదులు 5% చేయాలనీ డాట్ విజ్ఞప్తి చేసింది. దేశ సరిహద్దుల్లో సంక్లిష్ట ప్రాంతాలు, మారుమూల, కొండ ప్రాంతాల నుంచి 5% వినియోగదార్లు నమోదైతే 1% రాయితీ ఇవ్వొచ్చనీ సూచించింది. కంపెనీలు నిర్దేశిత లక్ష్యాన్ని చేరిన పక్షంలో ఒక్కో వినియోగదారు నుంచి రూ.500 ఛార్జీకి అనుమతినివ్వాలని తెలిపింది. డాట్ ప్రతిపాదనల్లో 5% స్పెక్ట్రమ్ ఫీజును ట్రాయ్ తోసిపుచ్చింది. పట్టణ ప్రాంతాల్లోని గిరాకీ దృష్ట్యా రూ.500 వసూలుకు మాత్రం అనుమతినిచ్చింది.

రూ.7 లక్షల కోట్లు ఆవిరి

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.655.59 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.2,542.49 కోట్లు

సెన్సెక్స్ ▼ 610 — 85103
నిఫ్టీ ▼ 226 — 25961



సూచీల రెండు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. విదేశీ మదుపర్ల విక్రయాలూ ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 10 పైసలు నష్టపోయి 90.05 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.61% తగ్గి 63.37 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై, జపాన్ సూచీలు లాభపడగా, హాంగ్‌సెంగ్ సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.12 లక్షల కోట్లు తగ్గి, రూ.464.19 లక్షల కోట్ల (5.15 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 85,624.84 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,712.37) ప్రతికూలంగా ప్రారంభమైంది. తదుపరి 85,722.97 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 84,875.59 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 609.68 పాయింట్ల నష్టంతో 85,102.69 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 225.90 పాయింట్లు కోల్పోయి 25,960.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,178.70-25,892.25 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 26 నష్టపోయాయి. బీఈఎల్ 4.97%, ఎటర్నల్ 2.45%, ట్రెంట్ 2.35%, టాటా స్టీల్ 2.18%, బజాజ్ ఫైనాన్స్ 2.12%, అదానీ పోర్ట్స్ 1.94%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.77%, పవర్‌గ్రిడ్ 1.69%, ఎస్‌బీఐ 1.58%, టీఎంపీవీ 1.53%, ఏషియన్ పెయింట్స్ 1.39%, టైటన్ 1.29%, ఎన్‌టీపీసీ 1.22%, కోటక్ బ్యాంక్ 1.07%, హెచ్‌యూఎల్ 1.05%, ఎల్ అండ్ టీ 1.05%, భారతీ ఎయిర్‌టెల్ 1.03% తగ్గాయి. టెక్ మహీంద్రా 1.40%, హెచ్‌సీఎల్ టెక్ 0.31% చొప్పున పెరిగాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే సేవలు, స్థిరాస్తి, భారీ యంత్ర పరికరాలు, టెలికాం, పారిశ్రామిక, యుటిలిటీస్, లోహ, విద్యుత్ రంగాలు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 843 షేర్లు సానుకూలంగా, 3,460 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 182 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

ఈనాడు సినిమా



కృతిశెట్టి

అన్యాయంగా నాపై నిందలు

చిన్న వయసులోనే ఎన్నో నిందలు అనుభవించాల్సి వచ్చిందని... తాను నటించిన సినిమాలు విజయవంతం కాకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో అన్యాయంగా తనని లక్ష్యం చేసుకుని విమర్శించడం ఎంతో బాధించిందని కన్నీటి పర్యంతమైంది కృతి శెట్టి. 'ఉప్పెన' సినిమాతో పరిచయమైన కథానాయిక ఆమె. తొలి చిత్రమే మంచి విజయం సాధించడంతో వరుస అవకాశాల్ని సొంతం చేసుకొంది. అయితే చెప్పుకోదగ్గ విజయాల్ని మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. ఈ నెల 12న కార్తితో కలిసి 'అన్నగారు వస్తారు' చిత్రంతో సందడి చేయనుంది. ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన ప్రయాణం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది కృతిశెట్టి. "నటన అపారమైన భావోద్వేగ శక్తిని డిమాండ్ చేస్తుంది. అలాంటి సమయాల్లో ఎలాంటి కారణం లేకుండా ద్వేషాన్ని స్వీకరించాల్సి రావడం భరించలేని విషయం. మన నియంత్రణకు మించిన విషయాలపై కూడా విమర్శల్ని ఎదుర్కోవాలంటే బాధ కలుగుతుంది"ని తనపై వచ్చిన ట్రోల్స్‌పై అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆరంభంలో ఒక దశలో నటన ప్రయాణం ఆపేద్దామని కూడా అనుకున్నానని చెప్పుకొచ్చింది కృతి. "తొలి రోజుల్లో నాకూ, నా తల్లిదండ్రులకీ సినిమా గురించి పెద్దగా అవగాహన లేదు. నటిగా ఒక సినిమా విషయంలో నాకంటూ కొన్ని అంచనాలు ఉంటాయి. దాంతో తీవ్రంగా ఒత్తిడికి గురయ్యేదాన్ని. దాంతో జుట్టు కూడా రాలిపోయేది. చర్మ సంబంధిత సమస్యలూ చుట్టు ముట్టాయి. కష్టంగా ఉంటే సినిమాల్లో చేయొద్దని అమ్మానాన్నలూ చెప్పారు. నేనూ ఆ దిశగా ఆలోచించా. కానీ 'ఉప్పెన'తో దక్షిణ ప్రేక్షకుల ఆదరణ నాకు ఉత్సాహాన్నిచ్చింది"ని చెప్పుకొచ్చింది కృతిశెట్టి. తన సినీ ప్రయాణంలో ఇంకా ఉత్తమ దశ రాలేదన్న ఆమె, భిన్న భాషల్లో కెరీర్ మలుచుకోవడంపై దృష్టిపెట్టింది.

దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఎన్టీఆర్



ఎన్టీఆర్

తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు వ్యవహరిస్తున్నారంటూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. వారిపై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ పిటిషన్‌ను విచారించింది ధర్మాసనం. 2021 ఐటీ చట్టం ప్రకారం మూడు రోజుల్లోగా విచారణ జరిపి సోషల్ మీడియా, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ కేసును ఈ నెల 22కు వాయిదా వేసింది. గతంలో ఇలాంటి అంశాలనే లేవనెత్తుతూ పలువురు సినీ ప్రముఖులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

ఓటీటీలో ఈ వారం

కొత్తవారం ప్రారంభమైంది.. ఓటీటీలో కూడా కొత్త కథల పండగ మొదలైంది. ఎప్పటిలాగే ఈ వారం కూడా వైవిధ్యమైన కథలు ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబయ్యాయి. ఈ వారాంతం అదిరిపోయే సినిమాలు, సీటు అంచున కూర్చోబెట్టే సిరీస్‌లతో వినోదాలు పంచడానికి ఓటీటీలు రెడీగా ఉన్నాయి.


రియల్ కశ్మీర్ ఫుట్‌బాల్ క్లబ్ (సిరీస్)	మంగళవారం	సోనీలివ్
పెర్సీ జాక్సన్ అండ్ ది ఒలింపియన్స్ 2 (సిరీస్)	బుధవారం	జియోహాట్‌స్టార్
మెర్సీ (సినిమా)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
మ్యాన్ వర్సెస్ బేబీ(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
త్రీ రోజెస్ సీజన్ 2(సిరీస్)	శుక్రవారం	ఆహా
సింగిల్ పాపా (సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ది గ్రేట్ షంషుద్దీన్ ఫ్యామిలీ(సినిమా)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
వేక్ అప్ డెడ్ మ్యాన్(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
సిటీ ఆఫ్ షాడోస్(సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్

మట్టిని కాదు.. పర్వతాన్ని నేను



"ఊదేయడానికి నేను మట్టిని కాదు.. పర్వతాన్ని" అంటూ ఇటీవలే 'కాంత' చిత్రంతో తెరపై సందడి చేశారు హీరో దుల్కర్ సల్మాన్. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. రానా, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని తదితరులు కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో అలరించిన ఈ సినిమా ఇప్పుడు శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో రావడానికి సిద్ధమైంది. 1950లో మద్రాస్ నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో దుల్కర్... నట చక్రవర్తి మహదేవన్ పాత్రలో ఒదిగిపోయి.. స్వర్ణయుగం నాటి హీరోగా కనిపించిన తీరు సినీప్రియుల్ని మెప్పించింది.

సూపర్‌మ్యాన్ వచ్చేస్తున్నాడు



సూపర్ హీరో సినిమా వస్తుందంటేనే సంబరపడిపోయే సినీప్రేమికుల్ని ఓటీటీలో అలరించడానికి సిద్ధమయ్యాడు 'సూపర్‌మ్యాన్'. ప్రముఖ నిర్మాణ సంస్థ డీసీ యూనివర్స్‌లో రూపొందిన చిత్రమిది. జేమ్స్ గన్ తెరకెక్కించిన ఈ సినిమాలో డేవిడ్ కొరెన్స్‌వెట్ ప్రధాన పాత్ర పోషించారు. "నువ్వు చేసే పనులే నువ్వేంటో ఈ ప్రపంచానికి చూపిస్తాయి" అంటూ ఇటీవలే విడుదలైన ఈ సినిమా గురువారం నుంచి జియోహాట్‌స్టార్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. మరి ఇంకెందుకు ఆలస్యం.. సూపర్‌మ్యాన్ సాహసాలపై మీరూ ఓ లుక్కేయ్యండి.

చిత్రీకరణలో గాయం.. శస్త్రచికిత్స



రాజశేఖర్

ప్రముఖ నటుడు రాజశేఖర్ గత నెలలో ఓ కొత్త సినిమా చిత్రీకరణలో గాయపడ్డారు. కాలికి తీవ్ర గాయం కారణంగా చీలమండకు పగుళ్లు ఏర్పడటంతో వైద్యులు అత్యవసర శస్త్రచికిత్సకు సిఫారసు చేశారని, ఇటీవలే మూడు గంటల పాటు శస్త్రచికిత్స జరిగిందని, నాలుగు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు చిత్రవర్గాలు తెలిపాయి. శర్వానంద్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'బైకర్'లో రాజశేఖర్ ఓ కీలకమైన పాత్రని పోషిస్తున్న సంగతి తెలిసిందే. బైక్ రేసింగ్ నేపథ్యంలో సాగే కథ ఇది. వీటితోపాటు, మరో రెండు చిత్రాల్లో ఆయన నటిస్తున్నారు. జనవరిలోనే ఆయన ఆయా సినిమాల చిత్రీకరణలో తిరిగి పాల్గొననున్నారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

ఊహించడానికే భయం వేసే చీకటి ప్రపంచం



'ఈషా'

'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాల తర్వాత నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి నుంచి వస్తున్న కొత్త చిత్రం 'ఈషా'. త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని శ్రీనివాస్ మన్నె తెరకెక్కించారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. "మీకు తెలియని.. మీరు ఊహించడానికే భయం వేసే చీకటి ప్రపంచం ఇంకొకటి ఉంది" అంటూ పృథ్వీ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇది అతీంద్రియ శక్తులకు, సైన్స్‌కు మధ్య జరిగే సంఘర్షణతో ముడిపడిన కథ. ఆత్మలు లేవని బలంగా నమ్మే నలుగురు స్నేహితులు ఓ చీకటి ప్రపంచంలోకి అడుగు పెడితే.. అక్కడ వాళ్లకి ఎదురైన భయానక అనుభవాలేంటి? అన్నది ట్రైలర్‌లో ఉత్కంఠభరితంగా చూపించారు. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. సినిమాలో ఉలిక్కిపాటుకు గురి చేసే హారర్ అంశాలు, ట్విస్ట్‌లు చాలానే ఉన్నట్లు అర్థమవుతోంది. "కళ్లు మూసుకున్నంత మాత్రానా గతం మారిపోదు" అంటూ ఆఖర్లో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: ఆర్ ఆర్ ధృవన్, ఛాయాగ్రహణం: సంతోశ్ సనమోని.

డుం..డుం..పైసా



ఫరియా, నరేశ్ అగస్త్య

"గుర్రం పాపిరెడ్డి' ఆద్యంతం మంచి నవ్వుల ప్రయాణంలా ఉంటుంద"న్నారు దర్శకుడు మురళీ మనోహర్. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించారు. వేణు సద్ది, అమర్ బుర్రా, జయకాంత్ సంయుక్తంగా నిర్మించారు. బ్రహ్మానందం, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో "పైసా డుం డుం' అనే గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ.. "ఈ పాట తెరపై చాలా బాగుంటుంది. ఈ సినిమాలో ఫరియా కూడా ఓ పాట పాడింది" అన్నారు. దర్శకుడు మురళీ మనోహర్ మాట్లాడుతూ.. "ప్రేక్షకుల్ని నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమా చేశాం. ఓ కొత్త కాన్సెప్ట్‌తో డార్క్ హ్యూమర్ చిత్రంగా ముస్తాబు చేశాం" అన్నారు. "మా కంటెంట్‌పై ఉన్న నమ్మకంతోనే ఈనెల 19న 'అవతార్ 3'తో పాటు ప్రేక్షకుల ముందుకొస్తున్నాం" అన్నారు నిర్మాత జయకాంత్.

విజయానికి మరో మెట్టు



అవితేజ్, కోయిల్‌దాస్

ఒక వైఫల్యం జీవితంలో ఎన్నో పాఠాల్ని నేర్పిస్తుందని... అదే విజయానికీ కారణమవుతుందని చెప్పే చిత్రమే మా 'ఫెయిల్యూర్ బాయ్స్' అన్నారు అవితేజ్. ఆయన కథానాయకుడిగా... వెంకట త్రినాథరెడ్డి ఉసిరిక దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. క్రాంతి, అవితేజ్, ప్రదీప్, సుపర్ణ, పావని, కోయిల్‌దాస్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. వి.ఎస్.ఎస్.కుమార్, ధన శ్రీనివాస్ జామి, లక్ష్మి వెంకట్‌రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. నటుడు బాబుమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది. ఈ ఆలోచన చెప్పగానే నిర్మాతలు నన్నే దర్శకత్వం చేయమని ప్రోత్సహించారు. వాళ్ల నమ్మకానికి తగ్గట్టుగా మంచి అనుభూతిని పంచేలా చిత్రాన్ని తీర్చిదిద్దా" అన్నారు. అవితేజ్ మాట్లాడుతూ "ఫెయిల్యూర్ విజయానికి మరో మెట్టులాంటిదని చెప్పే చిత్రమిది" అన్నారు. "జీవితంలో ఎలా ఎదగాలో చెప్పే కథ ఇది. దర్శకుడు ఒక బ్యాంక్ మేనేజర్ అయినప్పటికీ, సెలవు రోజుల్లోనే ఈ సినిమాని తీస్తూ విజయవంతంగా పూర్తి చేశాడు" అన్నారు నిర్మాతల్లో ఒకరైన వి.ఎస్.ఎస్. కుమార్. ఈ కార్యక్రమంలో అంజి శ్రీను, నటుడు పింగ్ పాంగ్, శ్రీనివాస్ జమ్మి, దర్శకుడు తెలుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ ప్రయత్నమిది




ఈషారెబ్బా, తరుణ్ భాస్కర్

గోదావరి యాస, సంస్కృతితో... ఓ మంచి అనుభవాన్ని పంచేలా ఎంతో నిజాయతీతో చేసిన సినిమానే మా 'ఓ శాంతి శాంతి శాంతిః' అన్నారు తరుణ్ భాస్కర్. ఆయన కథానాయకుడిగా... ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. ఈషా రెబ్బా కథానాయిక. సృజన్ యరబోలు, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివారపు, కిశోర్ జాలాది, బాలసౌమిత్రి నిర్మాతలు. సోమవారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ "సినిమా మరొక జీవితాన్ని జీవించే అవకాశాన్నిస్తుంది. నాకు అలాంటి అవకాశం ఇచ్చిందీ చిత్రం. ఎంతో ప్రేమతో చేశా. మేం చేసిన ఈ ప్రయత్నంలో నిజాయతీ కనిపిస్తుంది" అన్నారు. ఈషారెబ్బా మాట్లాడుతూ "తరుణ్‌భాస్కర్‌తో కలిసి నటించే అవకాశం దొరికినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆయన దర్శకత్వంలో నటించే అవకాశం కూడా లభిస్తుందని భావిస్తున్నా. సజీవ్ ఈ చిత్రాన్ని చాలా బాగా తీశాడు" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అందరికీ వినోదం పంచే చిత్రమిది" అన్నారు. నిర్మాత సృజన్ మాట్లాడుతూ "ఒక మంచి కుటుంబ కథా చిత్రమిది. '35 చిన్న కథ కాదు' సినిమాకి ఎలాంటి ప్రశంసలు వచ్చాయో ఈ చిత్రానికి కూడా అంత పేరొస్తుందని నమ్ముతున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు బ్రహ్మాజీ, రచయిత, దర్శకుడు నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి... సంప్రదాయాల్లో మనమంతా ఒక్కటే

పాలన పరంగా మనం వేరుగా ఉండొచ్చు కానీ, సంస్కృతి సంప్రదాయాల పరంగా మనమంతా ఒక్కటే అన్నారు తరుణ్ భాస్కర్. ఈ వేడుకలో అమర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ప్రతిష్ఠ వివాదంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు తరుణ్ భాస్కర్ స్పందిస్తూ మనందరి భావోద్వేగాలు ఒక్కటే అని, ఊహాజనిత అడ్డుగోడలు మనల్ని వేరు చేయలేవన్నారు. ఆంధ్ర, తెలంగాణ అని కాకుండా మన దేశంలో గొప్ప నటులు, సాంకేతిక నిపుణులు ఉన్నారని, తాను రెండు రాష్ట్రాల నుంచి ఎంతో స్ఫూర్తి పొందానన్నారు. సినిమాతో అందరికీ ప్రేమని పంచుదామని పిలుపునిచ్చారు.

బెంగాలీ నటుడు కల్యాణ్ ఛటర్జీ మృతి



ప్రముఖ బెంగాలీ నటుడు కల్యాణ్ ఛటర్జీ (81) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చికిత్స తీసుకుంటూ ఆదివారం తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1968లో 'అపాంజన్' సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన.. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. 'బడా దిన్', 'సబుజ్ ద్వీపర్ రాజా', 'దత్తక్' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో సహాయక పాత్రల్లో కనిపించి తన సహజ నటనతో మెప్పించారు. 400లకి పైగా సినిమాల్లో నటించిన కల్యాణ్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

మరో ప్రేమకథలో జాన్వీ?



లక్ష్య



జాన్వీ కపూర్

'పరమ్ సుందరి', 'సన్నీ సంస్కారి కి తులసి కుమారి' లాంటి చిత్రాలతో ఇటీవలే తెరపై సందడి చేసింది బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి ఇప్పుడు మరో ప్రాజెక్టు చేరినట్లు తెలుస్తోంది. 'కిల్'తో మంచి విజయాన్ని అందుకొని ఈ ఏడాది 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' సిరీస్‌తో అలరించిన లక్ష్య హీరోగా 'లగ్ జా గాలే' అనే సినిమా రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. రాజ్ మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కథానాయికగా జాన్వీని ఎంపిక చేసిందట చిత్రబృందం. దీంతోపాటు ఈ చిత్ర షూటింగ్ కూడా ఇప్పటికే మొదలైనట్లు సమాచారం. ప్రేమ, ప్రతీకారం లాంటి అంశాలతో యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో టైగర్ ష్రాఫ్ ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

షార్ట్ సిరీస్ 'చాయ్ షాట్స్' ఆవిష్కరణ



రాహుల్ హుమయూన్, ఫణీంద్ర సామ, రిషికేశ్, రోహిత్ చెన్నమనేని, రానా, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, రవిశంకర్, కృష్ణమోహన్

వర్తమాన పరిస్థితుల్లో మొబైల్ మనిషి జీవితంలో భాగమైందని, ఈ నేపథ్యంలో అరచేతిలో అన్ని విషయాలను చేరువ చేసేలా కార్యక్రమాలు రూపుదిద్దుకోవడం సంతోషకరం అని ప్రముఖ సినీ హీరో రానా దగ్గుబాటి అభిప్రాయపడ్డారు. చాయ్ బిస్కట్ సంస్థ వ్యవస్థాపకులు శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రీజినల్ షార్ట్ సిరీస్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'చాయ్ షాట్స్' యాప్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రానా దగ్గుబాటి, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ అతిథులుగా పాల్గొని చాయ్ షాట్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ, తనకు శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి చాలా ఏళ్లుగా తెలుసన్నారు. వీరి ఆలోచనా విధానం, సృజనాత్మకత విభిన్నంగా ఉంటాయని ప్రశంసించారు. ఈ ప్రయాణంలో తానూ భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. రవిశంకర్ మాట్లాడుతూ.. ట్రెండ్ ఎప్పటికప్పుడు మారిపోతున్న ఈ రోజుల్లో వీక్షకుల అంచనాలను అందుకోవడం సాధారణం కాదన్నారు. శరత్‌చంద్ర, అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థ పదేళ్ల ప్రస్థానంలో.. తమద్వారా ఎందరో నటీనటులు వెండితెరకు పరిచయమయ్యారని గుర్తు చేసుకున్నారు. తమ చాయ్ షాట్స్ ద్వారా సీరియళ్లు, యువతకు అవసరమైన కార్యక్రమాలు, వినోద, ఆధ్యాత్మిక కార్యక్రమాలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. రెండు నిమిషాల లోపు కథలు ఇందులో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రూ.20కోట్ల పెట్టుబడితో, 200 మంది క్రియేటర్లతో ఈ వేదికను సిద్ధం చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ర్యాపిడో సహవ్యవస్థాపకుడు రిషికేశ్, రెడ్‌బస్ వ్యవస్థాపకుడు ఫణీంద్ర సామ, డార్విన్ బాక్స్ సహవ్యవస్థాపకుడు రోహిత్ చెన్నమనేని, వివిధ రంగాలకు చెందిన కృష్ణమోహన్, రాహుల్ హుమయూన్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బంజారాహిల్స్

దీక్ష.. పట్టుదలతో ఎలా ఎదిగారంటే!



సుమన్


కిరణ్ హీరోగా ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఆర్కే దీక్ష'. అక్సాఖాన్, అలేఖ్య రెడ్డి కథానాయికలు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నటుడు సుమన్ సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "దేశం కోసం దేనికైనా సిద్ధమైన ఆ సైనికుల్ని తలచుకుంటూ దీంట్లో ఓ చక్కటి పాట పెట్టారు" అన్నారు. "ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో జీవితంలో ఎలా ఎదుగుతాడన్నది ఈ చిత్రంలో చూపిస్తున్నాం" అన్నారు హీరో కిరణ్. ఈ కార్యక్రమంలో సి.కల్యాణ్, భరత్ భూషణ్, డీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీరే మూలకణ దాతలు

రక్తదానం, కిడ్నీ దానం, కాలేయ దానం గురించి తెలిసిందే. మరి మూలకణ దానం గురించి? రక్త క్యాన్సర్లు, థలసీమియా వంటి జబ్బులతో జీవన్మరణాల మధ్య కొట్టు మిట్టాడుతున్న ఎంతోమందికిది పునర్జన్మ ప్రసాదిస్తోంది. నిజానికిది కొత్తదేమీ కాదు. కాకపోతే ఇప్పుడిప్పుడే బాగా ప్రాచుర్యం పొందుతోంది. స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు, దాతలు చొరవచూపటం, ప్రచారం చేస్తుండటంతో రోజురోజుకీ ఊపందుకుంటోంది.

- విశాఖపట్నానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రెండుసార్లు మూలకణాలను దానం చేసి, రక్తక్యాన్సర్‌తో బాధపడుతున్న ఇద్దరికి పునర్జన్మ ప్రసాదించారు.
- తీవ్ర అప్లాస్టిక్ ఎనీమియాతో బాధపడుతున్న 11 ఏళ్ల తన సోదరుడికి పదేళ్ల వరంగల్ అమ్మాయి మూలకణాలను దానం చేసి జబ్బు నుంచి బయటపడేలా చేసింది.
- మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక అమ్మాయి తన నాలుగేళ్ల సోదరుడికి మూలకణాలను దానం చేసి సోదర ప్రేమను చాటుకుంది.
- పదేళ్ల బాలుడి ప్రాణాలు కాపాడటానికి ఒక వ్యక్తి ఎక్కడో ఉన్న దుబాయి నుంచి ఇక్కడి కేరళకు వచ్చి మూలకణాలను దానం చేశారు.

- ఇవన్నీ ఇటీవల వెలుగులోకి వచ్చిన ఉదంతాలే. రోజురోజుకీ మూలకణ దానం ప్రాచుర్యం పొందుతోందనటానికి నిదర్శనాలే. మృత్యుముఖంలో నిల్చున్నవారి ప్రాణాలను కాపాడటంలో మూలకణాల ప్రాధాన్యాన్ని గుర్తిస్తుండటం, అవగాహన పెరుగుతుండటం ఈ ధోరణిని ప్రోత్సహిస్తోంది. మూలకణాలను సేకరించే ప్రక్రియ సులభతరం కావటం, దీంతో ముడిపడిన దుష్ప్రభావాలు తగ్గటం.. మూలకణ దాతల పేర్లను నమోదు చేసుకునే రిజిస్ట్రీల్లో మరింత ఎక్కువమంది చేరుతుండటమూ కలిసి వస్తోంది. ఇప్పుడిప్పుడే పరిస్థితి ఆశాజనకంగా మారుతున్న మాట నిజమే అయినా మూలకణ దానంపై ఇప్పటికీ ప్రజల్లో సరైన అవగాహన లేకపోవటం, అపోహలు అడ్డంకులుగా నిలుస్తున్నాయి.



ఏంటీ మూలకణాలు?

ఇవి ప్రత్యేకమైన, శక్తిమంతమైన కణాలు. ఒకటి రెండుగా విభజన చెందటం, ఎలాంటి కణజాలంగానైనా మారటం వీటి ప్రత్యేకత. ఒక మూలకణం రెండుగా విభజన చెందినప్పుడు వీటిల్లో ఒకటి అవయవ కణంగా మారితే.. మరొకటి మూలకణంగా మిగులుతుంది. అవసరమైతే తిరిగి విభజన చెందుతుంది కూడా. ఇలా కణజాలాలు ఆరోగ్యంగా ఉండటానికి, మరమ్మతు కావటానికివి తోడ్పడతాయి. దెబ్బతిన్న కణాలు, అస్తవ్యస్తమైన కణాలు తిరిగి కోలుకోవటానికి దోహదం చేస్తాయి.

ఎలా పనిచేస్తాయి?

దెబ్బతిన్న లేదా మృతకణాలు వాటికి సంబంధించిన కణ ఆకృతులను (డ్యాంప్స్) విడుదల చేస్తాయి. ఇవే 'ప్రమాద' సంకేతాలుగా మూలకణాలకు దారిచూపుతాయి. వీటికి మూలకణాల మీదుండే గ్రాహకాలు అంటుకొని ప్రాథమిక వాపు ప్రతిస్పందనను ప్రేరేపిస్తాయి. అప్పుడు మూలకణాలు ఉత్తేజితమై గ్రోత్ ఫ్యాక్టర్స్, సైటోకైన్ల వంటి వాటిని విడుదల చేసి పనిలోకి దిగుతాయి. వేగంగా విభజన చెందుతూ, ఆయా కణజాలాలకు చెందిన కొత్త కణాలుగా మారతాయి. దెబ్బతిన్న కణాల స్థానంలో కుదురుకొని, మరమ్మతు ప్రక్రియను చేపడతాయి. అందుకే రక్త క్యాన్సర్లు, థలసీమియా, తీవ్ర అప్లాస్టిక్ ఎనీమియా వంటి రక్త సమస్యల చికిత్సల్లో ఆశాజనకంగా కనిపిస్తున్నాయి.

దాతల కొరతే అడ్డంకి

మూలకణ మార్పిడిలో రోగి జన్యు మ్యాపింగ్ (హెచ్‌ఎల్‌ఏ టైప్) దాతలతో సరిపోవటం చాలా కీలకం. అప్పుడే చికిత్స విజయవంతంగా పనిచేస్తుంది. అయితే రోగి కుటుంబ సభ్యుల్లో సరిపోయిన దాతలు దొరకటం కష్టం. కేవలం 25% మంది జన్యు మ్యాపింగ్ మాత్రమే సరిపోతుంది. మనదేశంలో సుమారు లక్షకు పైగా థలసీమియా బాధితులున్నారని అంచనా. ఏటా కొత్తగా సుమారు 10వేల కొత్త కేసులు నమోదవుతున్నాయి కూడా. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 27 సెకండ్లకు ఒకరు రక్తక్యాన్సర్ బారినపడుతున్నారు. వీరిలో 17% మందికే సరిపోయిన దాతలు దొరుకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే దాతల మూలకణాలకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఈ విషయంలో ఎముకమజ్జ, మూలకణ దాతల రిజిస్ట్రీలు ఆదుకుంటున్నాయి. మనదగ్గర ధాత్రి, డీకేఎంఎస్ వంటి రిజిస్ట్రీలు చురుకుగా ఉన్నాయి. ఇవి స్థానిక ఆసుపత్రులు, వైద్యసంస్థల సహకారంతో స్వచ్ఛందంగా పనిచేస్తున్నాయి. దాతలకు, రోగులకు సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నాయి.

అపోహలు వద్దు

మూల కణాలను దానం చేయటం సురక్షితం. శరీరం మీద ఎలాంటి దుష్ప్రభావమూ పడదు. కానీ కొన్ని అపోహలు వెనకాడేలా చేస్తున్నాయి. రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నవారిలోనూ మరింత సమాచారం ఇవ్వటానికి నిరాకరిస్తుండటం గమనార్హం. దాతలుగా నమోదు చేసుకున్నవారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. వీళ్లు మూల కణాల దానం చేస్తామని కుటుంబ సభ్యులకు చెప్పినప్పుడు అభ్యంతరం చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం మూల కణాల మీద, వీటి దానం మీద అవగాహన లేకపోవటమే.

- ఒకప్పుడు బైపాస్ సర్జరీ చేయించుకున్నవారి సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టేవారు. ఇప్పుడు కాస్త పెద్ద పట్టణాల్లోనూ చేసేస్తున్నారు. భవిష్యత్తులో మూలకణ మార్పిడి సైతం ఇలాంటి స్థితికి చేరుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ప్రమాణాలు పెరుగుతున్నకొద్దీ ఫలితాలూ మెరుగవుతాయని.. దీంతో ప్రజలూ బాగా అంగీకరిస్తారని నిపుణులు ఆశిస్తున్నారు.

గొప్ప సదవకాశం

మనిషి బతికుండగా తన అవయవాలేవీ కోల్పోకుండా ఇతరులకు ప్రాణ/అవయవ దానం చేసే విధానం ఇదొక్కటే. కిడ్నీ దానం అనుకోండి. శరీరం నుంచి ఒకదాన్ని తీసి ఇవ్వాలి. కాలేయ దానమైతే చిన్న ముక్కను తీస్తారు. కానీ మూలకణ దానం అలా కాదు, రక్తదానం మాదిరిగా ఇవ్వచ్చు. ఈ మూలకణాలు మూడు నెలల్లోనే తిరిగి ఉత్పత్తి అవుతాయి. వీటిని దానం చేసే అవకాశం రావటమంటేనే గొప్ప అవకాశం. జీవన్మరణ సమస్య ఎదుర్కొంటున్నవారికి తమ మూలకణాలతో పునర్జన్మను ప్రసాదించటమంటే మాటలా? మరొకరి ప్రాణాలను నిలబెట్టామన్న ఆలోచనే మనసుకు ఎంతో తృప్తిని కలిగిస్తుంది.



– డా॥ సూరపనేని ఎస్. రావు, ప్లాస్టిక్ సర్జన్, స్టార్ హాస్పిటల్, హైదరాబాద్

ఆరోగ్యవంతులెవరైనా..

మంచి ఆరోగ్యంతో ఉన్న 18-50 ఏళ్ల వయసువారు ఎవరైనా మూలకణాలను దానం చేయొచ్చు. వీటిని దానం చేయాలనే ఆసక్తి గలవారు రిజిస్ట్రీల వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొన్ని తేలికైన ప్రశ్నలకు సమాధానాలిస్తే దూదిపుల్ల పరీక్ష (స్వాబ్) కిట్‌ను పంపిస్తారు. దీన్ని నోట్లో బుగ్గల మీద రుద్ది, ప్యాక్ చేసి తిరిగి వెనక్కి పంపించాలి. ఇందులో ఎలాంటి నొప్పి ఉండదు. రక్తస్రావమేమీ కాదు. దూదిపుల్లకు అంటిన జిగురుపొర కణాలను విశ్లేషించి, హెచ్‌ఎల్‌ఏ టైపింగ్‌ను నిర్ణయిస్తారు. అనంతరం నమోదు చేసుకున్న వ్యక్తికి సర్టిఫికెట్ అందజేస్తారు. దీనిలోని బార్‌కోడ్‌లో దాతకు సంబంధించిన వివరాలన్నీ ఉంటాయి.

- హెచ్‌ఎల్‌ఏ టైపింగ్ రోగితో సరిపోతే రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న వ్యక్తిని సంప్రదిస్తారు. కొన్ని ముందస్తు పరీక్షలు నిర్వహించి ఇన్‌ఫెక్షన్లు, రక్త సమస్యల వంటివేవైనా ఉన్నాయేమో చూస్తారు. ఆరోగ్యంగా ఉన్నట్టు తేలితే మూలకణాలను తీసుకుంటారు.

దానం ఎలా?

ఒకప్పుడు ఎముకమజ్జను తీసి దానిలోంచి మూలకణాలను సేకరించేవారు. ఇది కాస్త నొప్పితో కూడుకున్న ప్రక్రియ. అందుకే చాలమంది భయపడేవారు. ముఖ్యంగా కుటుంబసభ్యులు కానివారికి ఎముకమజ్జ ఇవ్వటానికి వెనకాడేవారు. ఇప్పుడలాంటి ఇబ్బందేమీ లేదు. కాళ్లు, చేతుల్లోని రక్తనాళాల నుంచి తీసిన రక్తం ద్వారానే మూలకణాలను తీసుకునే విధానం (పెరిఫెరల్ బ్లడ్ స్టెమ్‌సెల్ డొనేషన్) వచ్చింది.

- ముందుగా దాతకు ఐదురోజుల పాటు గ్రాన్యులోసైట్ కాలనీ స్టిమ్యులేటింగ్ ఫ్యాక్టర్ (జీసీఎఫ్) ఇంజెక్షన్ ఇస్తారు. దీంతో మూలకణాల సంఖ్య బాగా పెరుగుతుంది. అవి ఎముకమజ్జలోంచి బయటకు వచ్చి రక్తంలోకి చేరతాయి. ఐదో రోజున కాళ్లు, చేతుల్లోని రక్తనాళాల ద్వారా మూలకణాలను సంగ్రహిస్తారు. రక్తాన్ని సేకరించేటప్పుడే ఎఫెరిసిస్ యంత్రం ద్వారా వీటిని వేరు చేస్తారు. మిగతా రక్తమంతా తిరిగి దాత శరీరంలోకే వెళ్తుంది. ఇదంతా నాలుగైదు గంటల్లోనే ముగుస్తుంది. సేకరించిన మూలకణాలను భద్రపరుస్తారు. అవసరమైన రోగికి ఎక్కిస్తారు.
- కుటుంబ సభ్యులు, బంధువులైతే తప్ప ఎవరు, ఎవరికి మూలకణాలను దానం చేస్తున్నారో తెలిసే అవకాశం లేదు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పుడో, మరో సందర్భంలోనో దాతలు, గ్రహీతలు కలుసుకునే అవకాశముంటుంది. అదీ వాళ్లు అంగీకరిస్తేనే.
- రిజిస్ట్రీలు ప్రపంచవ్యాప్తంగానూ సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటాయి. అంటే హెచ్‌ఎల్‌ఏ టైపింగ్ సరిపోతే ప్రపంచంలో ఎక్కడ, ఎవరికి అవసరమైనా మూలకణాలు దానం చేసే సదవకాశం లభిస్తుందన్నమాట.

రెండు రకాల మూలకణాలు

తల్లిదండ్రుల అండం, శుక్ర కణాల కలయికతో ఏర్పడిన ఒక్క మూలకణం నుంచి 40 ట్రిలియన్ల కణాలు పుట్టుకొస్తాయి. వీటితోనే శరీరమంతా ఏర్పడుతుంది. మూలకణం శక్తి అలాంటిది. అయితే దాతల మూలకణాలు రోగుల్లో చాలామందికి సరిపోవు. దాతల సంఖ్య పెరిగితే సరిపోయే మూలకణాలు అందుబాటులో ఉండటమూ ఎక్కువవుతుంది. ఈ నేపథ్యంలో మూలకణ దానం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశమంతటా ప్రాచుర్యం పొందుతుండటం ముదావహం. అయితే రక్తం నుంచి సేకరించిన మూలకణాలను (హీమోపోయెటిక్ స్టెమ్ సెల్స్) కొన్నిసార్లు శరీరం తిరస్కరించొచ్చు (గ్రాఫ్ట్ వర్సెస్ హోస్ట్ డిసీజ్). దీన్ని నివారించటానికి స్టిరాయిడ్లు, కొత్తరకం మందులు తోడ్పడతాయి. ఇవీ పనిచేయకపోతే? మీసెన్‌కైమల్ స్టెమ్ సెల్స్ అనే మరోరకం మూలకణాలు ఆదుకుంటాయి. ఎముకమజ్జ, కొవ్వు, బొడ్డుతాడు రక్తం నుంచి వీటిని సేకరించాల్సి ఉంటుంది. కణజాలాలను మరమ్మతు చేయటం వీటి ప్రత్యేకత. అందుకే ఇవి మధుమేహం, గుండె, కిడ్నీ వైఫల్యం, అల్జీమర్స్, కీళ్ల నొప్పుల వంటి సమస్యల చికిత్సలో ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఒకరకంగా ఇవి ఆయా అవయవాలను పునరుత్తేజితం (రీజనరేటివ్) చేసి, జబ్బులను సమూలంగా నయం చేస్తాయన్నమాట. అయితే వీటికి మనదేశంలో మరో రెండు మూడేళ్లలో అనుమతి లభించొచ్చు. ఈ మూలకణాల విషయంలో ప్రపంచంలోనే మనదేశం ముందుండటం గమనార్హం.




– డా॥ సాయిరాం అట్లూరి, మూలకణ పరిశోధకులు, ఎరీట్ హాస్పిటల్, హైదరాబాద్

క్యాల్షియం మాత్రలతో కిడ్నీ రాళ్లా?

అపోహ | నిజం

క్యాల్షియం మాత్రలు వేసుకుంటే కిడ్నీ రాళ్లు ఏర్పడతాయని కొందరు భయపడుతుంటారు. ఇది కేవలం అపోహే. అవసరమైనప్పుడు క్యాల్షియం మాత్రలు వేసుకోవటం తప్పనిసరి. లేకపోతే ఎముకలు బలహీనమై తేలికగా విరిగే ప్రమాదముంటుంది. సాధారణంగా ఎముక క్షీణించినప్పుడు (ఆస్టియోపీనియా), ఎముక గుల్లబారినప్పుడు (ఆస్టియోపోరోసిస్), ఎముక శస్త్రచికిత్సల వంటి సందర్భాల్లో డాక్టర్లు క్యాల్షియం మాత్రలు సూచిస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు, నెలసరి నిలిచిన మహిళల్లో ఎముకలు బలంగా ఉండటానికివి అత్యవసరం. అయితే కొందరు వీటితో కిడ్నీరాళ్లు ఏర్పడతాయని వేసుకోవటం మానేస్తుంటారు. కిడ్నీరాళ్లు చాలావరకూ క్యాల్షియంతో కూడుకున్నవి కావటం వల్ల ఈ అపోహకు గురవుతుంటారు. నిజానికి క్యాల్షియం మాత్రలతో కిడ్నీ రాళ్లేమీ ఏర్పడవు. మాత్రల్లోని క్యాల్షియం రక్తంలో కలిసి ఎముకల్లోకి చేరుతుంది. కొంత మూత్రం ద్వారా బయటకు పోతుంది. ఇదేమీ ఇబ్బంది కలిగించదు.



అయితే అప్పటికే కిడ్నీ రాళ్లు ఏర్పడే గుణం గలవారు మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాలి. వీరికి మూత్రంలోకి చేరుకున్న క్యాల్షియం, కిడ్నీల్లో పోగుపడి రాళ్లు ఏర్పడే అవకాశం పెరగొచ్చు. ఇలాంటి వారు మాత్రల కన్నా ఆహారం ద్వారా (పాలు, పెరుగు, చీజ్, రాగుల వంటివి) క్యాల్షియం లభించేలా చూసుకోవటం మంచిది. ఒకవేళ తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాల్సి వస్తే కాస్త ఎక్కువగా నీరు తాగాలి. అలాగే విటమిన్ డి తగినంత లభించేలా చూసుకోవాలి. ఇది శరీరం క్యాల్షియాన్ని సంగ్రహించు కోవటానికి తోడ్పడుతుంది. దీంతో మూత్రంలో క్యాల్షియం పోగుపడకుండా చూసుకోవచ్చు. రాళ్లు ఏర్పడే స్వభావం లేనివారికైతే మాత్రలతో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కాకపోతే భోజనం చేసిన వెంటనే లేదా భోజనంతో పాటు క్యాల్షియం మాత్రలు వేసుకోవటం, కాస్త ఎక్కువ నీరు తాగటం మంచిది.



– డా॥ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ యూరాలజిస్ట్

ఆరోగ్యపరంగా ఏవైనా అపోహలుంటే sukhi@eenadu.in కు పంపొచ్చు. నిపుణుల ద్వారా తీర్చటానికి ప్రయత్నిస్తాం.

మగవారి కుంగుబాటు భిన్నం



కుంగుబాటు బారినపడ్డ ఆడ, మగ ఇద్దరిలోనూ నిరాశ, ఏకాగ్రత తగ్గటం, ఒకప్పుడు ఆనందించిన పనుల పట్ల ఆసక్తి చూపకపోవటం వంటి ప్రధానమైన లక్షణాలు కనిపిస్తుంటాయి. ఆడవారిలోనైతే అదేపనిగా విచారించటం, మాటిమాటికీ ఏడ్వటం, చెడు భావనలతో సతమతం కావటం వంటి మూడ్ సమస్యలు ఎక్కువగా ఉండొచ్చు. అదే మగవారిలో విచారం కన్నా కోపం, చిరాకు, ఉద్రిక్తత ఎక్కువగా బయటపడుతుంటాయి. వీరిలో ఇవే కాకుండా..

- అనాలోచిత ప్రవర్తన
- దయ చూపక పోవటం
- ఆత్మ విశ్వాసం సన్నగిల్లటం
- ఇతరులను నిందించటం
- విడిగా ఉండటం
- అనూహ్య పరిస్థితులను తప్పించుకోవాలని భావించటం
- మాదక ద్రవ్యాల వ్యసనం
- జూదానికి అలవాటు పడటం
- అనుచిత లైంగిక సంబంధాలు

- ఇవన్నీ విచారాన్ని కప్పి పుచ్చుకొనే ప్రయత్నాలే! నిజానికి మామూలు విచారం, చిరాకు తాత్కాలికం. ఇవి ఆయా కారణాలతో ప్రేరేపితమవుతాయి. కానీ కుంగుబాటులో ఎలాంటి ప్రేరకమూ ఉండదు. రెండు వారాలు, అంతకన్నా ఎక్కువ రోజులు విచారం, దిగులు వంటివి రోజువారీ పనులకు విఘాతం కలిగిస్తుంటే తప్పకుండా ఆలోచించాల్సిందే.

నడక వేగంతో తుంటి మార్పిడి ఫలితం అంచనా



తుంటి కీలులోని మృదులాస్థి క్షీణించి, బాగా దెబ్బతిన్నప్పుడు సాధారణంగా పూర్తి తుంటి మార్పిడి (టోటల్ హిప్ రిప్లేస్‌మెంట్) చేస్తుంటారు. అయితే ఫలితాలు అందరిలో ఒకేలా ఉండవు. ఎప్పుడు తుంటి మార్పిడి చేస్తే మంచిదనేదీ కచ్చితంగా తెలియదు. దీని విషయంలో క్యూషూ యూనివర్సిటీ పరిశోధకులు కొత్త విషయాన్ని కనుగొన్నారు. తుంటి మార్పిడికి ముందు ప్రతి సెకండుకు కనీసం ఒక మీటరు వేగంతో నడిచేవారికి శస్త్రచికిత్స అనంతరం గణనీయమైన ఫలితం కనిపించే అవకాశమున్నట్టు గుర్తించారు. అంటే నడక వేగాన్ని బట్టి తుంటి మార్పిడి ఫలితాన్ని తెలుసుకోవచ్చన్నమాట. ఇది చాలా తేలికైన పద్ధతి కాబట్టి శస్త్రచికిత్స ముందు మదింపు చేసే సమయంలో నడక వేగాన్ని పరిగణనలోకి తీసుకోవటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

ఒంట్లో పంప్ బాగుందా?



గుండె లబ్‌డబ్‌మని కొట్టుకుంటూ ఉంటేనే మన ప్రాణం నిలుస్తుంది. ఇది రాత్రనకా, పగలనకగా నిరంతరం రక్తాన్ని పంప్ చేస్తుంటుంది. ఒక్క క్షణం మొరాయించినా శరీరం కుప్పకూలుతుంది. మన గుండెను ఇంట్లో నీటిని తోడే మోటారు పంపుతో పోల్చుకోవచ్చు. ఒకవేళ పంపు సరిగా నడవటం లేదనుకోండి. పైపుల లోపల ఏవో అడ్డుపడ్డాయి లేదా ఉన్నట్టుండి పంపే ఆగిపోయింది అనుకోండి. ఇంట్లో నీటి సరఫరా మొత్తం అస్తవ్యస్తమవుతుంది కదా. మన ఒంట్లోనూ ఇలాగే జరుగుతుంది. గుండెను పంప్ అనుకుంటే రక్తనాళాలే పైపులు. ఇక నీరేమో ఆక్సిజన్, పోషకాలను మోసుకెళ్లే రక్తం. ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తున్నంతవరకూ ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఎక్కడ సమస్య తలెత్తినా ఇక్కట్లు మొదలవుతాయి. గుండెపోటు, గుండె వైఫల్యం, గుండె స్తంభించటం వంటివి దాడిచేస్తాయి. కొన్నిసార్లు ఇవి చాలా వేగంగా ముంచుకొస్తాయి కూడా. అందువల్ల వీటి హెచ్చరిక సంకేతాలు, ముప్పు కారకాలు, నివారణ గురించి తెలుసుకొని ఉండటం మంచిది.

గుండెపోటు అంటే?

మీరు కారులో ప్రయాణిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అయ్యింది. కార్లు ఒకదాని వెనక ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఒకటే హారన్ మోతలు. ఏదీ ముందుకు కదలటం లేదు. గుండెపోటు సరిగ్గా ఇలాగే సంభవిస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులే రోడ్లు. ఇవి గుండె కండరానికి రక్తాన్ని చేరవేస్తాయి. ఈ ధమనుల్లో అడ్డంకులు (పూడికలు) ఏర్పడితే రక్తం సరిగా సరఫరా కాదు. సాధారణంగా కొవ్వు, కొలెస్ట్రాల్ పోగుపడి పూడికలుగా మారుతుంటాయి. వీటి మూలంగా రక్తం అందని గుండె భాగం ఆక్సిజన్ కొరవడి, చచ్చుబడటం మొదలవుతుంది. ఇదే గుండెపోటు.

లక్షణాలు ఇవీ

- ఛాతీలో నొప్పి. ఛాతీ బిగపట్టినట్టు, పెద్ద బరువేదో మోపినట్టు అనిపించటం.
- ఎడమ చేయి, మెడ, దవడ, వీపు భాగానికి నొప్పి విస్తరించటం.
- శ్వాస తీసుకోలేక ఆయాస పడటం.
- చెమట పట్టటం, వికారం, వాంతి.
- ఆడవారిలో, వృద్ధుల్లో ఇలా స్పష్టమైన లక్షణాలు ఉండకపోవచ్చు. వీరిలో ఏదో నిస్సత్తువగా ఉండటం, తల తిప్పటం, అజీర్ణం వంటివి కనిపిస్తుంటాయి. దీంతో చాలాసార్లు గుండెపోటును పోల్చుకోవటంలో పొరపడుతుంటారు.

- సినిమాల్లో చూపించినట్టు గుండెపోటు అన్నిసార్లూ హఠాత్తుగా రావాలనేమీ లేదు. కొన్నిసార్లు నెమ్మదిగా తలెత్తొచ్చు. అందువల్ల హెచ్చరిక సంకేతాల మీద ఓ కన్నేసి ఉంచటం మంచిది.

గుండె వైఫల్యం అంటే?

గుండె వైఫల్యమంటే మొత్తంగా గుండె ఆగిపోవటం కాదు. పంప్ బలహీనపడిందని, సమర్థంగా రక్తాన్ని పంప్ చేయటం లేదని అర్థం. నీటి పంప్ పనిచేస్తున్నా మునుపటిలా నీటిని బలంగా తోడటం లేదనుకోండి. ఏమవుతుంది? ట్యాంకులో, పైపుల్లో నీరు నిల్వ ఉంటుంది కదా. సరిగ్గా గుండె వైఫల్యంలోనూ ఇలాగే జరుగుతుంది. గుండె రక్తాన్ని సమర్థంగా పంప్ చేయకపోవటం వల్ల ఊపిరితిత్తులు, కాళ్ల వంటి భాగాల్లో ద్రవాలు పోగుపడతాయి.

లక్షణాలు ఇవీ..

- ఆయాసం. ముఖ్యంగా పడుకున్నప్పుడు లేదా కొద్ది దూరం నడిచిన తర్వాత ఆయాసం రావటం.
- పాదాలు, మడమలు, కడుపు ఉబ్బటం.
- ద్రవాలు పోగుపడటం వల్ల హఠాత్తుగా బరువు పెరగటం.
- నిస్సత్తువ, బలహీనత.
- విడవకుండా దగ్గు. కొన్నిసార్లు నురగతో కూడిన కళ్లె పడటం.

- చాలావరకూ గుండె వైఫల్యం దీర్ఘకాల సమస్య. కానీ సరైన చికిత్స, జీవనశైలి మార్పులతో హాయిగా జీవించేలా చూసుకోవచ్చు.

గుండె స్తంభించటమంటే?

విద్యుత్తు కట్ అయితే పంప్ ఉన్నట్టుండి ఆగిపోతుంది కదా. గుండె స్తంభించటం కూడా ఇలాంటిదే. గుండె కొట్టుకోవటానికి గుండెలో ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంటుంది. ఇది విఫలమైతే గుండె ఉన్నట్టుండి ఆగిపోతుంది. రక్త సరఫరా హఠాత్తుగా నిలుస్తుంది. సత్వరం సీపీఆర్, డిఫ్రిలేషన్‌తో చికిత్స చేస్తే కోలుకునే అవకాశముంది. లేకపోతే నిమిషాల్లోనే ప్రాణాపాయం సంభవించొచ్చు.

లక్షణాలు ఇవీ..

- ఉన్నట్టుండి కుప్పకూలటం. ● శ్వాస, నాడి ఆడకపోవటం
- స్పృహ కోల్పోవటం

- గుండెపోటు, గుండె వైఫల్యం మాదిరిగా గుండె స్తంభనలో చాలావరకూ ఎలాంటి హెచ్చరికలూ ఉండవు. కొన్నిసార్లు ఇది తీవ్ర గుండెపోటుతోనూ రావొచ్చు. గుండె లయ అస్తవ్యస్తం కావటమూ దీనికి దారితీయొచ్చు.

సాధారణ ముప్పు కారకాలు

దుమ్ము, తుప్పు పడితే మోటారు పంపు, పైపులు దెబ్బతిన్నట్టుగానే కొన్ని అలవాట్లు, సమస్యలు గుండెను దెబ్బతీస్తుంటాయి.

- **అధిక రక్తపోటు:** ఇది నిశ్శబ్ద హంతకి. రక్తనాళాలను ఒత్తిడికి గురిచేస్తుంది.
- **మధుమేహం:** దీంతో రక్తనాళాలు బలహీనమవుతాయి. ● **అధిక కొలెస్ట్రాల్:** రక్తనాళాల్లో పోగుపడి, పూడికలకు దారితీస్తుంది. ● **పొగ, మద్యం తాగటం:** ఇవి గుండె, రక్తనాళ వ్యవస్థలను దెబ్బతీస్తాయి. ● **ఊబకాయం, పోషణలేమి:** గుండె మీద అదనపు భారం పడేలా చేస్తాయి. ● **శ్రమ చేయకపోవటం:** గుండెకు పని చెప్పకపోతే బలహీనమవుతుంది. ● **మానసిక ఒత్తిడి:** దీంతో హార్మోన్ల మోతాదులు పెరిగి గుండె లయ అస్తవ్యస్తమవుతుంది. ● **కుటుంబ చరిత్ర:** జన్యుపరంగా గుండె జబ్బులు వచ్చే అవకాశం గలవారికి అవి త్వరగా ముంచుకొస్తాయి.

నివారణ సాధ్యమే

మోటారును శ్రద్ధగా కనిపెట్టుకుంటూ, పైపులు శుభ్రంగా ఉంచుకుంటూ, తగినంత విద్యుత్తు అందేలా చూసుకుంటే ఎక్కువకాలం మన్నికగా పనిచేస్తుంది కదా. ఇది గుండెకూ వర్తిస్తుంది.

- **మంచి ఆహారం:** తాజా పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. ఉప్పు, చక్కెర, మిఠాయిలు, వేపుళ్లు తగ్గించుకోవాలి.
- **వ్యాయామం:** రోజూ క్రమం తప్పకుండా అరగంట సేపు నడవటం లేదా వ్యాయామం చేయటం ద్వారా గుండె బలంగా ఉండేలా చూసుకోవచ్చు. గుండెకు కదలికే ఔషధమని తెలుసుకోవాలి.
- **పొగ, మద్యం వద్దు:** వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.
- **ఒత్తిడి తగ్గించుకోవాలి:** ధ్యానం, యోగా, ప్రార్థన, హాబీల వంటి వాటితో మనసు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి.
- **కంటి నిండా నిద్ర:** రాత్రిపూట 7-8 గంటల సేపు ప్రశాంతంగా నిద్రించాలి.
- **పరీక్షలు క్రమం తప్పకుండా:** బీపీ, గ్లూకోజు, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి. బరువునూ కొలుచుకోవాలి. తేడాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్త పడొచ్చు. చిన్న సమస్యలను ముందే పట్టుకుంటే ముమ్ముందు పెద్ద ప్రమాదం రాకుండా చూసుకోవచ్చు.

మధుమేహానికీ డ్యాష్ ఆహార పద్ధతి!

అధిక రక్తపోటును తగ్గించుకోవటానికి డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్‌టెన్షన్ (డ్యాష్) ఆహార పద్ధతిని చాలాకాలంగా అనుసరిస్తున్నారు. ఇది మధుమేహుల్లో గ్లూకోజు మోతాదులు అదుపులో ఉండటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. కాకపోతే డ్యాష్ పద్ధతిని స్వల్పంగా మార్చటం గమనార్హం.



డ్యాష్ అనేది సరళమైన ఆహార పద్ధతి. ఇందులో పండ్లు, కూరగాయలు, తవుడుతో కూడిన ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పప్పులు, గింజ పలుకులు. మాంసాహారులకైతే చికెన్, చేపల వంటి వాటికి ప్రాధాన్యమిస్తారు. అదే సమయంలో ఉప్పు పరిమితం చేసుకోవటం చాలా ముఖ్యం. ఏ విధంగా చూసినా ఉప్పు రోజుకు 2,300 మి.గ్రా. కన్నా మించనీయొద్దు. 1,500 మి.గ్రా. మించకపోతే ఇంకా ఉత్తమం. అలాగే మాంసం, మిఠాయిలు, చక్కెర, తీపి పానీయాలు, ఆహార ఉత్పత్తులు (చక్కెర, ఉప్పు, కొవ్వు కలిపి తయారుచేసేవి) తగ్గించుకోవాలి.

- ఈ డ్యాష్ పద్ధతి రక్తపోటును తగ్గించటం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగవటానికి తోడ్పడుతున్నట్టు చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే మధుమేహం గలవారిలో రక్తంలో గ్లూకోజు మోతాదుల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందనేది స్పష్టంగా తెలియరాలేదు. అందుకే కొత్త అధ్యయనంలో దీనిపై దృష్టి సారించారు.

కొద్దిగా మార్చి..

రక్తపోటును సమర్థంగా తగ్గిస్తున్నందున డ్యాష్ పద్ధతిని మధుమేహం, ఇతర సమస్యలు గలవారికీ తరచూ సూచిస్తుంటారు. అయితే గ్లూకోజు నియంత్రణ కోసం పరిశోధకులు డ్యాష్ పద్ధతిలో స్వల్పంగా మార్పులు చేశారు. తీపి పదార్థాలు, పిండితో కూడిన బంగాళాదుంపల వంటి వాటిని మరింతగా తగ్గించారు. దీనికి డ్యాష్4డీ అని పేరు పెట్టారు.

- కొందరు మధుమేహులను ఎంచుకొని ఐదు వారాల పాటు దీని ప్రభావాన్ని పరిశీలించారు. మామూలు ఆహారం తీసుకున్నవారితో పోలిస్తే డ్యాష్4డీ పద్ధతిని పాటించినవారిలో రక్తంలో గ్లూకోజు నిర్ణీత మోతాదుల్లో ఎక్కువసేపు స్థిరంగా ఉన్నట్టు గుర్తించారు.
- డ్యాష్ పద్ధతి రక్తంలో గ్లూకోజు మోతాదులను గణనీయంగా మెరుగుపరుస్తున్నట్టు ఒక నియంత్రిత అధ్యయనంలో తేలటం ఇదే తొలిసారని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఎలిజబెత్ సెల్విన్ చెబుతున్నారు.

కరెంట్ అఫైర్స్



◆ మిసెస్ యూనివర్స్ – 2025 టైటిల్ విజేతగా నిలిచిన భారత మహిళ ఎవరు? (ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరిగిన ఈ పోటీలో 120 మందితో పోటీ పడి ఈమె విజేతగా నిలిచి భారత దేశానికి తొలి మిసెస్ యూనివర్స్ టైటిల్ అందించింది. ఇవి 48వ మిసెస్ యూనివర్స్ పోటీలు.)

మాదిరి ప్రశ్నలు

జ: షెర్రీ సింగ్

◆ భారత సైన్యం ఇటీవల ప్రారంభించిన స్వదేశీ కౌంటర్ అన్ మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (యూఎస్ఏ) యాంటీ- డ్రోన్ గ్రిడ్ ఏది?

జ: ఎస్ఏకేఈఎస్‌హెచ్ఏఎం- సిట్యుయేషనల్ అవేర్‌నెస్ ఫర్ కైనెటిక్ సాఫ్ట్ అండ్ హార్డ్ కిల్ అసెట్స్ మేనేజ్‌మెంట్ (ఇది సైన్యం వైమానిక నియంత్రణ సామర్థ్యాలను పెంచే అధునాతన కమాండ్ అండ్ కంట్రోల్ నెట్‌వర్క్.)

◆ ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026 ప్రకారం ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా ఏది నిలిచింది?

జ: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (వరుసగా ఆక్స్‌ఫర్డ్ 10వ సారి అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం 500 యూనివర్సిటీలతో రూపొందించిన ఈ జాబితాలో అమెరికా (171 విశ్వవిద్యాలయాలు), భారత్ (128 విశ్వవిద్యాలయాలు) సంఖ్యా పరంగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.)

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?

☛ ఈసీహెచ్ఎస్-విశాఖలో మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలు
చివరి తేదీ: 12.12.2025

☛ ఐఐబీఎఫ్‌లో ఫ్యాకల్టీ మెంబర్ పోస్టులు
చివరి తేదీ: 13-12-2025

ప్రకృతిని నమ్ముకొని.. ప్రమాదాలను దాటుకొని!

వివిధ పరిసరాల్లో నివసిస్తున్న ఆదిమ జాతులు

జనరల్ స్టడీస్ – విపత్తు నిర్వహణ

మానవుడు జీవించడానికి తగిన భౌతిక పరిసరాలు అత్యవసరం. వాటిని ప్రకృతి, సహజ వనరులే కల్పిస్తాయి. పరిసరాల గురించి సమగ్రంగా తెలుసుకున్నప్పుడే పూర్వం మనుషుల జీవనం సాగిన తీరు అర్థమవుతుంది. ఆధునిక సౌకర్యాలు లేని కాలంలో మానవుల జీవనశైలి గురించి తెలిస్తే, విపత్కర పరిస్థితుల్లో వారు ఎలా జీవించారో, విపత్తుల నుంచి ఏ విధంగా బయటపడ్డారో అర్థమవుతుంది. అందుకోసం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ మనుగడలో ఉన్న ఆదిమ జాతుల జీవనాన్ని తెలుసుకోవాలి. ఆహార సేకరణ, వేట, పశుపోషణ, కొన్ని కుటుంబాలు సమూహంగా జీవించడం, పనిముట్ల వాడకం, ప్రకృతితో మమేకమై, ప్రమాదాలను తప్పించుకుంటూ జీవనం గడపడం తదితరాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వారి సంప్రదాయ జీవనశైలి, ప్రకృతితో సన్నిహితంగా, సరళంగా జీవిస్తున్న తీరును అర్థం చేసుకోవాలి.

మానవుడు - పరిసరాలు

మానవులు ప్రారంభ దశలో ప్రకృతికి అనుగుణంగా, పరిసరాలకు తగినట్లుగా జీవితాన్ని గడిపారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక రవాణా, సమాచార సేకరణల సాయంతో ప్రకృతి అవరోధాలను కూడా అధిగమించి పరిసరాలను అనుకూలంగా మార్చుకున్నారు. కానీ ఇప్పటికీ మానవ నివాసం, అభివృద్ధి ప్రకృతి వనరులపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.


పరిసరాలు-అవగాహన: పరిసరాలు, పర్యావరణం అనేవి ఒకదానికొకటి పర్యాయ పదాలుగా వాడుకలో ఉన్నాయి. భూమి, వాతావరణం, సూర్యరశ్మి, సహజ వృక్ష జంతుజాలాలను ప్రకృతిగా, ప్రాకృతిక మూలకాలుగా భావిస్తారు. ప్రకృతిలోని వివిధ మూలకాల ఉనికి, పరస్పర సంబంధం, వాటి ప్రభావం వల్ల లభించే ఉత్పాదకాలను పరిసరాలుగానే భావించాలి.

మనుషులు నివసించే భూగోళం 1) శిలావరణం 2) జలావరణం 3) వాతావరణం 4) జీవావరణం అనే నాలుగు ఆవరణలతో ఉంది. వీటన్నింటినీ కలిపి పరిసరాలు లేదా పర్యావరణం అంటారు. లేదా ఒక జీవి చుట్టూ ఉండే భౌతిక, రసాయనిక, దైనిక పరిస్థితులను పరిసరాలు/పర్యావరణం అని పేర్కొనవచ్చు.

జీవావరణం తప్ప మిగిలిన మూడు ఆవరణలను భౌతిక పరిసరాలు, సహజ పరిస్థితులుగా చెప్పవచ్చు.



జీవావరణం: భూ, జల, వాయు గోళాల్లో జీవకోటి ఉంది. భూమిపై నివసించే జంతు, వృక్షజాలాన్ని కలిపి జీవావరణం అంటారు. చిన్నచిన్న మొక్కల నుంచి మహావృక్షాల వరకు, బ్యాక్టీరియా మొదలుకొని ఏనుగు వంటి పెద్ద జంతువుల వరకు జీవజాలం ఉంది. వివిధ జీవజాలాల ఉనికి, విస్తరణ ఆయా ప్రదేశాల భౌతిక పరిసరాలపై ఆధారపడి ఉంటుంది. ● జలావరణం, శిలావరణం, వాతావరణాలు జీవజాలానికి ఎంతో ముఖ్యమైనవి. ఈ మూడింటి మధ్య పరస్పర సంబంధాలు కొనసాగినప్పుడే మానవుల మనుగడ, అభివృద్ధి సాఫీగా జరుగుతుంది.




బుష్‌మెన్‌లు: ఆఫ్రికా దక్షిణ భాగంలో కలహరి ఎడారిలో సుమారు 2 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో దాదాపు పది వేల మంది బుష్‌మెన్లు నివసిస్తున్నారు. ఈ ఎడారిలో ఏడాది పొడవునా అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. వర్షపాతం, నీటి పారుదల వసతులు చాలా తక్కువ. ఎలుకలు, కుందేళ్లు, జింకలు, నక్కలు, అడవి కుక్కలు, జిరాఫీలు, జీబ్రాలతో పాటు రకరకాల పక్షులు, కొంగలు, విషసర్పాలు ఉంటాయి. బుష్‌మెన్లు వీటిని వేటాడుతుంటారు. పెద్ద క్రూర జంతువులను కూడా సమీపంలో ఉండి చంపుతారు. వేసవిలో ఆ జీవజాలం అంతా వలసపోవడంతో ఆహారం కొరత ఏర్పడి జీవనం దుర్భరంగా ఉంటుంది. ఎడారిలో లభించే కందమూలాలను తింటారు. వీరి పెంపుడు జంతువులైన అడవి కుక్కలు వేటలో సహాయపడతాయి. బుష్‌మెన్‌లు సంచార జీవులు. పొదలనే నివాసాలుగా ఉపయోగిస్తారు. కొన్నిచోట్ల అర్ధ వృత్తాకారంలో గుడిసెలు నిర్మించుకుంటారు. పక్షుల, జంతువుల కళేబరాల అవశేషాలను కప్పులుగా ఉపయోగిస్తారు. జంతుచర్మాలను దుస్తులుగా ధరిస్తారు. వీరికి స్నానం తెలియదు. ఉపయోగించే పాత్రలు కూడా తక్కువ. స్త్రీలకు తాగునీరు తేవడం పెద్ద సమస్య. విల్లు, బాణాలు, కత్తులు, గడ్డపారలు, బరిసెలను ఆయుధాలుగా ఉపయోగిస్తారు. బాణాల చివర పదును చేసి విషం పూస్తారు. పురుషులు 5 అడుగులు, స్త్రీలు 4 అడుగుల ఎత్తు ఉంటారు. దేవుడి ఆలోచన లేదు. కొన్ని మూఢనమ్మకాలు ఉన్నాయి.

కిర్గిజ్: మధ్య ఆసియా పీఠ భూముల్లో కిర్గిజ్ జాతి విస్తరించింది. వీరి నివాస ప్రాంతం సముద్రానికి దూరంగా అనార్ద్ర ప్రదేశంలో 2500 - 4000 మీటర్ల ఎత్తులో పచ్చిక బయళ్లతో ఉంటుంది. ఒంటెలు, జడల బర్రె, గుర్రాలు, గొర్రెలను పెంచుకుంటారు. ఎండాకాలంలో చెరువులు, నదులు, సరస్సులు ఇంకినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆ సమయంలో పెంపుడు జంతువులతో సంచార జీవనం సాగిస్తారు. ఈ జాతి వారు పర్వతమయ శీతల ప్రదేశాల్లో జీవించడానికి అలవాటుపడ్డారు. చలి, వర్షం నుంచి కాపాడుకోడానికి పాదాల వరకు జంతు చర్మాలతో చేసిన గౌన్లు, పాదరక్షలు, బూట్లు ధరిస్తారు. విద్య, సాంఘిక రంగాల్లో అభివృద్ధి చెందలేదు. ఇటీవల రష్యా ప్రభుత్వం వీరి జీవన విధానాన్ని మార్చే ప్రయత్నం చేస్తోంది.

పిగ్మీలు: మధ్య ఆఫ్రికా ప్రాంతంలో ఉగాండా నుంచి గబన్ వరకు భూమధ్యరేఖకు ఇరువైపుల్లో మూడు డిగ్రీల అక్షాంశం వరకు పిగ్మీలు నివసిస్తున్నారు. ఎక్కువగా కాంగో నది పరీవాహక ప్రాంతంలో ఉంటారు.. అధిక ఉష్ణోగ్రత, వర్షపాతం, తేమ సంవత్సరం పొడవునా ఉంటుంది. పిగ్మీల వద్ద ఎలాంటి పెంపుడు జంతువులు లేవు. వ్యవసాయం తెలియదు. వేట, చేపలు, అడవుల్లోని కందమూలాలు, ఫలాలపై ఆధారపడతారు. విల్లు, బరిసెలు వీరి ఆయుధాలు. బాణాల చివర విషం పూసి పెద్ద జంతువులను వేటాడతారు. నడుం చుట్టూ పెద్ద పెద్ద ఆకులు చుట్టుకుంటారు. స్థిర నివాసాలు లేవు. 10 నుంచి 12 కుటుంబాలు ఒకచోట గుడిసెలు కట్టుకొని నివసిస్తాయి.

ఎస్కిమోలు: ఉత్తర ధ్రువ మండలంలోని ఉత్తర అమెరికా ఉత్తర ప్రాంతం, దాని దీవుల సరిహద్దులు, గ్రీన్‌లాండ్ తీర ప్రాంతాలు, సైబీరియా ఆగ్నేయ ప్రాంతాల్లో ఎస్కిమోలు విస్తరించి ఉన్నారు. చేపలు పట్టడం, వేట ప్రధాన వృత్తులు. ఉత్తర ప్రాంతాల్లోని పచ్చికబయళ్లలో మంచు లేని మే నెలలో రెయిన్‌డీర్, ధ్రువపు జింకలు, అమెరికన్ కారిబోలను వేటాడుతుంటారు. వాటి మాంసాన్ని ఉడకబెట్టి లేదా పచ్చిగానే భద్రపరిచి శీతాకాలం తింటారు. జంతుచర్మాలు, మాంసం అమ్మి టీ, పిండి, ఆయుధాలు కొనుగోలు చేస్తారు. శీతాకాలంలో మంచు గడ్డలతో ఇగ్లూలు నిర్మించుకొని లోపలిభాగం సీల్, ధ్రువ పుజింక చర్మాలతో కప్పి వేస్తారు. శ్వేతజాతి ప్రభావంతో క్రమంగా పురాతన ఎస్కిమో జీవన విధానాలు మారుతున్నాయి.



తోడాలు: దక్షిణ భారతదేశంలో నీలగిరి కొండల్లో 'తోడా' అనే ఆదిమ జాతి నివసిస్తోంది. పశుపోషణ ప్రధాన వృత్తి. సాధారణమైన ఎత్తు, చక్కని ముక్కు, మెరిసే గడ్డం, నొసలు మీదికి వేలాడే ఉంగరాల జుట్టు, పొట్ట, ఛాతి మీద, కాళ్ల మీద దట్టమైన వెంట్రుకలు ఉంటాయి. బాలుడికి 12 ఏళ్లు రాగానే కుడి భుజంపై కట్టెతో మచ్చ పడే విధంగా కాలుస్తారు. ఆ తర్వాతే ఆ బాలుడు పాలు పితకడానికి అర్హుడవుతాడు. వంట, పాలు, పెరుగు, వెన్న తీయటం తదితర పనులను మహిళలు చేస్తారు. స్త్రీని వివాహమాడిన పురుషుడి అన్నదమ్ములందరికీ ఆమె భార్య అవుతుంది. వీరి నివాస గుడిసెలను అర్ధ వలయాకారంలో నిర్మిస్తారు. చుట్టూ రాళ్లతో పేర్చిన ప్రహరీ ఉంటుంది.



రచయిత: సక్కరి జయకర్

SENIOR INTER Chemistry — Electro Chemistry

Final Exams-2026 IMPORTANT Q & A

1. What is a galvanic cell or a voltaic cell? Give one example.

A: Galvanic cell: A device which converts chemical energy into electrical energy by the use of a spontaneous redox reaction is called a Galvanic cell (or) voltaic cell.

e.g.: Daniell cell.

2 Marks

2. How is E_0 cell related mathematically to the equilibrium constant K_c of the cell reaction?

A: Relation between E_0 cell and equilibrium constant K_c of the cell reaction E^0_{cell} = (2.303RT/nF) logK_c

n = number of electrons involved

F = Faraday = 96500 C mol^{-1}

T = Temperature R = gas constant

3. How is Gibbs energy (G) related to the cell emf (E) mathematically?

A: Relation between Gibbs' energy (G) and emf (E) mathematically

$\Delta G^\circ = -nFE_{(cell)}$

ΔG = change in Gibbs' energy

n = number of electrons involved

F = Faraday = 96500 C mol^{-1}

4. State Faraday's first law of electrolysis.

A: The amount of chemical reaction which occurs at any electrode during electrolysis is proportional to the quantity of current passing through the electrolyte.

(Or)

The mass of the substance deposited at an electrode during the electrolysis of the electrolyte is directly proportional to the quantity of electricity passed through it.

$m \propto Q$; $m \propto c \times t$

5. What is a primary battery? Give one example.

A: The batteries which after their use over a period of time, becomes dead and the cell reaction is completed, and this cannot be reused again are called primary batteries.

e.g.: Leclanche cell, Dry cell

Practice questions — 2 Marks

6. Give one example of a secondary battery. Give the cell reaction.

7. What is metallic corrosion? Give one example.

More Imp Q & A

Writer: Dr. P. TrinadhaRaja

'ఆ దండయాత్ర ఫలితం లేని గొప్ప విజయం!'

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

మధ్యయుగంలో భారత్‌పై అరబ్బుల దాడులు దేశ చరిత్రను మలుపు తిప్పాయి. ఉపఖండంలో ఇస్లాం విస్తరణకు, ముస్లింల ఆధిపత్యానికి నాంది పలికాయి. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలపై శాశ్వత ప్రభావాన్ని ప్రదర్శించాయి. ఉత్తర భారతంలో రాజకీయ అస్థిరత, ఏకీకరణ అవసరాన్ని తెలియజేశాయి. స్వదేశీ పాలకుల అనైక్యత, అసమర్థతే ఆసరాగా సాగిన ఆ దండయాత్రల ఫలితాలు, పరిణామాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. పదకొండో శతాబ్దంలో గజనీ వరుస దాడులు, ఆ తర్వాత పన్నెండో శతాబ్దంలో ఘోరీ దండయాత్రల లక్ష్యాలు, చేసిన యుద్ధాలు, వారిని ఎదిరించిన హిందూ రాజులు, పృథ్వీరాజ్ చౌహాన్ ధీరత్వం, క్రమంగా దిల్లీ సుల్తాన్ యుగానికి దారితీసిన పరిస్థితులు, సంబంధిత చారిత్రక రచనల గురించి తెలుసుకోవాలి.


అరబ్బుల దండయాత్ర

1. 1192లో ఉత్తర భారతదేశాన్ని జయించిన మధ్య ఆసియాకు చెందిన పాలకుడు?
   1) జలాలుద్దీన్ మంగబర్నీ 2) మహ్మద్ గజనీ 3) షాబుద్దీన్ మహ్మద్ ఘోరీ 4) చెంఘీజ్ ఖాన్

2. మహ్మద్ ఘోరీని పృథ్వీరాజ్ చౌహాన్ ఏ యుద్ధంలో ఓడించాడు?
   1) రెండవ తరైన్ యుద్ధం
   2) మొదటి తరైన్ యుద్ధం
   3) మూడవ పానిపట్టు యుద్ధం
   4) మొదటి చాంద్‌వార్ యుద్ధం

3. క్రీ.శ.711లో భారతదేశంపై అరబ్బుల మొదటి దండయాత్ర జరిగింది. అప్పటి ఖలీఫా ఎవరు?
   1) అల్-హజాజ్ 2) అల్-వాలిద్ 3) అల్-బకర్ 4) అల్-ఖాదిర్

4. ఘోరీ మహ్మద్‌కు సంబంధించి కింది ప్రవచనాల్లో ఏది సరైంది కాదు?



ఘోరీ మహ్మద్

   1) మొదటి తరైన్ యుద్ధంలో మహ్మద్ ఘోరీని రాజపుత్రులు ఓడించారు.
   2) భారతదేశంలో తాను జయించిన ప్రాంతాలకు కుతుబుద్దీన్ ఐబక్‌ను గవర్నర్‌గా నియమించాడు.
   3) అతడు ఒక దండయాత్రలో సోమనాథ దేవాలయంపై దండెత్తి అక్కడి ధనరాశులను కొల్లగొట్టాడు.
   4) అజ్మీర్ రాజైన పృథ్వీరాజ్ చౌహాన్‌ను రెండవ తరైన్ యుద్ధంలో ఓడించారు.

5. అరబ్బుల దండయాత్ర నాటికి సింధ్ రాజధాని ఏది?
   1) దేబాల్ 2) ముల్తాన్ 3) భటిండా 4) అలోర్

6. తైమూర్ దండయాత్ర సమయంలో దిల్లీని పరిపాలిస్తున్న సుల్తాన్ ఎవరు?
   1) దౌలత్ ఖాన్‌లోడి 2) అబూబాకర్ 3) నసీరుద్దీన్ మహ్మద్ 4) ఫిరోజ్‌షా తుగ్లక్

7. హింద్ (భారత్) ప్రజలకు గుర్తుగా 'హిందూ' అనే పదాన్ని మొదట ఎవరు ఉపయోగించారు?
   1) గ్రీకులు 2) రోమన్లు 3) చైనీయులు 4) అరబ్బులు

8. మహ్మద్ ప్రవక్త ఏ సంవత్సరంలో జన్మించారు?
   1) క్రీ.శ.570 2) క్రీ.శ.622 3) క్రీ.శ.642 4) క్రీ.శ.670

9. అరబ్బుల మొదటి దండయాత్ర ఏ సంవత్సరంలో జరిగింది?
   1) 674 2) 1013 3) 711 4) ఏదీకాదు

10. మక్కా ఎక్కడ ఉంది?
   1) సిరియా 2) ఇరాన్ 3) ఇరాక్ 4) సౌదీ అరేబియా

11. భారతదేశంపై దండయాత్ర చేసిన మొదటి ముస్లిం రాజు ఎవరు?
   1) కుతుబుద్దీన్ ఐబక్ 2) మహ్మద్ గజనీ 3) మహ్మద్‌బిన్ ఖాసిం 4) మహ్మద్ ఘోరీ

12. భారతదేశంపై దండయాత్ర చేసిన ముస్లింలు ఎవరు?
   1) ఘజ్నవిద్‌లు 2) ఘరీద్‌లు 3) అరబ్బులు 4) ఎవరూ కాదు


13. మహ్మద్ – బిన్ – ఖాసిం ఒక..?
   1) తురుష్కుడు 2) మంగోలుడు 3) అరబ్బు 4) తురుక - అఫ్గాన్

14. కిందివారిలో ఘజ్నవిద్ రాజవంశ స్థాపకులు?
   1) అలప్తజిన్ 2) మహమూద్ 3) సబక్తజిన్ 4) ఇస్మాయిల్

15. మహ్మద్ గజనీ ఓడించిన చందేల రాజు ఎవరు?
   1) ధనుంజయుడు 2) విద్యాధరుడు 3) జైశక్తి 4) చంద్రపాలుడు

16. మహ్మద్ గజనీ ఆస్థాన చరిత్రకారుడు ఎవరు?
   1) అమిర్ ఖుస్రూ 2) హసన్ నిజామీ 3) ఉత్బీ 4) చాంద్ బర్దాయ్

17. 'షానామా'ను రచించిన ఫిరదౌసి ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?




   1) సబక్తజిన్
   2) మహ్మద్ గజనీ
   3) మహ్మద్ ఘోరీ
   4) అలప్తజిన్

18. కింది పండితుల పేర్లను పరిశీలించండి.
   ఎ) ఫిరదౌసి బి) అల్ బెరూని
   సి) జియాఉద్దీన్ బరౌనీ
   పైన పేర్కొన్న కవుల్లో మహ్మద్ గజనీ ఆస్థానంతో సంబంధం కలిగిన వారి సంఖ్య
   1) ఒకరు 2) ఇద్దరు 3) ముగ్గురూ 4) ఎవరూ కాదు

19. మహ్మద్ గజనీతో పాటు భారతదేశాన్ని సందర్శించిన ప్రముఖ చరిత్రకారుడు ఎవరు?
   1) ఫెరిష్తా 2) అల్ - బెరూని 3) అఫిఫ్ 4) ఇబన్ బటూటా

20. అల్ – బెరూని భారతదేశాన్ని ఎప్పుడు సందర్శించాడు?



అల్ - బెరూని

   1) క్రీ.శ 9వ శతాబ్దం
   2) క్రీ.శ 10వ శతాబ్దం
   3) క్రీ.శ 11వ శతాబ్దం
   4) క్రీ.శ 12వ శతాబ్దం

21. హరియాణాలోని ఏ ప్రదేశం వద్ద మహ్మద్ ఘోరీ పృథ్వీరాజ్ చౌహాన్‌ను ఓడించాడు?
   1) తారావాడి 2) తరౌరి (తరైన్) 3) నిలోఖేడి 4) తిత్రామ్

22. అల్ – బెరూనీకి సంబంధించి కింది ప్రకటనల్లో సరైంది?
   1) లౌకిక రచయిత
   2) ఇతని రచనలు భారతదేశంతో ప్రభావితమయ్యాయి.
   3) సంస్కృత పండితుడు
   4) త్రికోణమితిలో నిపుణుడు

23. పురాణాలను అధ్యయనం చేసిన మొదటి ముస్లిం ఎవరు?
   1) అబుల్‌ఫజల్
   2) అబ్దుల్ ఖాదిర్ బదయూని
   3) అల్ - బెరూని 4) దారాషికో

24. ఒకవైపు సంస్కృత పురాణ పాత్రల బొమ్మలతో ఉన్న వెండి నాణేలను విడుదల చేసినవారు?



గజనీ మహ్మద్

   1) మహ్మద్ బిన్ ఖాసిం
   2) గజనీ మహ్మద్
   3) షేర్షాసూర్
   4) సికిందర్‌షా సూర్

25. మహ్మద్‌బిన్ ఖాసిం సింధ్‌ను ఎప్పుడు జయించాడు?
   1) క్రీ.శ.173 2) క్రీ.శ.716 3) క్రీ.శ.712 4) క్రీ.శ.719

26. మహ్మద్ ఘోరీని మొదటిసారి ఓడించింది ఎవరు?
   1) మూలరాజు 2) పృథ్వీరాజ్ చౌహాన్ 3) విద్యాధరుడు 4) కులశేఖరవర్మ

27. మహ్మద్ ఘోరీ ఏ యుద్ధంలో జయచంద్రను ఓడించాడు?
   1) తరైన్ యుద్ధం (1191)
   2) తరైన్ యుద్ధం (1192)
   3) చాంద్‌వార్ యుద్ధం (1194)
   4) కనౌజ్ యుద్ధం (1194)

28. మహ్మద్ గజనీ భారతదేశంపై ఎన్నిసార్లు దండెత్తాడు?
   1) 16 2) 17 3) 15 4) 7

29. 1191లో మొదటి తరైన్ యుద్ధంలో మహ్మద్ ఘోరీని ఓడించిన మొదటి రాజపుత్ర పాలకుడు ఎవరు?
   1) మాల్‌దేవ్ రాథోడ్ 2) పృథ్వీరాజ్ చౌహాన్ 3) రాణాకుంభ 4) బప్పారావల్

30. భారతదేశంలో ముస్లిం ఆధిపత్యానికి పునాది వేసిన యుద్ధం ఏది?
   1) మొదటి తరైన్ యుద్ధం
   2) రెండవ తరైన్ యుద్ధం
   3) మొదటి పానిపట్టు యుద్ధం
   4) రెండవ పానిపట్టు యుద్ధం

31. ఏ ముస్లిం పాలకుడి నాణేలపై లక్ష్మీ దేవి చిత్రం ఉంది?



   1) మహ్మద్ ఘోరీ 2) అల్లాఉద్దీన్ ఖిల్జీ 3) జలాలుద్దీన్ అక్బర్ 4) మహ్మద్ బిన్ తుగ్లక్

32. మహ్మద్ ఘోరీ భారతదేశంలో మొదటి ఇక్తాను ఎవరికి అందించారు?
   1) తాజుద్దీన్ యాల్డజ్ 2) కుతుబుద్దీన్ ఐబక్ 3) షంషుద్దీన్ ఇల్ టుట్ మిష్ 4) నజీరుద్దీన్ ఖాబాచా

33. బెంగాల్, బిహార్‌లను జయించిన మహ్మద్ ఘోరీ బానిస ఎవరు?
   1) కుతుబుద్దీన్ ఐబక్ 2) ఇల్ టుట్ మిష్ 3) భక్తియార్ ఖిల్జీ 4) యాల్డజ్

34. ధ్రువీకరణ (ఎ): మహ్మద్ గజనీ భారతదేశంపై పలుమార్లు దండయాత్ర చేశాడు.
   కారణం (ఆర్): భారతదేశంలో శాశ్వత ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించాలని భావించాడు.
   1) ఎ, ఆర్ రెండూ సరైనవి, ఆర్ ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ రెండూ సరైనవి, ఆర్ ఎ కు సరైన వివరణ కాదు.
   3) ఎ సత్యం, ఆర్ అసత్యం
   4) ఎ అసత్యం, ఆర్ సత్యం

35. కింది పేర్లను కాలక్రమానుసారంగా అమర్చండి. ఇచ్చిన కోడ్ నుంచి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   ఎ) చెంఘీజ్ ఖాన్ బి) మహ్మద్ గజనీ
   సి) మహ్మద్ ఘోరీ డి) తైమూర్
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, ఎ, డి 3) సి, డి, ఎ, బి 4) డి, ఎ, బి, సి

36. సింధ్‌పై అరబ్బుల దండయాత్ర 'ఫలితం లేని గొప్ప విజయం' అని తెలిపిన చరిత్రకారుడు ఎవరు?
   1) ఆచార్య బిపిన్ చంద్ర 2) స్టాన్లీ లేన్‌పూల్ 3) ఆచార్య ప్రేమ్‌చంద్ 4) రోమిల్లా థాపర్

37. కిందివాటిలో 'బంగారు నగరం' అని పిలిచేది?
   1) లాహోర్ 2) అలోర్ 3) దేబాల్ 4) ముల్తాన్

38. జిజియా పన్ను విధించిన మొదటి దిల్లీ సుల్తాన్ ఎవరు?
   1) మహ్మద్‌బిన్ ఖాసి 2) కుతుబుద్దీన్ ఐబక్ 3) ఇల్ టుట్ మిష్ 4) మహ్మద్ ఘోరీ

39. కనౌజ్ కోసం త్రైపాక్షిక పోరాటంలో పాల్గొన్న మూడు రాజ వంశాలు ఏవి?
   ఎ) చోళ వంశం బి) పాల వంశం
   సి) గుర్జర వంశం డి) రాష్ట్రకూట వంశం
   కింద ఇచ్చిన కోడ్‌ను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) బి, సి, డి 4) ఎ, సి, డి

40. "హిందూ రాజపుత్రుడు తన కనురెప్పలను మరణంలో మాత్రమే మూస్తాడు" అని ప్రకటించిన రాజపుత్ర రాజు?
   1) పృథ్వీరాజ్ చౌహాన్ 2) జయచంద్రుడు 3) రెండో భీమరాజు 4) లక్ష్మణసేనుడు

41. దిల్లీ సుల్తాన్ యుగం ఎప్పుడు ప్రారంభమైంది?
   1) క్రీ.శ.712
   2) క్రీ.శ.1206
   3) క్రీ.శ.1396
   4) క్రీ.శ.1526



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-3, 2-2, 3-2, 4-3, 5-4, 6-3, 7-4, 8-1, 9-4, 10-4, 11-3, 12-3, 13-3, 14-1, 15-2, 16-3, 17-2, 18-2, 19-2, 20-3, 21-2, 22-1, 23-3, 24-2, 25-3, 26-1, 27-3, 28-2, 29-2, 30-2, 31-1, 32-2, 33-3, 34-3, 35-2, 36-2, 37-4, 38-2, 39-3, 40-1, 41-2.



ఉష్ణం అనేది ఒక శక్తి స్వరూపం. ఉష్ణశక్తి ఎల్లప్పుడూ అధిక ఉష్ణోగ్రత నుంచి అల్ప ఉష్ణోగ్రత వైపు ప్రయాణిస్తుంది. ఉష్ణోగ్రత వస్తువు/పదార్థం చల్లగా లేదా వేడిగా ఉండటాన్ని తెలుపుతుంది. ఒక వ్యవస్థ పనిచేయడానికి ఉష్ణం సహాయపడుతుంది. వ్యవస్థలోని పరమాణువులు, అణువులు, సూక్ష్మకణాల యాదృచ్ఛిక చలనం వల్ల ఏర్పడే గతిజ, స్థితిజ శక్తుల మొత్తాన్ని ఉష్ణశక్తిగా పేర్కొంటారు. వాహనాలు, యంత్రాలు పనిచేయడానికి కారణం పలు రకాల ఇంధనాలు దహనమై ఉష్ణాన్ని విడుదల చేయడమే. జీవి తీసుకున్న ఆహారం కూడా దహనమై, కావాల్సిన శక్తి ఉత్పత్తి అవుతుంది.

విశిష్టోష్ణం

ఏకాంక ద్రవ్యరాశి ఉన్న పదార్థ ఉష్ణోగ్రతను 1°C పెంచడానికి కావాల్సిన ఉష్ణాన్ని ఆ పదార్థ విశిష్టోష్ణం అంటారు. దీన్ని S అనే అక్షరంతో సూచిస్తారు.

- విశిష్టోష్ణానికి CGS పద్ధతిలో ప్రమాణం కెలోరీ/గ్రామ్-°C

SI పద్ధతిలో ప్రమాణం జౌల్/కిలోగ్రామ్ - కెల్విన్

- ఒక పదార్థం ఉష్ణోగ్రతలో పెరుగుదల దాని స్వభావంపై ఆధారపడి ఉంటుంది.
- పదార్థ విశిష్టోష్ణం విలువ ఎక్కువగా ఉంటే దాని ఉష్ణోగ్రత పెరుగుదల లేదా తగ్గుదల రేటు తక్కువగా నమోదవుతుంది.
- ఒక పదార్థం దాని ఉష్ణోగ్రత మార్పునకు ఎంతమేర విముఖత (Reluctance) చూపుతుందో విశిష్టోష్ణం భావన తెలియజేస్తుంది.

అంతర్గత శక్తి:

ఒక వస్తువు లేదా పదార్థంలోని కణాలు వేర్వేరు శక్తులను కలిగి ఉంటాయి. వీటినే రేఖీయ గతిజ శక్తి, భ్రమణ శక్తి, కంపన శక్తి, స్థితిజ శక్తి అంటారు. ఈ శక్తులన్నింటి మొత్తాన్ని అంతర్గత శక్తి అంటారు.

విశిష్టోష్ణం అనువర్తనాలు

బజ్జీలు లేదా సమోసాలు బయట చల్లగా ఉన్నప్పటికీ తినేటప్పుడు లోపల వేడిగా ఉండి నోరు కాలుతుంది. దీనికి కారణం లోపల ఉన్న పదార్థం విశిష్టోష్ణం విలువ అధికంగా ఉండటమే.

- ఫ్రిజ్‌లో ఉంచిన వివిధ రకాల పళ్లను బయటకు తీస్తే... నీరు ఎక్కువగా ఉన్న పుచ్చకాయ మాత్రమే ఎక్కువసేపు చల్లగా ఉంటుంది. ఎందుకంటే, దానిలో ఉన్న నీరు అధిక విశిష్టోష్ణాన్ని కలిగి ఉండటమే.
- సముద్రతీర ప్రాంతాల్లో నీరు, నేల వేర్వేరు విశిష్టోష్ణాలు కలిగి ఉండటం వల్ల పగలు సముద్రంపై నుంచి చల్లటి గాలులు నేలపైకి వీస్తాయి. అదేవిధంగా సాయంకాలం లేదా రాత్రుల్లో నేలపై నుంచి చల్లటి గాలులు సముద్రంపైకి వీస్తాయి.
- పదార్థ విశిష్టోష్ణాన్ని కనుక్కోవడానికి కింది మిశ్రమాల పద్ధతి సూత్రం ఉపయోగిస్తారు.

వేడి వస్తువులు కోల్పోయిన ఉష్ణం = చల్లని వస్తువులు గ్రహించిన ఉష్ణం

- సాధారణంగా ఘనపదార్థాల విశిష్టోష్ణం కనుక్కునే ప్రయోగాలను కెలోరీమీటర్ అనే పరికరం సహాయంతో నిర్వహిస్తారు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

అణువుల సరాసరి గతిశక్తి.. పరమ ఉష్ణోగ్రతకు అనులోమం!

ఉష్ణం - ఉష్ణోగ్రత

ఉష్ణం

వేడి వస్తువుల నుంచి చల్లని వస్తువులకు ప్రవహించే శక్తి రూపాన్ని ఉష్ణం అంటారు. దీన్ని Q అనే అక్షరంతో సూచిస్తారు. ఉష్ణానికి CGS పద్ధతిలో ప్రమాణం కెలోరీ, SI పద్ధతిలో జౌల్ (J).

1 కెలోరీ = 4.186 జౌల్

కెలోరీ: ఒక గ్రామ్ నీటి ఉష్ణోగ్రతను $1^{\circ}C$ పెంచేందుకు అవసరమయ్యే ఉష్ణాన్ని 1 కెలోరీ అంటారు.

ఉష్ణోగ్రత

ఒక వస్తువు వెచ్చదనం లేదా చల్లదనం స్థాయిని ఉష్ణోగ్రత అంటారు. దీన్ని T అనే అక్షరంతో సూచిస్తారు.

- ఉష్ణోగ్రతకు SI ప్రమాణం కెల్విన్ (K)
- ఉష్ణోగ్రతను సాధారణంగా $^{\circ}C$ (సెల్సియస్) లేదా $^{\circ}F$ (ఫారెన్‌హీట్)లలో తెలియజేస్తారు.

$0\ ^{\circ}C = 273\ K$కు సమానం.

పరమ ఉష్ణోగ్రత

కెల్విన్ మానంలో తెలియజేసే ఉష్ణోగ్రతను పరమ ఉష్ణోగ్రత అంటారు.

- ఒక వస్తువులోని అణువుల సరాసరి గతిశక్తి దాని పరమ ఉష్ణోగ్రతకు అనులోమానుపాతంలో ఉంటుంది.
- రెండు వస్తువులు ఒకదానినొకటి తాకుతూ ఉన్నప్పుడు ఉష్ణశక్తి బదిలీ వల్ల ఉష్ణ సమతాస్థితిని పొందుతాయి. అంటే వేడి వస్తువు నుంచి చల్లని వస్తువుకు ప్రవహించే శక్తి స్వరూపం ఉష్ణం అయితే, ఏ వస్తువు వేడిగా ఉందో, ఏ వస్తువు చల్లగా ఉందో నిర్ణయించే రాశి ఉష్ణోగ్రత. కాబట్టి ప్రవహించే శక్తి ఉష్ణం అయితే, ఉష్ణశక్తి ప్రసార దిశను నిర్ణయించేది ఉష్ణోగ్రత.

ఉష్ణమాపకాలు

సెల్సియస్ థర్మామీటర్:

ఈ పరికరాన్ని ఆండ్రూ సెల్సియస్ అనే శాస్త్రవేత్త రూపొందించారు. ఇది పలుచటి గాజుతో తయారై, బల్బును కలిగి ఉంటుంది.

- ఒక పొడవాటి మందమైన గాజు కేశనాళీయ గొట్టం తీసుకుని ఒకవైపు పూర్తిగా మూసివేయాలి. రెండో కొన నుంచి పాదరసాన్ని నింపుతూ లోపల గాలి బుడగలు లేకుండా జాగ్రత్త వహించాలి. దీన్ని మంచు కరిగే ఉష్ణోగ్రత దగ్గర ఉంచి కనిష్ఠ స్థిర బిందువును, నీరు మరిగే స్థానం వద్ద ఉంచి గరిష్ఠ స్థిర బిందువును ఉష్ణమాపకంపై నమోదు చేయాలి. రెండు స్థిర బిందువుల మధ్య దూరాన్ని 100 భాగాలుగా విభజించాలి. అప్పుడు కనిష్ఠ స్థిర బిందువు $0\ ^{\circ}C$ గా, గరిష్ఠ స్థిర బిందువు $100\ ^{\circ}C$ గా గుర్తించవచ్చు. ఈ విధంగా తయారైన ఉష్ణమాపకాన్ని సెల్సియస్ లేదా సెంటీగ్రేడ్ ఉష్ణమాపకం అంటారు. దీని సహాయంతో $-10\ ^{\circ}C$ నుంచి $110\ ^{\circ}C$ వరకు కొలవవచ్చు.

ఫారెన్‌హీట్ ఉష్ణమాపకం:

ఇది ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగించే మరొక పరికరం.

- సెల్సియస్ నుంచి ఫారెన్‌హీట్‌కు మార్చేందుకు సూత్రం

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}$$

జ్వరమానిని:

సాధారణ పాదరస జ్వరమానినితో జ్వరం తీవ్రతను తెలుసుకుంటారు. జ్వరమానినిగా రూపాంతరం చెందిన ఉష్ణమాపకంలో గాజు గొట్టం పొడవు తక్కువగా ఉంటుంది. సెల్సియస్, ఫారెన్‌హీట్ స్కేళ్లు రెండూ ఉంటాయి.

- సెల్సియస్ మానంలో $35\ ^{\circ}C$ నుంచి $42\ ^{\circ}C$ వరకు, ఫారెన్‌హీట్ మానంలో $95\ ^{\circ}F$ నుంచి $110\ ^{\circ}F$ వరకు ఉష్ణోగ్రతను కొలవవచ్చు.
- జ్వరమానిని బల్బు నుంచి పాదరసం



వ్యాకోచం చెంది పైకి వస్తుంది. కానీ నోటి నుంచి జ్వరమానిని తీసినప్పుడు వెనక్కి వెళ్లలేదు. ఎందుకంటే, లోపల చిన్ననొక్కు ఉండి పాదరసాన్ని ఆపుతుంది.

సిక్స్ గరిష్ఠ – కనిష్ఠ ఉష్ణమాపకం:

ఒక రోజులో నమోదయ్యే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలను కొలిచేందుకు ఒక ప్రత్యేక ఉష్ణమాపకం వాడతారు. దీన్నే సిక్స్ గరిష్ఠ - కనిష్ఠ ఉష్ణమాపకం అంటారు. ఇది U ఆకారంలో ఉండే సన్నటి గాజు గొట్టం. దీని రెండు భుజాలపై విడిగా ఉష్ణోగ్రత స్కేళ్లు ఉంటాయి. ఒకటి గరిష్ఠాన్ని, మరొకటి కనిష్ఠాన్ని గుర్తిస్తాయి. ఇందులో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వయం చాలకంగా నమోదవుతాయి. ఏ సమయంలోనైనా వీటిని తెలుసుకోవచ్చు. మరుసటి రోజు ఒక అయస్కాంతంతో పాదరస మట్టంపై ఉన్న స్ప్రింగ్‌ను యథాస్థితికి చేర్చి తిరిగి వినియోగించవచ్చు.

గెలీలియో ఉష్ణమాపకం:

ఈ ఉష్ణమాపకం ద్వారా ఒక ద్రవంలో వచ్చే ఉష్ణ వ్యాకోచాన్ని ఆధారంగా చేసుకుని పరిసరాల ఉష్ణోగ్రతను నమోదు చేస్తారు. దీన్ని థర్మోస్కోప్ అని కూడా అంటారు. ఇందులో చిన్నచిన్న గాజు గోళాలు ద్రవంలో తేలే మాదిరిగా ఏర్పాటు చేస్తారు. ఈ గోళాలు ఉత్ప్లవనం సూత్రం ఆధారంగా తేలుతాయి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 855

Outstrip

Telugu meaning: అధిగమించు, దాటు

English meaning: The word outstrip (ఔట్‌స్ట్రిప్) is a verb that means to surpass, exceed, or do something better or faster than someone or something else.

Synonyms: Surpass, Exceed; ***Antonyms:*** Fall behind, Lag

Usage: 1. The company managed to outstrip all its competitors by introducing innovative technology ahead of time.

2. Her dedication and consistency allowed her to outstrip the expectations set by her mentors.

Current Affairs



Former captain Rohit Sharma achieved a major milestone by surpassing 20,000 runs in the international cricket. The achievement came during India's 3rd ODI against South Africa in Vishakhapatnam on 6 December 2025.

- Rohit Sharma became only the fourth Indian batter to achieve the landmark and the 14th batter to get to the milestone in international cricket. Rohit joined an elite list of Indian batters, including Sachin Tendulkar (34,357), Virat Kohli (27,910) and Rahul Dravid (24,064).

Union Home and Cooperation Minister Amit Shah inaugurated the EARTH Summit 2025 at Mahatma Mandir, Gandhinagar. He also launched more than 13 new services and products under the 'Sahakar Sarathi' initiative.

The Defence Research and Development Organisation (DRDO) has transferred seven indigenous technologies developed under the Technology Development Fund (TDF) scheme to the Indian Army, Navy and Air Force. The technologies handed over include an Indigenous High-Voltage Power Supply for Airborne Self-Protection Jammers, a Tide-Efficient Gangway for Naval Jetties, Advanced VLF–HF Switching Matrix Systems, and VLF loop aerials for underwater platforms.

The Indira Gandhi National Centre for the Arts (IGNCA) launched the book "Bharat: That Is India – Reclaiming Our Real Identity" by Abhijeet Joag in New Delhi. The event was attended by Bihar's Governor Arif Mohammad Khan, IGNCA Trust President Ram Bahadur Rai among others.

Indian scientists have discovered an ancient spiral galaxy named Alaknanda. The galaxy was formed when the Universe was only 1.5 billion years old, i.e, 1.5 billion years after the Big Bang. Notably, the 13.8-billion-year-old galaxy resembles the Milky Way.

For more Current Affairs: Scan QR code

ఆసిమా ఛటర్జీ

శాస్త్రవేత్తలు విశేషాలు


ఈమె భారతదేశానికి చెందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త. ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫైటోమెడిసిన్ రంగాల్లో చేసిన పరిశోధనలకు ప్రసిద్ధి చెందారు. ముఖ్యంగా ఆల్కలాయిడ్స్, కౌమరియన్స్ (Coumarins), టెర్పెనాయిడ్స్, అనలిటికల్ కెమిస్ట్రీలో పలు ప్రయోగాలు నిర్వహించారు. మన దేశంలో అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఉన్నాయని.. వాటి ద్వారా వివిధ వ్యాధులను నయం చేయొచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మూర్ఛ వ్యాధిని, మలేరియాను నిరోధించే ఔషధాన్ని అభివృద్ధి చేశారు. ఆమె జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

ఆసిమా ఛటర్జీ 1917, సెప్టెంబరు 23న కోల్‌కతాలో జన్మించారు. తండ్రి ఇంద్రనారాయణ ముఖర్జీ తన కుమార్తెకు చిన్నతనం నుంచే మొక్కలు, వాటి ఉపయోగాల గురించి చెబుతుండేవారు. దీంతో ఆసిమాకు ప్రకృతి పట్ల ఇష్టం ఏర్పడింది.

- పాఠశాల విద్య పూర్తయ్యాక ఆమె రసాయనశాస్త్రం వైపు మొగ్గు చూపారు. 1936లో కలకత్తా విశ్వవిద్యాలయంలోని స్కాటిష్ చర్చి కళాశాల నుంచి కెమిస్ట్రీలో ఆనర్స్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1940లో కలకత్తాలోని లేడీ బ్రబోర్న్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. తర్వాత కెమిస్ట్రీ విభాగానికి అధిపతిగా పనిచేశారు.

చివరగా: సంప్రదాయ ఆయుర్వేదాన్ని ఆధునిక వైద్యశాస్త్రంతో అనుసంధానం చేయడం ద్వారా సహజ ఉత్పత్తుల రసాయనశాస్త్ర అభివృద్ధికి ఆమె ఎంతగానో తోడ్పడ్డారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో, మొక్కల ఉత్పత్తులపై ఈమె చేసిన పరిశోధనలు నేటికీ ఎంతో మందికి మార్గదర్శకంగా ఉన్నాయి. ఈమె భారతీయ ఔషధ మొక్కలకు సంబంధించి 'ట్రీటైస్ ఆన్ మెడిసినల్ ప్లాంట్స్'ను ఆరు భాగాల గ్రంథంగా వెలువరించారు. వైద్యశాస్త్ర అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన ఆసిమా 2006, నవంబరు 22న కోల్‌కతాలో మరణించారు.



ఆసిమా చేసిన పరిశోధనలు, పొందిన పురస్కారాలు - గౌరవాలు తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

అభివృద్ధి సమస్యలు - మార్పు

మానవాళి అభివృద్ధిలో విద్య ఎంతో కీలకం. ఇది ఉత్పాదకతను, సృజనాత్మకతను పెంచుతుంది. తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. దేశంలో అక్షరాస్యత శాతం ఎంత ఎక్కువగా ఉంటే ఆ దేశం అంత త్వరగా అభివృద్ధి చెందుతుందనేది ఆర్థికవేత్తల అభిప్రాయం. అందుకే భారతదేశం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, దేశంలో అక్షరాస్యతతోపాటు, నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. దీనికి అవసరమైన ప్రణాళికలు, పథకాలను అమలు చేస్తోంది.



సామాజిక మౌలిక సదుపాయాలు - విద్యారంగం

ఆర్థికాభివృద్ధిలో విద్య పాత్ర

మానవ వనరుల అభివృద్ధికి విద్య, నైపుణ్య శిక్షణ ప్రధానం. దీని ద్వారా కింది అంశాలను సాధించవచ్చు. అవి:

- విద్య, ఆర్థికాభివృద్ధి
- ఆదాయ అసమానతల తగ్గింపు
- గ్రామీణాభివృద్ధి
- కుటుంబ నియంత్రణ
- ఉద్యోగ శిక్షణ

భారతదేశంలో విద్య

దేశ జీడీపీలో 6% విద్యారంగానికి కేటాయించాలని 1968 నాటి జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) సిఫార్సు చేసింది. 1986, 2020 ఎన్ఈపీలోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నారు. అయితే ఇది అమలు కాలేదు.

భారతదేశంలో అక్షరాస్యత రేటు, విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చు, స్థూల దేశీయోత్పత్తిలో విద్యారంగంపై ఖర్చు, ప్రాథమిక విద్యాహక్కు చట్టం, పోషణ్ భీ పఢాయ్ భీ (పీబీపీబీ), ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్ కోర్సు'లో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

PGDM Program

Xavier Institute of Social Service, Ranchi, invites applications for admissions to the PGDM program for the year 2026-2028. Eligible candidates can apply online before 15 December 2025.

Graduate, Diploma Apprentice Posts

Hindustan Aeronautics Limited (HAL) invites applications for the recruitment of one-year Graduate, Diploma Apprentice training posts at Koraput Division, Sunabeda, Odisha, for the year 2025-26. The last date for online applications is 15 December 2025.

AO Jobs

The Oriental Insurance Company Limited (OICL) in Delhi is inviting applications for the Administrative Officer (AO) in various departments. The total no. of posts is 300. The application fee is Rs.1000. Eligible candidates can apply online before 15 December 2025.

Did You Apply..?

Today (December 9) is the last date for the following Jobs/ Apprentice posts

- 82 Manager posts in Bank of Baroda. ***Eligibility:*** Diploma, Degree, PG.
- Field Data Collector Jobs in AIIMS Rajkot. ***Eligibility:*** Degree, PG.
- 150 jobs in TCIL. ***Eligibility:*** Tenth, Diploma/ITI, Degree.
- 16 Management Trainee Posts in BVCFL. ***Eligibility:*** BE/B.Tech, PG, Diploma, CA/ICWAI.

For more information and other notifications - scan QR code

Mensuration

1. The base of a pyramid is an equilateral triangle of side 18 cm. If the height of the pyramid is $\frac{40}{\sqrt{3}}$ cm. Then the volume of the pyramid is:

A) 1008 cucm B) 1080 cucm
C) 1800 cucm D) 1180 cucm
E) 1818 cucm

2. The base of a right prism is a triangle whose sides are 20 cm, 21 cm and 29 cm and its lateral surface area is 1680 sq.cm. What is the volume of the prism?

A) 5040 cucm B) 5004 cucm
C) 5400 cucm D) 5020 cucm
E) 5100 cucm

3. The height of a wall is $5\frac{1}{2}$ times of its width and the length of the wall is $6\frac{1}{3}$ times of its height. If the volume of the wall is 41,382 cum. Then find the width of the wall.

A) $5\frac{1}{3}$ B) 5 m C) 4 m
D) 6 m E) 8 m

4. A metallic sheet is of a rectangular shape with dimensions 45 cm × 32 cm. From each of its corners, a square is cut off, so as to make an open box.

Bank Exams

Quantitative Aptitude

If the length of the square is 7 cm, then the volume of the box is:

A) 3690 cucm B) 3609 cucm
C) 3906 cucm D) 3960 cucm
E) None of the above

5. The size of a wooden block is 24 cm × 18 cm × 6 cm. How many such blocks will be required to construct a solid wooden cube of minimum size?

A) 15 B) 10 C) 14 D) 12 E) 18

6. A square of side $3\frac{3}{4}$ cm is cut off from each corner of a rectangular sheet of length 25 cm and breadth 16 cm and the remaining sheet is folded to form an open rectangular box. The surface area of the box is:

A) $85\frac{3}{4}$ sqcm B) $85\frac{11}{16}$ sqcm
C) $85\frac{15}{16}$ sqcm D) $85\frac{13}{16}$ sqcm
E) None of the above

7. A boat having a length 5 m and breadth 3 m is floating on a lake. The boat sinks by 0.6 cm when a man gets on it. The mass of man is:

A) 90 kg B) 60 kg C) 80 kg
D) 70 kg E) 59 kg

8. A prism and a pyramid have the same base and the same height. Find the ratio of the volumes of the prism and the pyramid.

A) 2 : 3 B) 3 : 1 C) 1 : 3
D) 3 : 2 E) 2 : 5

9. The base of a right prism is a regular hexagon of side 7 cm. If its height is $10\sqrt{3}$ cm, then its volume is:

A) 2205 cucm B) 2105 cucm
C) 2250 cucm D) 2502 cucm
E) None of the above

10. The base of a right prism is a trapezium whose parallel sides are 13 cm, 17 cm and the distance between them is 12 cm. If the volume of the prism is 2250 cucm, then the height of the prism will be:

A) 12.8 cm B) 15 cm C) 12.5 cm
D) 13.5 cm E) 14.1 cm

11. $\frac{2}{3}$ cum of gold sheet is extended by hammering so as to cover an area of $1\frac{1}{4}$ hectare. The thickness of sheet (approx) is:

A) 0.0033 cm B) 0.0053 cm
C) 0.053 cm D) 0.53 cm
E) None of the above

12. A river 1.75 m deep and 39 m wide as flowing at the rate of 3.6 km/hr. The amount of water that runs into the sea per minute in cubic meters is:

A) 4100 cum B) 4055 cum
C) 4059 cum D) 4095 cum
E) 4105 cum

13. If a metallic cuboid weight 25 kg. How much would a miniature cuboid of metal weight, if all dimensions are reduced to $\frac{1}{5}$ th of the original cuboid dimensions.

A) 200 gms B) 250 gms
C) 225gms D) 230 gms
E) None of the above

14. A field is in the form of a rectangle of length 21 m and width 16 m. A pit 8.4 m long, 5 m broad and 0.7 m deep, is dug in a corner of the field and the earth taken out is evenly spread over the remaining area of the field. The level of the field raised (approx) is:

A) 10.4 cm B) 9 cm
C) 8 cm D) 10 cm
E) 7 cm

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

రంగం ఏదైనా 'సమస్య' అనివార్యం. తప్పించుకుంటారా? పరిష్కార కర్తగా మారతారా? మీరు స్పందించే తీరును బట్టే సమాజం, పనిచేసే సంస్థలు మిమ్మల్ని ఓ భిన్నమైన వ్యక్తిగా గుర్తిస్తాయి. సమస్యా పరిష్కార నైపుణ్యాలకు కార్పొరేట్ ప్రపంచంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. సంస్థలన్నీ 'సులభంగా ఛేదించే' సామర్థ్యం ఉన్న వారిని సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. మీ జీవన గమనాన్ని అమాంతం మార్చేయగల గేమ్ ఛేంజర్ లాంటి ఈ నైపుణ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలో తెలుసా?



ఇదీ విధానం

సమస్యా పరిష్కారంలో వివిధ దశలుంటాయి. వాటిలో ప్రధానమైనవి..
- సమస్యను గుర్తించడం
- సమస్యను విశ్లేషించడం
- పరిష్కార మార్గాలు అన్వేషించడం
- అత్యుత్తమ పరిష్కార మార్గాన్ని ఎంపిక చేసుకోవడం
- సమర్థంగా అమలు చేయడం
- ఫలితాలను పరిశోధించడం

పరిష్కార నైపుణ్యం ఉంటే..
కొలువుల కిరీటం!

నాస్కామ్-ఇన్‌డీడ్ ఫ్యూచర్ వర్క్ 2024 నివేదిక ప్రకారం.. 85 శాతం హెచ్ఆర్ లీడర్లు సమస్యా పరిష్కార నైపుణ్యాన్ని ఉద్యోగార్థులకు ఉండాల్సిన ప్రధాన నైపుణ్యంగా పేర్కొన్నారు. కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఎంత పెరిగినా.. తార్కిక విధానంలో సమస్యా పరిష్కార సామర్థ్యం ఉన్న వ్యక్తులకు డిమాండ్ ఏ మాత్రం తగ్గదని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచ పని సంస్కృతిలో దేన్నీ సమస్యగా భావించడం లేదు. కేవలం సవాళ్లుగానే పరిగణిస్తున్నారు. వాటిని సులభంగా ఛేదించే సామర్థ్యం ఉన్న వారి కోసం జల్లెడపడుతున్నారు. ఆ సమస్యలను అవకాశాలుగా మార్చుకుని, సత్తా చాటే వ్యక్తుల కోసం ఎదురుచూస్తున్నారు.

పొందడం ఎలా?

భిన్న పరిస్థితుల్లో ఎదురయ్యే సవాళ్లను ముందుచూపుతో గ్రహించాలి. వాటిని అర్థం చేసుకుని, తార్కికంగా ఆలోచించి, ఉత్తమ పరిష్కార మార్గాలు అన్వేషించాలి. సమర్థంగా వాటిని అమలు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. ఇది మీ తెలివితేటలకు సంబంధించిన నైపుణ్యం అనుకుంటే పొరబడినట్లే. సమస్యా పరిష్కారంలో.. తార్కిక ఆలోచన, నిర్ణయాలు తీసుకోవడం, సృజనాత్మకత, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమర్థంగా వినియోగించడం వంటి నైపుణ్యాలెన్నో భాగంగా ఉంటాయి. అంతేకాకుండా పెద్ద సమస్యను చిన్న భాగాలుగా విభజించి, ఒక్కొక్కటీ పరిష్కరించడం.. వంటి విభిన్న ప్రక్రియలు కలగలిపి ఉంటాయి. ఇంకా చెప్పాలంటే.. మీరు స్కూలు లేదా కాలేజీలో ఏదైనా లెక్కకు జవాబు రాస్తున్నప్పుడు దానిని స్టెప్ బై స్టెప్ చేస్తూ వెళ్తారు కదా! దీన్ని మీ పని వాతావరణంలో అనుకరించడమే. అనుకోని సమస్య ఎదురైనా సరళమైన, సరైన మార్గంలో పరిష్కరించుకుంటూ వెళ్లడమే.

ఎందుకింత ప్రాధాన్యం?

ఇటీవల అన్ని రంగాల్లోనూ ఆటోమేషన్, కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం పెరిగింది. అయితే ఈ పరికరాలు/ఉపకరణాలు వాటికి నేర్పించిన, కోడింగ్ రాసిన విధంగా మాత్రమే పని చేయగలుగుతాయి. కొత్తగా ఉత్పన్నమయ్యే సమస్యలు, సంక్లిష్టమైన వాటిని అవి పరిష్కరించలేవు. వాటికి తప్పనిసరిగా మానవ నైపుణ్యమే కావాలి. అంతే కాకుండా వ్యాపార సరళి ఎప్పుడూ ఒకేలా ఉండదు. మార్కెట్లూ, వినియోగదారుల అవసరాలూ ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఆ సమయంలో తక్షణ ఆలోచన, విశ్లేషణ, వేగవంతమైన నిర్ణయం చాలా అవసరం. అందుకే సమస్యా పరిష్కార నైపుణ్యం ఉన్న వారి కోసం సంస్థలు వెతుకుతున్నాయి.

సాఫ్ట్ స్కిల్స్

- లింక్డ్ ఇన్ వర్క్ ప్లేస్ లెర్నింగ్ రిపోర్టు ప్రకారం ఉద్యోగులకు కావాల్సిన ప్రధాన ఐదు నైపుణ్యాలలో సమస్యా పరిష్కార సామర్థ్యం మొదటి స్థానంలో ఉంది.
- మెకిన్సే గ్లోబల్ స్కిల్ షిఫ్ట్ 2025 ప్రకారం.. తార్కిక ఆలోచన, సమస్యా పరిష్కార నైపుణ్యాలకు డిమాండ్ 2020తో పోల్చితే 29 శాతం పెరిగిందని అంచనా.
- వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ 2023 నివేదిక ప్రకారం.. విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత భవిష్యత్తులో అత్యంత అవసరమైన నైపుణ్యాలుగా ఉంటాయి. ఈ రెండూ సమస్యా పరిష్కారానికి మూలాధారాలు.

ఈ లక్షణాలు అవసరం

ఓపిక కావాలి: సమస్యను చూడగానే ఎలా తప్పించుకోవాలి అనే దానిపైనే మనసు పెడతారు. అలా కాకుండా పరిష్కారం కోసం ప్రయత్నించే ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలి. ఇది ఒక్క రోజులో సాధ్యమయ్యేది కాదు. ఓపికగా అభివృద్ధి చేసుకోవాల్సిన నైపుణ్యం.

సృజనాత్మక నిర్ణయాలు: మీరు ఎదుర్కొంటున్న సవాలును అభివృద్ధికి అవకాశంగా భావించండి. విభిన్నంగా ఆలోచించండి. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించండి. అడుగేసే ముందు ఆ మార్గంలో వెళ్తే ఎదురొచ్చే ఇతర కొత్త సమస్యల గురించి అవగాహనకు రండి. మీ నిర్ణయం వేగంగా, కచ్చితత్వంతో కూడినదై ఉండాలి. పరిష్కారాన్ని అంచెలంచెలుగా అమలు చేయండి. ఏది ఎంత వరకూ చేయాలో అంతే చేయగలిగేలా మీ నిర్ణయాలుండాలి.

నేర్చుకుంటూ ఉండాలి: మీరు పనిచేస్తున్న రంగంలో నిరంతరం ఆధునికీకరణపై దృష్టి పెట్టాలి. కొత్త సాంకేతికతలు, ఆలోచనా పరమైన పద్ధతులు నేర్చుకునే ప్రయత్నం చేయాలి. నేర్చుకునే తత్వం లోపిస్తే ఎదుగుదల నిలిచిపోతుంది. అందుకే నిత్య విద్యార్థిగా ఉండాలి.

పరిశోధన కీలకం: పని సంస్కృతిలో కొన్ని సార్లు క్లిష్టమైన సమస్యలూ ఎదురవుతుంటాయి. వాటి గురించి ఎప్పుడూ విని ఉండకపోవచ్చు. అలాంటి సమయాల్లో ఈ పరిశోధన మీకు ఉపకరిస్తుంది. మీ ఖాళీ సమయాల్లో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించి సమాచారాన్ని క్రోడీకరించాలి. కొత్త మార్కెట్లు, వినియోగదారులు, పోటీదారులు, పరిశ్రమలో కొత్త సాంకేతికతలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవగాహన పెంచుకోవాలి. దీంతో పనిలో రాణించడంతో పాటూ, అందరిలో ప్రత్యేకంగా గుర్తింపు పొందుతారు.

బృందంలో భావవ్యక్తీకరణ: సమస్యను గుర్తించి, పరిష్కారాన్ని కనుగొన్న తర్వాత మీ బృందంతో చర్చించడం చాలా ముఖ్యం. అలాగే బృంద సభ్యులు చెప్పేదీ జాగ్రత్తగా వినాలి. వారి దృక్కోణం నుంచీ ఆలోచించడం నేర్చుకోవాలి. ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి.



ఇలా చేయండి

- విద్యార్థులు 'ఎందుకు' అని ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలి. ఏదైనా సంఘటన, సమస్య ఏర్పడినప్పుడు దాని వెనుక కారణం ఏమై ఉంటుందో అన్వేషించాలి. ఇది మీ విశ్లేషణాత్మక శక్తిని మెరుగుపరుస్తుంది.
- మెదడుకు వ్యాయామం అవసరం. మీ ఖాళీ సమయాల్లో సుడోకు, చెస్, అక్షరాల పజిల్స్ వంటివి ఆడుతుండాలి.
- మీ కాలేజీల్లో ఏదైనా ఈవెంట్ నిర్వహించడం, ఒక చిన్న వెబ్‌సైట్ తయారు చేయడం లేదా మీ కాలనీలో ఏదైనా ఒక సామాజిక సమస్యకు పరిష్కారం కోసం ప్రయత్నించడం చేస్తుండాలి. అవి మీరు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేలా చేస్తాయి.
- విజేతల గురించి చదవండి. ఏదైనా ఒక సంస్థకు ఎదురైన పెద్ద సమస్య ఎలా పరిష్కారమైంది, అందుకు ఉపయోగించిన టూల్స్, బృందంలో ఎలాంటి చర్చలు జరిగేవి.. లాంటివీ తెలుసుకోవాలి.

– గంపా నాగేశ్వర్‌రావు
సైకాలజిస్ట్,
ఇంపాక్ట్ వ్యవస్థాపకులు



టెక్నీషియన్లు

ఇండియా ఆప్టెల్ లిమిటెడ్, రాయ్‌పుర్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
- ప్రాజెక్ట్ టెక్నీషియన్: 149

విభాగాలు: ఫిట్టర్ ఇన్‌స్ట్రుమెంట్స్-61, ఫిట్టర్ ఎలక్ట్రానిక్స్-49, మెషినిస్ట్-07, ఆప్టికల్ వర్కర్-23, ఎలక్ట్రోప్లేటర్-05, పెయింటర్-04.

అర్హత: పదో తరగతి, ఎన్‌సీవీటీ జారీచేసిన ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, అడ్వాన్స్‌డ్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ మెకట్రానిక్స్, మెకానిక్ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, మెకానిక్ ఎంబెడెడ్ సిస్టమ్స్, మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్, మెషినిస్ట్, ఆప్టికల్ వర్కర్, ఎలక్ట్రోప్లేటర్, పెయింటర్ విభాగాల్లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ లేదా నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్ ఉండాలి.

వేతనం: నెలకు రూ.20,000.

వయసు: 18 ఏళ్ల నుంచి 32 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది. **ఎంపిక:** విద్యార్హతల మెరిట్‌తో. **పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 29-12-2025.

చిరునామా: ది ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా ఆప్టెల్ లిమిటెడ్, ఓఫిల్డ్ క్యాంపస్ రాయ్‌పుర్, ఉత్తరాఖండ్. **వెబ్‌సైట్:** https://ddpdoo.gov.in/career

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో..

కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.. తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- గెస్ట్ ఫ్యాకల్టీ - 05

అర్హత: సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(స్టాటిస్టిక్స్)తో పాటు నెట్/సెట్ స్కోరు ఉండాలి.

దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా deansm@uohyd.ac.in కు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 02-01-2026.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://uohyd.ac.in/non-teaching-project-staff/

లఖ్‌నవూ యూనివర్సిటీలో

లఖ్‌నవూ యూనివర్సిటీ.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- రిసెర్చ్ ఇన్వెస్టిగేటర్ - 04 ◆ డేటా అసిస్టెంట్/కంప్యూటర్ కమ్ టాబ్యులేటర్ - 04 ◆ రిసెర్చ్ ఫెలో-1 - 01
- రిసెర్చ్ ఫెలో-2 - 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 30-12-2025.

చిరునామా: డైరెక్టర్ కార్యాలయం, జనాభా పరిశోధన కేంద్రం, ఆర్థిక శాస్త్ర విభాగం, లఖ్‌నవూ యూనివర్సిటీ, ఉత్తర్‌ప్రదేశ్ - 226007.

వెబ్‌సైట్: https://www.lkouniv.ac.in/en/page/current-openings

అప్రెంటిస్‌లు

హిందుస్థాన్ ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్ఎల్), గోరఖ్‌పుర్.. బరౌనీ యూనిట్‌లో 33 టెక్నీషియన్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- టెక్నికల్ అప్రెంటిస్ ట్రెయినీ: ఇన్‌స్ట్రుమెంటేషన్- 02, ఎలక్ట్రికల్- 02, కెమికల్- 09, సివిల్- 02, మెకానికల్ -05
- టెక్నికల్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ- 13

అర్హత: టెక్నికల్ అప్రెంటిస్ ట్రెయినీ పోస్టులకు సంబంధిత విభాగంలో డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు బీఈ/బీటెక్, బీకాం/బీబీఏ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌లో బీఎస్సీ ఉండాలి.

స్టైపెండ్: నెలకు టెక్నికల్ అప్రెంటిస్‌కు రూ.9,000; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 8,000.

వయసు: 18 నుంచి 25 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తులు: ఆన్‌లైన్‌లో ఎన్ఏటీఎస్ పోర్టల్ ద్వారా పూర్తిచేయాలి.

చివరి తేదీ: 20-12-2025.

వెబ్‌సైట్: https://hurl.net.in/

ఏఎంపీఆర్ఐలో సైంటిస్టులు

సీఎస్ఐఆర్ సంస్థ అడ్వాన్స్‌డ్ మెటీరియల్ అండ్ ప్రాసెసెస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, భోపాల్.. తాత్కాలిక ప్రాతిపదికన 20 సైంటిస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- సైంటిస్టు: 17
- సీనియర్ సైంటిస్టు: 03

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: సైంటిస్టుకు 32 ఏళ్లు; సీనియర్ సైంటిస్టుకు 37 ఏళ్లు మించకూడదు.

వేతనం: సైంటిస్టుకు రూ.1,26,900; సీనియర్ సైంటిస్టుకు రూ.1,46,770.

ఎంపిక: దరఖాస్తుల షార్ట్ లిస్ట్, విద్యార్హతలు, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10-12-2025. **వెబ్‌సైట్:** https://ampri.res.in/

పీజీడీఎం కోర్సు

జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీస్, రాంచీ.. పీజీడీఎం కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) 2026-28

స్పెషలైజేషన్లు: హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, రూరల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్. **అర్హతలు:** బ్యాచిలర్ డిగ్రీతో పాటు గ్జాట్2026/ క్యాట్2025/ సీమ్యాట్2026 లేదా ఎక్స్ఐఎస్ఎస్ స్కోరు ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.12.2025. **వెబ్‌సైట్:** https://xiss.ac.in/admission/

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. 23 ప్రాజెక్ట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీచేయనుంది. బీఈ/బీటెక్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగానుభవం, ధ్రువపత్రాల పరిశీలన, పర్సనల్ ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

ఈసీఐఎల్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్లు

ప్రాజెక్ట్ ఇంజినీర్ 15, టెక్నికల్ ఆఫీసర్ 5, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్ 3 ఖాళీలు ఉన్నాయి. ఒప్పంద ప్రాతిపదికన ముందుగా ఏడాది కాలానికి ఎంపిక చేసినప్పటికీ నాలుగేళ్లు పొడిగిస్తారు.

ఎంపిక: విద్యార్హతలు, ఉద్యోగానుభవంతో షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు ఏడాది అనుభవానికి ఐదు మార్కులు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ఏడాది ఉద్యోగానుభవానికి పది మార్కుల చొప్పున కేటాయిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకు 50 మార్కులు. ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ఒకేరోజున నిర్వహిస్తారు.

- ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠ వయసులో సడలింపులు, రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- సౌత్‌జోన్ వారికి.. ఈసీఐఎల్ జోనల్ ఆఫీస్, ఎకనామిస్ట్ హౌస్, పోస్ట్ బాక్స్ నం.3148, ఎస్-15, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చెన్నై-600032లో వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.



అర్హతలు

- ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు.. సీఎస్ఈ/ ఐటీ/ ఈసీఈ/ ఈఈఈ/ ఈఐ/ ఇన్‌స్ట్రుమెంటేషన్‌తో బీఈ/ బీటెక్, మూడేళ్ల అనుభవం.
- టెక్నికల్ ఆఫీసర్‌కు.. సీఎస్ఈ/ ఐటీ/ ఈసీఈ/ ఈటీసీ/ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్, ఏడాది అనుభవం ఉండాలి.
- అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు.. ఎలక్ట్రానిక్స్/ ఈసీఈ/ ఎలక్ట్రికల్/ ఈఈఈ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఈఅండ్ఐ/ మెకానికల్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిప్లొమా, ఏడాది అనుభవం ఉండాలి. ఇంజినీరింగ్ డిగ్రీ, డిప్లొమాలను 60 శాతం (ఎస్సీ/ ఎస్టీలు 50 శాతం)తో పూర్తిచేయాలి.

వయసు: ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు 33 సంవత్సరాలు, టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్లకు 30 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ - ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు మొదటి ఏడాది నెలకు రూ.40,000, రెండో ఏడాది రూ.45,000, మూడో ఏడాది 50,000, నాలుగో ఏడాది రూ.55,000. టెక్నికల్ ఆఫీసర్‌కు మొదటి ఏడాది రూ.25,000. రెండో ఏడాది రూ.28,000, మూడు, నాలుగు ఏడాదుల్లో రూ.31,000. అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు నెలకు రూ.25,506.

వాక్ఇన్ ఇంటర్వ్యూ తేదీ: 16.12.2025

వెబ్‌సైట్: www.ecil.co.in

మెకానికల్ తర్వాత?

మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. ఏడాది వ్యవధి ఉండే షార్ట్‌టర్మ్ కోర్సులు ఏవైనా చదివితే, వెంటనే కొలువు పొందడానికి అవకాశం ఉంటుందా? - రిషి



■ ఇటీవల కాలంలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల నుంచి పరిశ్రమలు వైవిధ్యమైన నైపుణ్యాలు కోరుతున్నాయి. మెకానికల్ ఇంజినీరింగ్ చదివినవారికి సంప్రదాయ మాన్యుఫ్యాక్చరింగ్ ఉద్యోగాలతో పాటు.. డిజైన్, ఆటోమేషన్, రోబోటిక్స్, డేటా అనలిటిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఈ నూతన టెక్నాలజీలను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలంటే తక్కువ వ్యవధి ఉన్న సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా ప్రోగ్రామ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా సీఎన్‌సీ క్యాడ్, క్యామ్, సాలిడ్‌వర్క్స్, క్యాటియా, క్రియో, జీడీ అండ్ టీ లాంటి వాటిలో సర్టిఫికెట్/ డిప్లొమా చేస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయి. వీటితో పాటు ఆధునిక ఆటోమేషన్ టెక్నాలజీ కోర్సులైన రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, పీఎల్‌సీ స్కాడా వంటి కోర్సులు మెకానికల్ విద్యార్థులకు డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో మాత్రమే కాకుండా, డిజిటల్ ఇండస్ట్రీ 4.0 దిశగా అడుగులు వేయడానికి సహాయపడతాయి.

● ప్రస్తుతం ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్స్) రంగం బాగా విస్తరిస్తోంది. భారత్‌లో ఈవీ తయారీ కోసం అనేక సంస్థలు పెట్టుబడులూ పెడుతున్నాయి. ఈ రంగానికి చెందిన బ్యాటరీ టెక్నాలజీ, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (బీఎంఎస్), మోటార్ పవర్‌ట్రెయిన్ డిజైన్ వంటి కోర్సులు మెకానికల్ ఇంజినీర్లకు విలువైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. టూల్ అండ్ డై మేకింగ్, రోబోటిక్స్, మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ మెయింటెనెన్స్ వంటి కోర్సులు పరిశ్రమలో నేరుగా ఉపయోగపడే నైపుణ్యాలను కల్పిస్తాయి. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ హైదరాబాద్‌లో.. ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్, క్యాడ్-క్యామ్, సీఎన్‌సీ మెషినింగ్ వంటి కోర్సులకు అధిక డిమాండ్ ఉంది. ఈ సంస్థలో శిక్షణ పొందిన వారు తయారీ రంగం, ఏరోస్పేస్ పరిశ్రమ, ఆటోమొబైల్ కంపెనీలు, మౌల్డ్ డిజైన్ యూనిట్లలో వేగంగా ఉద్యోగాలు పొందుతున్నారు.

ఇటీవలి కాలంలో అనేక మంది మెకానికల్ ఇంజినీర్లు డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, ఆటోమేషన్ కోడింగ్ వంటి ఐటీ రంగాల్లోకీ ప్రవేశిస్తున్నారు. పైథాన్ లాంగ్వేజ్‌ని డేటా అనాలిసిస్, డిజైన్ ఆటోమేషన్, సిమ్యులేషన్, స్క్రిప్టింగ్ వంటి రంగాల్లో విస్తృతంగా వాడుతున్నారు. పైథాన్‌తో పాటూ.. పవర్ బీఐ, టాబ్లో లాంటి డేటా విజువలైజేషన్ టూల్స్ నేర్చుకుంటే మెకానికల్, అనలిటిక్స్ కలయికతో మెరుగైన ఉద్యోగాలు పొందవచ్చు. ప్రస్తుతం పైథాన్ ఫర్ ఇంజినీర్స్ కోర్సుకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

● డిజిటల్ ఇండస్ట్రీస్ పెరుగుతున్న నేపథ్యంలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు.. సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ ఇంజినీరింగ్, క్లౌడ్ టెక్నాలజీల్లో శిక్షణ పొందుతున్నారు. ఎథికల్ హ్యాకింగ్, క్లౌడ్ ఫండమెంటల్స్, సెక్యూరిటీ అనలిస్ట్ వంటి కోర్సులు టెక్నాలజీ రంగంలో మంచి వేతనాలతో కెరియర్ అందిస్తున్నాయి.

● మెకానికల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు హెచ్‌వీఏసీ (హీటింగ్, వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్), డిజైన్, డక్ట్ డ్రాఫ్టింగ్, చిల్లర్ సిస్టమ్ అనాలిసిస్ వంటి కోర్సుల్లో ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది.

● ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ డిప్లొమాలు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థల్లో నిరంతర అవకాశాలను అందిస్తాయి. ఆఫ్రికా, గల్ఫ్ దేశాల్లో హెచ్‌వీఏసీ, సేఫ్టీ ఇంజినీర్లకు అధిక వేతనాలు లభిస్తాయి.

పైన చెప్పిన విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని మీ కెరియర్‌కు ఉపయోగపడే సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

చలిలో చదవలేకపోతున్నారా?

ఈ కాలంలో రాత్రిళ్లు త్వరగా నిద్ర పోవాలనిపిస్తుంది. ఉదయాన్నే లేవాలనిపించదు. దాంతో చదవాల్సినవన్నీ వాయిదా పడుతూ సమయమెంతో వృథా అవుతుంది. అలా కాకూడదంటే...

పగటి సమయం తక్కువగా, రాత్రిళ్లు ఎక్కువగా ఉండే ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం కాస్త కష్టంగానే ఉంటుంది. అయితే సరైన పఠన పద్ధతులను పాటించడానికి ప్రయత్నించాలి.


- బయటి వాతావరణం ఎలాగూ బాగా చలిగా ఉంటుంది. కాబట్టి చదివే ప్రదేశం కాస్త వెచ్చగా, వెలుతురుతో ఉండేలా చూసుకోవాలి. చుట్టూ ప్రకాశవంతమైన వాతావరణం ఉండటం వల్ల చురుగ్గా ఉండి చక్కగా చదవగలుగుతారు.
- కుర్చీలో విశ్రాంతిగా కూర్చుంటే నిద్ర ముంచుకురావచ్చు. నిటారుగా కూర్చుని చదవడానికి ప్రయత్నించాలి. ఇలాచేయడం వల్ల ఏకాగ్రత నిలుస్తుంది.
- ఏ పని చేయాలన్నా ప్రణాళిక ఎంతో ముఖ్యం. ఇది లేకపోతే ఏదీ సక్రమంగా పూర్తికాదు. అందుకే స్టడీ ప్లాన్ వేసుకుని దాన్ని కచ్చితంగా అమలుచేయాలనే నియమం పెట్టుకోవాలి. ప్రతి సబ్జెక్టుకూ నిర్ణీత సమయాన్ని కేటాయించి.. ఆ వ్యవధిలోనే దాన్ని పూర్తిచేయాలి.
- నిరవధికంగా చదవకుండా మధ్యలో చిన్న విరామం తీసుకోవాలి. ఈ పద్ధతి వల్ల ఏకాగ్రత పెరుగుతుందని కొన్ని అధ్యయనాలూ చెబుతున్నాయి.
- సూర్యరశ్మి ఉండటం వల్ల పగటిపూట ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. కాబట్టి ఈ సమయంలోనే నోట్సు రాసుకోవడం, తప్పనిసరిగా చదవాల్సిన వాటిని పూర్తిచేయాలి.
- ఈ కాలంలో వాతావరణం చల్లగా ఉండటంతో కాస్త మందకొడిగా ఉంటుంది. దీనికితోడు కడుపు నిండా తిని చదివితే నిద్ర ముంచుకొచ్చేస్తుంది. అలాగే మసాలా వంటకాలకు కాస్త దూరంగా ఉండి పండ్లు, డ్రైఫ్రూట్లను ఎక్కువగా తీసుకోవాలి.



- కొందరు ఒంటరిగా చదవడానికి ఇష్టపడతారు. మరికొందరు ఇతరులతో కలిసి చదవాలనుకుంటారు. ఎవరికి ఇష్టమైన పద్ధతిని వాళ్లు ఎంచుకోవచ్చు. అయితే స్నేహితులతో కలిసి చదవడం వల్ల కొన్నింటిని చర్చించడానికి వీలవుతుంది. దీంతో ఆసక్తి పెరిగి.. కొత్త ఆలోచనలు రావొచ్చు కూడా.
- కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉండాలన్నా, చదివినవి గుర్తుండాలన్నా తగినంత నిద్ర అవసరం. అలాగే ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం అలవాటు చేసుకోవాలి. మొబైల్ స్క్రీన్ సమయాన్ని నియంత్రించి.. కచ్చితమైన నిద్ర వేళలను పాటిస్తే మంచి ఫలితాలను రాబట్టవచ్చు.
- ప్రతిరోజూ ఏమేం చదవాలనేది లిస్టు రాసుకోవాలి. చదివిన వాటిని కొట్టివేయాలి. దీంతో ఏ రోజు పనులను ఆ రోజే పూర్తి చేయగలుగుతారు.
- స్ఫూర్తిదాయక వాక్యాలను కంటికి కనిపించేలా అమర్చుకోవాలి. ఎప్పుడైనా కాస్త బద్ధకంగా అనిపించినా అవి అవసరమైన ప్రేరణను అందిస్తాయి. దాంతో ఎప్పటి పనులను అప్పుడే ఉత్సాహంగా పూర్తి చేయగలుగుతారు.

సరే.. ఇకపై 'బంకిం బాబు' అంటాను

- మిమ్మల్ని దాదా అనైనా అనవచ్చా?
- సౌగత్ రాయ్ అభ్యంతరంపై మోదీ



దిల్లీ: వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని బంకిం దా (దాదా) అని ప్రధాని నరేంద్ర మోదీ పలుమార్లు సంబోధించడంపై తృణమూల్ ఎంపీ సౌగత్ రాయ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. సోదరుడు అనే సంబోధించేందుకు బెంగాలీ భాషలో 'దా' అని వాడతారని.. సాంస్కృతిక దిగ్గజమైన బంకించంద్రను 'బంకిం బాబు' అని సంబోధించాలని సూచించారు. ప్రధాని సానుకూలంగా స్పందించారు. సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఇది చోటుచేసుకుంది. ఛటర్జీని ఇకనుంచి బంకిం బాబు అనే సంబోధిస్తానన్నారు. పొరబాటును సరిచేసినందుకు సౌగత్‌రాయ్‌కు ధన్యవాదాలు చెబుతూ.. "నేను మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా..? దానిపై కూడా ఏమైనా అభ్యంతరాలున్నాయా..?" అని సరదాగా ప్రశ్నించారు. బిహార్‌లో గెలిచామని, ఇక బెంగాల్‌లోనూ గెలుస్తామని భాజపా ఎంపీలు నినాదాలు చేశారు. దేశ సామరస్యత, బలానికి వందేమాతరం ప్రతీక అని స్పీకర్ ఓంబిర్లా పేర్కొన్నారు.

చరిత్రను తిరగరాసే ప్రయత్నం: గొగొయ్

చరిత్రను తిరగరాసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ విమర్శించారు. వందేమాతరంపై చర్చకూ రాజకీయ రంగు పులమాలని చూస్తున్నారని, భాజపా ఎంతగా ప్రయత్నించినా నెహ్రూ ప్రాభవానికి మచ్చ తీసుకురాలేరని చెప్పారు. ఎక్కడ ఎలాంటి అవకాశం వచ్చినా నెహ్రూను ప్రస్తావించడం మోదీకి పరిపాటిగా మారిందన్నారు. ఏయే చర్చల్లో ఎన్నిసార్లు ఆయన పేరును ఉటంకించారో లెక్కలు వివరించారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఈ చర్చలో పాల్గొంటూ- స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర లేనివారు వందేమాతరం విలువ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు.

మోదీ క్షమాపణ చెప్పాలన్న కాంగ్రెస్

వందేమాతరం విషయంలో వక్రీకరణలతో దేశాన్ని తప్పుదోవ పట్టించడానికి ప్రధాని మోదీ ప్రయత్నించారనీ, దానికి గానూ ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. స్వాతంత్ర్య పోరాట యోధుల్ని, విశ్వకవి ఠాగూర్‌ను కూడా మోదీ అవమానించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆక్షేపించారు.

అపరాధ భావనతోనే రాహుల్ మాట్లాడలేదు: భాజపా

లోక్‌సభలో చర్చలో విపక్షనేత రాహుల్‌గాంధీ పాల్గొనకపోవడాన్ని భాజపా తప్పుబట్టింది. వందేమాతరాన్ని తమ కుటుంబం ఎలా వంచించిందో తెలుసు కాబట్టి ఆ అపరాధ భావనతోనే ఆయన ముఖం చాటేశారని భాజపా అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర విలేకరుల సమావేశంలో విమర్శించారు.

రాష్ట్రాలకు ఏమిస్తారు?

- 'పాన్ మసాలా సెస్'పై రాజ్యసభలో స్పష్టత కోరిన సభ్యులు
- బిల్లుకు పార్లమెంటు ఆమోదం
- దేశ భద్రతకు ఈ సెస్సు తప్పదన్న నిర్మలా సీతారామన్



దిల్లీ: 'ఆరోగ్య భద్రత నుంచి జాతీయ భద్రత సెస్' పేరుతో పాన్ మసాలా కంపెనీల నుంచి వసూలు చేసే దాంట్లో రాష్ట్రాలకు ఏమిస్తారని రాజ్యసభలో పలువురు సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సోమవారం రాజ్యసభలో 'ఆరోగ్య భద్రత నుంచి జాతీయ భద్రత బిల్లు-2025' పేరుతో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం లభించింది. ఈ నెల 5వ తేదీనే ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఆరోగ్య, జాతీయ భద్రతలకు వెచ్చించే నిధుల వనరులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. ఈ బిల్లుద్వారా పాన్ మసాలా తయారుచేసే కంపెనీల ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి జీఎస్టీకి అదనంగా సెస్సును కేంద్రం వసూలు చేయనుంది. ప్రస్తుతం పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 28శాతం జీఎస్టీతోపాటు పరిహార సెస్సును వసూలు చేస్తోంది. దాని స్థానంలో పొగాకుపై ఎక్సైజ్ డ్యూటీని, పాన్ మసాలాపై సెస్సు విధించనుంది.

'రాష్ట్రాల నుంచి పలుమార్లు విజ్ఞప్తులు వచ్చినా సెస్సులు, సర్‌ఛార్జీల్లో వాటికి భాగం ఇవ్వడం లేదు. ఈ బిల్లు ద్వారా అయినా రాష్ట్రాలకు వాటా చెల్లిస్తారా అనే అంశంలో స్పష్టత ఇవ్వాలని మంత్రిని కోరుతున్నా. ఎందుకుంటే ఆరోగ్యం అనేది రాష్ట్రాల పరిధిలోని అంశం. సెస్సువల్ల కేంద్ర ఆదాయం బాగా పెరిగింది. దానివల్ల రాష్ట్రాలకు పన్నుల వాటాల్లో నష్టం కలుగుతోంది. 2025 ఆగస్టులో కాగ్ ఇచ్చిన నివేదిక ప్రకారం.. 3.69 లక్షల కోట్ల రూపాయలను రాష్ట్రాలకు కేంద్రం పంపిణీ చేయలేదు' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ అశోక్ కుమార్ మిత్తల్, వైకాపా ఎంపీ గొల్ల బాబూరావు, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, తృణమూల్ ఎంపీ సాకేత్ గోఖలే పేర్కొన్నారు. ఈ బిల్లుపై చర్చలో భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భాజపా సభ్యులు మాయా నరోలియా, ధనంజయ్ భీంరావ్ మహాదిక్, కవితా పటీదార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య, జాతీయ భద్రత నిధుల కోసం ఈ బిల్లును తెస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో చర్చకు ఆమె సమాధానమిచ్చారు. దీనిని నిత్యావసరాలపై విధించడం లేదని, హానికలిగించే వస్తువులపైనే వేస్తున్నామని వెల్లడించారు. 'నిర్దిష్ట ఆయుధ, అటానమస్ వ్యవస్థలు, అంతరిక్ష బలం, సైబర్ ఆపరేషన్స్, యుద్ధరంగ నిఘా వంటి వాటిపై ఆధునిక ఘర్షణలు ఆధారపడి ఉంటున్నాయి. వాటికి అత్యధికంగా వ్యయం చేయాల్సి వస్తోంది. టెక్నాలజీ కూడా వేగంగా మారుతోంది. ఎప్పటికప్పుడు అందులో అప్‌డేట్ కావాల్సి ఉంది. దానికీ పెట్టుబడులు కావాలి. అందుకే ఆర్థిక వనరులను అదనంగా సమకూర్చుకోవాల్సి వస్తోంది' అని సీతారామన్ వివరించారు.

అటవీ సమస్యల పరిష్కారానికి సుప్రీంకోర్టు వరకు ఎందుకు?

దిల్లీ: అడవులు, సరస్సులకు సంబంధించిన వివాదాలను ఆయా రాష్ట్ర హైకోర్టులలో పరిష్కరించుకోవాల్సింది పోయి సుప్రీంకోర్టు వద్దకు రావడమేమిటని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం సోమవారం ప్రశ్నించింది. పైగా 1995లో దాఖలైన గోదావర్మన్ తిరుమలపాడ్ ప్రజాహిత వ్యాజ్యం (పిల్)పై విచారణ ఇంకా పూర్తికావలసి ఉన్నందున ఆలోగా అత్యవసర సమస్యలపై తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వాలంటూ మధ్యంతర దరఖాస్తులు పెట్టడం ఆనవాయితీ అయిపోయిందని వ్యాఖ్యానించింది. చండీగఢ్ సమీపంలోని సుఖ్నా సరస్సు కబ్జాలకు గురి కావడంతో అక్రమ కట్టడాలను కూల్చేయాలని 2020లో పంజాబ్-హరియాణా హైకోర్టు ఆదేశించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వుల కోసం కొందరు సుప్రీంకోర్టు గుమ్మం తొక్కారు. సుఖ్నా సరస్సు పంజాబ్-హరియాణా హైకోర్టుకు కేవలం 500 మీటర్ల దూరంలో ఉందని, దాని రక్షణకు ఉత్తర్వులిచ్చే అధికారం హైకోర్టుకు ఉండగా, దాన్ని తాము కబ్జా చేయడమేమిటని సీజేఐ ప్రశ్నించారు. ఇదంతా ప్రైవేటు డెవలపర్లు, మరికొందరు కలిసి ఆడుతున్న నాటకంలా ఉందన్నారు. అటవీ సమస్యలన్నీ సుప్రీంకోర్టు దాకా రావడమెందుకని ప్రశ్నించారు.

యునెస్కో నామినేషన్లలో దీపావళి పండుగ

- ఎర్రకోటలో సదస్సు ప్రారంభం

దిల్లీ: సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు యునెస్కో నిర్వహిస్తున్న వారంరోజుల సదస్సు ముందుకు దీపావళి పండుగ సహా 67 నామినేషన్లు వచ్చాయి. 79 దేశాలు వీటిని సమర్పించాయి. సదస్సు దిల్లీలోని ఎర్రకోటలో ప్రారంభమైంది. ఇలాంటిది మన దేశంలో జరగడం ఇదే తొలిసారి. వారసత్వ జాబితాల్లో చేర్చడానికి వచ్చిన ప్రతిపాదనల్ని అంతర్ ప్రభుత్వ కమిటీ పరిశీలిస్తుంది. గుర్తింపు పొందడానికే కాకుండా పరిరక్షణకు ఈ జాబితాలు శక్తిమంతమైన ఆయుధాలని యునెస్కో పేర్కొంది. హస్తకళలు, వాయిద్య పరికరాలు వంటివి నామినేషన్లలో ఉన్నాయి. సాంస్కృతిక శక్తితో తరతరాలను అనుసంధానం చేయడానికి దేశం కట్టుబడి ఉందని, దానిలో భాగంగానే దిల్లీలో సదస్సు జరుగుతోందని ప్రధాని నరేంద్రమోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

కాంగోలో బాంబు పేలుడు.. 30 మంది మృత్యువాత

గోమా: ఆఫ్రికా దేశమైన కాంగోలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. కాంగో సైన్యం, ప్రభుత్వ అనుకూల పౌరసైన్యం మధ్య సోమవారం ఘర్షణలు చెలరేగాయి. అనంతరం తూర్పు కాంగోలోని సాంగే పట్టణంలో బాంబు పేలుడు చోటుచేసుకుంది. పేలుడు తీవ్రతకు 30 మంది మృత్యువాతపడ్డారు. 20 మంది గాయపడ్డారు.

దక్షిణ యెమెన్‌పై యూఏఈ మద్దతుదారుల పట్టు

ఎడెన్: యెమెన్ గగనతలం సోమవారం మూతపడింది. చమురు సమృద్ధిగా ఉన్న దేశ దక్షిణ ప్రాంతంపై యూఏఈ మద్దతున్న వేర్పాటువాదులు.. పట్టు సాధించడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో యెమెన్‌కు వచ్చి వెళ్లే విమానాలను సౌదీ అరేబియా అనుమతించలేదు. ఎడెన్ విమానాశ్రయంలో వందల మంది చిక్కుకుపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికి విమానాలను అనుమతించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. 2015 నుంచి యెమెన్ గగనతలాన్ని సౌదీ నియంత్రిస్తోంది.

లైంగిక వేధింపుల కేసుల్లో జడ్జీల అనుచిత వ్యాఖ్యలకు కళ్లెం



- హైకోర్టులు, ట్రయల్ కోర్టులకు మార్గదర్శకాలు జారీ చేస్తామన్న సర్వోన్నత న్యాయస్థానం

దిల్లీ: లైంగిక వేధింపుల కేసుల విచారణ సమయంలో కొందరు జడ్జీలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు బాధితులను, వారి కుటుంబ సభ్యులనూ అధైర్యపరిచేలా, భయాందోళనలకు గురిచేసేలా ఉంటున్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇటువంటి వాటిని నివారించటానికి సమగ్ర మార్గదర్శకాలు జారీచేయనున్నట్లు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సోమవారం వెల్లడించింది. బాలికపై లైంగిక దాడి కేసులో అలహాబాద్ హైకోర్టు మార్చి 17న వెలువరించిన ఉత్తర్వుల్లోని వివాదాస్పద వ్యాఖ్యలను సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా పలు ఇతర న్యాయస్థానాల్లోనూ మౌఖికంగా, లిఖిత పూర్వకంగానూ ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తోన్నట్లు ధర్మాసనం దృష్టికి వచ్చింది. 'మహిళలు రాత్రి వేళల్లో సంచరించడమంటే నేరగాళ్లను ఆహ్వానించినట్లే'నని మరో కేసులో పేర్కొన్న అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలను సీనియర్ న్యాయవాది శోభాగుప్తా ఈ సందర్భంగా ప్రస్తావించారు. కలకత్తా, రాజస్థాన్ హైకోర్టులలోనూ ఇలాంటి ఉదంతాలున్నాయని తెలిపారు. సోమవారం ఒక ట్రయల్ కోర్టు విచారణలోనూ బాధితురాలిని మాటలతో వేధించారని మరో న్యాయవాది పేర్కొన్నారు. లైంగిక వేధింపుల బాధితులను, వారి కుటుంబ సభ్యులను అనుచిత వ్యాఖ్యలతో బాధిస్తే వారు కేసులను ఉపసంహరించుకునే ప్రమాదం ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి విచారణ సమయానికి న్యాయవాదులు తమ సూచనలను లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించారు. 'బాలిక వక్షోజాలను పట్టుకునే యత్నం చేయడం, లోదుస్తులను తొలగించబోవడం అత్యాచారం నేరం కిందకు రాదు. తక్కువ నేరానికి వర్తించే సెక్షన్ కింద కేసు నమోదు చేయాల'ంటూ అలహాబాద్ హైకోర్టు మార్చి 17నాటి ఉత్తర్వుల్లో పేర్కొనడంపై వివాదం తలెత్తిన విషయం తెలిసిందే.

జెలెన్‌స్కీయే వెనక్కి లాగుతున్నారు

- ఉక్రెయిన్ శాంతి ఒప్పందంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



కీవ్: రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. దౌత్యపరమైన సంప్రదింపులకు కీవ్ నుంచి సరైన స్పందన రావడం లేదని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా శాంతి ప్రతిపాదనను చదవకపోవడం నాకు కొంచెం నిరాశ కలిగించింది. ఈ ప్రతిపాదనను ఆ దేశ ప్రజలు ఇష్టపడుతున్నారు. జెలెన్‌స్కీ మాత్రం అంగీకరించడం లేదు. ఈ శాంతి ప్రణాళికకు రష్యా కూడా సుముఖంగానే ఉందని నమ్ముతున్నా. జెలెన్‌స్కీ సంతృప్తిగా ఉన్నారా లేరా అనే విషయం నాకు కచ్చితంగా తెలియదు" అని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్, అమెరికా అధికారులు మూడు రోజులుగా జరుపుతున్న చర్చలు శనివారం ముగిశాయి. ప్రతిపాదనలపై ఉక్రెయిన్ బృందం సంతృప్తిగా ఉన్నా, జెలెన్‌స్కీ కారణంగా చర్చలు ముందుకు వెళ్లడం లేదని అమెరికా మండిపడుతోంది.

చర్చల నుంచి ట్రంప్ వైదొలిగే అవకాశం : జూనియర్ ట్రంప్

ఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సీనియర్ అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణల కారణంగా తన తండ్రి శాంతి చర్చల నుంచి పూర్తిగా వైదొలిగే అవకాశం ఉందని ఆయన చెప్పడం గమనార్హం. దోహా ఫోరమ్‌లో ట్రంప్ జూనియర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ దేశం రష్యా కంటే చాలా ఎక్కువ అవినీతిమయం అని అన్నారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు చర్చల నుంచి వైదొలగుతారా అని విలేకరులు ప్రశ్నించగా, అది కూడా జరగొచ్చని ట్రంప్ జూనియర్ సమాధానమిచ్చారు.

లాభసాటిగా ఉన్నచోట నుంచే భారత్ చమురు కొంటుంది

- రష్యా అధ్యక్ష భవనం వ్యాఖ్య

మాస్కో: భారత్ ఒక సార్వభౌమ దేశమని, ఎక్కడ లాభదాయకంగా ఉందనుకుంటే అక్కడి నుంచి చమురు కొనుగోలు చేసే స్వేచ్ఛ ఆ దేశానికి ఉందని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ పేర్కొంది. భారత్ తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునే విధానానికి కట్టుబడి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేసింది. రష్యా నుంచి చమురు కొంటోందన్న అక్కసుతో అమెరికా.. ఇండియా నుంచి వస్తున్న ఎగుమతులపై అదనంగా 25 శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. ఆ నెల చివరినాటికి దాన్ని 50 శాతానికి పెంచింది. ఇటీవల భారత్‌లో పర్యటించిన రష్యా అధ్యక్షుడు పుతిన్.. ప్రధాని మోదీతో చర్చల అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చమురు అంశాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా రష్యా కొనసాగుతుందని పేర్కొన్నారు. "నాకు తెలిసినంతవరకూ భారత్.. తన ఆర్థిక ప్రయోజనలకు అనుగుణంగా నడుచుకుంటుంది" అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సోమవారం పేర్కొన్నారు.

బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నేతలతో జెలెన్‌స్కీ భేటీ

- శాంతి ప్రణాళికపై చర్చ



లండన్: శాంతి ప్రణాళికకు అంగీకారం తెలపాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచుతున్న వేళ లండన్‌లో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌లతో జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై వారితో దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. ఉక్రెయిన్‌కు ఐరోపాలో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ సన్నిహిత మిత్రదేశాలు. ఐరోపాలో శాంతి నెలకొనేందుకు రాబోయే కొన్ని రోజులు అత్యంత కీలకమని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ పేర్కొన్నారు.

ఆదాయం లేకుంటే స్థానిక సంస్థలు పనులు చేయలేవు

- అకోలా మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను పెంపునకు సుప్రీం సమర్థన

దిల్లీ: ఆదాయ వనరులను పెంచుకోలేకపోతే ప్రజలకు వివిధ సేవలందించాల్సిన రాజ్యాంగ బాధ్యతలను స్థానిక సంస్థలు నిర్వర్తించలేవని సుప్రీంకోర్టు పేర్కొంది. పారిశుద్ధ్య పనులు తదితరాలు నిలిచిపోయి అనారోగ్యకర పరిస్థితులు తలెత్తుతాయని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం హెచ్చరించింది. అకోలా మున్సిపల్ కార్పొరేషన్ 16 ఏళ్ల తర్వాత ఆస్తి పన్ను పెంచగా ఆ ఉత్తర్వులను బాంబే హైకోర్టులోని నాగ్‌పుర్ ధర్మాసనం కొట్టివేసింది. మౌలిక సదుపాయాలు కల్పించటానికి, మానవ వనరుల వినియోగానికి స్థానిక సంస్థలకు నిధులు అవసరమని పేర్కొంటూ హైకోర్టు ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది.

బెంగాల్‌లో 'సర్' పరిశీలకులుగా ఐదుగురు సీనియర్ ఐఏఎస్‌లు

- ఎన్నికల సంఘం నియామకం

కోల్‌కతా: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తులో భాగంగా పశ్చిమ బెంగాల్‌లోని వివిధ డివిజన్లలో స్పెషల్ రోల్ అబ్జర్వర్స్(ఎస్ఆర్‌వోలు)గా ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఎన్నికల సంఘం నియమించింది. వీరిలో రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్ రవికాంత్ సింగ్, హోంశాఖ సంయుక్త కార్యదర్శి నీరజ్‌కుమార్ బన్సోద్, సమాచార ప్రసార శాఖ సంయుక్త కార్యదర్శి కృష్ణ కుమార్ నిరలా, ఆర్థిక వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అలోక్ తివారీ, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ ఉన్నారు.

మధ్య హిమాలయాల్లో ఉద్ధృతం కానున్న వరదలు

- 2100 లోపు 80 శాతం పెరగనున్న విపత్తు తాకిడి
- బ్రిటన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: గ్రీన్‌హౌస్ ఉద్గారాల తాకిడి పెరగడం వల్ల మధ్య హిమాలయ ప్రాంతాల్లో అసాధారణ వరదలు పెరగొచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 2100 లోపు ఇవి 80 శాతం మేర పెరగొచ్చని పేర్కొన్నారు. నేపాల్‌లోని కర్నాలీ నదికి సంబంధించి ఒక సిమ్యులేషన్ అధ్యయనాన్ని నిర్వహించి ఈ మేరకు తేల్చారు. "ఇలాంటి పెను వరదలు ఒక ఏడాదిలో ఉత్పన్నం కావడానికి ఒక్క శాతం అవకాశం ఉంది. ఈ శతాబ్దం చివరి నాటికి ఇలాంటివి ప్రతి 5-10 ఏళ్లకోసారి చోటుచేసుకోవచ్చు. ఫలితంగా భారత్, నేపాల్‌లో జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై పెను ప్రభావాన్ని చూపుతాయి" అని శాస్త్రవేత్తలు తెలిపారు. భారీ వర్షాలు లేదా మంచు లేదా హిమానీనదాలు కరగడం వల్ల వరదనీరు 90 శాతం మేర పెరగొచ్చని చెప్పారు. బ్రిటన్‌లోని దర్హామ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. గ్రీన్‌హౌస్ ఉద్గారాల పెరుగుదల వల్ల చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు వరదలు సహా అసాధారణ వాతావరణ పోకడలను పెంచుతున్నట్లు వారు వివరించారు. 2020 నుంచి 2059 మధ్య తీవ్రస్థాయి వరదలు 22 నుంచి 26 శాతం మేర పెరగొచ్చని పేర్కొన్నారు. హానికారక ఉద్గారాల్లో పెరుగుదల మధ్యస్థంగా ఉంటే 2060 నుంచి 2099 మధ్య అవి 37 నుంచి 43 శాతం మేర పెరగొచ్చని వివరించారు. ఉద్గారాల తాకిడి తీవ్రస్థాయిలో ఉంటే పెను వరదల ఉధృతి 73 నుంచి 84 శాతం మేర పెరగొచ్చన్నారు.

వర్చువల్‌గా సుప్రీంకోర్టుకు హాజరవుతానన్న వాంగ్‌చుక్ అభ్యర్థనను వ్యతిరేకించిన కేంద్రం

దిల్లీ: సుప్రీంకోర్టు విచారణకు తాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టైన వాంగ్‌చుక్ ప్రస్తుతం జోద్‌పుర్ జైలులో ఉన్నారు. ఆయనను చట్టవిరుద్ధంగా నిర్బంధించారని, ఈ చర్య ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె అంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు ధర్మాసనం అనుమతిని వాంగ్‌చుక్ కోరుకుంటున్నారని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. కేంద్రం తరఫున హాజరైన తుషార్ మెహతా అందుకు అభ్యంతరం తెలిపారు. 'ఇలాంటి అవకాశాన్ని దేశవ్యాప్తంగా ఉన్న దోషులందరికీ కల్పించాల్సి వస్తుంద'ని పేర్కొన్నారు. విచారణను ధర్మాసనం ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది.

ఇక నుంచీ ఆన్‌లైన్‌లో చైనా వీసాకు దరఖాస్తు

ఈటీవీ భారత్: భారతీయులకు వీసా జారీ విధానంలో చైనా కీలక మార్పులు తీసుకొచ్చింది. వీసా దరఖాస్తు విధానాన్ని సరళతరం చేసింది. ఈ నెల 22న ఆన్‌లైన్ వీసా దరఖాస్తు వ్యవస్థను అధికారికంగా ప్రారంభించనుంది. కొత్త వ్యవస్థ ద్వారా చైనా వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇకపై ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు. ఈ వివరాలను భారత్‌లోని చైనా రాయబారి క్సూ ఫైహాంగ్ సోమవారం ఎక్స్ ద్వారా వెల్లడించారు. దరఖాస్తు దారులు పూర్తి వివరాల కోసం https://visaforchina.cn/DEL3_EN/qianzhengyewu అధికారిక వెబ్‌సైట్ సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

చైనాకు ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించండి: కేంద్రం

దిల్లీ: చైనాకు వెళ్లేటప్పుడు లేదా ఆ దేశం గుండా ప్రయాణించేటప్పుడు భారతీయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సోమవారం పేర్కొంది. రెండు వారాల క్రితం షాంఘై గుండా జపాన్ వెళుతున్న అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన భారతీయ మహిళ ఇండియన్ పాస్‌పోర్టును చైనా అధికారులు గుర్తించకుండా.. ఆమెను ఎయిర్‌పోర్టులో నిర్బంధించిన నేపథ్యంలో ఈ అడ్వైజరీ జారీ చేసింది. "చైనా విమానాశ్రయాల గుండా భారత పౌరులు ప్రయాణించేటపుడు వారిని లక్ష్యంగా చేసుకోబోమని, నిర్హేతుకంగా నిర్బంధించబోమని, వేధించబోమని, అంతర్జాతీయ విమాన ప్రయాణ నిబంధనలను గౌరవిస్తామని చైనా అధికారులు హామీ ఇస్తారని మేం ఆశిస్తున్నాం" అని విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.



రష్యా క్షిపణి దాడితో ఉక్రెయిన్‌లోని సుమీలో ఓ అపార్ట్‌మెంట్‌లో చెలరేగిన మంటలు

నైజీరియాలో అపహరణకు గురైన 100 మంది విద్యార్థుల విడుదల

- ఇంకా చెరలోనే 150 మంది విద్యార్థులు

మిన్నా: గత నెలలో అపహరణకు గురైన పాఠశాల విద్యార్థులు 100 మంది విడుదలయ్యారని, ఇంకా 150 మందికి పైగా చిన్నారులు కిడ్నాపర్ల చెరలోనే ఉన్నారని నైజీరియాలోని క్రిస్టియన్ అసోసియేషన్ సోమవారం వెల్లడించింది. నైగర్ రాష్ట్రంలోని పాపిరి కమ్యూనిటీలోని సెయింట్ మేరీస్ క్యాథలిక్ స్కూల్ నుంచి నవంబరు 21న 303 మంది విద్యార్థులను, 12 మంది ఉపాధ్యాయులను దుండగులు అపహరించుకుని వెళ్లారు. వీరిలో 50 మంది కొన్ని గంటల వ్యవధిలోనే కిడ్నాపర్ల నుంచి తప్పించుకోగలిగారు. మిగిలిన వారిలో 100 మందిని శని, ఆదివారాల్లో దుండగులు విడుదల చేశారని క్రిస్టియన్ అసోసియేషన్ ప్రతినిధి తెలిపారు.

దురాక్రమణకు దిగితే ప్రతిచర్య తప్పదు

- తాలిబన్ సర్కారుకు మునీర్ హెచ్చరిక

ఇస్లామాబాద్: పాకిస్థాన్ శాంతికాముక దేశమనీ, తమ ప్రాదేశిక సమగ్రతనూ, సార్వభౌమత్వాన్ని ఎవరు సవాలు చేసినా సహించేది లేదని పాక్ త్రివిధ దళాల అధిపతి (సీడీఎఫ్) ఆసిం మునీర్ హెచ్చరించారు. తమపై దురాక్రమణకు దిగినవారిపై ఎంతో వేగంగా, తీవ్రంగా ప్రతిచర్య తీసుకుంటామన్నారు. ఆయన అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వాన్ని ఈ మేరకు గట్టిగా హెచ్చరించారు. నిరుడు పాక్ ప్రభుత్వం నిషిద్ధ తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ గ్రూపును ఇస్లామిక్ చరిత్రలో తీవ్ర హింసాకాండకు దిగిన ఫిత్నా అల్ ఖవారిజ్ గ్రూపుతో పోల్చింది. అఫ్గాన్ తాలిబన్ సర్కారుకు పాకిస్థాన్ కావాలో లేక ఫిత్నా అల్ ఖవారిజ్ కావాలో తేల్చుకోవాలని సోమవారం నాటి ప్రసంగంలో మునీర్ పిలుపు ఇచ్చారు. పాకిస్థాన్‌కు మొట్టమొదటి త్రివిధ దళాల అధిపతి (సీడీఎఫ్)గా నియుక్తుడైన సందర్భంగా ఆయన సైన్యాధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.

వరదల్లో గల్లంతయ్యాడని అంత్యక్రియలు

- 12 ఏళ్ల తర్వాత ఆచూకీ తెలిపిన ఆస్పత్రి

వరదల్లో కొట్టుకుపోయాడో వ్యక్తి. ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో చనిపోయి ఉంటాడని భావించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. దాదాపు పన్నేండేళ్ల తర్వాత ఆ కన్నవాళ్లకు అతడి ఆచూకీ దొరికింది. ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్ జిల్లా రూర్కీ గ్రామానికి చెందిన శివమ్ కుటుంబం 2013లో కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లింది. అక్కడ సంభవించిన ఆకస్మిక వరదల్లో శివమ్‌తో పాటు చాలామంది భక్తులు కొట్టుకుపోయారు. శివమ్ ఆచూకీ ఎంతకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు అతనికి లాంఛనంగా అంత్యక్రియలు జరిపించారు. ప్రమాదంలో మతిస్థిమితం కోల్పోయిన శివమ్ మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లోని ఓ ఆలయం పరిసరాల్లో తలదాచుకున్నాడు. అక్కడ చోరీకి వచ్చిన దొంగల ముఠా స్థానికులకు పట్టుబడింది. శివమ్ కూడా తమ సభ్యుడేనని దొంగలు చెప్పడంతో పోలీసులు అందరినీ కోర్టులో హాజరుపరిచారు. శివమ్ మానసిక స్థితి సరిగ్గా లేదని గుర్తించిన పోలీసులు 2021 అక్టోబరు 27న అతనిని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. శివమ్ ఉత్తరాఖండ్‌లోని కొండ ప్రాంతాల ప్రజలు మాట్లాడే పహారీ భాషలో మాట్లాడటం గమనించిన డాక్టర్ రోహిణి భోసలే అతడి చిరునామా తెలుసుకున్నారు. అతడి ప్రస్తుత వివరాలు, ఫొటోలను రూర్కీ పోలీసుస్టేషన్‌కు పంపించారు. వీడియో కాల్ ద్వారా శివమ్‌ను అతడి కుటుంబీకులతో మాట్లాడించారు. మతిస్థిమితం సరిగా లేదని వైద్యులు నిర్ధారించిన నేపథ్యంలో శివమ్ విడుదలకు వైజాపూర్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. లేడు, రాడు అనుకున్న వ్యక్తి తిరిగి రావడంతో శివమ్ కుటుంబ సభ్యులు సంతోషించారు.

15 ఏళ్ల తర్వాత ఇంటికి చేర్చిన సోషల్ మీడియా

సోషల్ మీడియా పోస్టు ఒకటి.. 15 ఏళ్ల కిందట తప్పిపోయిన ఓ వ్యక్తిని ఇంటికి చేర్చింది. దీంతో ఆ కుటుంబం ఉబ్బితబ్బిబ్బవుతోంది. ఊరు ఊరంతా మంగళ హారతులతో స్వాగతం పలికింది.

హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పుర్ జిల్లా గిర్తోలీ గ్రామానికి చెందిన బల్‌దేవ్.. 15 ఏళ్ల కిందట జనరల్ రిజర్వు ఇంజినీర్ ఫోర్స్‌కు (జీఆర్ఈఎఫ్) ఎంపికయ్యారు. ఉద్యోగంలో చేరేందుకు దిల్లీ వెళ్లిన ఆయన. . అందులో చేరలేదు. ఇంటికీ రాలేదు. మతి స్థిమితం కోల్పోయిన ఆయన హరియాణా హిస్సార్‌లోని ఓ గోశాలలో చేరారు. అక్కడే 9 ఏళ్లు ఉన్నారు. కొవిడ్ సమయంలో అక్కడి నుంచి యజమానులు వెళ్లగొట్టారు. అయితే రాజస్థాన్‌లోని మాలోటీ గ్రామానికి చెందిన బిష్ణోయ్ కుటుంబం ఆయనను తీసుకెళ్లింది. అక్కడ ఉండగా.. కొద్దిగా గుర్తుకు తెచ్చుకున్న ఆయన తాను హమీర్‌పుర్‌లోని ఛబూతరాకు చెందిన వాడినని ఒకసారి, ఉనాకు చెందినవాడినని మరోసారి చెప్పారు. దీంతో అతడి వీడియో తీసిన బిష్ణోయ్ కుటుంబం.. ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. అది అటూఇటూ తిరిగి.. బల్‌దేవ్ వదిన కంటపడింది. ఆమె వెంటనే గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు రాజస్థాన్ వెళ్లి బల్‌దేవ్‌ను తీసుకొచ్చారు. మేళతాళాలతో స్వాగతం పలికారు.



యూజీ, పీజీ స్పాట్ ప్రవేశాలకు ఈ నెల 10 చివరి గడువు

ఈనాడు, అమరావతి: అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో స్పాట్, యాజమాన్య కోటా కింద ప్రవేశాలకు ఈ నెల 10 వరకు అవకాశం కల్పించినట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి తిరుపతి రావు తెలిపారు. విద్యార్థులు, ప్రైవేటు కళాశాలల నుంచి వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, ప్రవేశపత్రాల అప్‌లోడ్‌కు అపరాధ రుసుముతో ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

క్రిస్మస్ హై టీ నిర్వహణకు రూ.1.25 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్మస్ హై టీ నిర్వహణకు కూటమి ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర, జిల్లాస్థాయి వేడుకల నిర్వహణకు వినియోగించనున్నారు. హై టీ నిర్వహణకు ఒక్కో జిల్లాకు రూ.2 లక్షల చొప్పున, రాష్ట్రస్థాయి వేడుకలకు రూ.73 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. వైకాపా హయాంలో ఈ వేడుక నిర్వహణకు జిల్లాకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు చొప్పున మాత్రమే మంజూరు చేశారు.

ఎస్సీ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.21 కోట్లు

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.21 కోట్లు విడుదలచేస్తున్నట్లు ప్రభుత్వం పాలనా అనుమతులిచ్చింది. 719 స్నానాల గదులు, 580 మరుగుదొడ్ల నిర్మాణానికి, 200 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు, 7,914 కిటికీలకు మెష్‌లు పెట్టేందుకు ఈ నిధులు వెచ్చించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రుణాల మంజూరులో పీఏసీఎస్‌లకు మార్గదర్శకాలు

ఖాళీ ఓచర్లు, ప్రామిసరీ నోట్లపై సంతకాలు తీసుకోవద్దని స్పష్టం


ఈనాడు, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంటరుణాలు, ఇతర రుణాలు మంజూరు చేసేటప్పుడు లబ్ధిదారుల నుంచి ఖాళీ ఓచర్లు, ప్రామిసరీ నోట్లు, ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకోకూడదని సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు ఆదేశించారు. ఈ ఆదేశాలు పాటించకపోతే తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఏసీఎస్‌ల ఆర్థిక నిర్వహణ, రుణాల పంపిణీ విధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. 'పంట రుణాలు, దీర్ఘకాలిక (ఎల్‌టీ) రుణాలను ఎకౌంట్ పేయీ చెక్ ద్వారా మాత్రమే ఇవ్వాలి. లబ్ధిదారులు వాటిని తమ సొంతపు ఖాతాల్లో వేసేలా చూడాలి. నగదు రూపంలో ఇవ్వకూడదు. పంటరుణాలను పేఆర్డర్లు, ఎల్‌టీ రుణాలకు బేరర్ చెక్కులు ఇవ్వడాన్ని నిలిపేయాలి. ఈ-పీఏసీఎస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకోవాలి. ఖాతాల పుస్తకాలు, లెడ్జర్లు, సభ్యుల ఖాతా పుస్తకాలు, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు ప్రభుత్వ ఆదేశాల మేరకే ఉండాలి. రోజు ముగింపు (డే ఎండ్ క్లోజింగ్) నిబంధన తప్పనిసరిగా పాటించాల'ని బాబు స్పష్టం చేశారు.

ఏపీఎంఎస్ఐడీసీలో నలుగురు విశ్రాంత ఉద్యోగులకు మళ్లీ అవకాశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు - మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన నలుగురు అధికారుల సేవలను ఏడాది పాటు ప్రభుత్వం పొడిగించింది. విశ్రాంత ఇన్‌ఛార్జి ఈఈ ఇందిర (ఆర్కిటెక్)తో పాటు కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈఈ సీవీ రమణ, సూపరింటెండెంట్ ఏవీఎస్ శర్మ ఏడాది పాటు కొనసాగేందుకు అవకాశం కల్పించారు. ఏలూరు డివిజన్ డీఈఈ శ్రీనివాస రెడ్డికి రెండేళ్ల పాటు కొనసాగేందుకు అవకాశం కల్పించారు. మేనేజ్‌మెంట్ కమిటీ సిఫార్సుల మేరకు ఒప్పంద పద్ధతిలో వీరిని పునర్నియమిస్తున్నట్లు వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు

తెలంగాణలో అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

తిర్యాణి, న్యూస్‌టుడే: తెలంగాణలోని కుమురంభీం జిల్లా తిర్యాణి మండలంలోని సూంగపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు దుర్గం రాజయ్య(55) అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఆ వివరాలు..రాజయ్య వానాకాలం సీజన్‌లో పది ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశారు. పెట్టుబడుల కోసం రూ.5 లక్షల వరకు అప్పుచేశారు. మూడు నెలల కిందట తన కుమార్తె పెళ్లి కోసం మరో రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ఈ క్రమంలో పంట దిగుబడి అంతంత మాత్రమే రావడంతో రాజయ్య మానసికంగా కుంగిపోయారు. అప్పు ఎలా తీర్చాలనే దిగులుతో మనస్తాపం చెందిన ఆయన ఆదివారం రాత్రి పురుగుమందు తాగగా..గమనించిన కుటుంబసభ్యులు వెంటనే తిర్యాణి సీహెచ్‌సీకి తీసుకెళ్లి రాజయ్యకు ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



ఎంత ఎక్కువ చదివితే అంత మేలు

సాధ్యమైనన్ని ఎక్కువ పుస్తకాలు చదవండి. మీరు ఎంత ఎక్కువ చదివితే, అంత ఎక్కువ నేర్చుకుంటారు. ఎంత ఎక్కువ నేర్చుకుంటే, అంత ఎక్కువగా మీ పాత విశ్వాసాలను ప్రశ్నించడం మొదలుపెడతారు. దానివల్ల మీలోని అజ్ఞానం క్రమంగా తొలగిపోతూ మీరో కొత్త వ్యక్తిగా అవతరిస్తారు. మీరు ప్రపంచాన్ని చూసే విధానం కూడా పూర్తిగా మారిపోతుంది. మరింత తెలుసుకోవాలన్న జిజ్ఞాస ద్వారా కలిగే సంతృప్తికర భావన ఎందులోనూ దొరకదు.

– మనోజ్ అరోడా, రచయిత

పీఎంఏవై అనర్హులకు 'చెకర్'తో చెక్

- దరఖాస్తుల తనిఖీకి కేంద్రం ఏఐ టూల్
- ఫొటోల ఆధారంగా అర్హతల నిర్ధారణ
- ఆపై మూడు దశల్లో రాష్ట్ర అధికారుల పునఃపరిశీలన
- ఆ తర్వాతే ఇల్లు మంజూరు చేయనున్న కేంద్రం

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకం కింద సొంతిల్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను తనిఖీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఏఐ టూల్ 'చెకర్'ను తీసుకొచ్చింది. సొంత స్థలంలో పక్కా ఇల్లు ఉన్నా మళ్లీ అక్కడే నిర్మిస్తామని చూపిస్తూ కొంతమంది ప్రభుత్వాన్ని బురిడీ కొట్టిస్తున్నారని గుర్తించిన కేంద్రం తనిఖీని పక్కా చేసింది. యాప్‌లో నమోదు చేసిన ఫొటోల ఆధారంగా అధికారుల ప్రమేయం లేకుండానే దరఖాస్తుదారు అర్హులా.. కాదా.. అనేది చెకర్ నిర్ధారిస్తుంది. ఈ ప్రక్రియలో అర్హులు పథకానికి దూరం కాకుండా వాటిని మళ్లీ మూడుదశల్లో క్షేత్రస్థాయి అధికారుల ద్వారా తనిఖీ చేయనున్నారు. యాప్ అనర్హులుగా గుర్తించిన వారి స్థలం వద్దకు గృహనిర్మాణశాఖ ఏఈ వెళ్లి వాస్తవికతను మరోసారి నిర్ధారిస్తారు. తర్వాత ఎంపీడీవో, తర్వాత జిల్లా పీడీ క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేసి అర్హతను తేలుస్తారు. ఆ తర్వాతే కేంద్రం వారికి ఇల్లు మంజూరు చేస్తుంది.

80 శాతం పైబడితే అనర్హుల జాబితాలోకి..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకానికి ఆవాస్+ యాప్ ద్వారా కేంద్రం దరఖాస్తులు స్వీకరిస్తోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధుల్ని మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తోంది. సొంత స్థలం ఉన్నా, లేకపోయినా ఈ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తున్నారు. యాప్‌లో.. నిర్మాణం చేపట్టే స్థలం ఫొటోను, ప్రస్తుతం వారు ఉంటున్న అద్దె ఇంటి ఫొటోను అప్‌లోడ్ చేయాలి. అయితే చాలా మంది విషయంలో ఇల్లు కట్టబోయే స్థలంలో అప్పటికే నిర్మాణాలు జరిగినవి ఉన్నాయి. వీటినే యాప్‌లోని చెకర్ తనిఖీ చేయనుంది. అది పునాది దశలో ఉందా? గోడ వరకు నిర్మించారా? మట్టి గోడనా? సిమెంటు ప్లాస్టరింగ్ జరిగిందా? కప్పు దశకు చేరిందా? పూర్తి స్థాయి నిర్మాణం జరిగిందా? అనేది తనిఖీ చేసి అర్హతను నిర్ధారిస్తూ శాతాన్ని కేటాయిస్తుంది. 80 శాతం పైబడిన వారివి అనర్హుల జాబితాలో చేర్చి పునఃపరిశీలనకు రాష్ట్ర అధికారులకు పంపుతుంది.

అనర్హుల జాబితాలో 24 వేలు..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 9.50 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 81 వేలమంది వివరాలను చెకర్ ఇప్పటివరకు తనిఖీ చేసింది. ఇందులో 24 వేలమంది వివరాలను అనర్హుల జాబితాలో చేరుస్తూ తిరిగి వాటిని అధికారులకు నివేదించింది. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 5,793 మంది వివరాలను చెకర్ తనిఖీ చేయగా. . ఇందులో 5,590 మందివి 80 శాతం పైగా జాబితాలో ఏఐ చేర్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 56,503 మంది వివరాలకుగాను 8,738 మందివి పునఃపరిశీలనకు పంపింది. వీటన్నింటినీ అధికారులు పరిశీలిస్తున్నారు.

సారీ.. తప్పైంది.. క్షమించండి

- ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యేలకు అధికారుల క్షమాపణ
- మాధవిరెడ్డి, జోగేశ్వరరావుల ఫిర్యాదులపై ప్రివిలేజ్ కమిటీ విచారణ
- తదుపరి భేటీకి 'సాక్షి' ప్రతినిధులకు పిలుపు!

ఈనాడు, అమరావతి: శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించి, వారిని అవమానించినందుకు రెవెన్యూ అధికారులు క్షమాపణలు చెప్పారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో శాసనసభ ప్రివిలేజ్ కమిటీ.. ఛైర్మన్ పితాని సత్యనారాయణ అధ్యక్షతన భేటీ అయ్యింది. సభ్యులు పి.ధర్మరాజు, బి.దస్తగిరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కడప రిమ్స్‌లో నూతన భవన సముదాయం ప్రారంభం సందర్భంగా వేసిన శిలాఫలకంపై స్థానిక ఎమ్మెల్యేగా తన పేరును రాయలేదని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కమిటీ సమీక్షించింది. 'పొరపాటు జరిగింది. భవిష్యత్తులో జరగకుండా చూసుకుంటాం. సారీ' అని అప్పటి జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వరరెడ్డి ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పారు.

వైకాపా ఎమ్మెల్సీ ఒత్తిడితోనే అలా చేశాం

2022-24 వరకు మండపేట నియోజకవర్గంలో చేపట్టిన పనులకు సంబంధించిన శిలాఫలకాలపై తన పేరును రాయలేదని అప్పుడూ, ఇప్పుడూ ఎమ్మెల్యేగా ఉన్న జోగేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై చర్చించారు. బాధ్యులైన నాటి ఐదుగురు అధికారులను సభాసంఘం ప్రశ్నించింది. 'మండపేట నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన వైకాపా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఒత్తిడితోనే ఎమ్మెల్యే జోగేశ్వరరావు పేరును శిలాఫలకాలపై వేయలేదు. ప్రొటోకాల్ పాటించనందుకు క్షమాపణ కోరుతున్నాం' అని ఐదుగురు అధికారులు ప్రకటించారు. 'పాత శిలాఫలకాలపై జోగేశ్వరరావు పేరును జతచేసి, పునరుద్ధరించి వారంలోగా నివేదిక ఇవ్వండి' అని కమిటీ వారిని ఆదేశించింది.

కడప కలెక్టరేట్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

గతేడాది స్వాతంత్ర్య దిన వేడుకల్లో తనకు కనీసం కుర్చీ ఏర్పాటు చేయలేదని ఎమ్మెల్యే మాధవిరెడ్డి చేసిన మరో ఫిర్యాదుపై కమిటీ సమీక్షించింది. 'గత నెలలో భేటీకి బాధ్యులను పిలిస్తే రాలేదు. అప్పటి డీఆర్వో గంగాధర్‌ను పంపాలని కలెక్టర్ కార్యాలయానికి రాతపూర్వకంగా సమాచారమిచ్చినా, పట్టించుకోలేదు. దీనికేం చెబుతారు' అని కడప డీఆర్వో విశ్వేశ్వరనాయుడిని సభాసంఘం ప్రశ్నించింది. సమాచారాన్ని బాధ్యులైన అధికారులకు సకాలంలోనే చేరవేశామని డీఆర్వో చెప్పగా, ఆ ఉత్తర ప్రత్యుత్తరాలను తమ ముందుంచాలని కమిటీ ఆదేశించింది. ఆయా ఉద్యోగులకు తాఖీదులివ్వాలని నిర్ణయించింది. మాధవిరెడ్డి ఫిర్యాదుపై డీఆర్వో వివరణ ఇస్తూ 'స్వాతంత్ర్య వేడుకలకు ఎమ్మెల్యే తొలుత వస్తామన్నారు, తర్వాత రావడం లేదని తెలిసింది. స్పష్టతలేక సమన్వయలోపం జరిగింది' అని చెప్పబోగా.. 'ఆమె ఎమ్మెల్యే మాత్రమే కాదు, ప్రభుత్వ విప్ కూడా? ప్రొటోకాల్ చూసుకోరా' అని కమిటీ ప్రశ్నించింది. విప్‌లకు ప్రత్యేకంగా ప్రొటోకాల్ లేదని డీఆర్వో సిబ్బంది చెప్పగా. . 'మీకున్న గైడ్‌లైన్స్ ఏంటో తదుపరి సమావేశంలో సమర్పించండి' అని కమిటీ ఆదేశించింది.

సాక్షి నుంచి రాతపూర్వక జవాబు వచ్చాక..

'కోట్లు ఖర్చు.. శిక్షణ తుస్సు.. ప్రణాళిక లేకుండా ఎమ్మెల్యేల శిక్షణ తరగతుల ప్రకటన' శీర్షికతో 'సాక్షి'లో ఫిబ్రవరిలో ప్రచురించిన కథనం సభాహక్కుల ఉల్లంఘనేనని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఇటీవల చేసిన ఫిర్యాదు ఈ భేటీలో చర్చకు వచ్చింది. హైకోర్టు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో సాక్షి ఎడిటర్, చీఫ్ రిపోర్టర్ వ్యక్తిగతంగా రాలేదని అధికారులు తెలిపారు. వారు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాల్సి ఉందని, వారంలోపు వివరణ సమర్పిస్తే.. దాన్ని చూశాక తదుపరి భేటీకి పిలవాలని కమిటీ నిర్ణయించింది.

సాస్కీ కింద ఐదేళ్లలో ఏపీకి రూ.19 వేల కోట్ల విడుదల

ఈనాడు, దిల్లీ: మూలధన వ్యయం కోసం వడ్డీ లేని రుణాలను సాస్కీ (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద ఆంధ్రప్రదేశ్‌కు గత ఐదేళ్లలో రూ.19,287 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. ఆయన సోమవారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. 2020-21లో రూ.688 కోట్లు, 2021-22లో రూ.501 కోట్లు, 2022-23లో రూ.6,105 కోట్లు, 2023-24లో రూ.4,090 కోట్లు, 2024-25లో రూ.7,901 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. వీటిద్వారా రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులు చేపట్టినట్లు వివరించారు.

నెల్లూరు జిల్లాలో రెండు ఈఎస్ఐ ఆసుపత్రులు

నెల్లూరు జిల్లాలోని నెల్లూరు, శ్రీసిటీలలో 100 పడకల సామర్థ్యంతో రెండు ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు బదులిచ్చారు. శ్రీసిటీ ఆసుపత్రికి అవసరమైన 5 ఎకరాల భూమి సేకరణ పూర్తయిందని చెప్పారు. నెల్లూరులో నిర్మించే మరో 100 పడకల ఆసుపత్రి కోసం 2 ఎకరాలు కావాల్సి ఉందన్నారు. ఇది పూర్తయిన వెంటనే పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు.

కేంద్ర పన్నుల్లో వాటా, ఆర్థిక సంఘం రూ.2.60 లక్షల కోట్లు

కేంద్ర పన్నుల్లో వాటా, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ల ద్వారా ఏపీకి గత ఐదేళ్లలో రూ.2,60,644 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. లోక్‌సభలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. 2021-22 నుంచి 2025-26 డిసెంబర్ 2 వరకు కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.2,09,257 కోట్లు, ఆర్థిక సంఘం నిధుల కింద రూ.51,387 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కోసం మరో రూ.20,659 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు.

ఇసుక అక్రమ తవ్వకాల కేసు విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ: వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు రూ.18 కోట్ల జరిమానా చెల్లించాలంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జయప్రకాశ్ పవర్ వెంచర్స్ దాఖలు చేసిన కేసు విచారణ ఈ నెల 15కి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్‌కేసింగ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జేపీ వెంచర్స్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ మొత్తం 18 పర్యావరణ అనుమతుల్లో ఉల్లంఘనలు జరిగాయని, ఒక్కోదానికి రూ.కోటి చొప్పున జరిమానా చెల్లించాలని ఎన్జీటీ తీర్పిచ్చిందని చెప్పారు. ఆ పర్యావరణ అనుమతుల్లో 7 మాత్రమే తమ సంస్థ పేరు మీద ఉన్నాయని, మిగతావి ప్రభుత్వం పేరుమీద ఉన్నాయని.. అందువల్ల వాటికి రాష్ట్ర ప్రభుత్వమే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆ పర్యావరణ అనుమతులు ఇచ్చేటప్పటికి తమ సంస్థే మనుగడలోనే లేదని, అలాంటప్పుడు తమనెలా బాధ్యుల్ని చేస్తారని ప్రశ్నించారు. స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఈ కేసు తుది విచారణ ఇంకా ట్రైబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నందున జేపీ అప్పీల్‌ను డిస్మిస్ చేసి, తిరిగి అక్కడికే వెళ్లమని చెబుతామని పేర్కొన్నారు. ట్రైబ్యునల్ తుది తీర్పునకు లోబడి ఉండేలా జేపీ సంస్థ తన పేరు మీదున్న ఏడు లైసెన్సులకు సంబంధించి రూ.7 కోట్లు జరిమానా చెల్లించేలా ఆదేశిస్తామని పేర్కొన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మది అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే మీ అభిప్రాయం చెప్పండని జస్టిస్ సంజయ్ కరోల్ అడిగారు. తమ అభిప్రాయం చెప్పడానికి సమయం ఇవ్వాలని అహ్మది కోరారు. అంగీకరించిన ధర్మాసనం విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

'ఉపాధి' క్షేత్ర సహాయకుల సంఘం నూతన కార్యవర్గం

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని విజయవాడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఏకే జిలానీ (బాపట్ల జిల్లా), అధ్యక్షుడిగా టి.సత్యనారాయణ (గుంటూరు), ఉపాధ్యక్షుడిగా పి.లక్ష్మీనారాయణ (పల్నాడు), ప్రధాన కార్యదర్శిగా తాటిపాక చైతన్ కుమార్ (కాకినాడ), కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.బాలకృష్ణ (పశ్చిమ గోదావరి), కోశాధికారిగా జి.ధర్మారావు (శ్రీకాకుళం), సంయుక్త కార్యదర్శిగా వై.చంద్రశేఖరరెడ్డి (నంద్యాల), ప్రచార కార్యదర్శిగా ఎ.గౌరీశంకర్ (విజయనగరం), గౌరవ ఉపాధ్యక్షుడిగా ఎం.పోతురాజు (కృష్ణా), గౌరవ సలహాదారుగా బి.నాగేశ్వరరావు (కాకినాడ) ఎన్నికయ్యారు.

అన్నీ విపత్తు చిరునామాలే!

- తుపాను, టైఫూన్, హరికేన్‌లు ఒకటే!
- భౌగోళిక ప్రాంతం ఆధారంగా వేర్వేరు పేర్లు



ఈనాడు, విశాఖపట్నం: శ్రీలంక, తమిళనాడులో 'దిత్వా' తుపాను బీభత్సం సృష్టించింది. గత నెలలో 'ఫుంగ్-వాంగ్' సూపర్ టైఫూన్ ఫిలిప్పీన్స్‌ను వణికించింది. అక్టోబరులో కరేబియన్ దేశం జమైకాలో 'మెలిసా' హరికేన్ ప్రజలను భయపెట్టింది. ఇవన్నీ ప్రకృతి విపత్తులే. మనకు అర్థమయ్యేలా మాట్లాడుకోవాలంటే టైఫూన్, హరికేన్ కూడా తుపాన్లే. శాస్త్రీయంగా ఇవన్నీ ఒకే రకంగా ఏర్పడతాయి. అన్నీ ప్రమాదకరమైనవే. వాటి తీవ్రత ఆధారంగా బలమైన ఈదురుగాలులు, భారీవర్షాలు సంభవిస్తాయి. అయితే ప్రపంచంలో అవి ఏర్పడిన భౌగోళిక ప్రాంతం ఆధారంగా పేర్లు మారుతుంటాయి. సముద్ర ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే.. తుపాన్ల ఏర్పాటుకు అవసరమైన వేడి, తేమను అందిస్తాయి.

హిందూ మహాసముద్రంలో

హిందూ మహాసముద్రం, దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడితే వాటిని తుపాన్లుగా వర్ణిస్తారు. ఆయా సముద్రాల పరిసరాల్లో ఉన్న భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా తదితర దేశాలు తరచూ వీటి వల్ల ప్రభావితం అవుతున్నాయి. భారీ వర్షాలు, తీర ప్రాంతాల్లో వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, ఆస్తినష్టం సంభవిస్తున్నాయి. హిందూ మహాసముద్రంలో తుపాన్లను భారత వాతావరణ విభాగం, దక్షిణ పసిఫిక్‌లో అధికారికంగా ఫిజీ మెటీయరలాజికల్ సర్వీస్, న్యూజిలాండ్‌కు చెందిన మెట్ సర్వీస్ పర్యవేక్షిస్తున్నాయి. ఆస్ట్రేలియన్ బ్యూరో ఆఫ్ మెటీయరాలజీ, అమెరికాకు చెందిన జాయింట్ టైఫూన్ వార్నింగ్ సెంటర్ అనధికారికంగా సమాచారం అందిస్తున్నాయి.

అట్లాంటిక్, ఈశాన్య పసిఫిక్‌లో

అట్లాంటిక్ మహాసముద్రం, ఈశాన్య పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే తుపాన్లను హరికేన్లుగా పిలుస్తారు. అమెరికా, కరేబియన్, మెక్సికో తదితర ప్రాంతాలపై ఇవి ఉగ్రరూపం చూపిస్తాయి. గాలి వేగం ఆధారంగా సఫిర్-సింప్సన్ స్కేల్ ఉపయోగించి వీటిని కేటగిరీ 1 నుంచి కేటగిరీ 5 వరకు వర్గీకరిస్తారు. అట్లాంటిక్ సముద్రంలో హరికేన్లను ఫ్లోరిడాలోని నేషనల్ హరికేన్ సెంటర్ (ఎన్‌హెచ్‌సీ), ఈశాన్య పసిఫిక్‌లో హరికేన్లను ఎన్‌హెచ్‌సీతోపాటు హవాయిలోని సెంట్రల్ పసిఫిక్ హరికేన్ సెంటర్ (సీపీహెచ్‌సీ) పర్యవేక్షిస్తున్నాయి.

వాయవ్య పసిఫిక్‌లో

వాయవ్య పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే విపత్తులను టైఫూన్లుగా చెబుతారు. వీటివల్ల జపాన్, ఫిలిప్పీన్స్, చైనా, తైవాన్ తదితర ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయి. అక్కడ సముద్రాలు ఎప్పుడూ వేడిగా ఉండడం, ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రపంచంలోనే అత్యంత బలమైన టైఫూన్లలో కొన్ని ఇక్కడే ఏర్పడుతున్నాయి. వాయవ్య పసిఫిక్‌లో టైఫూన్లను జపాన్ మెటీయరలాజికల్ ఏజెన్సీ (జేఎంఏ) పర్యవేక్షిస్తుంది. ఈ కేంద్రం ఆ ప్రాంతానికి రీజనల్ స్పెషలైజ్డ్ మెటీయరలాజికల్ సెంటర్ (ఆర్ఎస్ఎంసీ)గా పనిచేస్తుంది.

ప్రివిలేజ్ కమిటీకి రేణుకాచౌదరి వ్యవహారం

ఈనాడు, దిల్లీ: కరిచేది కుక్క కాదు.. కరిచేవారు పార్లమెంటులో ఉన్నారంటూ.. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఇటీవల పార్లమెంటు ఆవరణలో చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదును రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ప్రివిలేజ్ కమిటీకి ప్రతిపాదించారు. ఆరోజు ఓ కుక్కను తన కారులో తీసుకొని పార్లమెంటులోకి అడుగుపెట్టిన ఆమెను కుక్క ఎవరినైనా కరిస్తే ఏంటి సంగతి అని విలేకర్లు ప్రశ్నించగా.. కరిచేది కుక్క కాదు.. అలా కరిచేవారు పార్లమెంటు లోపల ఉన్నారని పేర్కొన్నారు. ఆమె చేసిన ఆ వ్యాఖ్యలు రాజ్యసభ సభ్యుల ప్రతిష్ఠకు భంగం కల్గించేలా, సభను ధిక్కరించేలా ఉన్నందున ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ భాజపా రాజ్యసభ సభ్యులు బ్రిజ్‌లాల్, ఇందు బాల గోస్వామి ఫిర్యాదు చేశారు. రూల్ 203 కింద ఆ ఫిర్యాదుపై పరిశీలన, విచారణ జరిపే అంశాన్ని ప్రివిలేజ్ కమిటీకి రాజ్యసభ ఛైర్మన్ ప్రతిపాదించారు.

పరకామణిలో చోరీ కేసులో ఎవర్ని కాపాడటానికి ప్రయత్నం జగన్?

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: పరకామణి చోరీ కేసులో ఎవరిని కాపాడటానికి తాపత్రయపడుతున్నారు జగన్ అని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. పరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తే పశ్చాత్తాపపడుతుంటే....జగన్‌కు మాత్రం ఇది చిన్నదొంగతనంలా కనిపిస్తోందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నెలకోసారి జగన్ ప్రెస్‌మీట్ పెట్టి అందులో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విమర్శించడం సిగ్గుచేటు. త్వరలో పరకామణి చోరీ కేసులో నిందితులు, ఫిర్యాదుదారు సతీశ్‌కుమార్ మరణానికి కారణాలు బయటకొస్తాయి' అని మంత్రి పేర్కొన్నారు.

◆ ఈ సందర్భంగా చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించనున్న ఎలైట్ క్రికెట్ లీగ్‌కు సంబంధించిన జెర్సీ, పోస్టర్‌ను మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు.

తప్పుడు పత్రాలతో భూ ఆక్రమణ

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తప్పుడు పత్రాలతో తన పొలాన్ని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, పొలంలో పంట వేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని తిరుపతి జిల్లా ఏర్పేడు మండలానికి చెందిన శ్రీనివాసులు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీ మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ పి.శ్రీనివాసులు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. తనకు తెలియకుండా ఆస్తిని రాయించుకున్న బంధువులపై చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలానికి చెందిన రామకృష్ణ కోరారు. తన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నమయ్య జిల్లా కురుబలకోట మండలం కంటేవారిపల్లికి చెందిన వెంకటశివ విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టు భద్రతపై దృష్టి సారించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన గొయ్యికి మరమ్మతులు చేపట్టి, దెబ్బతిన్న సిలిండర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ రాశారు. "శ్రీశైలం ప్రాజెక్టు భద్రతలో అత్యంత కీలకమైనవి సిలిండర్లు. ప్లంజ్‌పూల్‌లో ఏర్పడిన భారీ గొయ్యి ఆనకట్ట వైపు విస్తరించకుండా ఈ సిలిండర్లు రక్షణగా ఉంటున్నాయి. ఇవి 2009లో వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్నాయి" అని పేర్కొన్నారు.

కొత్త జిల్లాలకు అనుగుణంగా అక్రిడేషన్లు మంజూరు చేయండి

సీఎం చంద్రబాబుకు ఏపీజేఎఫ్ ప్రతినిధుల వినతి



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీజేఎఫ్ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: నూతన జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా కొత్త అక్రిడేషన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం(ఏపీజేఎఫ్) ప్రతినిధులు కోరారు. మీడియా అక్రిడేషన్ పోర్టల్‌లో అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వీటిపై స్పందించిన చంద్రబాబు వెబ్‌పోర్టల్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల్ని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీజేఎఫ్ అధ్యక్షుడు శివ రాజేశ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల రాష్ట్ర అధ్యక్షుడు మద్దినేని అనిల్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి సంస్కృత వర్సిటీలో దళిత విద్యార్థినిపై లైంగిక దాడి

- అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య



లోక్‌సభలో మాట్లాడుతున్న కడియం కావ్య

ఈనాడు, దిల్లీ: తిరుపతి సంస్కృత యూనివర్సిటీలో చదువుతున్న ఒడిశాకు చెందిన దళిత విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన అక్కడి అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో దీని గురించి మాట్లాడారు. 'బాధిత విద్యార్థినిపై తొలుత ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు దిగితే, తర్వాత మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆ వీడియోలను చూపి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. దాని గురించి బాధితురాలు యూనివర్సిటీలోని లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో స్వస్థలం ఒడిశాకు వెళ్లిపోయింది. ఒక ఎస్సీ విద్యార్థిని జీవితంలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని యూనివర్సిటీ స్థాయికి వచ్చిన తర్వాత కూడా ఆమెకు రక్షణ లేకుండాపోయింది. ఇలాంటి వాటిని అరికట్టడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు' అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గాన్ని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ప్రకటించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు: ముక్కు రాధాకృష్ణ (నెల్లూరు జిల్లా), బలివాడ శివకుమార్ పట్నాయక్ (ఎన్టీఆర్), పైలా సుభాష్‌చంద్రబోస్ (కాకినాడ), గునుపూరు వెంకటనాయుడు (పార్వతీపురం మన్యం), పల్లి శ్రీనివాసులునాయుడు (విశాఖ), గిడ్డుమర్రి ఆదినారాయణ (శ్రీ సత్యసాయి), కాలెపు సత్యసాయిరాం (తూర్పుగోదావరి); **రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు:** గడ్డం విజయ్‌కుమార్ (నెల్లూరు), బండి ఆనంద్ (అన్నమయ్య), కంటు భక్త శ్రీనివాస్ (విశాఖ); **జోనల్ ఇన్‌ఛార్జులు:** ఉదయాన చిన్నంనాయుడు (ఉత్తరాంధ్ర), అయినం బాలకృష్ణ (గోదావరి), తులిమిల్లి రామకృష్ణ (కోస్తా), మేకల బంగారయ్య (రాయలసీమ); **రాష్ట్ర కార్యదర్శులు:** దంతివాడ అప్పలాచారి (విజయనగరం), కర్రి రామకృష్ణ (అనకాపల్లి), చరక కుమార్‌గౌడ్ (గుంటూరు), కొక్కిలగడ్డ శ్రీనివాసరాజు (బాపట్ల), అయినవిల్లి సత్తిబాబు (అంబేడ్కర్ కోనసీమ), అసనాపురం చంటి (శ్రీసత్యసాయి), రేపన అశోక్ (అనంతపురం), చోరగుడి శివలలిత (ఎన్టీఆర్); **కోశాధికారి:** మడుమూరి రామదాసు (అన్నమయ్య); **ఉపకోశాధికారి:** లక్కోజి అనిల్‌కుమార్ (ఏలూరు), **రాష్ట్ర మీడియా కన్వీనర్:** కోవెలకోరి రాకేశ్ (గుంటూరు), **కో కన్వీనర్:** తెలుగు అంబన్న (కర్నూలు); **రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్:** బాబు మునిసురేష్ (నెల్లూరు), **కో కన్వీనర్:** ముదబోయిన వినయ్‌కుమార్ (గుంటూరు); **ఐటీ సెల్ కన్వీనర్:** సింగుపురపు వెంకటరమణ (శ్రీకాకుళం), **కో కన్వీనర్:** మరకాని సతీష్‌ప్రేమ్ (తూర్పుగోదావరి).